'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 18 | సంచిక: 297

SUNDAY Special | ఆదివారం 18-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారత్ ఘన విజయం

అండర్‌–19 ప్రపంచ కప్‌లో భారత్ 18 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. భారత్ 49 ఓవర్లలో 238 పరుగులు చేయగా... బంగ్లా 28.3 ఓవర్లలో (డక్‌వర్త్–లూయిస్ ప్రకారం) 146కే ఆలౌటైంది.

- వివరాలు 10లో

గ్రాండ్‌మాస్టర్ గైడెన్స్

'మీ ఓటమిని అంగీకరించండి. దానిని నోట్‌బుక్‌లో రాసుకోండి. తర్వాత ఏం చేయాలో మీకే తెలుస్తుంది' అంటూ పిల్లలకు పాఠాలు చెబుతున్నారు గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్..

- వివరాలు 13లో

అమెరికాపై 30 శాతం టారిఫ్‌లు

అమెరికా నుంచి దిగుమతయ్యే తృణధాన్యాలపై భారత్ 30 శాతం టారిఫ్‌లు విధించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

వివరాలు 6లో ▸

ఇరాన్‌లో భయంభయంగా..

ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారుల్లో కొందరు క్షేమంగా ఢిల్లీకి చేరుకున్నారు.

వివరాలు 6లో ▸

శ్వేతపత్రం ప్రచురించగలరా?

బెంగాల్‌కు ఇచ్చిన మొత్తం నిధులపై శ్వేతపత్రం ప్రచురించగలరా? అని ప్రధాని మోదీకి టీఎంసీ సవాల్ విసిరింది.

వివరాలు 6లో ▸



వందేభారత్ స్లీపర్ రైలు ప్రారంభం

దేశంలోనే మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ రైలును ప్రధాని మోదీ మాల్డా రైల్వేస్టేషన్‌లో ప్రారంభించారు.

వివరాలు 6లో ▸

■ బాబు యూ టర్న్

'రీ సర్వే'పై దొంగాట

భూముల రీ సర్వే చేసిందెవరు? క్రెడిట్ చోరీ కోసం పాకులాడుతుందెవరు?

రీ సర్వే పేరుతో భూములు దోచుకుంటున్నారని నాడు దుష్ప్రచారం చేసిందే చంద్రబాబు

అప్పుడు సర్వేను అడ్డుకుని ఇప్పుడు అదే సర్వే క్రెడిట్ కొట్టేసే యత్నం

జగన్ ప్రభుత్వం చేసిన సర్వేకు కేంద్రం రూ.400 కోట్లు ఇస్తే అవి తనవల్లే వచ్చాయని చంద్రబాబు ప్రచారం..

దేశ చరిత్రలో ఇంత దిక్కుమాలిన ప్రభుత్వం ఉండదంటున్న రెవెన్యూ రంగ నిపుణులు

2 లో

రీ సర్వేకు అంకురార్పణ చేసి విజయవంతంగా నిర్వహించింది జగన్ ప్రభుత్వం

సర్వే కోసం దేశ చరిత్రలో తొలిసారి 15 వేల మంది సర్వేయర్ల నియామకం

అత్యాధునిక టెక్నాలజీతో తొలిసారి డ్రోన్లు, రోవర్లు, విమానాల వినియోగం

భూములకు జియో హద్దులు.. పట్టాదార్ పాస్ పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌లు

వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన సర్వేను రోల్ మోడల్‌గా తీసుకున్న కేంద్రం

దీంతో అధికారంలోకి రాగానే యూటర్న్ తీసుకున్న బాబు

రీ సర్వే క్రెడిట్ చోరీ చేస్తూ అది తనదిగా చెప్పుకునే ప్రయత్నం

2020లో శాశ్వత భూ హక్కు, భూ రక్షను ప్రారంభిస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- సర్వే రాళ్లపై నవరత్నాల లోగో వేస్తే రాజకీయ లబ్ధి కోసం నాడు బాబు దుష్ప్రచారం
- సీఎంవో నుంచి పంచాయతీ కార్యాలయం వరకు అన్ని చోట్లా ఈ లోగోతో ఫొటో
- దాన్నే సర్వే రాళ్లపై వాటర్ మార్క్‌గా ముద్రిస్తే తప్పంటూ విష ప్రచారం
- సర్వే చేయక ముందు, చేసిన తర్వాత పరిస్థితి తెలిసేందుకే ఫొటో ముద్రణ
- ఇప్పుడు పింఛన్ల పంపిణీ పాంప్లెట్లపై చంద్రబాబు ఫొటో ఉండటం లేదా?

2023లో అప్పటి కేంద్రమంత్రి హరదీప్‌సింగ్ సమక్షంలో కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంటున్న యూనిపెర్, గ్రీన్‌కో సీఈవోలు

కీర్తి చోర నారా.. మరో చోరీ!

కాకినాడ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కూడా తన ఘనతేనంటూ డప్పు

కాకినాడలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు వైఎస్ జగన్ హయాంలో 2023లో యూనిపెర్‌తో గ్రీన్‌కో ఒప్పందం

'ఇండియా ఎనర్జీ వీక్' సందర్భంగా అప్పటి కేంద్రమంత్రి హరదీప్‌సింగ్ పూరి సమక్షంలో ఒప్పందం

3 లో

ఆ తర్వాత 2023లోనే విశాఖ జీఐఎస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న గ్రీన్‌కో

వాస్తవాలను దాచిపెట్టి ఈ ఒప్పందాన్ని తన ఖాతాలో వేసుకున్న బాబు సర్కారు

'గ్రీన్' ప్రాజెక్టులకు వైఎస్ జగన్ రెడ్ కార్పెట్

3లో

- జగన్ తెచ్చిన కంపెనీలతో మళ్లీ ఒప్పందాలు కుదుర్చుకుంటూ చంద్రబాబు క్రెడిట్ చోరీ.. రెన్యూ పవర్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగింది వైఎస్ జగన్ హయాంలోనే..
- గత ప్రభుత్వంలోనే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో భేష్ అనిపించుకున్న ఏపీ.. 10-15 బిలియన్ డాలర్ల గ్రీన్ హైడ్రోజన్ వ్యాపారం చేయొచ్చని అంచనా.. అందుకు తగ్గట్టుగా పాలసీ రూపకల్పన
- రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చిన సంస్థలు

న్యూస్‌రీల్

కొత్త ప్రైవేటు వర్సిటీల నిబంధనల్లో సవరణలు

16 లో

రాష్ట్రంలో కొత్త ప్రైవేటు విశ్వవిద్యాలయాల (గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్) స్థాపన కోసం అనుమతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు ఏపీ ప్రైవేటు వర్సిటీ స్థాపన చట్టం–2016లోని నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది.

చంద్రగిరిలో పోలీసుల ఓవర్‌యాక్షన్

15 లో

జల్లికట్టు సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్ జగన్ ఫ్లెక్సీలను తొలగించాలని పోలీసులు హెచ్చరించగా.. టీడీపీ, జనసేన ఫ్లెక్సీలను తొలగిస్తే తామూ తొలగిస్తామని బీసీ నేత బొమ్మగుంట రవి బదులిచ్చారు. దీంతో రవిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు.

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	164	డ్రెస్డ్ స్కిన్‌తో	277
	రిటైల్ లైవ్ బర్డ్	191	స్కిన్ లెస్	315

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి

కొంత స్థలం మనకు, మరికొంత స్థలం ప్రైవేటు వాళ్లకు.. మిగతా స్థలం మనవాళ్లు కబ్జా చేశారు. ఇక సమస్యలు ఏముంటాయ్ సార్!!

గుంటూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్, దళిత నాయకులు

సాల్మన్ హత్యపై భగ్గుమన్న దళితులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు

5 లో

చంద్రబాబు పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు నిత్యకృత్యంగా మారాయని నాయకుల ఆగ్రహం

సాల్మన్ హంతకులను కఠినంగా శిక్షించాలి..

బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్

హంతకులను ఇంకా అరెస్టు చేయకపోవడంపై మండిపాటు

ఈ–పంటకు నిర్లక్ష్యం చీడ!

- మూడున్నర నెలల క్రితం రబీ సీజన్ ప్రారంభం
- ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం 36 లక్షల ఎకరాలు
- కానీ, ఈ–పంటలో నమోదైన విస్తీర్ణం 11 లక్షల ఎకరాలే
- ఉద్యాన, పట్టు పంటల నమోదు పరిస్థితీ అంతే..
- 2.93 కోట్ల ల్యాండ్ పార్సిల్స్‌కుగాను ఇప్పటి వరకు కేవలం 11 లక్షలు మాత్రమే నమోదు
- పథకం నిర్వీర్యమే చంద్రబాబు సర్కారు లక్ష్యం

2లో

నెల్లూరు జిల్లా ఉదయగిరి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తీరని యూరియా తిప్పలు

16 లో

చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు యూరియా అందించడంలో విఫలమైన బాబు ప్రభుత్వం.. రబీ సీజన్‌లో కూడా మేల్కొనలేదు. దీంతో రైతన్నలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. యూరియా కోసం చిత్తూరు జిల్లా తవణంపల్లెలో వేకువజాము నుంచే రైతులు బారులు దీరగా.. నెల్లూరు జిల్లా గుడినరవ గ్రామస్తులు ఉదయగిరి వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు.



• బాబు యూ టర్న్

‘రీ సర్వే’పై దొంగాట

చరిత్రాత్మకంగా భూముల రీ సర్వే చేసిందెవరు? క్రెడిట్ చోరీ కోసం పాకులాడుతుందెవరు?

రీ సర్వే పేరుతో భూములు దోచుకుంటున్నారని నాడు దుష్ప్రచారం చేసిందే చంద్రబాబు

అప్పుడు సర్వేను అడ్డుకుని ఇప్పుడు అదే సర్వే క్రెడిట్ కొట్టేసే యత్నం

సర్వే రాళ్లపై నవరత్నాల లోగో వేస్తే రాజకీయ లబ్ధి కోసం నాడు బాబు దుష్ప్రచారం

సీఎంవో నుంచి పంచాయతీ కార్యాలయం వరకు అన్ని చోట్లా ఈ లోగోతో ఫొటో

దాన్నే సర్వే రాళ్లపై వాటర్ మార్క్‌గా ముద్రిస్తే తప్పంటూ విష ప్రచారం

సర్వే చేయక ముందు, చేసిన తర్వాత పరిస్థితి తెలిసేందుకే ఫొటో ముద్రణ

ఇప్పుడు పింఛన్ల పంపిణీ పాంప్లెట్లపై చంద్రబాబు ఫొటో ఉండటం లేదా?

ఈనాడు
మీ భూమి మీది కాదు
Date : 04/05/2024 EditionName : ANDHRA PRADESH PageNo :

మీ భూమి మీది కాదంటూ ఎన్నికల సమయంలో ఈనాడులో టీడీపీ ప్రచారం చేసింది ఇలా..

జగన్ హయాంలో జరిగిన రీ సర్వే హైలైట్స్

రీ సర్వే ప్రారంభం: **2020 డిసెంబర్ 21**

డ్రోన్, ఏరియల్ సర్వేతో కొలిచిన విస్తీర్ణం: **1.26 లక్షల చదరపు కిలోమీటర్లు (2.26 కోట్ల ఎకరాలు)**

అన్ని దశల రీసర్వే పూర్తయి డిజిటల్ రికార్డులు తయారైన గ్రామాలు: **6,800**

మొత్తం సర్వే నంబర్లు: **2.47 కోట్లు**

సర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే నంబర్ల స్థానంలో కొత్తగా జారీ చేసిన ఎల్‌పీఎం నెంబర్లు : **86,80,246**

4,500 సర్వే బృందాలు: **రూ.1,000 కోట్ల వ్యయం**

సర్వేలో భాగంగా చేసిన మ్యుటేషన్లు: **10 లక్షలు**

సబ్ డివిజన్లు: **14 లక్షలు**

సాక్షి, అమరావతి: తనకు సంబంధం లేని వాటిని కూడా తానే చేసినట్లు నిర్భీతిగా, నిస్సిగ్గుగా చెప్పుకునే చంద్రబాబు.. జగన్ హయాంలో ప్రారంభమైన భూముల రీ సర్వే క్రెడిట్‌ను సైతం తన ఖాతాలో వేసుకుంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రీ సర్వేపై అదే పనిగా దుష్ప్రచారం చేసి, దానివల్ల రైతుల భూములు కబ్జా అవుతాయని చెప్పిన నోటితోనే ఇప్పుడు దాన్ని తానే ప్రారంభించినట్లు చెప్పుకుంటూ బహిరంగంగా మరో క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. లక్షల ఎకరాలను 22–ఎ జాబితాలో పెట్టిన బాబు.. ఇప్పుడు వేల ఎకరాలను 22–ఎ జాబితా నుంచి తొలగించినట్లు బరితెగించి ప్రచారం చేసుకోవడం గమనార్హం. బ్రిటీషర్ల తర్వాత ఏ రాష్ట్రంలో, ఏ పాలకుడూ తలపెట్టని అతి పెద్ద భూముల సర్వేను గత వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టడమే కాకుండా విజయవంతంగా నిర్వహించింది. ఇందుకోసం 15 వేల మంది సర్వేయర్లను ప్రత్యేకంగా నియమించారు. దేశ చరిత్రలో అంత మంది రెవెన్యూ సిబ్బందిని నియమించడం అదే ప్రథమం. 2019కి ముందు ఒక భూమిని సర్వే చేయాలంటే సంవత్సరాలు పట్టేది. ఆ సర్వే కూడా అరకొరగా చేసేవారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో ఉన్న ప్రతి భూమిని సర్వే చేసి భూ వివాదాలు లేకుండా చేయాలని వైఎస్ జగన్ తపన పడ్డారు. పైసా ఖర్చు లేకుండా 2024 ఎన్నికల నాటికి రాష్ట్రమంతా డ్రోన్ సర్వే పూర్తి చేయగా, సుమారు 6,800 గ్రామాల్లో సర్వే అన్ని దశలు పూర్తయి డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో 30 లక్షల మందికి పైగా రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇచ్చారు. సర్వే చేశాక నిర్ణయించిన హద్దుల్లో రాళ్లు పాతించారు. భూముల వ్యవస్థ స్వరూపాన్ని సమూలంగా మార్చి వేసే దీనిపై చంద్రబాబు లేనిపోని నిందలు, అభాండాలు వేశారు.

సర్వే రాళ్లపై ముద్రించిన లోగోపై తప్పుడు ప్రచారం

సర్వే చేసి, హద్దులు నిర్ణయించి, ఆ హద్దులో ప్రభుత్వమే రాళ్లు పాతి.. రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తే దానిపై ఇష్టానుసారం తప్పుడు ప్రచారం చేశారు. ఆ రాళ్లపై జగన్ ఫొటో ఉందని చంద్రబాబు బురదజల్లారు. నిజానికి ఆ రాళ్ల మీద ఉన్న ఫొటో నవరత్నాల వాటర్ మార్క్ లోగో. రాష్ట్రంలో అమలయ్యే సంక్షేమ పథకాల వివరాలు అందులో ఉన్నాయి. ఆ నవరత్నాల ఫొటోను 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పెట్టారు. దాన్ని ఒక భగవద్గీతగా, ఒక బైబిల్‌గా, ఒక ఖురాన్‌గా భావించారు. అధికారంలోకి వచ్చాక సీఎం కార్యాలయం నుంచి ప్రతి పంచాయతీ కార్యాలయంలోనూ ఆ ఫొటో పెట్టి దాని ప్రకారం పరిపాలన నడిపిన చరిత్ర జగన్‌ది. అయితే మేనిఫెస్టోలో ఉన్న ఆ ఫొటోపైనే చంద్రబాబు అండ్ గ్యాంగ్ తప్పుడు ప్రచారానికి ఒడిగట్టారు. నవరత్నాల కేంద్రంగానే మొత్తం పరిపాలన సాగించి, ఇచ్చిన ప్రతిని హామీని అమలు చేసి చూపిస్తే దాన్ని తప్పు పట్టిన వ్యక్తి చంద్రబాబు.

అప్పుడు అడ్డుకుని.. ఇప్పుడు తనదేనని..

రీ సర్వేను అడ్డుకుని, దానిపై దుష్ప్రచారం చేసి, మీ భూములు పోతాయని దుర్మార్గంగా ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు నిస్సిగ్గుగా దాన్ని తన ఖాతాలో వేసుకుంటుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాను తెచ్చిన సంస్కరణల వల్లే రీ సర్వే జరుగుతోందని, దానికి రూ.400 కోట్లు కేంద్రం ఇచ్చిందని ఆయన డప్పు కొట్టుకుంటున్నారు. వివాదాలు లేని భూముల వ్యవస్థను తీసుకువచ్చేందుకు వైఎస్ జగన్ రీ సర్వేకు అంకురార్పణ చేసి నిర్వహించారు. సర్వే పూర్తి చేసే క్రమంలో 14 లక్షల పట్టా సబ్ డివిజన్లు, దాదాపు 10 లక్షల మ్యుటేషన్లు జరిగాయి. 3 లక్షలకు పైగా రైతుల పేర్లు తొలిసారి రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించారు. పట్టా సబ్ డివిజన్, మ్యుటేషన్ కోసం వెళితే పట్టే సమయం, ఏర్పడే తిప్పలు ఎన్నో తెలిసిందే. రీ సర్వే ద్వారా రైతుల నుంచి చిల్లిగవ్వ తీసుకోకుండా ఈ పనుల్ని జగన్ ప్రభుత్వం పూర్తి చేసింది.

జగన్ హయాంలోనే క్యూఆర్ కోడ్.. జియో హద్దులు

క్యూ ఆర్ కోడ్ ముద్రించడం ఒక్కటే కాదు.. సర్వే పూర్తయిన గ్రామాల భూ రికార్డులను రాష్ట్ర ప్రభుత్వం అక్షాంశాలు, రేఖాంశాలుతో గత జగన్ ప్రభుత్వం జారీ చేసింది. అంటే శాటిలైట్ హద్దులన్నమాట. వాటిని మార్చడం సాధ్యం కాదు. క్షేత్ర స్థాయిలో భూమి హద్దులు మారినా శాటిలైట్ హద్దులు మాత్రం అలాగే ఉంటాయి. పట్టాదార్ పాస్ పుస్తకాలపై క్యూ ఆర్ కోడ్, జియో హద్దులు ఇవ్వడం జగన్ హయాంలో వచ్చిన అతి పెద్ద భూ సంస్కరణల్లో ఒకటి. అసలు ఇవేమీ వద్దని.. వాటి ద్వారా రైతుల నుంచి భూములు లాక్కుంటారని అడ్డగోలు దుష్ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు దాన్నే ఫాలో అవుతున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా అవన్నీ తాను తెచ్చినవేనని డప్పు కొట్టుకోవడం చూసి రెవెన్యూ యంత్రాంగం ఆశ్చర్యపోతోంది.

జగన్ చేసిందాన్నే మళ్లీ చేస్తూ తనదిగా ప్రచారం

రీ సర్వేలో ప్రతి భూమికి ల్యాండ్ పార్సిల్ మ్యాప్, భూ హక్కు పత్రం, ప్రాపర్టీ పార్సిల్ మ్యాప్, ప్రతి గ్రామానికి రెవెన్యూ విలేజ్ మ్యాప్ కూడా ఇచ్చారు. వాటన్నింటితో కలిపి ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజకీయ ముద్ర వేసి అధికారంలోకి వచ్చాక బాబు ఏకపక్షంగా రద్దు చేశారు. ఏడాదిన్నర తర్వాత తప్పుల తడకలుగా కొత్త పాస్‌పుస్తకాలు ముద్రించి గతంలో జగన్ హయాంలో ఇచ్చిన క్యూఆర్ కోడ్, జియో కోఆర్డినేట్స్‌నే అందులో పెట్టి అవి తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. నిజానికి రీ సర్వే తర్వాత జగన్ ప్రభుత్వం ప్రతి భూ కమతానికి ఆధార్ నెంబర్ మాదిరిగా ఒక విశిష్ట సంఖ్య (ఐడీ నంబర్) కూడా ఇచ్చింది. వీటన్నింటి వల్ల రికార్డుల ఆధునికీకరణ జరిగి వాటిని ట్యాంపరింగ్ చేసే అవకాశం లేని వ్యవస్థ సృష్టించి భూ రికార్డుల వ్యవస్థ పూర్తిగా ప్రక్షాళన చేశారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలను పరిష్కరించేందుకు, భూ అక్రమాలకు తావు లేకుండా చేసేందుకు వైఎస్ జగన్ తెచ్చిన ఈ విధానంపై చంద్రబాబు జగమంత విషం కక్కారు. కానీ ఇప్పుడు తాను గతంలో చేసిన దుష్ప్రచారాన్ని మరచిపోయి అది ఘనతేనని చెప్పుకుంటున్నారు. దీన్ని చూసి ఇంత దిక్కుమాలిన ప్రభుత్వం బహుశా భారతదేశ చరిత్రలో ఎక్కడా ఉండదని రెవిన్యూ విభాగం నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

డ్రోన్లు.. విమానాలు.. ఆధునిక టెక్నాలజీతో రీ సర్వే

రీ సర్వే కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యాధునిక సర్వే టెక్నాలజీని వినియోగించింది. 2020 డిసెంబర్ 21న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పేరుతో సర్వే ప్రారంభించింది. అప్పటి నుంచి విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు, కంటిన్యూయస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్స్ (సీఓఆర్ఎస్), జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్) రోవర్లతో కేవలం 5 సెంటీమీటర్ల కచ్చితత్వం (తేడా)తో రైతులు సంతృప్తి చెందేలా సర్వే చేశారు. మొత్తం 1.26 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని డ్రోన్ల ద్వారా సర్వే (కొలిచారు) చేశారు. భూ హక్కు పత్రాల ద్వారా యజమానులకు రికార్డుల్లో యాజమాన్య హక్కులు కల్పించడం, వారి భూముల హద్దుల్లో భూరక్ష సర్వే రాళ్లు పాతడం ద్వారా రక్షణ కల్పించడమే లక్ష్యంగా రీ సర్వే నిర్వహించారు. అభ్యంతరాలు, వినతులను అక్కడికక్కడే పరిష్కరించేందుకు మండలానికి ఇద్దరు చొప్పున 1,358 మంది మొబైల్ మేజిస్ట్రేట్‌లను నియమించి 40 వేల వివాదాలను పరిష్కరించారు. నిర్విరామంగా ఒక మహాయజ్ఞంలా జరిగిన రీ సర్వే కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియా కూడా పాలుపంచుకుంది. కేరళ, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు ఇక్కడ జరుగుతున్న రీ సర్వే మోడల్‌పై అధ్యయనం చేసి టెక్నాలజీ సాయం కోరాయి. కేంద్ర ప్రభుత్వం ఏపీలో జరుగుతున్న రీ సర్వే అద్భుతమని కితాబిచ్చింది.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు.. నిలిపివేసిన చంద్రబాబు

నాటి ప్రభుత్వంలో సర్వే, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ లాంటి అన్ని సేవల్ని సచివాలయాల్లోనే పొందే సౌలభ్యం కల్పించింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు చేసే ప్రక్రియ కూడా మొదలు పెట్టారు. కానీ చంద్రబాబు సచివాలయ వ్యవస్థను భ్రష్టు పట్టించే క్రమంలో దాన్ని నిలిపివేశారు.

సర్వే రాళ్లపై ఆ ఫొటో ఎందుకంటే..

రీ సర్వే చేయక ముందు, చేసిన తర్వాత ఉన్న తేడా స్పష్టంగా తెలియడం కోసమే రాళ్లపై ఆ నవరత్నాల లోగోను ముద్రించారు. కేవలం సరిహద్దులు నిర్ణయించి వదిలేస్తే మళ్లీ గొడవలు వస్తాయని, ఎవరికి వారు రాళ్లు పాతుకోవాలంటే కష్టమవుతుందని, ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో అప్పట్లో ప్రభుత్వమే రాళ్లు పాతించింది. ఆ రాళ్లపై నవరత్నాల లోగో ముద్రిస్తే అందులో జగన్ ఫొటో ఉందని తప్పుడు ప్రచారం చేశారు. ఆ ఫొటో ఉండడం వల్ల తప్పేంటి? ఇప్పుడు పింఛన్ల ఫొటోల్లో చంద్రబాబు ఫొటో ఉండడం లేదా? అయిన దాంట్లో, కాని దాంట్లో తన పాంప్లెట్లపై పెట్టి పబ్లిసిటీ చేసుకుంటున్న చంద్రబాబు.. చరిత్రలో తొలిసారి సాహసోపేతంగా రీ సర్వే చేసి, హద్దు రాళ్లపై లోగోను ముద్రించడం తప్పెలా అవుతుందో చంద్రబాబుకే తెలియాలి.

ఈనాడు
మీ భూమి మీది కాదు

ఎన్నికలప్పుడేమో ఇలా విషప్రచారం..

రీ సర్వేలో ఏపీ నంబర్ వన్ అంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని కితాబు

ఇటీవల టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ భూముల సర్వేలో ఏపీ దేశంలో నెంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. చంద్రబాబు వచ్చాక ఒక్క గ్రామంలో కూడా రీ సర్వే పూర్తి చేయలేదు. సర్వే చేయకుండానే రాష్ట్రం ఎలా నంబర్ వన్‌గా నిలిచింది? జగన్ హయాంలో ఒక యజ్ఞంలా జరిగిన రీ సర్వే వల్లే ఏపీ అందులో నంబర్ వన్ స్థానాన్ని అధిరోహించింది. రోల్ మోడల్‌గా నిలిచిన కార్యక్రమంపై అడ్డగోలుగా అభాండాలు వేసిన చంద్రబాబు ఇప్పుడు రంగు మార్చి అది తన గొప్పేనని చెప్పుకోవడాన్ని ఏమనాలి?

ఈనాడు
రీ సర్వేలో దేశంలోనే ఏపీ మొదటిస్థానం
• కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నేడేమో క్రెడిట్ చోరీ..

పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఆదినారాయణ కన్నుమూత


డాక్టర్ ఎస్వీ ఆదినారాయణ (ఫైల్)

మహారాణిపేట (విశాఖ): ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావు శనివారం విశాఖలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించిన ఆయన, విశాఖ కేజీహెచ్‌లో ఆర్థోపెడిక్ విభాగంలో సుదీర్ఘ కాలం సేవలందించారు. వైద్యుడిగానే కాకుండా మంచి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా కూడా విశాఖ ప్రజలకు ఆయన సుపరిచితులు. వైద్య రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం 2022లో ‘పద్మశ్రీ’ పురస్కారంతో గౌరవించింది. డాక్టర్ ఆదినారాయణ రావు మృతిపట్ల వైద్యరంగ ప్రముఖులు, క్రీడాకారులు, పలువురు రాజకీయ నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తంచేశారు.

వెంకట ఆదినారాయణరావు మృతి తీరని లోటు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సంతాపం

పోలియో రహిత దేశం కోసం పాటుపడ్డారని ప్రశంసలు

సాక్షి, అమరావతి: ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుంకర వెంకట ఆదినారాయణరావు మృతి పట్ల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పోలియో రోగులకు లక్షలాది శస్త్రచికిత్సలు చేసి, వేలాది మందికి నడక నేర్పిన ఆయన సేవలకు గుర్తింపుగా 2022లో పద్మశ్రీ అవార్డు అందుకున్నారు. ‘పోలియో బాధితులు, వికలాంగులకు లక్షకు పైగా ఉచిత శస్త్రచికిత్సలు చేశారు. దేశ వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. పోలియో రహిత భారతదేశం కలలను సాకారం చేయడం లక్ష్యంగా వైద్య రంగంలో సేవలందించారు. అలాంటి గొప్ప వైద్యుడి మరణం తీరని లోటు’ అని వైఎస్ జగన్ కొనియాడారు. ఆదినారాయణ రావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వైఎస్ జగన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ఈ-పంటకు నిర్లక్ష్యం చీడ!

- మూడున్నర నెలల క్రితం రబీ సీజన్ ప్రారంభం
- ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం 36 లక్షల ఎకరాలు
- కానీ, ఈ–పంటలో నమోదైన విస్తీర్ణం 11 లక్షల ఎకరాలే
- ఉద్యాన, పట్టు పంటల నమోదు పరిస్థితీ అంతే..
- 2.93 కోట్ల ల్యాండ్ పార్సిల్స్‌కు గాను ఇప్పటివరకు కేవలం 11 లక్షలు మాత్రమే నమోదు
- పథకం నిర్వీర్యమే చంద్రబాబు సర్కారు లక్ష్యం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా, విజయవంతంగా అమలైన ‘ఈ–క్రాప్’ నమోదును ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. దీని నమోదు విషయంలో సర్కారు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం అన్నదాతల పాలిట శాపంగా మారింది. ఈ రబీ సీజన్‌లో ఇప్పటివరకు దాదాపు 36 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. కానీ, ఈ–పంటలో నమోదైంది కేవలం 11.35 లక్షల ఎకరాలే. ఈకేవైసీ అయితే ఒక్క రైతు నుంచి కూడా నమోదుకాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందో చెప్పడానికి ఈ గణాంకాలే నిదర్శనం. మరోవైపు.. ఈ సీజన్ నుంచి రైతులు సాగుచేసిన పంటలను రైతులే నమోదు చేసుకోవాలంటూ చెప్పడం వల్ల ఈ–క్రాప్ స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలుగుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

లక్ష్యానికి దూరంగా ఈ-పంట నమోదు..

వాస్తవానికి.. ఏటా రబీ సీజన్‌లో నవంబరు మొదటి వారంలో ఈ–క్రాప్ నమోదు ప్రారంభించి జనవరి 31కల్లా పూర్తిచేసేవారు. కానీ, ఈ ఏడాది డిసెంబరు 17న శ్రీకారం చుట్టారు. డిజిటల్ క్రాప్ సర్వే ప్రకారం నూరు శాతం ల్యాండ్ పార్శిల్స్ నమోదు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు ఏడు శాతానికి మించి నమోదు చేయలేకపోయారు. 11.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 47వేల ఎకరాల్లో ఉద్యాన, 670 ఎకరాల్లో పట్టు, 5,962 ఎకరాల్లో సామాజిక అటవీ పంటలు నమోదు చేశారు. అలాగే, ఈ సీజన్‌లో దాదాపు 45 లక్షల మంది రైతులు రబీ పంటలు సాగుచేస్తుండగా, ఇప్పటివరకు కేవలం 5.57 లక్షల మంది సాగుచేసిన పంటల వివరాలను మాత్రమే నమోదుచేశారు. ఇక డిజిటల్ క్రాప్ సర్వే ప్రకారం.. రాష్ట్రంలో 2.93 కోట్ల ల్యాండ్ పార్సిల్స్ ఉండగా, ఇప్పటివరకు కేవలం 11 లక్షలు మాత్రమే నమోదుచేశారు.

నిర్వీర్యమే లక్ష్యంగా స్వీయ నమోదు..

ప్రస్తుత సీజన్ నుంచి తాము సాగుచేసిన పంట వివరాలను భౌగోళిక సరిహద్దులతో సహా నేరుగా రైతులే ఈ–పంట యాప్‌లో స్వయంగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పింది. వాస్తవానికి.. రైతులు పొలంలో ఉన్న సమయంలో ఆర్బీకే సిబ్బంది వెళ్లి రైతుతో పాటు పంట ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అయితే, తాము వెళ్లినప్పుడు వారు ఉండడం లేదనే సాకుతో ఈ–పంట నమోదు, ఫొటోల అప్‌లోడ్ బాధ్యతను రైతులకే అప్పగించారు. అలాగే, గతంలో సామాజిక తనిఖీ కింద ఆర్బీకేల్లో ప్రదర్శించిన తర్వాత, గ్రామసభల ద్వారా అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించి తుది జాబితాలను ప్రదర్శించే వారు. అలాంటిది ఇక నుంచి www.karrhak.ap.gov.in/ecsop, www.africuture.ap.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి తమ ఆధార్ నెంబర్‌తో ఈ–పంట నమోదు వివరాలను రైతులే పరిశీలించుకోవడమే కాక.. స్వీయ ధృవీకరణతో పాటు తప్పొప్పులపై ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసుకోవాలని చెప్పారు. అయితే, ఎంతమంది రైతులకు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లున్నాయి? ఎంతమంది రైతులకు స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన ఉందనేది ఆలోచించకుండా ఈ బాధ్యతను రైతులకు అప్పగించడంపట్ల సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి.

ఈ-క్రాప్ స్ఫూర్తిని దెబ్బతీసేందుకే..

ఇక రైతులు తాము ఎంత విస్తీర్ణంలో ఏ పంటసాగు చేయబోతున్నామో ముందుగా సమీప ఆర్బీకే సిబ్బందికి తెలియజేయాలి. వెబ్‌ల్యాండ్, సీసీఆర్సీ (పంట సాగు హక్కు పత్రం) డేటా ఆధారంగా సీజన్ వారీగా ఏ సర్వే నెంబర్‌లో ఏ రైతు ఏయే పంటలు ఏ పద్ధతుల్లో సాగుచేస్తున్నారో జాయింట్ అజమాయిషీ కింద వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ సహాయకులు క్షేత్రస్థాయి పరిశీలనలో నమోదు చేయాలి. అలాగే..

- రైతును పంట పొలం వద్ద నిలబెట్టి ఫొటోలు తీసి జియో కోఆర్డినేట్స్‌తో అప్‌లోడ్ చేయాలి.
- ఆ తర్వాత ఈ వివరాలను ఆర్బీకే, రెవెన్యూ అధికారులు ధృవీకరించి రైతుల వేలిముద్రలు (ఈకేవైసీ) తీసుకున్నాక మొబైల్ ఫోన్లకు మెస్సేజ్ పంపాలి.
- ర్యాండమ్‌గా 5–10 శాతం విస్తీర్ణంలో సాగైన పంట వివరాలను ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ధృవీకరించిన తర్వాత రైతులకు భౌతిక రశీదులివ్వాలి.
- ముసాయిదా జాబితాలను తొలుత సామాజిక తనిఖీ కింద ఆర్బీకేల్లో ప్రదర్శించి గ్రామసభల ద్వారా రైతుల అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించి తుది జాబితాలను ప్రదర్శించాలి.
- ఇలా పక్కాగా ఈ–పంట నమోదు జరిగితే ఏదైనా విపత్తు వేళ ఎంత విస్తీర్ణంలో ఏ పంట దెబ్బతిన్నదో క్షణాల్లో గుర్తించొచ్చు. నేరుగా సదరు రైతుకు నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)తో పాటు పంటల బీమా పరిహారం అందించొచ్చు. పండించిన పంట ఉత్పత్తులను దళారీలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవచ్చు. అలాగే, సాగు వేళ అవసరమైన విత్తనాలు, ఎరువులు వంటి ఉత్పాదకాలను అందించే అవకాశం ఉంటుంది. ఏపీలో అమలుచేసిన ఈ–క్రాప్ స్ఫూర్తితోనే జాతీయ స్థాయిలో కేంద్రం డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)కు శ్రీకారం చుట్టింది. డీసీఎస్ నిబంధనల ప్రకారం ప్రతీ ల్యాండ్ పార్సిల్‌ను విధిగా నమోదుచేయాలనే నిబంధన ఉంది. ఇది భారం కావడంతో ఈ–పంట నమోదు బాధ్యత నుంచే ప్రభుత్వం తప్పించుకోవాలన్న ఎత్తుగడ వేస్తున్నట్లు కన్పిస్తోంది.

ఈ-పంట నమోదును నిర్వీర్యం చేశారు

అత్యంత పారదర్శకంగా గత ప్రభుత్వం చేపట్టిన ఈ–పంట నమోదు ప్రక్రియను ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. వాస్తవ సాగుదారులైన కౌలుదారుల వివరాలను నమోదు చేయడం లేదు. భూ యజమానుల పేరిట నమోదు చేస్తున్నారు. తాజాగా.. స్వచ్ఛందంగా రైతులకే స్వీయ నమోదుకు అవకాశం ఇవ్వడంవల్ల అవకతవకలు చోటుచేసుకునే అవకాశముంది.

– ఎం. హరిబాబు, ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మీరు కోరిన పత్రాలు వారి నుంచే తీసుకోండి

ఏపీకి గోదావరి బోర్డు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజనకు ముందు తెలంగాణ ప్రాజెక్టులకు 940.87 టీఎంసీల జలాలను వినియోగించుకోవడానికి కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)లోని వివిధ డైరెక్టరేట్లతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) ఇచ్చిన అనుమతుల పత్రాలు ప్రాజెక్టుల వారీగా అందజేయాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ)ను ఏపీ ప్రభుత్వం కోరింది. దీనిపై గోదావరి బోర్డు స్పందిస్తూ ఆయా విభాగాల నుంచే నేరుగా ఆ సమాచారం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఏపీ, తెలంగాణ మధ్య జలవివాదాలపై ఇరు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి పరిష్కారాలను సూచించడానికి కేంద్ర జల్ శక్తి శాఖ ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీలో రెండు రాష్ట్రాలకు సంబంధించిన అత్యున్నత స్థాయి పరిపాలన, సాంకేతిక విభాగాల అధికారులతో పాటు సీడబ్ల్యూసీలో ప్రాజెక్టుల ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టులు(పీఎఫ్ఆర్), డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టులు(డీపీఆర్)లను మదింపు జరిపే అధికారులూ ఉన్నారని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో అవసరమైన పత్రాలు, సమాచారాన్ని కోరుతూ నేరుగా కమిటీకి విజ్ఞప్తి చేయాలని ఏపీకి సూచించింది. ఈ మేరకు ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ (ఇరిగేషన్)కి గోదావరి బోర్డు శుక్రవారం లేఖ రాసింది.

కీర్తిచోర నారా...
మరో చోరీ!

కాకినాడ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు కూడా తన ఘనతేనంటూ డప్పు

కాకినాడలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు వైఎస్ జగన్ హయాంలో యూనిపెర్‌తో గ్రీన్‌కో ఒప్పందం

వాస్తవాలను దాచిపెట్టి ఈ ఒప్పందాన్ని తన ఖాతాలో వేసుకున్న బాబు సర్కారు

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వంలో కుదిరిన ఒప్పందాలను సీఎం చంద్రబాబు నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు. ఇప్పటికే విశాఖలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ చోరీకి పాల్పడిన చంద్రబాబు.. తాజాగా కాకినాడ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును కూడా తన ఘనతగా చెప్పుకొంటూ భారీ ప్రకటనలను జారీ చేయించారు. కాకినాడలో భారీ గ్రీన్ అమ్మోనియా యూనిట్ నెలకొల్పే విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో గ్రీన్‌కో 2023లోనే ఒప్పందం కుదుర్చుకుని దానికి అనుగుణంగా వేగంగా అడుగులు వేస్తే.. చంద్రబాబు సర్కారు ఆ ఘనతను తన ఖాతాలో వేసుకోవడంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. 2023లో బెంగళూరులో జరిగిన ఇండియా ఎనర్జీ వీక్‌లో అప్పటి కేంద్రమంత్రి హరదీప్‌సింగ్ పూరి సమక్షంలో కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును నెలకొల్పడానికి గ్రీన్‌కో సంస్థ యూనిపెర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ తర్వాత 2023 మార్చిలో విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్(జీఐఎస్)లో కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఏఎం గ్రీన్ సంస్థ ఒప్పందం చేసుకుంది. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా కాకినాడ గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో చర్చ జరగడంతో పాటు అవార్డులు దక్కించుకుంది. పునరుత్పాదక ఇంధనాల కోసం కఠినమైన యూరోపియన్ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా ఈయూ పునరుత్పాదక ఇంధనాలు నాన్–బయోలాజికల్ ఆరిజిన్ (ఆర్‌ఎఫ్‌ఎన్‌బీఓ) ప్రీ–సర్టిఫికేషన్ పొందిన మొదటి భారతీయ ప్రాజెక్టుగా ఏఎం గ్రీన్ నిలిచింది.

కేంద్రం కంటే ముందుగానే సొంత పాలసీ

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం 2023లోనే ఓ ప్రత్యేక పాలసీని రూపొందించింది. గ్రీన్ ఎనర్జీపై కేంద్రం పాలసీ తీసుకురావడానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురావడం గమనార్హం. రాష్ట్రంలో ప్రస్తుతం గ్రీన్ హైడ్రోజన్ డిమాండ్ ఏడాదికి దాదాపు 0.34 మిలియన్ టన్నులు (ఎంటీ) ఉంటే రానున్న ఐదేళ్లలో సంవత్సరానికి 0.5 మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్, 2 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని వైఎస్ జగన్ ప్రభుత్వం పాలసీని రూపొందించింది. ఒక మిలియన్ టన్ను గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయగలిగితే 12 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేసింది. ఈ పాలసీ అమలుకు న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్‌డీసీ ఏపీ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఈ పాలసీతో ఎన్టీపీసీ, ఏఎం గ్రీన్‌కో, రెన్యూ ఎనర్జీ, ఇండోసోల్, ఏబీసీ, అదానీ గ్రీన్ఎనర్జీ వంటి అనేక పెట్టుబడులు రాష్ట్రానికి వెల్లువలా వచ్చాయి. 2023లో జరిగిన జీఐఎస్ సదస్సులో మొత్తం రూ.13.11 లక్షల కోట్లకుపైగా పెట్టుబడుల ఒప్పందాలు వస్తే, అందులో ఒక్క గ్రీన్ ఎనర్జీ రంగంలోనే రూ.9,07,127 కోట్ల విలువైన 40కి పైగా ఒప్పందాలు కుదిరాయంటే ఈ రంగంలో పెట్టుబడులకు వైఎస్ జగన్ ఏ స్థాయిలో కృషి చేశారో అర్థం చేసుకోవచ్చు. చంద్రబాబు సర్కారు గ్రీన్ ఎనర్జీ రంగంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించలేక గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలను తన ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటోంది.


GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Energy Department – Formulation of Andhra Pradesh Green Hydrogen & Green Ammonia Policy – 2023- Orders- Issued.

==

ENERGY (POWER.II) DEPARTMENT

G.O.Ms.No.14 Dated:20.06.2023
Read the following:-

O R D E R:-

Government hereby notify the following Andhra Pradesh Green Hydrogen & Green Ammonia Policy – 2023 for promotion of Green Hydrogen and Green Ammonia production in Andhra Pradesh State.

ANDHRA PRADESH GREEN HYDROGEN & GREEN AMMONIA POLICY - 2023

1. PREAMBLE

1.1 Today, world is in the midst of a major transition to clean energy due to growing concerns of climate change and global warming. The 2015 Paris agreement, followed by the CoP 26 summit (26th Conference of Parties) held during 2021, under the **United Nations Framework Convention on Climate Change (UNFCCC)** targeted to limit the increase in global warming by 2°C and achieve **"Net Zero"** emissions by the year 2050. Honourable Prime Minister of India, Shri Narendra Modi ji on his part presented **"Panchamrit"** to deal with this challenge and pledged to achieve **"Net Zero by 2070"**.

1.2 Five targets under **"Panchamrit"** set up by Government of India for dealing with climate change and global warming are

i. Achieve about 50 percent cumulative electric power installed capacity from non-fossil fuel-based energy resources by 2030
ii. Meet 50 percent of energy requirements from Renewable Energy (RE) sources by 2030
iii. Reduce the total projected carbon emissions by one billion tonnes from current level till 2030
iv. Reduce the emission intensity of the GDP by 45% by 2030, from 2005 level
v. Achieve "Net Zero" by 2070

1.3 Hydrogen is emerging as one of the major alternative fuels due to zero carbon content, thereby generating interest in the world about the possibility of manufacturing hydrogen through Renewable Energy (RE). To cut down GHG emissions in sectors such as Oil & Gas, Heavy Industries, and

వైఎస్ జగన్ ప్రభుత్వం 2023లో విడుదల చేసిన గ్రీన్ హైడ్రోజెన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ ఉత్తర్వులు

‘గ్రీన్’ ప్రాజెక్టులకు వైఎస్ జగన్ రెడ్ కార్పెట్

- జగన్ తెచ్చిన కంపెనీలతో మళ్లీ ఒప్పందాలు కుదుర్చుకుంటూ చంద్రబాబు క్రెడిట్ చోరీ
- గత ప్రభుత్వంలోనే క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో భేష్ అనిపించుకున్న ఏపీ

సాక్షి, అమరావతి : స్వచ్ఛ ఇంధనంగా పిలిచే గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్‌ను వైఎస్ జగన్ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమంగా నిలిపింది. పునరుత్పాదక విద్యుత్‌తో పాటు ఇంధన సామర్థ్యం, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో మన రాష్ట్రం వైఎస్సార్‌సీపీ పాలనలోనే అగ్రస్థానంలో దూసుకెళ్లిందనడానికి జాతీయ నివేదికలు సాక్ష్యంగా నిలిచాయి. నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పంప్డ్ స్టోరేజ్ పవర్ (పీఎస్పీ) ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి గ్రీన్ ఎనర్జీ పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా చేసిన పాలసీలే ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వానికి మార్గదర్శకాలయ్యాయి. కానీ, ఇప్పుడు తామే పీఎస్పీలను కనిపెట్టినట్టు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను తెస్తున్నట్టు పాత ఒప్పందాలనే మళ్లీ చేసుకుంటూ చంద్రబాబు ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోంది.

తామే తెస్తున్నట్టు బిల్డప్

రెన్యూ పవర్‌ని గత ప్రభుత్వం రాష్ట్రం నుంచి గెంటేసిందని, తామే ఆ సంస్థ నుంచి పెట్టుబడులు తీసుకొస్తున్నామని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు వల్లె వేశారు. నిజానికి.. వైఎస్ జగన్ ప్రభుత్వం విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రెన్యూ పవర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అంతేకాక.. రెన్యూ సంస్థ ప్రాజెక్టులకు అవసరమైన భూములు విశాఖ, కాకినాడ జిల్లాల్లో కేటాయించేందుకు కూడా అప్పుడే స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) అంగీకారం తెలిపింది. 2023 జూన్ 20న ఒక జీఓ, 2024 ఫిబ్రవరి 5న మరో జీఓను వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. కానీ.. విచిత్రంగా వైఎస్ జగన్ తెచ్చిన అదే రెన్యూ కంపెనీతో వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో చంద్రబాబు సర్కారు మళ్లీ ఒప్పందం కుదుర్చుకుంది. అదేవిధంగా.. గ్రీన్‌కోకు చెందిన ఏఎం గ్రీన్ ఆధ్వర్యంలో 2023 ఫిబ్రవరి 7న వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే ఒప్పందం జరిగింది. తాజాగా.. దీనిని కూడా తండ్రీ కొడుకులు క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందంపై నాటి సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అనంతరం రెన్యూ పవర్ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా స్పందన ఇదీ..

పాలసీలకు అప్పుడే రూపకల్పన

గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించడం కోసం ఐదేళ్లలో ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏపీ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పోర్ట్ పాలసీ–2020, ఏపీ పంప్డ్ స్టోరేజీ ప్రమోషన్ పాలసీ–2022, ఏపీ గ్రీన్ ఎనర్జీ అండ్ గ్రీన్ అమ్మోనియా ప్రమోషన్ పాలసీ–2023లను తీసుకొచ్చింది. ఈ చర్యలతో పునరుత్పాదక ఇంధన పరిరక్షణలో ఏకంగా రాష్ట్రపతి చేతుల మీదుగా వరుసగా రెండేళ్లు అవార్డులు సైతం దక్కించుకుంది. ఏపీ ట్రాన్స్‌కోకు ‘టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్’ అవార్డు, దేశంలోనే ఉత్తమ టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీగా నెడ్‌క్యాప్‌కు అవార్డు, రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్‌ను చేరుకున్న ఉత్తమ రాష్ట్రంగా మరో అవార్డు రాష్ట్రానికి లభించాయి. వైజాగ్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో, గ్రీన్ హైడ్రోజన్, బయో డీజిల్, కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్రాజెక్టుల కోసం 42 ఇంధన అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది.

గ్రీన్ హైడ్రోజన్‌కు అనుకూలంగా..

గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) వంటి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రం అప్పుడే అందిపుచ్చుకుంది. రాష్ట్రంలో 10 నుంచి 15 బిలియన్ డాలర్ల గ్రీన్ హైడ్రోజన్ ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాలు ఉన్నాయని ఇంధన శాఖ గత ప్రభుత్వ హయాంలోనే అంచనా వేసింది. ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేయడానికి, రాష్ట్ర అవసరాల కోసం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు రాష్ట్రం అనుకూలంగా ఉంది. ఇక్కడ ఏటా 400 కిలో టన్నుల దేశీయ హైడ్రోజన్ డిమాండ్ ఉంది. 2030 నాటికి కనీసం 500 కిలో టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. ఇందుకోసం యాక్సిలరేటింగ్ స్మార్ట్ పవర్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్ ఇండియా (ఆస్పైర్) ప్రోగ్రాం కింద ఫారిన్, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ సాయంతో ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాల నివేదికను వైఎస్ జగన్ ప్రభుత్వం సిద్ధం చేసింది. ఫలితంగా ఏపీలో కేంద్ర సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. విశాఖలో దాదాపు 1,200 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ ముందుకొచ్చి గత ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. 1,200 ఎకరాల్లో రోజుకి 1,200 టన్నుల హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యంతో రూ.1.10 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ హబ్ ఏర్పాటు చేయడానికి ఎన్టీపీసీ సంసిద్ధత వ్యక్తం చేసింది.

టాప్-5లో ఏపీని నిలిపిన జగన్

కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ‘ఎనర్జీ స్టాటిస్టిక్స్ ఇండియా–2025’ నివేదిక ప్రకారం.. 2024 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 21,09,655 మెగావాట్లుగా అంచనా. ఇందులో సగానికి పైగా నాలుగు రాష్ట్రాల్లో కేంద్రీకృతమై ఉంది. ఇందులో 7.9 శాతంతో ఏపీ 5వ స్థానంలో నిలిచింది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎనర్జీ ఎకనామిక్స్ అండ్ ఫైనాన్షియల్ అనాలసిస్, ఎంబర్ సంస్థల 2018–24 నివేదిక కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళల్లో ఐదు జాతీయ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇది వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీకి దక్కిన అరుదైన గుర్తింపు. ఈ హబ్‌లను 25 గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు క్లస్టర్లుగా విభజించి గ్రీన్ హైడ్రోజన్‌ను వివిధ రంగాలకు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించింది.

గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు ఎన్ఎఫ్‌సీఎల్ శ్రీకారం

1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్‌సీఎల్)లో ఏఎం గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శనివారం శంకుస్థాపన చేశారు. ప్లాంట్ లక్ష్యాలను ఏఎం ప్రతినిధులు కొల్లి మహేష్, చలమలశెట్టి అనిల్ వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2027 జూన్ నాటికి 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. కాకినాడ నుంచి గ్రీన్ అమ్మోనియాను జర్మనీకి ఎగుమతి చేస్తారన్నారు. గతంలో గ్రే అమ్మోనియా తయారీని నాగార్జున ఫెర్టిలైజర్స్ చేపట్టిందన్నారు. అదే ప్రాంతంలో పర్యావరణ హితంగా గ్రీన్ అమ్మోనియా తయారవుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత సాధించడంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారని, ఇందుకు అనుగుణంగా రాష్ట్రంలో 160 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీని లక్ష్యంగా నిర్దేశించుకున్నారని చెప్పారు. సౌర, పవన, జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్ వంటి విద్యుత్ ఉత్పత్తికి గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తులకు అనుకూలంగా రాష్ట్రం మారుతుందన్నారు. అలాగే గ్రీన్ అమ్మోనియా ప్రకృతి సేద్యానికి దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ కొనుగోలు భారాన్ని యూనిట్‌కు రూ.1.19 మేర తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వచ్చే 6 నెలల్లో అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు ప్రారంభమవుతాయని సీఎం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మట్టపల్లి లింగయ్య (ఫైల్)

దుర్గి: అప్పుల బాధ తాళలేక రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా ముటుకూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మట్టపల్లి లింగయ్య(38) వ్యవసాయం నిమిత్తం అప్పులు చేశాడు. పంట దిగుబడి రాకపోవడం, వచ్చిన పంటకు కూడా ప్రభుత్వం మద్దతు ధర కల్పించకపోవడంతో నష్టాల పాలయ్యాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధీర్ కుమార్ తెలిపారు.

దావోస్‌కు సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం ఆదివారం దావోస్ వెళ్లనుంది. 19 నుంచి 22 వరకూ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి భేటీలు, కార్యక్రమాల్లో సీఎం పాల్గొంటారు. పర్యటన తొలి రోజున జ్యూరిచ్‌లో తెలుగు డయాస్పొరా మీటింగ్‌లో పాల్గొంటారు. జనవరి 22న దావోస్ నుంచి బయల్దేరి 23న ఉదయం హైదరాబాద్‌కు చంద్రబాబు చేరుకుంటారు.

చెర్వుగట్టులో ఏపీ హైకోర్టు జడ్జి పూజలు

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం ఏర్పాటు చేశారు.

రెండోసారి ల్యాండ్ పూలింగ్ క్రిమినల్ చర్యే

- సీఎం చంద్రబాబుపై సీపీఐ నేత నారాయణ ఫైర్

సాక్షి, అమరావతి: అమరావతి కోసం ల్యాండ్ పూలింగ్ పేరుతో రెండోసారి భూములు లాక్కోవడం మంచి పద్ధతి కాదని, ఇది ముమ్మాటికీ క్రిమినల్ చర్య అని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ స్పష్టం చేశారు. ఆయన శనివారం విజయవాడలో మాట్లాడుతూ.. మొదటి విడత ల్యాండ్ పూలింగ్ కింద తీసుకున్న భూములను అభివృద్ధి చేసి, రైతులకు ప్లాట్లు ఇవ్వకుండా రెండోవిడత పూలింగ్‌కు సిద్ధపడడం సరికాదన్నారు. అయినోళ్లకు ఆకుల్లో.. కానోళ్లకు కంచంలో పెడతావా అని చంద్రబాబుపై మండిపడ్డారు.

ఖమ్మం సభకు 5 లక్షల మంది..

ఖమ్మంలో మొట్టమొదటి సారిగా సీపీఐ శతాబ్ది ముగింపు వేడుకలు జరుగుతున్నాయని, 5 లక్షల వరకు ప్రజలు తరలి రానున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు.

ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్–మహారాష్ట్ర సరిహద్దుల్లోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన వేర్వేరు ఎదురుకాల్పుల ఘటనల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ విషయాన్ని బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ మీడియాకు వెల్లడించారు. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతం పరిధిలోని కందాలపర్తి, సక్మెట్ట గ్రామాల సమీపంలో మావోయిస్టు పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి పాపారావు, డీవీసీఎం మెంబర్ దిలీప్‌తోపాటు 100 మందికిపైగా మావోయిస్టులు సంచరిస్తున్నారని నిఘా వర్గాలకు సమాచారం అందింది. దీంతో బీజాపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ విభాగాల బలగాలు శుక్రవారం సాయంత్రం నుంచి కూంబింగ్ చేపట్టాయి. శనివారం ఉదయం బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు మొదలుపెట్టగా బలగాలు సైతం ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో తొలుత డివిజనల్ కమిటీ సభ్యుడు దిలీప్ బెడ్జాతోపాటు మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు కోసా మడివి మృతిచెందారు. మరికొందరు గాయపడ్డప్పటికీ తప్పించుకున్నారు. ఘటనా స్థలంలో ఒక ఏకే 47తోపాటు పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎదురుకాల్పుల ఘటన నుంచి పలువురు మావోయిస్టులు తప్పించుకోవడంతో వారి కోసం అదనపు బలగాలతో కూంబింగ్‌ను విస్తృతం చేశారు. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడటంతో బలగాలు జరిపిన కాల్పుల్లో మరో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో ఒక మహిళా మావోయిస్టు ఉండగా వారిని గుర్తించాల్సి ఉందని ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు.

పల్లె నుంచి పట్నం వైపు

సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు తిరుగుబాట పట్టడంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. నల్లగొండ జిల్లా చిట్యాల వద్ద హైదరాబాద్ రూట్‌లో ప్రధాన రోడ్డుతో పాటు సర్వీస్‌రోడ్డుపై కూడా వాహనాలు ఇలా బారులు తీరాయి.

దయను, సత్యమును ఎన్నడును నిన్ను విడిచి పోనియ్యకుము.
వాటిని కంఠ భూషణములుగా ధరించుకొనుము.
నీ హృదయమను పలక మీద వాటిని వ్రాసికొనుము.
– క్రైస్తవ ధర్మం

శ్రీవారి ద్రోహికి శిక్ష తప్పదు!

అభిప్రాయం

భూమన కరుణాకరరెడ్డి

ధర్మ ఏవ హతో హన్తి, ధర్మో రక్షతి రక్షితః/తస్మాద్ధర్మో న హంతవ్యో, మా నో ధర్మో హతోవధీత్!!

'ధర్మాన్ని నాశనం చేస్తే, అది చేసిన వాడిని నాశనం చేస్తుంది. ధర్మాన్ని రక్షిస్తే, అది వారిని రక్షిస్తుంది. అలాగే ధర్మాన్ని ఎప్పుడూ నాశనం చేయకూడదు. ఒకవేళ నాశనం చేస్తే అదే దుర్గతి మనకు సంప్రాప్తిస్తుంది' అనేది ఈ శ్లోకం అర్థం. సనాతన ధర్మం (మనుస్మృతి)లో ధర్మ విశిష్టతను చెప్పే శ్లోకం ఇది. ధర్మానికి, న్యాయానికి సర్వలోకమూ నిలువెత్తు కొండగా తిరుమల శ్రీవారిని చూస్తుంది. కష్టమొస్తే, నష్టమొస్తే... 'కలియుగ దైవమా, పాహిమాం' అని వేడుకుంటే, ముల్లోకాల్లో శ్రీవారు ఎక్కడున్నా కాపాడుతారని భక్తుల అచంచల విశ్వాసం. అలాంటి అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడిపై నిత్యం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అనుచరగణం విషం చిమ్ముతున్నారు. పదివేల శేషుల పడగలపై ఆసీనులైన శ్రీ మహావిష్ణువుపై తాను విషం చిమ్ముతున్నాననే స్పృహలో లేనంతగా వారికి అహంకారం తలకెక్కిందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

రాజకీయ స్వార్థానికి చివరికి కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామిని సైతం వదిలిపెట్టనంతగా చంద్రబాబులో అవకాశవాదం పెరిగిపోయింది. మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, అలాగే ఆయన సైనికులైన మాలాంటి వాళ్లపై రాజకీయ కక్ష తీర్చుకోవడానికి చంద్రబాబుకు వేరే మార్గాలున్నాయి. కానీ అధికారంలోకి రాక మునుపు, వచ్చిన తర్వాత కూడా తిరుమల శ్రీవారినే చంద్రబాబు ఎంచుకోవడం తీవ్ర ఆవేదన, ఆందోళన కలిగిస్తోంది.

గత ఏడాదిన్నర చంద్రబాబు పాలనలో తిరుమల శ్రీవారి కేంద్రంగానే దుర్మార్గ రాజకీయాలకు బరి తెగించారని చెప్పడానికి ఆవేదన చెందుతున్నా. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వైసీపీ హయాంలో జంతువుల కొవ్వు కలిపారని సీఎం స్థాయిలో చంద్రబాబు నోరుజారి, స్వామి వారి దృష్టిలో క్షమించరాని నేరానికి పాల్పడ్డారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న చంద్రబాబు శ్రీవారి లడ్డూపై నిందారోపణలు చేయడాన్ని సాక్షాత్తు సర్వోన్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టే చీవాట్లు పెట్టింది. ఆ విషయమై నిగ్గు తేల్చేందుకు సీబీఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది.

కల్తీ అయ్యింది శ్రీవారి లడ్డూ ప్రసాదం కాదు, చంద్రబాబు మనసు రాజకీంగా కలుషితమైంది. అధికారం కోసం పిల్లనిచ్చిన మామనూ, అలాగే అలవికాని హామీలిచ్చి ప్రజల్నీ వెన్నుపోటు పొడిచారని మాత్రమే ఇంతకాలం చంద్రబాబును విమర్శించే వాళ్లం. కానీ కలియుగ దైవాన్ని కూడా విడిచిపెట్టలేదని లడ్డూ ప్రసాదంపై అత్యంత దుర్మార్గంగా పెద్ద బండలాంటి నింద వేశారని స్పష్టమైంది.

ఆ తర్వాత పరకామణిలో చోరీ కేసును కూడా స్వార్థ రాజకీయాలకు వాడుకుంటున్నారనేది కలియుగ దైవం ఎరిగిన సత్యం. తన అధికారం, మీడియా అండతో లోకం కళ్లు కప్పొచ్చని చంద్రబాబు భావిస్తుండొచ్చు. కానీ సర్వాంతర్యామి అయిన శ్రీవారిని మోసగించలేమని చంద్రబాబు తెలుసుకుంటే మంచిది.

తప్పు జరిగితే వదిలేవారా?

వైసీపీ హయాంలో ఏ తప్పూ జరగకపోయినా, ఏదో జరిగినట్టు ప్రజల్ని మభ్యపెట్టడంలో టీడీపీ, దాని అనుబంధ మీడియా నిమగ్నమైంది. మా హయాంలో తప్పు జరిగి ఉంటే, విడిచిపెట్టే పరిస్థితి ఉంటుందా? అనే ప్రశ్నకు... మాపై నిందలు మోపేవాళ్లు సమాధానం చెప్పాలి. చిన్న చిన్న తప్పులకే సామాన్య ప్రజలను వీధుల్లో ఊరేగిస్తుండడాన్ని చూస్తున్నాం. అలాంటిది టీటీడీలో మేమే తప్పు చేసి ఉంటే, ఈ పాటికి రాష్ట్రమంతా ఓపెన్ టాప్ జీపుల్లో ఈ ప్రభుత్వం ఊరేగించి, అవమానించకుండా విడిచిపెట్టేదా?

టీటీడీలో కొన్ని విభాగాల్లో అధికారుల తీరు వ్యవస్థీకృతమైంది. వాళ్ల తప్పుల్ని కూడా మాపై మోపి, తద్వారా వైసీపీని హిందూమత వ్యతిరేకిగా ముద్ర వేయాలనే అత్యుత్సాహంలో, కోట్లాదిమంది మనోభావాల్ని దెబ్బతీస్తున్నామన్న సంగతిని విస్మరించారు.

శ్రీవేంకటేశ్వరస్వామి తన ఇలవేల్పు అనీ, అపార భక్తిశ్రద్ధలున్నాయనీ చంద్రబాబు తరచూ చెబుతుంటారు. కానీ మాటలకూ, చేతలకూ పొంతన ఉండదన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. టీటీడీ కేంద్రంగా టీడీపీ తన మీడియాను అడ్డుపెట్టుకుని చేస్తున్న దుష్ప్రచారమంతా, అంతిమంగా హిందువుల మనోభావాల్ని దెబ్బతీసేదే!

అధికారాన్ని అడ్డం పెట్టుకుని రాష్ట్ర ఖజానాను కొల్లగొడితే, ఆ తర్వాత మా వైఎస్ జగన్ ప్రభుత్వం ఆయన్ను అవినీతి కేసులో అరెస్ట్ చేసింది. అయితే మళ్లీ అధికారాన్ని అడ్డంపెట్టుకుని, అధికారుల్ని బెదిరించి, ప్రలోభపెట్టి తప్పుడు నివేదికలతో కేసులన్నీ కొట్టేయించుకుంటున్న చంద్రబాబు, స్వామివారి హుండీ సొమ్మును దొంగిలించడం తప్పని పశ్చాత్తాపం చెంది... కోట్లాది రూపాయల విలువైన ఆస్తుల్ని శ్రీవారి పేరుతో రాయించిన రవికుమార్ తీరులో ఆలోచించాలి. కనీసం పరకామణి చోరీ నిందితుడిలో కనిపించిన పశ్చాత్తాపం కూడా, ప్రజల సొమ్మును కొల్లగొట్టిన చంద్రబాబులో లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఈ కేసులో చంద్రబాబు రాజకీయ స్వార్థానికి సతీశ్‌కుమార్ అనే నిజాయతీ కలిగిన సీఐ బలి అయ్యారు. ఇక్కడ బలి అయ్యింది కేవలం సీఐ మాత్రమే కాదు... ధర్మం, న్యాయం అనే సంగతిని మరిచిపోవద్దు. భార్య, ఇద్దరు చిన్నారులున్న సతీశ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఉసురు తగలక మానదు. అలాగే చాలామంది అధికారుల్ని మానసికంగా తీవ్రంగా వేధిస్తుండడం బహిరంగ రహస్యమే. అధికారులతో పాటు రాజకీయంగా మాపై వేధింపులు కాస్తా, కక్షగా మారి, సమాజ బహిష్కరణ చేయాలనే బీఆర్ నాయుడి అహంకారపూరిత పిలుపు దిగ్భ్రమ కలిగిస్తోంది. 'ఇలాంటి వాళ్లా అత్యంత ప్రతిష్ఠాత్మక టీటీడీకి చైర్మన్?' అనే ప్రశ్న సమాజం మనసును తొలిచేస్తోంది.

గోశాల గోవుల మరణాలు

టీటీడీ ఆధ్వర్యంలో నడిచే గోశాలలో వందలాది గోవుల మరణాలకు చంద్రబాబు, ఆయన నియమించిన బీఆర్ నాయుడి నేతృత్వంలోని పాలక మండలి మూల్యం చెల్లించుకోక తప్పదు. శ్రీవారిపై భక్తిశ్రద్ధలతో గోవుల మరణాలను నేను వెలుగులోకి తీసుకొస్తే, తప్పుల్ని సరిదిద్దుకోడానికి బదులు ఎదురు దాడికి దిగడం దివాళాకోరుతనాన్ని చూపుతోంది. గోవుల మృతిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో, తిరుపతి ఎమ్మెల్యే ఒక్కొక్కరు ఒక్కో సంఖ్య చెప్పి, అంతిమంగా నేను చెప్పింది నిజమే అని నిర్ధారించడం వాస్తవం కాదా? అసలు గోవును తల్లిగా భావించి, పూజించే పుణ్య భూమి, కర్మ భూమి మనదనే వాస్తవం తెలియక పోవడం మన దురదృష్టం.

◆ టీటీడీలో అవినీతి గురించి ఎంత చెప్పినా తక్కువే. శ్రీవారిని దర్శించుకోడానికి క్యూ కాంప్లెక్స్‌లలో ఉన్న భక్తులకు ఉచితంగా అందాల్సిన ప్రసాదాలను, దళారులు అమ్ముకుంటున్నది వాస్తవం కాదా? అలాగే టీటీడీలో టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయించే దందా సాగుతోంది. ఇదే మా హయాంలో బ్లాక్ మార్కెట్‌లో టికెట్ల విక్రయానికి సంబంధించి ఎమ్మెల్సీని అరెస్ట్ చేశాం. అలాగే కొండపై నుంచి బ్లాక్ మార్కెట్లో టికెట్ల దళారుల్ని తరిమికొట్టి, స్వామిపై మా భక్తి ఏంటో చేతల్లో చూపాం. మరి మీ హయాంలో చేస్తున్నదేంటో?

ఇక టీటీడీలో అవినీతి గురించి ఎంత చెప్పినా తక్కువే. శ్రీవారిని దర్శించుకోడానికి క్యూ కాంప్లెక్స్‌లలో ఉన్న భక్తులకు ఉచితంగా అందాల్సిన ప్రసాదాలను, దళారులు అమ్ముకుంటున్నది వాస్తవం కాదా? అలాగే టీటీడీలో టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో యథేచ్ఛగా విక్రయించే దందా సాగుతోంది. ఇదే మా హయాంలో బ్లాక్ మార్కెట్‌లో టికెట్ల విక్రయానికి సంబంధించి ఎమ్మెల్సీని అరెస్ట్ చేశాం. అలాగే కొండపై నుంచి బ్లాక్ మార్కెట్లో టికెట్ల దళారుల్ని తరిమికొట్టి, స్వామిపై మా భక్తి ఏంటో చేతల్లో చూపాం. మరి మీ హయాంలో చేస్తున్నదేంటో, కొండపై అడుగడుగునా కనిపించే దళారుల దాష్టీకాలే నిదర్శనం.

తిరుమల కొండపై అన్యమత ప్రచారం మాత్రమే అపచారం కాదు. కొండపై అవినీతి కూడా అపచారమే! బీఆర్ నాయుడి కార్యాలయం కేంద్రంగా సాగుతున్న అవినీతి అపచారం అంతా ఇంతా కాదు. దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి, భక్తుల్ని ఇష్టానుసారం దోచుకుంటున్నారు. స్వామి వారి దర్శనానికి వచ్చి, ఆనందంగా తిరుగు ప్రయాణం కావాల్సిన భక్తులు... దోపిడీకి గురయ్యామన్న ఆవేదనతో వెనుదిరగడం వాస్తవం కాదా? కంచే చేను మేసిన చందంగా, టీటీడీలో అవినీతి రహిత పాలన అందించాల్సిన బాధ్యతల్లో ఉంటూ, వాళ్లే దళారులుగా మారితే ఇక చెప్పడానికి ఏముంటుంది?

అలాగే అలిపిరి సమీపంలో రోడ్డుపక్కన 12 అడుగుల విష్ణుమూర్తి విగ్రహం అత్యంత దయనీయ స్థితిలో ప్రత్యక్షం కావడం కోట్లాది హిందువుల మనోభావాల్ని దెబ్బతీసింది. ఈ వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చిన పాపానికి నాపై కేసు పెట్టడం, అలాగే పోలీసులు విచారించడం దేనికి సంకేతం? సత్యం చెప్పినందుకు చరిత్రలో కళ్లు, ప్రాణాలు పోగొట్టుకున్న వాళ్లెందరో ఉన్నారు. అందుకే నేనెంతగానో ఇష్టపడే శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠకు భంగం కలిగితే ప్రాణాలు పోయేంత వరకూ నిజాలు మాట్లాడుతూనే ఉంటానని గతంలో చెప్పాను. ఇప్పుడూ అదే మాటకు కట్టుబడి ఉన్నాను.

కొండపై మద్య మాంసాలు యథేచ్ఛగా దొరుకుతుండడం కోట్లాది భక్తుల మనోభావాల్ని దెబ్బ తీయడం కాదా? ఈ మధ్య కాలంలో తిరుమల పోలీస్ గెస్ట్‌హౌస్ సమీపంలో మద్యం బాటిళ్లు కనిపిస్తే, వాటిని వీడియో తీసిన వ్యక్తిని, అలాగే సాక్షి ఫొటోగ్రాఫర్‌ని నిందితులుగా పేర్కొనడం కూటమి ప్రభుత్వ దురాగతానికి నిదర్శనం కాదా? ఇదే విషయమై ఆ రోజు తిరుపతి ఎస్పీ పీఆర్వో విడుదల చేసిన ప్రకటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాయంత్రానికి మాట మార్చడాన్ని ఏమనాలి?

వాస్తవాలు చెప్పడం దేశద్రోహమా?

అత్యంత పవిత్రమైన, హిందువుల ఆధ్యాత్మిక రాజధాని క్షేత్రమైన తిరుమలను మద్యం, మాంసప్రియులు, దళారులకు వదిలేసి, వాస్తవాలను చెప్పిన వారిపై దేశద్రోహం కేసు పెట్టడం దుర్మార్గం. అయితే న్యాయదేవత కళ్లు తెరిచి, ఆగ్రహించడంతో ఆ కేసు గాలిలో కలిసిపోయింది. శ్రీవారి విషయంలో ద్రోహి ఎవరో ప్రతి హిందువుకూ తెలుసు. కేవలం తన పార్టీకి ప్రచారకర్తగా పని చేసిన టీవీ ఛానల్ అధిపతికి ప్రతిష్ఠాత్మక టీటీడీ చైర్మన్ పదవి కట్టబెట్టి, స్వామివారికి చంద్రబాబు మొదటి అపచారం చేశారు. టీటీడీ చైర్మన్‌గా శ్రీవారికి సేవ చేయడానికి బదులు, ఇంకా తాను చంద్రబాబు భక్తి ఛానల్ చైర్మన్ అనే మాయలోనే బీఆర్ నాయుడు ఉన్నారు.

అందుకే కొండపై నిత్యం స్వామి వారికి అపచారం. అంతెందుకు సీఎంవో నుంచి నిత్యం వచ్చే సిఫార్సు లేఖలెన్ని? టీటీడీ చైర్మన్ కార్యాలయం నిత్యం ఇస్తున్న వివిధ రకాల దర్శనాలకు సంబంధించి వివరాలు వెల్లడిస్తే, స్వామి వారి విషయంలో వ్యాపారం చేసుకుంటున్నదెవరో తేలిపోతుంది. వాటికి సంబంధించి గోప్యత పాటిస్తున్నారంటే, ఏదో తప్పు చేస్తున్నారనే కదా? అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. స్వామి వారి చెంత దర్శనాలకు సంబంధించి పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. టీటీడీలో గతంలో ఎప్పుడూ ఇలాంటి దాపరికాలు లేవు.

ఏడాదిన్నర చంద్రబాబు పాలనను గమనిస్తే మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. బాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి పరిశ్రమలు వెల్లువెత్తుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా సాగుతున్నాయని... లేనివి ఉన్నట్టు కనికట్టు చేస్తున్నారు. అరచేతిలో వైకుంఠాన్ని కూటమి సర్కార్ చూపుతోంది. మూడో విషయానికి వస్తే, తిరుమల కేంద్రంగా, అలాగే వైసీపీపై హిందూ వ్యతిరేక ముద్ర వేయడానికి చంద్రబాబు, ఆయన్ను మోసే మీడియా ఒక తప్పుడు ఎజెండాతో ముందుకెళుతోంది. ఈ కుట్రల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వం.

సంస్కరణలా? ఇబ్బందులా?

సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత, మొట్టమొదట శ్రీవారిని చంద్రబాబు దర్శించుకున్నారు. ఆ సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో సంస్కరణలకు తిరుమల నుంచే శ్రీకారం చుడుతున్నామని ఆర్భాటంగా ప్రకటించారు. మా హయాంలో తిరుమలలో అన్యమత ప్రచారం జరిగిందని, ఇంకా లేనిపోని నిందలన్నీ వేసి రాజకీయ లబ్ధి పొందారు. కానీ సంస్కరణలు కాదు కదా భక్తులకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వైకుంఠద్వార దర్శనం రోజు గతంలో ఎప్పుడూ లేని విధంగా అతి తక్కువ సంఖ్యలో భక్తులు వైకుంఠ ద్వార దర్శనాన్ని చేసుకున్నారు. తిరుమల అంటే భక్తుల్లో భయాన్ని కలిగించి, ఏడుకొండలపైకి వెళ్లకుండా చేయడంలో టీటీడీ చైర్మన్, ఇతర అధికారులు విజయవంతం అయ్యారంటే అతిశయోక్తి కాదు. గత వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో సరైన భద్రతాపరమైన చర్యలు తీసుకోని కారణంగా... ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. టీటీడీ చరిత్రలో ఇదో మాయని మచ్చ. ఇదంతా చంద్రబాబు నియమించిన టీటీడీ పాలక మండలి, అధికారుల చేతకానితనం వల్ల ఏర్పడిన విపత్తు. అంతే కాదు, టీటీడీ చైర్మన్ చిన్నపిల్లాడిలా ఉన్నతాధికారులతో గొడవ పడుతూ, పరిపాలన సవ్యంగా సాగనివ్వని పరిస్థితిని సృష్టించడం నిజం కాదా?

'ఎవరైనా శ్రీవారికి అపచారం తలపెడితే వచ్చే జన్మలో కాదు, ఈ జన్మలోనే శిక్షిస్తాడని అందరూ నమ్ముతారు' అని చంద్రబాబు పదేపదే హెచ్చరిస్తుంటారు. బహుశా ఆయన ఈ హెచ్చరిక తనకు వర్తించదని అనుకుంటున్నారేమో! కలియుగ దైవమైన శ్రీవారికి అపచారం చేయడంలోనూ, అప్రతిష్ఠ కలిగేలా వ్యవహరించడంలోనూ చంద్రబాబు తర్వాతే ఎవరైనా, ఏమైనా! శ్రీవారి ఆది అంతాల ద్రోహి ఆయనే. టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని నాలాంటి వాళ్లు వెలికితీస్తే... అధికారాన్ని అడ్డం పెట్టుకుని దేశద్రోహం కేసులు పెట్టడానికి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.

కానీ ఆ వైకుంఠవాసుడు తనను ద్రోహిగా చూస్తున్నాడని ఇప్పటికైనా చంద్రబాబు గుర్తించి, భయ భక్తులతో మెలిగితే మంచిది. శిశుపాలుడికి శిక్ష విధించడానికి వంద తప్పుల్ని శ్రీకృష్ణ భగవానుడు లెక్కించారు. టీటీడీ కేంద్రంగా చంద్రబాబు తప్పుల్ని కూడా మహావిష్ణువు లెక్కిస్తుంటారు. బాబు నేతృత్వంలో స్వామి వారికి చేస్తున్న ద్రోహానికి, శిక్షించే సమయం మరెంతో దూరం లేదు. రాజకీయాల్లో అధర్మాన్ని నమ్ముకున్న చంద్రబాబును... చివరికి అదే నాశనం చేస్తుంది. ఇదే ప్రకృతి ధర్మం!

వ్యాసకర్త తిరుపతి మాజీ ఎమ్మెల్యే

వందేళ్ల అరుణ పతాక

సందర్భం

కూనంనేని సాంబశివరావు

భారత రాజకీయ చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం ఆవిష్కృతమవుతోంది. ఒక వ్యక్తికైనా, వ్యవస్థకైనా వందేళ్లు పూర్తి చేసుకోవడమనేది సామాన్య విషయం కాదు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలనను గడగడలాడించిన స్వాతంత్ర్య సంగ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పోషించిన పాత్ర అమోఘం. దేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలోనే కాక, స్వాతంత్ర్యానంతర దేశ నిర్మాణంలోనూ త్యాగాలు, బలిదానాలతో నిండిన మహత్తర ప్రస్థానం ఈ పార్టీది. శత వసంతాల వేడుక జరుపుకొంటున్న తరుణంలో, ఆనాటి విప్లవ స్ఫూర్తిని ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి మాతృకగా నిలిచిన సీపీఐ... 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ప్రాణం పోసుకుంది. సత్యభక్త అనే విప్లవకారుడి చొరవతో జరిగిన ఈ తొలి సభకు దేశవ్యాప్తంగా అజ్ఞాతంలో ఉన్న వందలాది విప్లవకారులు, అభిమానులు హాజరయ్యారు. 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాద సృష్టికర్త హస్రత్ మొహానీ, భారత నేలపై తొలిసారి మే డే ఉత్సవాలను నిర్వహించిన సింగారవేలు చెట్టియార్ వంటి మహనీయులు ఈ పార్టీకి పునాదులు వేశారు.

తెలుగునేలపై కూడా ఒక విప్లవ వేదిక కోసం ఎదురు చూస్తూ, అప్పటి వరకు కాంగ్రెస్ ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి వారు కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చేశారు. అలాగే కాంగ్రెస్‌లో ప్రత్యేక గ్రూపుగా ఉన్న 'కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ' నాయకులు కూడా ఈ స్రవంతిలో చేరారు. భారతదేశంలో 1920–22లో గాంధీజీ నేతృత్వంలో సహాయ నిరాకరణోద్యమం ఉవ్వెత్తున ఎగసింది. అకస్మాత్తుగా ఆయన సహాయ

నిరాకరణ ఉద్యమాన్ని ఉపసంహరించుకోవడంతో యువకులు తీవ్ర నిరుత్సాహానికి లోనై, బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా మరింత శక్తిమంతమైన విప్లవోద్యమం కోసం అన్వేషణ మొదలెట్టారు. అటువంటి వారికి భారత కమ్యూనిస్టు పార్టీ గొప్ప వేదికను అందించింది.

ప్రజాసంఘాల నిర్మాణం

కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావానికి ముందు కూడా అనేక మంది విప్లవ కిశోరాలు కాంగ్రెస్‌లో అంతర్భాగంగా పని చేసి, దానిని ప్రభావితం చేశారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను స్వాతంత్ర్యోద్యమం దిశగా చైతన్యవంతులను చేసేందుకు కమ్యూనిస్టులే వివిధ వర్గాలను సమీకరించి ప్రజాసంఘాల ఏర్పాటుకు బాటలు వేశారు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్–ఏఐటీయూసీ (1920), విద్యార్థులను కూడగట్టి ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ – ఏఐఎస్ఎఫ్ (1936), కవులు, కళాకారులను ఏకం చేసి ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ – ఇప్టా (1943), ఆలిండియా కిసాన్ సభ (1936), అభ్యుదయ రచయితల సంఘం–అరసం(1936) ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానంతరమూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ (1954), ఆలిండియా యూత్ ఫెడరేషన్ (1959) వంటివాటిని ఏర్పాటు చేసింది సీపీఐ. వీటి ద్వారా వివిధ వర్గాలలో చైతన్యంతో పాటు నవ నాయకత్వం దేశానికి లభించింది. ఇప్పటికీ సంఘాలు కొనసాగుతూ, భారతదేశ అభ్యున్నతిలో స్థిరమైన పాత్రను పోషిస్తున్నాయి.

నిర్బంధాలను దాటుకొని...

బ్రిటిష్ పాలకులు కమ్యూనిస్టుల పెరుగుదలను చూసి భయపడి తీవ్రమైన నిర్బంధాలను విధించారు. 'మీరట్ కుట్ర కేసు', 'కాన్పూర్ కుట్ర కేసు', 'పెషావర్ కుట్ర కేసు' వంటివాటిని బనాయించి నాయకులను చిత్రహింసలకు గురిచేశారు. ఆ సమయంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వంటి నేతలు స్వయంగా కమ్యూనిస్టుల తరపున కోర్టుల్లో వాదనలు వినిపించారంటే వారి పోరాట పటిమ ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాల తరబడి జైళ్లు, నిషేధాల మధ్యనే పార్టీ తన విస్తరణను కొనసాగించింది.

సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేసిన తొలి పార్టీ సీపీఐ. సంస్థానాలలో పోరాటాలకు కాంగ్రెస్ విముఖత చూపినప్పటికీ, కమ్యూనిస్టులు మాత్రం వెనకడుగు వేయలేదు. ముఖ్యంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం. నిజాం రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటంలో 4,000 మంది వీరులు ప్రాణత్యాగం చేశారు. ఫలితంగా 2,500 గ్రామాలు విముక్తి పొందాయి. 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులదే. కేరళలోని పున్నప్ర వయలార్, బెంగాల్‌లోని తెబాగా, మణిపూర్ రాచరిక వ్యతిరేక పోరాటాలు, గోవా, పాండిచ్చేరి విముక్తి ఉద్యమాలు కమ్యూనిస్టుల నాయకత్వంలోనే జయప్రదమయ్యాయి.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశ సమగ్రతను కాపాడటంలో సీపీఐ ముందు నిలిచింది. పంజాబ్‌లో వేర్పాటువాదం జడలు విప్పినప్పుడు దేశ ఐక్యత కోసం కమ్యూనిస్టులు ఉగ్రవాదుల తూటాలకు ఎదురొడ్డి నిలిచి ప్రాణాలు వదిలారు. భూసంస్కరణలను జాతీయ ఎజెండాగా మార్చడం, బ్యాంకుల జాతీయీకరణ, ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి చరిత్రాత్మక మార్పుల వెనుక కమ్యూనిస్టుల అలుపెరగని పోరాటం ఉంది. 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం వంటి అంశాలపై నిలదీసింది. విదేశీ బ్యాంకుల్లోని నల్లధనాన్ని వెనక్కి రప్పించాలని పాలకులపై ఒత్తిడి తెచ్చింది.

నేటి సంక్షోభం

ప్రస్తుతం దేశం అత్యంత విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటోంది. స్వాతంత్ర్య పోరాటంలో ఇసుమంత పాత్ర లేని వారు నేడు తామే అసలైన దేశభక్తులమని ప్రచారం చేసుకుంటున్నారు. ఆర్ఎస్ఎస్ – బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాల విషాన్ని చిమ్ముతూ కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోంది. గుప్పెడు మంది పెట్టుబడిదారులకు జాతి సంపదను, ప్రభుత్వరంగ సంస్థలను కట్టబెడుతూ ఆర్థిక అసమానతలను పెంచుతోంది. ప్రజాస్వామ్యం మృగ్యమైపోతోంది, ఐటీ, ఈడీ, సీబీఐ వంటి సంస్థలు ప్రతిపక్షాల గొంతు నొక్కే ఆయుధాలుగా మారాయి. ప్రశ్నించే జర్నలిస్టులు, రచయితలు జైళ్లపాలవుతున్నారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం తుంగలో తొక్కబడుతున్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తాండవిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. చరిత్రను చెరిపివేస్తూ అభూత కల్పనలతో పాఠ్యాంశాలను తిరగరాస్తున్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను 'లేబర్ కోడ్'ల పేరిట కాలరాస్తున్నారు.

వర్తమాన భారతదేశంలో మతోన్మాదం జడలు విప్పి నాట్యం చేస్తోంది. లౌకిక దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు బీజేపీ సర్కార్ కంకణం కట్టుకుంది. ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం మునుపెన్నడూ లేని రీతిలో పెరిగిపోయింది. మానవ హక్కులు, మహిళా హక్కులను గాలికి వదిలేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సైతం అధిక పనిగంటలతో వేధిస్తున్నారు. ఇటువంటి ఫాసిస్టు ధోరణులపై సీపీఐ నేడు నిటారుగా నిలబడి పోరాడుతోంది. వందేళ్ల స్ఫూర్తిని చాటుతూ ఏడాది పొడవునా జరిగిన సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నెల 18న (నేడు) ఖమ్మం నగరంలో లక్షలాది మందితో నిర్వహించే భారీ బహిరంగ సభకు సీపీఐ జాతీయ నాయకత్వం హాజరవుతోంది. అసమానతలు లేని, స్వేచ్ఛాయుత భారతదేశ నిర్మాణం కోసం పార్టీ తనను తాను పునరంకితం చేసుకుంటోంది.

వ్యాసకర్త సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

(నేటి నుంచి ఖమ్మంలో సీపీఐ వందేళ్ళ పండుగ – పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు)

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, **తిథి:** అమావాస్య రా.1.18 వరకు, తదుపరి మాఘ శు. పాడ్యమి, **నక్షత్రం:** పూర్వాషాఢ ఉ.10.42 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.7.14 నుండి 8.55 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.15 నుండి 4.59 వరకు, **అమృత ఘడియలు:** తె.5.28 నుండి 7.10 వరకు.

సూర్యోదయం : 6.38 **సూర్యాస్తమయం :** 5.43 **రాహుకాలం :** సా.4.30 నుంచి 6.00 వరకు; **యమగండం :** ప.12.00 నుంచి 1.30 వరకు.

నయా వలసవాద కేంద్రం అమెరికా

అభిప్రాయం

బుడ్డిగ జమిందార్

అమెరికా ఇటీవల కాలంలో తాను వేసుకున్న ముసుగును పూర్తిగా తొలగించి బాహాటంగానే దురాక్రమణ కాంక్షను వ్యక్తం చేస్తోంది. వరుసగా ఒక దేశం తరువాత మరొక దేశాన్ని ఆక్రమించడానికి వేగంగా పావులు కదుపుతోంది. వెనిజులా అధ్యక్షుణ్ణి కిడ్నాప్ చేసి పట్టుకుపోవడం, గ్రీన్‌ల్యాండ్ తమదేనని ప్రకటించడం, తాజాగా ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు అండగా ఉంటామని ప్రకటించడం... ఇవన్నీ అమెరికా దూకుడును సూచించే అంశాలే. ముఖ్యంగా అణు పాటవం సంతరించుకోకుండా ఇరాన్‌ను అడ్డుకోవడం, దాని చమురు సంపదను చేజిక్కించుకోవడంపై అమెరికా ఎప్పటి నుంచో కన్నేసింది. దాని కొనసాగింపే ప్రస్తుత ఇరాన్ సంక్షోభం.

2015 అణు ఒప్పందం నుండి అమెరికా ఏకపక్షంగా బయటకు రావడంతో ఇరాన్‌తో అమెరికా ఘర్షణ ముదిరింది. ఇరాన్‌కు చెందిన సుమారు 100 బిలియన్ డాలర్ల నిధులను అంతర్జాతీయ బ్యాంకుల్లో అమెరికా స్తంభింపజేయడమే కాకుండా, కఠినమైన ఆర్థిక ఆంక్షలను విధించింది. గడిచిన కొద్ది నెలలుగా ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా అమెరికా దాడులకు దిగుతోంది. ఈ దాడుల్లో ఏడు బి–2 స్టెల్త్ బాంబర్లు, అత్యంత శక్తిమంతమైన 14 బంకర్ బస్టర్ బాంబర్లు, 30,000 పౌండ్ల మందుగుండు సామగ్రిని ఉపయోగించి ఫోర్డో, నటాంజ్, ఇస్పహాన్ వంటి కీలక ప్రాంతాలపై విరుచుకుపడింది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 400 మందికి పైగా ఇరానీయులు ప్రాణాలు కోల్పోగా, 3,000 మందికి పైగా గాయపడ్డారు.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూల మధ్య ఇటీవల జరిగిన భేటీ పశ్చిమ ఆసియాలో యుద్ధ తీవ్రతను పెంచేలా ఉంది. గాజాలో ప్రతిఘటనను

తుడిచిపెట్టడమే కాకుండా, ఇరాన్ పుంజుకుంటే తీవ్రంగా దెబ్బతీస్తామని వారు హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఇరాన్ లోపల వ్యూహాత్మక అల్లర్లు ప్రారంభమయ్యాయి. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పడిపోతున్న కరెన్సీ విలువపై ప్రజల్లో అసహనం పెంచుతూ నిరసనలను, సమ్మెలను అమెరికా ప్రోత్సహిస్తోంది. శాంతియుత నిరసనల ముసుగులో జరుగుతున్న ఈ ఘర్షణల్లో ఇప్పటికే వందలాదిమంది మరణించారు. నిరసనకారులకు అమెరికా బాసటగా నిలుస్తామని ప్రకటించడం వెనుక ఇరాన్ ప్రభుత్వాన్ని పడగొట్టే పక్కా ప్లాన్ ఉంది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఆర్థిక విధ్వంసం – చమురు రాజకీయం

2025 జూన్ నాటి యుద్ధ పరిస్థితులు, చమురు ధరల పతనం ఇరాన్ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. నిత్యావసరాల ధరలు పెరగడంతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయి. విద్యుత్ కోతలు పారిశ్రామిక రంగాన్ని దెబ్బతీయగా, వాతావరణ మార్పుల వల్ల వర్షాలు లేక వ్యవసాయోత్పత్తి తగ్గి ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది. అమెరికా చర్యలను ఇరాన్ నేత ఖమేనీ తీవ్రంగా ఖండిస్తున్నారు. పాత కాలపు షా రాజరికం లాంటి బానిసత్వాన్ని 'నయా వలసవాదం' రూపంలో అమెరికా మళ్లీ రుద్దాలని చూస్తోందని ఆయన మండిపడ్డారు. దేశంలోని కార్పొరేట్ శక్తులు తమ స్వార్థం కోసం అమెరికా, ఐరోపా దేశాలతో చేతులు కలుపుతున్నాయనీ, దీనివల్ల కార్మికులు, గ్రామీణ ప్రజలపై భారం పెరుగుతోందనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ ముడిచమురు నిల్వల్లో ఇరాన్ వాటా 13 శాతం ఉండగా, అమెరికా అడుగులకు మడుగులొత్తే సౌదీ అరేబియా వద్ద 16 శాతం నిల్వలు ఉన్నాయి. వెనిజులా నిల్వలను కూడా కలిపితే, ప్రపంచ చమురులో 50 శాతాన్ని తన గుప్పిట్లో ఉంచుకోవాలని అమెరికా ఆశిస్తోంది. రష్యా, చైనాలు అమెరికా చర్యలను ఖండించే ప్రకటనలకే పరిమితం అవుతూ ప్రత్యక్ష కార్యాచరణకు దిగకపోవడం గమనార్హం.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా తన గూఢచారి సంస్థ 'సీఐఏ' ద్వారా అనేక దేశాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాలను కూల్చివేసింది. 1954లో గ్వాటెమాల, 1963లో ఈక్వెడార్, 1964లో బ్రెజిల్, 1973లో చిలీ... ఇలా సుమారు 20కి పైగా దేశాల్లో అమెరికా తన తోలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటు చేసేందుకు కుట్రలు చేసింది. క్యూబా నేత ఫిడెల్ క్యాస్ట్రోను హతమార్చేందుకు 621 సార్లు విఫలయత్నం చేయడం అమెరికా దురహంకారానికి పరాకాష్ఠ. డ్రగ్స్‌పై పోరాటం పేరుతో మెక్సికో, కొలంబియా వంటి దేశాల్లో అరాచకాలు సృష్టించింది. ఇప్పుడు మళ్లీ ప్రపంచవ్యాప్తంగా ట్యారిఫ్ యుద్ధాలు, సైనిక బెదిరింపులతో నూతన సామ్రాజ్యవాదాన్ని విస్తరించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది.

వ్యాసకర్త 'ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం' జాతీయ కార్యవర్గ సభ్యులు

వలకు చిక్కిన భారీ సొరచేప

భారీ సొరచేప

సింగరాయకొండ: ప్రకాశం జిల్లా పాకల సముద్ర తీరంలో శనివారం పాకల పంచాయతీలోని చెల్లెమ్మగారి పట్టపుపాలేనికి చెందిన మత్స్యకారుడు కఠారి కృష్ణంరాజు వలకు భారీ సొరచేప పడింది. ఉదయం సముద్రంలో 15 కిలోమీటర్ల దూరం వెళ్లి వేట సాగించాడు. ఆ సమయంలో సొరచేప వలకు చిక్కింది. ఇది తల్లి చేప అని, పిల్లల్ని కనేదశలో ఉందని మత్స్యకారులు తెలిపారు. ఈ సొరచేప రింగు వలకు చిక్కుకోవటంతో అది మృతి చెందిందని, దీని బరువు 400 కేజీలు ఉంటుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని మత్స్యశాఖాధికారులు తెలిపారు. ఈ చేపగర్భంలో దాదాపు 30 వరకు పిల్ల సొరచేపలు లభించాయని తెలిపారు. ఈ చేపను కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మత్స్యకారుడు శివ రూ.8 వేలకు ఈ చేపను దక్కించుకున్నాడు. గతంలో బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు ప్రాంతంలో సొరచేపలు లభించేవని, మొట్టమొదటిసారిగా పాకల తీరంలో సొరచేప దొరికిందని ఇది తల్లి చేప కావడం వల్ల వలకు చిక్కిందని అదే కనుక మగ చేప అయితే వలను తెంపుకుపోయేదని మత్స్యకారులు వివరించారు.

ఎడ్ల పందేల్లో జై జగన్ నినాదాలు!

వెదురుకుప్పం/చంద్రగిరి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా చివరి రోజైన శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలు గ్రామాల్లో రైతులు పశువుల పండుగను కోలాహలంగా నిర్వహించారు. జై జగన్.. జైజై జగన్ నినాదాలతో ఎడ్ల పందేలు హోరెత్తాయి. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలోని బ్రాహ్మణపల్లె, కురివికుప్పంలో జరిగిన జల్లికట్టు(ఎడ్ల పందేలు) జగన్నామ స్మరణతో మార్మోగింది. మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రంతో కూడిన వైఎస్సార్‌సీపీ జెండాలతో కోడె గిత్తలు సందడి చేశాయి. అలాగే, తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని దోర్నకంబాల, మండపం పల్లి, మల్లయ్యపల్లిలో గ్రామస్తులు జల్లికట్టు నిర్వహించారు. మల్లయ్యపల్లి నుంచి మండపంపల్లి వరకు ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, నేతల ఫొటోలతో స్వాగత తోరణాలే కనిపించాయి. మల్లయ్యపల్లిలో బీసీ నేత బొమ్మగుంట రవికు చెందిన కోడెగిత్త ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైఎస్ జగన్ ఫొటోతో కూడిన దళపతి పలకను ఎద్దు కొమ్ములకు కట్టి, ప్రదర్శనగా నిలిపారు.

రేపు తిరుమల ఏప్రిల్ దర్శన కోటా విడుదల

తిరుమల: 2026 ఏప్రిల్ నెలకు సంబంధించి వివిధ దర్శనాలు, గదుల కోటా వివరాలను, శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన కోటాను సోమవారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జనవరి 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్ లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాలి. 22న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాల టికెట్లను, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను విడుదల చేయనుంది. 23న అంగప్రదక్షిణ టోకెన్లు, శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం తిరుమల, తిరుపతిలో గదుల కోటా విడుదల చేస్తారు. 27న శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను విడుదల చేయనున్నారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు యాగ పూర్ణాహుతి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వైభవంగా జరుగుతున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో శనివారం యాగ పూర్ణాహుతి నిర్వహించారు. ముందుగా శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు అర్చకులు, వేదపండితులు విశేష పూజలు చేశారు. స్వామివారి యాగశాలలో చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి.. పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. ఉత్సవాల మొదటి రోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచికంగా ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటం అవరోహణ చేశారు. చివరి రోజు ఆదివారం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ జరుగుతాయి. దీంతో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

సాల్మన్ హత్యపై భగ్గుమన్న దళితులు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసనలు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మందా సాల్మన్ హత్యపై రాష్ట్రవ్యాప్తంగా దళితులు భగ్గుమన్నారు. టీడీపీ మూకలు పథకం ప్రకారం మందా సాల్మన్‌ను హత్య చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఎదుట పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు, ధర్నాలు చేశారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు జరిగిన ఈ నిరసనల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతోపాటు దళితులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రబాబు రెడ్‌బుక్ పాలనలో రాష్ట్రంలోని దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు నిత్యకృత్యంగా మారాయని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సాల్మన్ హంతకులను కఠినంగా శిక్షించాలని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాకుండా మంత్రి నారా లోకేశ్ రాసుకున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ దళితులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులను దారుణంగా హత్య చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉంటున్నారనే దళితులను లక్ష్యంగా చేసుకుని దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీడీపీ మూకల రక్తదాహానికి మందా సాల్మన్ బలయ్యారని, ఇది ముమ్మాటికి చంద్రబాబు ప్రభుత్వం చేయించిన హత్యేనని స్పష్టం చేశారు. హంతకులను ఇంకా అరెస్టు చేయకపోవడంపై మండిపడ్డారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కొమ్ముకాసిన టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, సీఐ, ఎస్‌ఐలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని నినదించారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు వినతి పత్రాలు సమర్పించారు.

సాల్మన్ హత్యకు నిరసనగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా అమలాపురం మండలం బొంతువారిపేట నుంచి ఈదరపల్లి వంతెన వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితులు ర్యాలీ నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్త చెరువులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు, దళితులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమానికి ముందస్తు అనుమతి లేదని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తే కేసులు పెడతామని బెదిరించారు. కడపలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు కట్టుకుని ధర్నా చేశారు. కర్నూలులోని కొండారెడ్డి బురుజు వద్ద నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి చంద్రబాబు డౌన్..డౌన్, జోహార్ అంబేడ్కర్... జైభీమ్.. పోలీసుల జులుం నశించాలి.. దళితులపై దాడులు అరికట్టాలి... రెడ్ బుక్ రాజ్యాంగం నశించాలి.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాపట్లలోనూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితులు ర్యాలీ నిర్వహించారు.

పలు ప్రాంతాల్లో ర్యాలీలు.. నల్లరిబ్బన్లతో నిరసనలు

కర్నూలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితుల నిరసన

ఏలూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, దళితులు

అమలాపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితుల ప్రదర్శన

విశాఖలో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, దళితులు

నెల్లూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ విభాగం

ఒంగోలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, దళితులు

టీడీపీ ఎమ్మెల్యే యరపతినేనిపై

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సీఐ, ఎస్‌ఐపై కూడా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి
- సాల్మన్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు డిమాండ్

మాట్లాడుతున్న సుధాకర్‌బాబు

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విడదల రజిని, డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్ రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, గజ్జల సుధీర్ భార్గవరెడ్డి తదితరులు

నరసరావుపేట: పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ దళిత కార్యకర్త మందా సాల్మన్ హత్యకు కారణమైన గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, దాచేపల్లి సీఐ, మాచవరం ఎస్‌ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. సాల్మన్ హత్యను, పోలీసుల వైఖరిని నిరసిస్తూ శనివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌బాబు మాట్లాడుతూ పోలీసులను కాపలా పెట్టించి మందా సాల్మన్‌ను టీడీపీ గూండాలతో సీఎం చంద్రబాబే దారుణంగా కొట్టి చంపించారని ఆరోపించారు. సాల్మన్ హత్య చంద్రబాబు దళిత వ్యతిరేక వ్యవహారశైలికి నిదర్శనమని మండిపడ్డారు. సాల్మన్ కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, పొలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాల్మన్ హత్యపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు, అఘాయిత్యాలు, హత్యలు పెరిగిపోయాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. పిఠాపురం నియోజకవర్గంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారని, కర్నూలు జిల్లాలో దళిత ఆడబిడ్డలపై లైంగిక దాడికి ప్రయత్నించారని, గ్రామ బహిష్కరణ చేశారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీలమీద సాగుతున్న దమనకాండపై జాతీయ స్థాయిలో ఆందోళన చేస్తామన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: కాసు

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ మందా సాల్మన్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని చెప్పారు. 19 నెలలుగా ఊరికి దూరంగా బతుకుతూ, తన భార్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను టీడీపీ నేతలు కొట్టి చంపినా, తిరిగి బాధితులపైనే కేసు నమోదు చేసిన పోలీసుల తీరు క్షమించరాదన్నారు. దీనికి కారణమైన సీఐ, ఎస్‌ఐను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒక దళితుడిని చంపి, కడచూపునకు కూడా కుటుంబ సభ్యులు నోచుకోకుండా చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి విడదల రజిని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పి.గౌతమ్‌రెడ్డి, దళిత నేతలు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీలో కేంద్రం జోక్యం తగదు

రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి



కర్నూలు కల్చరల్: స్వయం ప్రతిపత్తి కలిగిన కేంద్ర సాహిత్య అకాడమీలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం తగదని రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్టు, రచయిత తెలకపల్లి రవి అన్నారు. కర్నూలులోని సాహితీ స్రవంతి కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో రవి రచించిన ఆరు పుస్తకాలను సాహితీవేత్త, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి... మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను కవులు 'అవార్డు వాపసీ' పేరుతో వెనక్కి ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు కేంద్రమే అవార్డులు ఇవ్వడం లేదన్నారు. చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ.. పుస్తకాలు సమాజ ప్రగతికి దారులు పరుస్తాయన్నారు. రవి రచించిన 'ఆశయపథం' నవలను సాహితీ స్రవంతి ఆదోని డివిజన్ గౌరవాధ్యక్షురాలు నాగమణి, 'మేడే గీతాలు' సామాజిక ఉద్యమ గీతాల సంకలనాన్ని రాయలసీమ వర్సిటీ తెలుగు శాఖ సహాయ ఆచార్యులు జి.అరుణ, 'సజీవం' కవిత్వాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, 'మీరే ప్రేరణ–మీరే సాధన' అనే పుస్తకాన్ని వ్యాఖ్యాత ఇనయతుల్లా, 'అభద్ర', 'ప్రజాగానం' పుస్తకాలను సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, 'నేనెప్పుడూ కమ్యూనిజానికే సొంతం' అనే ఆరుద్ర రాసిన పుస్తకాన్ని తెలకపల్లి రవి పరిచయం చేశారు. సాహితీ స్రవంతి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులు మారుతి పౌరోహితం, తెలకపల్లి మధుసూదన శర్మ, సాహితీ స్రవంతి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాగోబా జాతర

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో ఏర్పాట్లు పూర్తి .. 22న గిరిజన దర్బార్

సాక్షి, ఆదిలాబాద్: దేశంలో రెండో అతిపెద్ద గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన నాగోబా జాతర ఆదివారం ప్రారంభం కానుంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో కొలువైన నాగోబా ఆలయంలో అందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 25 వరకు జాతరను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. 22న గిరిజన దర్బార్ జరగనుంది.

టీడీపీ దమనకాండకు నిండు ప్రాణం బలి

- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా దాడులు
- టీడీపీ కార్యకర్తల కవ్వింపుతో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- చీకటిలో జరిగిన దాడిలో ఆ పార్టీ కార్యకర్త మృతి
- కాకినాడ జిల్లా అల్లిపూడిలో ఘటన

అల్లిపూడిలో గస్తీ కాస్తున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) లాలం బంగారయ్య (ఫైల్)

కోటనందూరు (కాకినాడ): టీడీపీ కార్యకర్తలు సృష్టించిన దమనకాండకు ఓ నిండు ప్రాణం బలైంది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా టీడీపీ కార్యకర్తలు ఏటా సంక్రాంతి సమయంలో దాడులకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాది కూడా పక్కా ప్లాన్‌తో వైఎస్సార్ సీపీ నాయకులను హతమార్చే ప్రయత్నానికి తెర లేపారు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడికి చెందిన చిటికెల శేఖర్ కొన్నేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్లిపోయాడు. సంక్రాంతికి అల్లిపూడి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం అత్తవారి ఊరు రౌతులపూడి మండలం ములగపూడి నుంచి వస్తుండగా అల్లిపూడి గ్రామ సమీపంలో టీడీపీ కార్యకర్తలు రోడ్డుకు అడ్డంగా బైక్ పెట్టి పక్కనే ఉన్న దుకాణం వద్ద కబుర్లు చెప్పుకుంటున్నారు. బైక్ తీయాలని శేఖర్ కోరడంతో ఆగ్రహించిన వారు ఒక్కసారిగా అతడిపై దాడి చేశారు. విడదీసేందుకు ప్రయత్నించిన వారిపైనా టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో భయంతో ఓ ఇంటిలో దాక్కున్న శేఖర్‌పై మళ్లీ దాడి చేసేందుకు టీడీపీ కార్యకర్తలు ప్లాన్ వేశారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబుకు తెలియజేసేందుకు రాత్రి 10 గంటల సమయంలో ఆయన ఇంటికి శేఖర్ వెళ్లాడు. ఈ క్రమంలో స్థానిక ఎస్సీ పేట నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు చినబాబు ఇంటి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై రాడ్లు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ దొమ్మీలో ఇరు పక్షాల కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త లాలం బంగారయ్య (38) మృతి చెందాడు. దీనిని రాజకీయం చేసి, వైఎస్సార్‌సీపీ నేతలపై రుద్దేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఆ దిశగానే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటనతో సంబంధం లేని చినబాబు భార్య, బావమరిదితోపాటు మరో 15 మందిని విచారణ పేరుతో పోలీసులు వివిధ పోలీసు స్టేషన్లకు తిప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ విధించారు.

कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)
Regional Office
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453493
e-mail : rd-andhrapradesh@esic.gov.in

యజమానులు మరియు ఉద్యోగుల నమోదును ప్రోత్సహించే పథకం (SPREE 2025)
ESIC స్ప్రీ పథకాన్ని పొందేందుకు చివరి అవకాశం
చివరి తేదీ: ఇప్పుడు జనవరి 31, 2026 వరకు పొడిగించబడింది
ఆలస్యం లేకుండా నమోదు చేసుకోండి

ఆంధ్రప్రదేశ్ లోని అందరు యజమానులకు తక్షణ గమనిక:
యజమానులు మరియు ఉద్యోగుల నమోదును ప్రోత్సహించడానికి SPREE పథకం-2025 ఇప్పటికే అమలులో ఉందని మరియు త్వరలో ముగియబోతుందని కార్మిక రాజ్య బీమా సంస్థ (ESIC) అన్ని కవర్ చేయబడిన మరియు కవర్ చేయదగిన యజమానులకు అత్యవసరంగా తెలియజేయడమైనది.

తక్షణ నమోదు ఎందుకు ముఖ్యమైనది
- జనవరి 31, 2026 తర్వాత ఈ ఉపశమనం అందుబాటులో ఉండదు
- యజమాని ప్రకటించిన తేదీ నుండి రిజిస్ట్రేషన్ చెల్లుతుంది
- మునుపటి కాలాలకు తనిఖీలు ఉండవు
- ఇబ్బంది లేని స్వీయ నమోదు
- ఉద్యోగులకు సమగ్ర సామాజిక భద్రతా ప్రయోజనాలు

ఎవరు నమోదు చేసుకోవచ్చు
- ESI చట్టం కింద ఇంకా నమోదు కాని 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను కలిగి ఉన్న యజమానులు
- ESI చట్టం కింద అర్హత కలిగిన ఉద్యోగులందరినీ నమోదు చేసుకోని యజమానులు

ఎలా నమోదు చేసుకోవాలి
యజమానులు తమ యూనిట్ మరియు ఉద్యోగులను ESIC పోర్టల్ www.esic.gov.in, శ్రమ సువిధ పోర్టల్: https://registration.shramsuvidha.gov.in/. MCA పోర్టల్: www.mca.gov.in లలో నమోదు చేసుకోవచ్చు

దయచేసి ఇప్పుడే చర్య తీసుకోండి - గడువు వరకు వేచి ఉండకండి

ఆర్టెమిస్-2 వ్యోమగాముల బృందం క్రిస్టినా కోచ్ (ఎడమ), విక్టర్ గ్లోవర్ (వెనుక), రీడ్ వీస్‌మన్ (ముందు), జెరెమీ హన్సెన్ (కుడి)

చందమామను చుట్టొచ్చేలా...

ఆర్టెమిస్-2 మిషన్‌కు రంగం సిద్ధం

- లాంచ్ ప్యాడ్‌కు చేరిన భారీ రాకెట్
- అన్నీ కుదిరితే ఫిబ్రవరి 6న ఆర్టెమిస్–2 ప్రయోగం
- విజయవంతమైతే చంద్రునిపైకి వెళ్లనున్న ఆర్టెమిస్–3 మిషన్
- ఒకట్రెండేళ్లు పట్టే అవకాశం

కెన్నడీ స్పేస్ సెంటర్‌లో ఆర్టెమిస్ 2 రాకెట్

మనిషి చివరిసారిగా చంద్రునిపై దిగి 50 ఏళ్లు దాటింది. అర్ధ శతాబ్ది సుదీర్ఘ విరామం అనంతరం మరోసారి ఆ ఫీట్‌ను పునరావృతం చేసేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెమిస్ మిషన్ శరవేగంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఆర్టెమిస్–2 స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్ఎల్ఎస్) రాకెట్ శనివారం కెన్నెడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ ప్యాడ్‌కు చేరింది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఫిబ్రవరి 6న ఆర్టెమిస్–2 ప్రయోగం జరగనుంది. దీనిద్వారా నలుగురు వ్యోమగాములు ఓరియాన్ స్పేస్ క్యాప్సుల్‌లో చంద్రుని చుట్టూ పరిభ్రమించి రానున్నారు. అమెరికాకు చెందిన నాసా కమాండర్ రీడ్ వైజ్‌మన్, పైలట్ విక్టర్ గ్లోవర్, మిషన్ స్పెషలిస్ట్ క్రిస్టినా కోచ్, కెనడా అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన జెరెమీ హన్సెన్ ఈ మిషన్‌లో భాగస్వాములు. ఓరియాన్ క్యాప్సూల్ భూ దిగువ కక్ష్యను దాటుకుని చంద్రుని చుట్టూ ఓ రౌండ్ కొట్టి భూమికి 10 రోజుల అనంతరం తిరిగి వస్తుంది. తద్వారా వ్యోమగాములు చంద్రునిపై దిగేందుకు పూర్తిస్థాయిలో రంగం సిద్ధం చేస్తుంది. అనంతరం ఆర్టెమిస్–3 మిషన్‌లో భాగంగా వ్యోమగాములను చంద్రునిపై దింపాలన్నది నాసా లక్ష్యం. ఆర్టెమిస్–2 ఫలితాన్ని బట్టి 2027లో గానీ, 2028లో గానీ ఈ మిషను చేపట్టే అవకాశముంది. నాసా చివరిసారి 1972లో అపోలో 17 మిషన్‌లో భాగంగా వ్యోమగాములను చంద్రునిపై దింపింది. ఆర్టెమిస్–2 ఎస్ఎల్ఎస్ రాకెట్ ఎత్తు ఏకంగా 100 మీటర్లు కావడం విశేషం. ఇక దీని బరువు 5,000 టన్నులు!

- సాక్షి, నేషనల్ డెస్క్

అతి పెద్ద నీలమణి!

బరువు 3,536 క్యారెట్లు! ● విలువ రూ.3,600 కోట్లు?



ఊదా రంగంలో మెరిసిపోతున్న ఈ నీలమణిని చూసేందుకు రెండు కళ్లూ చాలడం లేదు కదా! ఇది అలాంటిలాంటి నీలం కాదు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నీలమణిగా రికార్డులకెక్కింది! అత్యంత అరుదైనదిగా చెబుతున్న ఈ నీలాన్ని శ్రీలంక రాజధాని కొలంబోలో శనివారం తొలిసారి ప్రదర్శనకు ఉంచారు. ఇది ఏకంగా 3,536 క్యారెట్ల బరువుండటం! అంటే 700 గ్రాములన్నమాట!! దీనికి స్టార్ ఆఫ్ ప్యూర్ ల్యాండ్ అని నామకరణం చేశారు. ఇది నకిలీది కాదని, సిసలైన నీలమణేనని జెమాలజికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అమెరికా (జీఐఏ) కూడా ధ్రువీకరించింది. అంతేగాక ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సహజ నీలం ఇదేననీ పేర్కొంది. ఇంత భారీ పరిమాణంలో కూడా ఈ నీలమణి పూర్తిస్థాయి సౌష్టవంతో కూడుకుని ఉండటం విశేషమని నిపుణులు చెబుతున్నారు. దానికితోడు సహజంగా అమరిన చూడచక్కని గుండ్రనైన రూపు దీని ప్రత్యేకతను ఎన్నో రెట్లు పెంచింది. వీటన్నింటికీ మించి ఇది ఆరు రకాల కాంతి కిరణాలను వెదజల్లుతుండటం కూడా! ఇక నీలమణికి అతి ముఖ్యమైన స్వచ్ఛత విషయంలో కూడా సాటి లేని నాణ్యత స్టార్ ఆఫ్ ప్యూర్ ల్యాండ్ సొంతమని ప్రదర్శకులు వివరించారు. దీని విలువ కనీసం 30 కోట్ల నుంచి 40 కోట్ల డాలర్లు (రూ.3,628 కోట్లు) ఉంటుందని అంతర్జాతీయ రత్నాల నిపుణులు చెప్పారు. వేలంలో దీనికి అంతకు మించే పలుకుతుందని అంచనా వేస్తున్నారు. భద్రతా కారణాల రీత్యా దీని యజమానుల వివరాలను గోప్యంగా ఉంచారు. ఈ నీలమణి 2023లో శ్రీలంక మారుమూల ప్రాంతంలో వజ్రాల నగరంగా పేరొందిన రత్నపురలో దొరికినట్టు దాని యజమానుల్లో ఒకరు వెల్లడించారు. సాటిలేని నాణ్యతతో కూడిన నీలమణులకు శ్రీలంక అనాది కాలం నుంచీ ప్రసిద్ధి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇండిగో సంస్థకు రూ.22 కోట్ల జరిమానా

ముంబై: ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించిన ఇండిగో విమానయాన సంస్థకు డీజీసీఏ రూ.22.20 కోట్ల జరిమానా విధించింది. గత ఏడాది డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా వేలాది ఇండిగో విమానాలు రద్దయిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీనివల్ల ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పైలట్లకు సంబంధించి ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్(ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను అమలు చేయడానికి ఇండిగో యాజమాన్యం ముందుగా సిద్ధం కాకపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ పరిణామంపై డీజీసీఏ నలుగురు సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇండిగోకు జరిమానా విధించింది.

8 యూరప్ దేశాలపై టారిఫ్‌లు: ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచంలోనే అతిపెద్ద దీవి గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్న 8 యూరప్ దేశాలపై ట్రంప్ టారిఫ్ కత్తి దూశారు. ఆ దేశాలపై అదనంగా 10 శాతం టారిఫ్‌లు వసూలు చేస్తామన్నారు. డెన్మార్క్‌తో పాటు యూకే, నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్ ఉత్పత్తులపై ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఈ టారిఫ్ వసూలు చేస్తామని ట్రంప్ సోషల్ మీడియాలో ప్రకటించారు. గ్రీన్‌ల్యాండ్‌ను పూర్తిగా అమెరికా కొనుగోలు చేయడంపై అంగీకారానికి రానిపక్షంలో ఈ దేశాలపై జూన్ ఒకటో నుంచి టారిఫ్‌ల మొత్తాన్ని 25 శాతానికి పెంచుతామని ట్రంప్ హెచ్చరించారు.

ట్రంప్‌కు కీలెరిగి వాత!

అమెరికాపై 30% టారిఫ్‌లు › మోదీ సర్కారు నిశ్శబ్ద నిర్ణయం › తృణధాన్యాలు అన్నింటికీ వర్తింపు › గత నవంబర్ నుంచే అమల్లోకి › సెనేటర్ల లేఖతో వెలుగులోకి



టారిఫ్‌లను బూచిగా చూపి ప్రపంచ దేశాలన్నింటినీ బెదిరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు భారత్ కీలెరిగి వాత పెట్టింది! 'నీవు నేర్పిన విద్యయే...' అన్నట్టుగా అమెరికాపై ప్రతీకార టారిఫ్‌లు విధించి దెబ్బకు దెబ్బ తీసింది. అది కూడా ట్రంప్‌లా నానా హడావుడీ చేయకుండా, నిశ్శబ్దంగానే పని కానిచ్చేసింది. మూడున్నర నెలలుగా వాటిని వసూలు చేస్తోంది కూడా! భారత్‌పై ట్రంప్ గతేడాది టారిఫ్‌ల మోత మోగించడం తెలిసిందే. రోజుకో రకంగా అన్నట్టుగా మారుస్తూ వచ్చి, చివరికి వాటిని 25 శాతానికి ఖరారు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపడం లేదంటూ మరో 25 శాతం వడ్డించి 50 శాతానికి చేర్చారు! ఇక్కడే భారత్ సైలెంటుగా పావులు కదిపింది. అమెరికా నుంచి దిగుమతయ్యే తృణధాన్యాలపై 30 శాతం టారిఫ్‌లు విధించేసింది! గత అక్టోబర్ 30న ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నవంబర్ 1 నుంచే ఆ టారిఫ్‌లు అమల్లోకి కూడా వచ్చాయి!! అమెరికా నుంచి దిగుమతి అవుతున్న పప్పులు, ముఖ్యంగా బఠాణీలకు ఇది వర్తిస్తోంది. ఈ విషయంలో మోదీ సర్కారు వ్యూహాత్మకంగా వ్యవహరించింది. టారిఫ్‌ల విధింపుపై అధికారిక ప్రకటన వంటిదేమీ చేయలేదు. అంతేగాక దానికి పెద్దగా ప్రచారం కూడా కల్పించకుండా జాగ్రత్త పడింది.

తీవ్ర నష్టం: సెనేటర్లు

నార్త్ డకోటా, మొంటానా రాష్ట్రాలకు చెందిన సెనేటర్లు కెవిన్ క్రేమర్, స్టీవ్ డెయిన్స్ శుక్రవారం ట్రంప్‌కు రాసిన లేఖతో అమెరికా తృణధాన్యాలపై భారత్ టారిఫ్‌ల అంశం వెలుగులోకి వచ్చింది. తమ రాష్ట్రాల్లో విస్తారంగా సాగయ్యే పప్పులు, ముఖ్యంగా తృణధాన్యాలకు ఈ టారిఫ్‌లు పెద్ద భారంగా మారాయంటూ లేఖలో వారు వాపోయారు. భారతీయులే వాటిని ప్రపంచంలోనే అత్యధికంగా వినియోగిస్తారని గుర్తు చేశారు. అలాంటి తృణధాన్యాలపై 30 శాతం దిగుమతి సుంకం సరికాదంటూ ఆవేదన వెలిబుచ్చారు. వాటిని తొలగించేలా ప్రధాని మోదీతో సంప్రదింపులు జరపాల్సిందిగా ట్రంప్‌ను వారు కోరారు. ఈ పరిణామంపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'టారిఫ్‌ల రంకెలు వస్తున్న అమెరికాకు దాని భాషలోనే భారత్ సైలెంటుగా దీటైన సమాధానమిచ్చింది', 'మౌనంగానే దెబ్బకు దెబ్బ కొట్టాం'అంటూ పోస్టులతో హోరెత్తిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పప్పులు, తృణధాన్యాల వినియోగంలో భారత్ వాటాయే 27 శాతంగా ఉంది. ట్రంప్ తొలి టర్ములో కూడా భారత్ ఇలాగే అమెరికాలో సాగయ్యే పప్పులపై సుంకాలు విధించిందని, అప్పుడు కూడా ఈ అంశాన్ని తామే ఆయన దృష్టికి తెచ్చామని సెనేటర్లు గుర్తు చేసుకున్నారు. దాంతో వాటిని తొలగించాలని కోరుతూ 2020 భారత పర్యటన సందర్భంగా మోదీకి ట్రంప్ స్వయంగా లేఖ అందజేసి మరీ సమస్యను పరిష్కరించినట్టు వారు చెప్పారు. జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ జాబితా నుంచి 2019లో భారత్‌ను తొలగించడంతో మరుసటేడే అమెరికా నుంచి దిగుమతయ్యే పప్పులు, తృణధాన్యాలపై భారత్ సుంకాలు వేసింది.

చర్చలకు విఘాతమే!

అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కొద్ది నెలలుగా అటూ ఇటూ ఊగిసలాడుతున్న విషయం తెలిసిందే. నిజానికి అది పూర్తిగా కొలిక్కి వచ్చిందని, కేవలం ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేయని కారణంగానే పెండింగ్‌లో పడిందని అమెరికా ఇటీవలే పేర్కొనడం తెలిసిందే. దాంతో ఇరు దేశాల సంబంధాలు కొద్ది రోజులుగా దిగజారుతూ వస్తున్నాయి. దానికి తోడు పప్పులు, తృణధాన్యాలపై భారత్ టారిఫ్‌తో పీటముడి మరింత బిగుసుకోవచ్చని భావిస్తున్నారు. ఎందుకంటే భారత వ్యవసాయ, పాడి మార్కెట్లలో మరింతగా చొచ్చుకొచ్చేందుకు అమెరికా చిరకాలంగా ప్రయత్నిస్తూ వస్తోంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చల్లో కూడా ప్రధానంగా ఈ దిశగా నిబంధనల సడలింపుకు పట్టుబడుతోంది. మోదీ సర్కారు మాత్రం అందుకు ససేమిరా అంటోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కేంద్రం ఇచ్చిన నిధులపై దమ్ముంటే శ్వేతపత్రం

మోదీకి తృణమూల్ కాంగ్రెస్ సవాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని, అవినీతిపరులు స్వాహా చేస్తున్నారని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలను అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఖండించింది. రాష్ట్రానికి ఇప్పటిదాకా కేంద్రం ఇచ్చిన మొత్తం నిధుల వివరాలతో శ్వేతపత్రం ప్రచురించగలరా? అని మోదీకి సవాలు విసిరింది. ఈ మేరకు శనివారం 'ఎక్స్'లో పోస్టుచేసింది. 2021 నుంచి ఇప్పటివరకు ఎన్ని నిధులు ఇచ్చారో చెప్పాలని పేర్కొంది. ''రాజకీయ పర్యాటకుడు నరేంద్ర మోదీ బెంగాల్‌లో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలని నిజంగా కోరుకుంటున్నారా? అయితే, పీఎం ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి దక్కాల్సిన రూ.24,275 కోట్ల నిధులు ఇవ్వకుండా ఎందుకు నిలిపివేశారో సమాధానం చెప్పాలి'' అని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా పీఎం ఆవాస్ యోజన పథకాన్ని కొనసాగించడానికి మమతా బెనర్జీ ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు పెట్టినట్లు తెలియజేసింది. బీజేపీ వాషింగ్ మిషన్‌గా మారినట్లు తృణమూల్ విమర్శించింది. అవినీతిపరులు ఆ పార్టీలో చేరగానే పరిశుద్ధులు అయిపోతున్నారని ఎద్దేవా చేసింది.

వెనెజువెలా అధ్యక్షురాలిపై... ఏళ్లుగా అమెరికా నిఘా!

వాషింగ్టన్: వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై అమెరికా ఏళ్ల తరబడి నిఘా వేస్తూ వస్తోందా? తాజాగా వెలుగు చూసిన అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ (డీఈఏ) పత్రాలు అవుననే చెబుతున్నాయి. 2018లో ఉపాధ్యక్షురాలు అయినప్పటి నుంచే ఆమెకు సంబంధించిన అన్ని వివరాలనూ డీఈఏ సేకరిస్తూ వస్తున్నట్టు అవి వెల్లడించాయి. అంతేగాక రోడ్రిగ్జ్‌ను డీఈఏ తమ 'ముఖ్యమైన లక్ష్యం' జాబితాలో చేర్చింది కూడా! డ్రగ్ ట్రాఫికింగ్ మొదలుకుని బంగారం స్మగ్లింగ్ దాకా ఆమెపై వచ్చిన ఆరోపణలన్నింటినీ ఎప్పటికప్పుడు డీఈఏ ట్రాక్ చేస్తూ వస్తోంది. కరీబియన్ దీవుల్లోని ఇస్లా మార్గరీటా రిసార్టుల్లోని పలు హోటళ్లను మనీ లాండరింగ్‌కు కేంద్రాలుగా రోడ్రిగ్జ్ మలచుకున్నట్టు కూడా 2021 నాటి డీఈఏ రహస్య పత్రాలు పేర్కొన్నాయి. అయితే ఆమెపై అమెరికా ఇప్పటిదాకా ఎలాంటి నేరారోపణలూ చేయకపోవడం గమనార్హం. పైగా రోడ్రిగ్జ్ అద్భుత నాయకురాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే కీర్తించడం తెలిసిందే. ఇటీవల వెనెజువెలా నియంత నికొలస్ మదురో దంపతులను అమెరికా నిర్బంధించి పదవీచ్యుతున్ని చేయడం తెలిసిందే.

చొరబాటుదార్లను వెళ్లగొట్టుడే

బెంగాల్‌కు అక్రమ చొరబాట్లే అతిపెద్ద సవాలు

- వారివల్ల జనాభా స్థితిగతుల్లో మార్పులు.. ఘర్షణలు
- అధికారంలోకి వచ్చాక చొరబాటుదార్ల నుంచి విముక్తి కల్పిస్తాం
- చట్టవిరుద్ధమైన వలసలను అడ్డుకోవడానికి చర్యలు తీసుకుంటాం
- బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం
- మాల్దా బహిరంగ సభలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

మాల్దా: అక్రమ చొరబాట్లే పశ్చిమ బెంగాల్‌కు అతి పెద్ద సవాలుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పొరుగుదేశం నుంచి వెల్లువెత్తుతున్న చొరబాట్ల కారణంగా ఇక్కడ జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని, తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ చొరబాట్ల వెనుక తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమేయం ఉందని మండిపడ్డారు. శరణార్థులుగా వచ్చినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగించారు. తృణమూల్ కాంగ్రెస్ సిండికేట్ రాజ్ రాజకీయ లబ్ధి కోసం చొరబాట్లను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఇక్కడి పాలకులు చొరబాటుదార్లతో చేతులు కలిపారని ధ్వజమెత్తారు. అక్రమంగా వచ్చినవారిని బయటకు పంపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తేల్చిచెప్పారు. అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలు సైతం చొరబాటుదార్లను భరించడం లేదని, బయటకు వెళ్లగొడుతున్నాయని గుర్తుచేశారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చాక చొరబాటుదార్ల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. చట్టవిరుద్ధమైన వలసలను అడ్డుకోవడానికి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆ బంధాన్ని విచ్ఛిన్నం చేయాలి

''చొరబాటుదారుల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోంది. చాలా రాష్ట్రాల్లో జనాభా స్థితిగతులు మారిపోతున్నాయి. చాలాచోట్ల ఇన్నాళ్లూ అధికంగా వినిపించిన భాష కూడా మారుతోంది. మరో భాష ఆధిపత్యం కనిపిస్తోందని ప్రజలు చెబుతున్నారు. అక్రమంగా మనదేశంలోకి వచ్చినవారు ఘర్షణలకు కారణమవుతున్నారు. బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్‌లో ఇలాంటి ఘటనలు జరిగాయి. రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్, చొరబాటుదార్ల మధ్య బంధాన్ని విచ్ఛిన్నం చేయాలి. ఇతర దేశాల్లో మతపరమైన వివక్ష ఎదుర్కొంటూ మనదేశంలోకి వచ్చినవారికి రక్షణ కల్పిస్తాం. మతువా వర్గం ప్రజలు అస్సలు ఆందోళన చెందొద్దు.

అరాచక పాలనకు ముగింపు పలకాల్సిందే

బెంగాల్‌లో పరివర్తన్‌కు సమయం ఆసన్నమైంది. తృణమూల్ కాంగ్రెస్ అరాచక పాలనకు ముగింపు పలకాల్సిందే. పేదల జీవితాలకు ముప్పుగా మారిన ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి. బెంగాల్ చుట్టుపక్కల రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. సుపరిపాలన అందిస్తోంది. ఇక బెంగాల్‌లోనూ అధికారంలోకి రావడం, సుపరిపాలన అందించడం తథ్యం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించడం ఖాయం. పేదలకు దక్కాల్సిన సంక్షేమ పథకాలను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను వారికి దక్కనివ్వడం లేదు. తృణమూల్ కాంగ్రెస్ నేతలు అవినీతిలో మునిగి తేలుతున్నారు. ప్రజల బాగు కోసం కేంద్రం ఇస్తున్న సొమ్మును విచ్చలవిడిగా లూటీ చేస్తున్నారు. అందుకే ప్రజాకంటక తృణమూల్ కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించాలి. బీజేపీ అభివృద్ధి మోడల్ పట్ల యువతలో విశ్వాసం పెరుగుతోంది. మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అపూర్వమైన విజయం సాధించింది. గతంలో మేము బలహీనంగా ఉన్నచోట ఇప్పుడు బలోపేతమయ్యాం. బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు, రైతులను నూతన అవకాశాలు కల్పిస్తాం. రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతాం''అని ప్రధాని మోదీ ప్రకటించారు.

వందేభారత్ స్లీపర్‌కు జెండా ఊపుతున్న మోదీ

వందేభారత్ స్లీపర్ ప్రారంభం

దేశంలో మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. శనివారం మాల్దా రైల్వేస్టేషన్‌లో జరిగిన జరిగిన కార్యక్రమంలో.. రైలు, రోడ్లకు సంబంధించి మొత్తం రూ.3,250 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. వందేభారత్ స్లీపర్ రైలుతో పాటు నాలుగు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు వర్చువల్‌గా పచ్చజెండా ఊపారు. వందేభారత్ స్లీపర్ రైలు బెంగాల్‌లోని హౌరా నుంచి అస్సాంలోని గౌహతి మధ్య రాకపోకలు సాగించనుంది. ప్రయాణ సమయం 18 గంటల నుంచి 2.5 గంటలకు తగ్గిపోతుంది. కొత్త రైళ్ల రాకతో ఈ ప్రాంతంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని ప్రధానమంత్రి వివరించారు.కాశీమాత, కామాఖ్య మాతల పవిత్ర క్షేత్రాలను అనుసంధానించే రైలును ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆధునిక రైళ్ల గురించి గతంలో విన్నామని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. అమెరికా లేదా యూరప్ కంటే మనదగ్గరే ఎక్కువ రైల్వే కోచ్‌లు తయారవుతున్నాయని గుర్తుచేశారు. దేశంలో రవాణా సదుపాయాలను ఆధునీకరిస్తున్నామని, ఈ విషయంలో స్వయం సమృద్ధి సాధిస్తున్నామని తెలిపారు. మాల్దా స్టేషన్‌లో ప్రయాణికులతో మోదీ మాట్లాడారు.

10 వేల మందితో బాగురుంబా నృత్యం

ప్రధాని మోదీ శనివారం అస్సాం రాజధాని గౌహతిలో పర్యటించారు. సాయంత్రం భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. జనం రహదారికి ఇరువైపులా బారులు తీరి ఆయనకు స్వాగతం పలికారు. వారికి ఆయన అభివాదం చేస్తూ ముందుకు సాగారు. 4 కిలోమీటర్ల మేర రోడ్ షో జరిగింది. గౌహతి స్టేడియంలో బోడో వర్గం కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ జానపద బాగురుంబా నృత్యాన్ని మోదీ తిలకించారు. 10 వేల మందికిపైగా కళాకారులు ఈ నృత్యరూపకాన్ని ప్రదర్శించడం విశేషం. అస్సాంలో బోడో వర్గం ప్రజల అభ్యున్నతికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పేర్కొన్నారు. బోడోల ఆధ్యాత్మిక గురువైన బోడోఫా ఉపేంద్రనాథ్ బ్రహ్మ ఆశయాలను తమ ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. అస్సాంలో గతంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఇక్కడి సంస్కృతిని, వారసత్వాన్ని అగౌరవపర్చిందని ప్రధానమంత్రి ఆరోపించారు. చొరబాటుదార్లకు ఎర్ర తివాచీ పర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన పాపాలను తమ పార్టీ శుద్ధి చేస్తోందని చెప్పారు. ప్రధాని మోదీ ఆదివారం అస్సాంలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించబోతున్నారు.

ఇరాన్‌లో సర్వత్రా యుద్ధ వాతావరణం

- ఎక్కడ చూసినా అశాంతి, అలజడే
- ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపేశారు
- భయానక అనుభవాలు పంచుకున్న భారతీయులు
- ఇరాన్ నుంచి స్వదేశానికి రాక

భయంగా బతికాం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉద్విగ్న పరిస్థితులు కనిపించాయి. ఇరాన్ నుంచి క్షేమంగా తిరిగివచ్చిన తమ కన్నబిడ్డలను చూసి తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. ఆనందభాష్పాలతో స్వాగతం పలికారు. ఆత్మీయులు, కుటుంబ సభ్యుల కోసం పెద్ద సంఖ్యలో జనం ఎయిర్‌పోర్టుకు తరలిచ్చారు. ఇరాన్‌లో కొన్ని రోజులుగా ప్రజల ఆందోళనలు, హింసాకాండ కొనసాగుతుండడం, శాంతి భద్రతలు దిగజారుతుండడంతో అక్కడున్న భారతీయులు కమర్షియల్ విమానాల్లో శుక్రవారం అర్ధరాత్రి స్వదేశానికి చేరుకున్నారు. ఇరాన్ నుంచి తిరిగిరావాలని భారత ప్రభుత్వం సూచించిన సంగతి తెలిసిందే. భారతీయ విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారులు, పవిత్ర క్షేత్రాల దర్శనానికి వెళ్లిన భక్తులు ఇరాన్‌లో పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. వారు స్వదేశానికి తిరిగిరావడానికి భారత విదేశాంగ శాఖ, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సహకరించాయి. అతిత్వరలో మరికొందరు భారతీయులు ఇరాన్ నుంచి తిరిగి రానున్నట్లు సమాచారం.

వ్యవస్థలు స్తంభించిపోయాయి

ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తర్వాత పలువురు తమ భయానక అనుభవాలను వ్యక్తంచేశారు. ఇరాన్‌లో అక్షరాలా యుద్ధ వాతావరణమే నెలకొందని వెల్లడించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రతిక్షణం భయంభయంగా బతికామని అన్నారు. అక్కడ పరిస్థితులు నానాటికీ భీకరంగా మారుతున్నాయని, బయటకు వెళితే ప్రాణాలతో తిరగి వస్తామన్న గ్యారంటీ లేదని తెలిపారు. వ్యవస్థలన్నీ దాదాపు స్తంభించిపోయాయని, ఇంటర్నెట్ సేవలను ఆపేశారని, ఫోన్లలో మాట్లాడుకొనే అవకాశం కూడా లేదని పేర్కొన్నారు. అక్కడ ఆందోళనలు ఉధృతంగా జరుగుతున్నాయని, ఎక్కడ చూసినా అశాంతి కనిపిస్తోందని వివరించారు.

నిత్యం భయంగా బతకాల్సి వచ్చింది

''నెల రోజుల క్రితం ఇరాన్ వెళ్లాం. కానీ, రెండు వారాల క్రితమే సమస్యలు మొదలయ్యాయి. బయటకు వెళితే నిరసనకారులు అడ్డుకొనేవారు. మా వాహనాన్ని ముందుకు వెళ్లనిచ్చేవారుకాదు. చేసేది లేక మా నివాసానికి తిరిగి వచ్చేవాళ్లం. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. ఎప్పుడు ఎక్కడేం జరుగుతోందో తెలిసేది కాదు. మా క్షేమ సమాచారాలను ఇండియాలోని కుటుంబ సభ్యులకు చేరవేసే అవకాశం కూడా దక్కలేదు. నిత్యం భయంగా బతకాల్సి వచ్చింది. అది నిజంగా చాలా కష్టమైన సమయం. మొత్తానికి భారత ఎంబసీ సహకారంతో బయటపడ్డాం''అని ఇరాన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి చెప్పారు.



ఇరాన్ నుంచి తిరిగొచ్చి తమవారిని ఆలింగనం చేసుకుంటున్న విద్యార్థులు

సొంత ఖర్చుతోనే వచ్చా..

''నేను ఇరాన్‌లో షిరాజ్ నగరంలో ఉన్న మెడికల్ కాలేజీలో చదుకుంటున్నా. కానీ, ఇంటర్నెట్ సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అసలేం జరుగుతోందో తెలిసేదికాదు. భారత ప్రభుత్వ సూచనతో స్వదేశానికి తిరిగివచ్చా. నేను సొంత ఖర్చుతోనే వచ్చా. ప్రభుత్వం మాకోసం ప్రయాణ ఏర్పాట్లు చేయలేదు''అని ఓ వైద్య విద్యార్థిని తెలియజేశారు.

9 వేల మంది భారతీయులు

ఇరాన్ నుంచి ఎంతమంది తిరిగి వచ్చారన్నది ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. ఇరాన్‌లో ప్రస్తుతం దాదాపు 9 వేల మంది భారతీయులు ఇరాన్‌లో ఉన్నట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. వీరిలో ఎక్కువమంది విద్యార్థులే ఉన్నారని తెలిపారు. వారిని క్షేమంగా వెనక్కి తీసుకొస్తామని స్పష్టంచేశారు. ఎవరూ ఇరాన్‌కు వెళ్లే ప్రయత్నం చేయొద్దని కోరారు.

సాక్షి
గుంటూరు
ఆదివారం । 18 । జనవరి । 2026

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 553.30 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 33,138 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరు రావడంలేదు. దిగువకు 2900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 38.3148 టీఎంసీలు.

గోగులమ్మ వారి విశేష దర్శనం



భట్టిప్రోలు: పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారు శనివారం మూలానక్షత్రం సందర్భంగా 27 నక్షత్రాల ప్రతీకగా నక్షత్ర దీప సౌందర్య కాంతుల అలంకారంతో విశేష దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

దత్త పీఠంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

తెనాలిరూరల్: పెదరావూరులోని అవధూత దత్త పీఠం, గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో గత వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి వేడుకలు ముగిశాయి. మైసూరులోని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ, శ్రీదత్త విజయానంద తీర్థస్వామీజీల సమక్షంలో సప్తాహంగా ఏడురోజుల పాటు ఈ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అవధూత దత్త పీఠం, గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో జరిగిన వేడుకల్లో చివరిరోజైన శనివారం ఉదయం చండీహోమం చేశారు. సాయంత్రం డోలోత్సవం, మంగళహారతి, స్వామీజీ ఆశీర్వచనంతో వేడుకలు ముగిశాయి. సంబరాల ముగింపు సందర్భంగా స్వామీజీ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

నేడు స్వామి, అమ్మవార్ల వస్త్రాలు వేలం

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంకు సంబంధించి ఎగువ, దిగువ సన్నిధుల్లో స్వామివారికి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు భక్తులు సమర్పించిన వస్త్రాలను నేడు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాట ఆదివారం ఉదయం 9 గంటలకు దిగువ సన్నిధిలోని ఆలయ ఆవరణలో జరుగుతుందని, ఆసక్తిగల భక్తులు వేలం పాటలో పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పుట్టలమ్మ తల్లి లడ్డూ ప్రసాదం వేలం

గుంటూరురూరల్: నల్లపాడు, చల్లావారిపాలెం గ్రామాల ఇలవేల్పుదేవత శ్రీ పుట్టలమ్మతల్లి, శ్రీ ఘంటాలమ్మ తల్లి ఆలయంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న లడ్డూ వేలంను శ్రీరామ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఏటా హోరాహోరీగా సాగే వేలంలో భక్తులు పాల్గొని అమ్మవారి 9 కిలోల ప్రసాదం లడ్డూను దక్కించుకుంటారు. ఈ సారీ పోటాపోటీగా సాగిన వేలంలో గ్రామానికి చెందిన అమ్మవారి భక్తుడు ఇమడాబత్తిని నాగేశ్వరరావు రూ.15,50,000లకు సొంతం చేసుకున్నారు. అనంతరం లడ్డూను వేలంలో పాడుకున్న భక్తునికి ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి దాతలు ఇంటూరి వీరారెడ్డి, రాజశేఖర్‌రెడ్డిలు అందజేసిన 9 గ్రాముల అమ్మవారి బంగారు లాకెట్‌ను అందజేశారు.

తెనాలిలో ఆస్ట్రేలియా యువతుల సందడి

తెనాలిఅర్బన్: తెనాలి మారీసుపేటలోని దయామణి ఇంగ్లిషు మీడియం స్కూల్ 16వ వార్షికోత్సవ వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆస్ట్రేలియా దేశంలోని నోట్రే డామ్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అత్తోట విద్యాసాగర్, ఆయన బృందం పాల్గొన్నారు. ఆస్ట్రేలియా ఉపాధ్యాయులు తెలుగు సంప్రదాయ పద్ధతిలో చీరలు, పంచెలు ధరించి సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అత్తోట హేమలత, ప్రవాస భారతీయులు దాసరి చంద్రమౌళి, టి.రవీంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

మందా సాల్మన్‌ది ప్రభుత్వ హత్యే

గుంటూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు

ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు

బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న వనమా బాలవజ్రబాబు, అంబటి మురళీకృష్ణ, ఎస్సీ విభాగ నేతలు

- పాలకులపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు
- చంద్రబాబు సర్కార్ వైఖరికి నిరసనగా ప్రదర్శన

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులపై మారణహోమం కొనసాగుతూనే ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు తొలి నుంచి దళితులంటే చిన్న చూపేనని.. నిండు ప్రాణాలను బలిగొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కార్‌ను కూకటి వేళ్లతో పెకిలిస్తామని హెచ్చరించారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో టీడీపీ నేతలు మందా సాల్మన్‌ను హత్య చేయడంతో నిరసన కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ముందుగా బాబూ జగ్జీవన్ రాం విగ్రహం వరకు నిరసన పదర్శన సాగింది. అనంతరం అక్కడ బైఠాయించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

హత్యా రాజకీయాలు ఆపాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు దళిత వ్యతిరేకి అని, ఈ నేపథ్యంలోనే పార్టీ కార్యకర్త మందా సాల్మన్ హత్య జరిగిందని ఆరోపించారు. హత్యా రాజకీయాలకు స్వస్తి పలకని పక్షంలో తగిన గుణపాఠం నేర్పిస్తామని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే రాష్ట్రంలో దళితుల హత్యలు, దళితులపై దాడులు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కోవలోనే పిన్నెల్లి వచ్చిన కార్యకర్త మందా సాల్మన్‌ను రాడ్లతో కొట్టి అత్యంత పాశవికంగా హత్య చేశారని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబే నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని స్పష్టం చేశారు. ఇలాంటి దారుణాలు పునరావృతం చేస్తే తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని ఆరోపించారు. గతంలో కారంచేడు, నీరుకొండలో తెలుగుదేశం శ్రేణులు దళితులను ఊచకోత కోసిన తర్వాత ఉవ్వెత్తున ఎగిసిపడిన ఉద్యమం నాటి తెలుగుదేశం ప్రభుత్వ పతనానికి ఎలా దారి తీసిందో.. సరిగ్గా పిన్నెల్లి ఘటన కూడా కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేస్తుందన్నారు.

కార్యక్రమంలో పార్టీ సీఈసీ సభ్యులు మందపాటి శేషగిరిరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, జిల్లా ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు పాపతోటి అంబేడ్కర్, దూపాటి వంశీ, రోషన్, ఈచంపాటి వెంకటకృష్ణ, బోడపాటి కిషోర్, పూనూరి నాగేశ్వరరావు, పలు అనుబంధ విభాగాల నేతలు బత్తుల దేవ, ఆలా కిరణ్, తాడిబోయిన వేణుగోపాల్, పఠాన్ సైదాఖాన్, యేటి కోటేశ్వరరావు, పఠాన్ అబ్దుల్లాఖాన్, చింతపల్లి వెంకటరమణ, తోటకూర స్వర్ణలత, గనిక ఝాన్సీ, ప్రభు, శేషగిరి పవన్, దూపాటి అనిల్, షరీపుద్దీన్, ఎస్సీ సెల్ నేతలు త్రివేణి, అంకాల రాజు, కిరణ్, తోట వెంకటేష్, బత్తుల మనోహర్, హుస్సేన్‌వలి, పిల్లి మేరీ, స్వర్ణ, భాగ్యారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు మాట్లాడుతూ, సాల్మన్ హత్యను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుపరుస్తూ వైఎస్సార్ సీపీలో యాక్టివ్‌గా ఉండే వారిని అంతమొందిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కోసం ఖాకీలు సైతం కార్యకర్తల తరహాలో పనిచేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎదురు తిరిగితే పరిస్థితి ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులు హత్యలు జరుగుతున్నా వేడుక చూసినట్లు మౌనం దాల్చటం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను హత్య చేయడం, దాడులకు తెగబడటం, వేధింపులు వంటి ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు కూడా అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు.

తొలి నుంచి చంద్రబాబు నైజం అదే

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ, చంద్రబాబు స్వతహాగా దళిత వ్యతిరేక భావజాలం కలిగిన రాజకీయ నాయకుడన్నారు. మందా సాల్మన్ హత్య కూడా ఆ భావజాలంతో జరిగిందేనని తెలిపారు. రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థ చట్టాన్ని పక్కనపెట్టి చోద్యం చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పూర్తిగా ఖూనీ అయిందని పేర్కొన్నారు. ఇదే విధంగా పొన్నూరు నియోజకవర్గంలోని బొనిగల నాగమల్లేశ్వరరావుపై పాశవికంగా దాడి చేశారని, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చొరవతో కాపాడుకోగలిగామన్నారు. దళితులపై దమనకాండ చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. చేసిన తప్పులకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదని పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు ఇలా..

పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- ఈనెల 21 నుంచి 29 వరకు వివిధ షిఫ్ట్‌లలో నిర్వహణ
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సైట్‌లో అడ్మిట్ కార్డులు
- ప్రతి షిఫ్ట్‌కు మూడు రోజుల ముందుగా అడ్మిట్ కార్డులు విడుదల
- నీట్ తరహాలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్న ఎన్‌టీఏ
- విద్యార్థుల వస్త్రధారణపై ఆంక్షలు
- ఉమ్మడి జిల్లాలో హాజరు కానున్న 15వేల మందికి పైగా విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు అర్హత కల్పించేందుకు ఉద్దేశించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2026 మొదటి సెషన్ పరీక్షలు ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఈనెల 21, 22, 23, 24, 28వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌లలో పేపర్–1 (బీఈ, బీటెక్) ప్రవేశ పరీక్షలు జరగనుండగా, ఈనెల 29న పేపర్–2 బీఆర్క్ పరీక్ష జరగనుంది. జేఈఈ మెయిన్స్ నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఆన్‌లైన్ పరీక్షల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు అయాన్ డిజిటల్ జోన్‌లలో ఏర్పాట్లు చేసింది. దాదాపు 15వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. జేఈఈ మెయిన్స్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఏ ఊరిలో పరీక్షా కేంద్రం ఉందనే సమాచారంతో సిటీ ఇంటిమేషన్ వివరాలను సైట్‌లో ఉంచిన ఎన్‌టీఏ, ఆయా తేదీల వారీగా జరిగే పరీక్షలకు మూడు రోజుల ముందుగా అడ్మిట్ కార్డులను విడుదల చేయనుంది.

రెండు గంటల ముందుగా కేంద్రానికి

- జేఈఈ మెయిన్స్ అడ్మిట్‌కార్డులు పొందిన విద్యార్థులు అందులో ఎన్‌టీఏ పొందుపర్చిన నియమ, నిబంధనలు క్షుణ్ణంగా చదవాలి. పరీక్షా సమయానికి రెండు గంటల ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి.
- ఉదయం పేపర్–1 ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష మొదటి షిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్‌లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. బీఆర్క్, బీ ప్లానింగ్ పరీక్షలకు అదనంగా అరగంట సమయాన్ని కేటాయించారు.
- జేఈఈ మెయిన్స్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు నీట్ తరహాలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్న ఎన్‌టీఏ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సాధారణ వస్త్రాలను ధరించి రావాలని, కాళ్లకు బూట్లకు బదులుగా సాధారణ చెప్పులను ధరించాలని నిబంధనలు విధించింది.
- ఎన్‌టీఏ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్‌కార్డు కింది భాగంలో ఇచ్చిన ఒక బాక్సులో కలర్ పాస్‌పోర్ట్ సైజుఫోటోను అతికించాల్సి ఉంది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేసిన ఫొటోనే అతికించాల్సి ఉండగా, పక్కన మరొక బాక్సులో విద్యార్థి ఎడమ చేతి వేలిముద్ర వేయాలి. పక్కన ఉన్న మూడో బాక్సులో పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన తరువాత ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేయాలి.
- విద్యార్థి తమ వెంట అడ్మిట్‌కార్డుతో పాటు అటెండెన్స్ షీట్‌పై అతికించేందుకు మరొక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను వెంట తెచ్చుకోవాలి. ప్రతి విద్యార్థి నుంచి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనున్నారు. ట్రాన్స్‌పరెంట్ వాటర్ బాటిల్‌తో పాటు బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను తెచ్చుకోవాల్సి ఉంది. దరఖాస్తు సమయంలో అప్లోడ్ చేసిన ఆధార్, పాన్ తదితర ఒరిజినల్ కార్డులను విధిగా తీసుకెళ్లాలి. ప్రతి విద్యార్థి అడ్మిట్‌కార్డులో పొందుపర్చిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ విధిగా చదవాలి.

రైతు గుండెపై ఓఆర్ఆర్

- ఆదుకుంటారనుకుంటే ఆడుకుంటున్నారు...
- కనీస సమాచారం కూడా ఇవ్వకుండా నోటీస్ బోర్డుల్లో పెట్టారు
- మార్కెట్ విలువలో పదోవంతు కూడా రాదు
- నిన్న నారాకోడూరు, నేడు మేడికొండూరు మండలం డోకిపర్రు రైతుల ఆందోళన
- డోకిపర్రులో ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో 365 ఎకరాలు సేకరణ
- పాస్ పుస్తకాలు కోసం వెళ్లిన రైతులకు షాక్ ఇచ్చిన అధికారులు
- గుంటూరు కలెక్టరేట్‌కు పెద్దఎత్తున తరలి వచ్చిన రైతులు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేసేందుకు తరలివచ్చిన డోకిపర్రు రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు వెస్ట్: రాజధాని చుట్టూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఓఆర్ఆర్ భూసేకరణ రైతులపై పిడుగులా పడింది. కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించకుండా సచివాలయాల్లో సమాచారాన్ని అతికించి వదిలివేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు ఒరగబెట్టింది ఏమీ లేకపోగా ఉన్న భూములను కూడా లాక్కుని రైతుల నోట్లో మట్టి కొట్టి రోడ్లపైకి లాగుతున్నారని వాపోతున్నారు. చడీచప్పుడు లేకుండా కనీసం పొలం సరిహద్దుకు కూడా తెలీకుండా రైతుల భూములను లాక్కునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇటీవల చేబ్రోలు మండలం, నారాకోడూరు రైతులకు సంబంధించిన భూముల విషయంలో ఇదే జరిగింది.

తాజాగా మేడికొండూరు మండలం డోకిపర్రు గ్రామ రైతులు శనివారం గుంటూరు కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. పేరేచర్ల–మేడికొండూరు మధ్యలో ఉన్న డోకిపర్రు గ్రామంలో 365 ఎకరాల భూమిని ఔటర్ రింగ్ రోడ్డు కోసం సేకరిస్తున్నట్లు తెలుసుకున్న రైతులు ఆగమేఘాలపై తమకు జరుగుతున్న అన్యాయాన్ని ముక్తకంఠంతో తెలిపేందుకు సిద్ధమయ్యారు.

ఏదో ఒరగబెడతారని అందరూ చంద్రబాబు సర్కారును గద్దెనెక్కిస్తే చివరికి మా నోటి దగ్గర కూడు లాక్కోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూమి కోల్పోతున్న రైతులకు రూ.20–30 లక్షల మధ్యలో నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. వాస్తవానికి ఇక్కడ కమర్షియల్ భూమి విలువ రూ.2 కోట్లు నుంచి రూ.2.5 కోట్లు మధ్యలో నడుస్తుంది. ఓఆర్ఆర్‌కు భూమి ఇచ్చేందుకు రైతులు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. కాని ప్రభుత్వం తమకిచ్చే పరిహారం విషయంలో తమకు జరిగే అన్యాయాన్ని ఎట్టిపరిస్థితిలో అంగీకరించేది లేదని తెగేసి చెబుతున్నారు.

చడీచప్పుడు కాకుండా కాజేసేందుకు స్కెచ్ ...

సుమారు 350 మంది రైతుల జీవితాలు ఆగమవుతుంటే తనకేమీ తెలియదని తాడికొండ ఎంఎల్ఏ తెనాలి శ్రావణ్ కుమార్ అంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మొదట విడత గెజిట్‌లో 70 మీటర్ల రోడ్డుగా నమోదు చేశారు. దానిని 140 మీటర్లుగానూ ఇప్పుడు అవీ ఇవీ కలుపుకుని ఇప్పుడు 250 మీటర్ల ఓఆర్ఆర్ అవసరమని అధికారులు తేల్చారు. వాస్తవానికి ఇంత వెడల్పున రోడ్డు రాష్ట్రంలో ఎక్కడాలేదు. ఇటీవల ప్రభుత్వం భూమి ఉన్న రైతులకు పాస్‌పుస్తకాలు అందజేసింది. దీంతో నాలుగు రోజుల క్రితం పాస్‌బుక్స్ తీసుకునేందుకు సచివాలయానికి వెళితేగాని వారికి అస్సలు విషయం అర్థం కాలేదు. తనకున్న రెండు ఎకరాలు ఓఆర్ఆర్ కింద తీసుకునేందుకు అధికారులు నోటీసు బోర్డులో అతికించేసరికి ఒక్కసారిగా షాక్‌కు గురి అయినట్లు డోకిపర్రుకు చెందిన గట్టు సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పరిశీలిస్తామని కలెక్టర్ అంటున్నారు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి మా ఇబ్బందులు చెప్పుకున్నాం. అక్కడకు అధికారులను పంపి విచారించి న్యాయం చేస్తామంటున్నారు. అసలు రైతులకు తెలీయకుండా ఈ భూములను తీసుకోవడమేంటో అర్థం కావడంలేదు. రైతులు ఏమీ చేయలేరనే ధీమా ప్రభుత్వానికి ఉంది.

– కె.సుబ్రమణ్యం, డోకిపర్రు

రోడ్డుమీద పడతాం

నాకు చదువులేదు. ఉన్న 1.70 ఎకరాల్లో పండించే పంటతోనే జీవనం. చంద్రబాబు సర్కార్ ఇలా ఉన్నట్లుండి మాపై బండలు వేస్తుందనుకోలేదు. కనీసం మాటమాత్రం చెప్పకుండా, గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా భూములను లాక్కోవడమంటే రైతుల్ని దగా చేయడమే. దీనిని ఎంతమాత్రం సహించేది లేదు. ఇదేం అన్యాయం. ఎంతవరకైనా పోరాడతాం.

– ఇంటిగొర్ల యలమంద, రైతు, డోకిపర్రు

ఆడపిల్లలకు కట్నం కింద ఇచ్చామయ్యా...

నాకు మొత్తం 2 ఎరాలు ఉంది. ఇటీవల ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసి చెరో అర ఎకరం ఇచ్చాం. మిగిలిన నా పొలంతో పాటు ఆడపిల్లలకిచ్చిన పొలాలు కూడా ఓఆర్ఆర్ కింద తీసుకుంటారంట. ఇలా అయితే వాళ్ళ సంసారాలు ఏం కావాలి. అల్లుళ్లు ప్రశ్నించరా. ప్రభుత్వం ఇస్తామన్న పరిహారం కూడా చాలా తక్కువంటున్నారు. నాలుగు రోజుల నుంచి మనస్సు ఏమీ బాగుండడం లేదయ్యా. నాకు 70 సంవత్సరాల వయస్సు. అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రభుత్వం ఇలా మోసం చేస్తుందనుకోలేదు.

– ఎన్.సరస్వతి, డోకిపర్రు

భూములు ఇచ్చేందుకు సిద్ధమే

అభివృద్ధికి మేం పూర్తిగా సహకరిస్తాం. మా వాళ్లు చాలా మంది అమరావతి రాజధాని కోసం భూములిచ్చారు. వారిలో ఇప్పటికీ కొందరికి ప్రభుత్వం ప్లాట్లు ఇవ్వలేదు. ఓఆర్ఆర్‌కు భూమిలిచ్చేందుకు సిద్ధం. కానీ సుమారు రూ.2 కోట్లకు పైగా విలువ ఉన్న భూములకు కేవలం రూ.30 లక్షలు ఇస్తామంటున్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. నాకున్న భూమిలో మిర్చి, పత్తి పండిస్తూ కుటుంబాన్ని నడిపిస్తున్నాను. భూములు కోల్పోతే మా పరిస్థితి ఏంటో తెలీడంలేదు.

– అనిల్ కుమార్, రైతు, డోకిపర్రు

క్లుప్తంగా

నగర కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మయూర్ అశోక్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా కె.మయూర్ అశోక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. నగరంలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గుంటూరు నగరంలో సుమారు 10 లక్షల మంది జనాభా ఉన్నారని, సీఆర్‌డీఏ పరిధిలో కీలక నగరంగా ఉందని, దానికి తగ్గట్టు నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు కేటాయించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలని, అందుకు తగిన విధంగా నగర అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్‌ల మర్యాదపూర్వకంగా కలిశారు.

20లోపు ధ్రువ పత్రాలు అందజేయండి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా పరిధిలో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థుల ధ్రువ పత్రాలను ఈనెల 20వ తేదీలోగా సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా పత్రాల ధ్రువీకరణ కోరుతూ ప్రభుత్వ పరీక్షల విభాగం నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ప్రకటన కోసం www.bre.ap.gov.in వెబ్‌సైట్‌ను గమనిస్తుండాలని స్పష్టం చేశారు. పరీక్ష ఫలితాల ప్రక్రియలో భాగంగా విద్యార్థుల పత్రాల పరిశీలనకు జాబితా డీఈఓ కార్యాలయానికి త్వరలో వస్తుందన్నారు. అప్పటికి విద్యార్థుల హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో సహ కుల, ఆదాయ, 7వ తరగతి ఉత్తీర్ణత తదితర సర్టిఫికెట్లు అందుబాటులో ఉండాలన్నారు. లేని పక్షంలో విద్యార్థుల వివరాలు తుది జాబితా నుంచి తొలగించబడతాయని తెలిపారు. దీనికి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ విద్యార్థులకు గ్రూప్–1 నుంచి గ్రూప్–3 వరకు ఏదో ఒక సర్టిఫికెట్ ఖచ్చితంగా ఉండాలని తెలిపారు. తుది జాబితా విడుదల చేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థనలు అంగీకరించబడవని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సర్టిఫికెట్లను గడువు తేదీలోగా డీఈఓ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

లిఫ్ట్ ఇచ్చి.... లూటీ చేశాడు

- వృద్ధురాలి మెడలో 27 గ్రాముల బంగారు గొలుసు చోరీ చేసిన వాహన చోదకుడు
- పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

వృద్ధురాలి వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెదకూరపాడు : సాయం చేసినట్లు చేసి వృద్ధురాలు మెడలోని 27 గ్రాముల బంగారం గొలుసుని లాక్కొని ద్విచక్ర వాహనదారుడు ఉడయించిన సంఘటన మండలంలోని పరస – ఖమ్మంపాడు గ్రామంపాడు గ్రామాల మధ్య శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన 70 సంవత్సరాల ఈదా సామ్రాజ్యం పరస గ్రామంలో ఉంటున్న తన మనవడు అంజిరెడ్డి గృహానికి శనివారం ఉదయం వచ్చింది. అంజిరెడ్డి కంభంపాడు, జనాలపురం గ్రామాల మధ్య ఒక ఎకరం మిరప తోట సాగు చేస్తున్నాడు. సామ్రాజ్యం మధ్యాహ్న భోజనం ముగించుకొని తన మనవడు మిరప పొలాన్ని చూసేందుకు బయలుదేరారు. పరస జంక్షన్ వద్ద మిరప పొలానికి వెళ్లేందుకు నిలిచి ఉండగా కంభంపాడు గ్రామం వైపు వెళుతున్న యువకుడి ద్విచక్ర వాహనాన్ని లిఫ్ట్ అడిగింది. వాహనదారుడు వృద్ధురాలను ఎక్కించుకొని మార్గమధ్యంలో ఆమె మెడలో ఉన్న 27 గ్రాముల బంగారం గొలుసును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. వెంటనే వృద్ధురాలు సామ్రాజ్యం తన మనవడు అంజిరెడ్డికి సమాచారం ఇచ్చి పెదకూరపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ సంఘటన స్థలానికి చేరుకొని వృద్ధురాలు వద్ద వివరాలు సేకరించి, దగ్గరలో ఉన్న సీసీ పుటేజ్ పరిశీలించారు.

చదువుతో పాటు కళల్లో రాణించడం ఒక అభిరుచిగా మలచుకోవడం కొద్ది మందికే సాధ్యపడుతుంది. క్రీడా, సాంస్కృతిక అంశాల్లో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకుని తమకిష్టమున్న రంగాల్లో రాణిస్తుంటారు. అయితే అంతర్గతంగా దాగిన సృజనాత్మక నైపుణ్యాలకు పదును పెట్టి లెక్కకు మించిన కళల్లో ప్రావీణ్యం సంపాదించడం అరుదుగా కనిపిస్తుంది. గుంటూరు నగరానికి చెందిన విద్యార్థిని ఇదే కోవకు చెందుతుంది.

సకల కళా వైభవి

- వివిధ కళల్లో రాణిస్తున్న కావ్యశ్రీ వైభవి
- సంప్రదాయ నృత్యంలో అందెవేసిన చేయి
- చిత్రలేఖనం, క్రాఫ్ట్ తయారీ ద్వారా సృజనాత్మక నైపుణ్యాలకు పదును
- ఎన్‌సీసీ, కర్రసాములోనూ ప్రతిభ
- 13 ఏళ్ల వయసులో రాణిస్తున్న గుంటూరుకు చెందిన విద్యార్థిని వైభవి

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలలో చదువును కొనసాగిస్తూ చిన్నతనం నుంచి నేర్చుకుంటున్న సంప్రదాయ కూచిపూడి శిక్షణలో ప్రతిభావంతురాలిగా ఎదిగింది గుంటూరుకు చెందిన కన్నేపల్లి కావ్యశ్రీ వైభవి. గుంటూరు నగరంతో పాటు జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇచ్చిన నృత్య ప్రదర్శనల ద్వారా నాట్య మయూరిగా నిలిచింది. చదువుతో పాటు నృత్యంలో ప్రావీణ్యం సంపాదించడమొక్కటేనా అంటే కాదనే చెప్పాలి. శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కావ్యశ్రీ వైభవి చిన్నతనం నుంచి సంప్రదాయ కూచిపూడి నృత్యంలో ప్రావీణ్యం సంపాదించింది. దీంతో పాటు ఎన్‌సీసీ కేడెట్‌గా శిక్షణ పొందుతోంది. పాఠశాలలో చదువులో భాగంగా ఎన్‌సీసీ శిక్షణ పొందుతూ, పాఠశాల ముగిసిన అనంతరం నృత్యంలో శిక్షణ కొనసాగిస్తోంది. అదే విధంగా చిత్రలేఖనంపై ఎంతో మక్కువ కలిగిన వైభవి చిన్నతనం నుంచే వివిధ రకాల చిత్రాలకు ప్రాణం పోసింది. దేవతామూర్తుల చిత్రాలతో పాటు ప్రకృతి రమణీయ చిత్రాలు, పెయింటింగ్స్ గీయడం హాబీగా మలచుకుని, చిత్రలేఖనంలో ఎటువంటి శిక్షణ పొందకుండా సొంతంగా చిత్రాలను గీయడం విశేషం. ఇవన్నీ కాకుండా భిన్నమైన కర్రసాములోనూ రాణిస్తోంది. ఈ విధంగా కేవలం 13 ఏళ్ల వయసులో నాలుగు రకాల కళల్లో ప్రావీణ్యం సంపాదించి, ప్రతిభావంతురాలిగా నిలిచింది. ఈ నాలుగు కళల్లోనే కాకుండా వేస్ట మెటీరియల్‌తో గృహాలంకరణ సామగ్రి తయారీలోనూ నైపుణ్యం ప్రదర్శిస్తోంది. ఖాళీ అట్టపెట్టెలు, ఖాళీ వాటర్ బాటిల్స్, ఇస్‌క్రీం పుల్లలతో వివిధ రకాల గృహాలంకరణ వస్తువులను రూపొందించడం ద్వారా ఏక కాలంలో వివిధ రకాల కళల్లో రాణిస్తోంది.

నాట్యకళతో ప్రారంభమైన ప్రస్థానం

బహుముఖ ప్రతిభావంతురాలిగా రాణిస్తున్న కావ్యశ్రీ వైభవి ప్రస్థానం ముందుగా నాట్యశిక్షణతో మొదలైంది. ఐదేళ్ల చిరుప్రాయంలోనే నాట్య గురువు అనుశేఖర్ వద్ద శిక్షణ ప్రారంభించిన వైభవి ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. వినాయకచవితి ఉత్సవాలతో పాటు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, శివరాత్రి పర్వదినాల్లో సంప్రదాయ నృత్య ప్రదర్శనల్లో ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. కాణిపాకంలో యేటా జరిగే బ్రహ్మోత్సవాల్లో అను డ్యాన్స్ అకాడమీ నాట్యకారిణుల బృందంలో భాగస్వామిగా ప్రదర్శనలు ఇస్తోంది. శ్రీశైలం, అమరావతి, పెదకాకాని పుణ్యక్షేత్రాల్లో జరిగే నాట్య ప్రదర్శనల్లో పాల్గొనడం పరిపాటిగా మారింది.

ఎన్‌సీసీ కేడెట్‌గా రాణింపు

గుంటూరు ఆంధ్ర 25 ఎన్‌సీసీ గ్రూప్ నిర్వహించిన సెలక్షన్స్‌లో ఎంపికైన వైభవి ఎన్‌సీసీ కేడెట్‌గా శిక్షణ పొందుతోంది. ఒకవైపు శాస్త్రీయ నృత్యంలో సంప్రదాయ వస్త్రధారణతో మెరిసిపోతూ, మరోవైపు కఠినమైన ఎన్‌సీసీ యూనిఫాంతో మార్చ్‌ఫాస్ట్, వ్యాయామ కృత్యాలు చేస్తోంది. దీంతో పాటు సెలవు దినాల్లో తీరిక దొరికితే చాలు వెంటనే పేపర్‌పై చిత్రాలను గీయడం ప్రారంభించేస్తుంది. నాట్యకారిణిగా ప్రారంభమైన తన ప్రస్థానంలో తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు నాట్య గురువు, ఉపాధ్యాయులు తనకు ఎన్నో విధాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని చెబుతున్న వైభవి, వారి ప్రోత్సాహంతోనే తాను ఈ విధంగా వివిధ రకాల కళల్లో రాణిస్తున్నట్లు చెబుతోంది.

పోటీల్లో బహుమతులు కైవసం

వివిధ కళల్లో ప్రావీణ్యం సంపాదించిన వైభవి ఆయా రంగాల్లో నిర్వహించే పోటీల్లోనూ ప్రతిభ చాటుతోంది. కాణిపాకం దేవస్థానంలో యేటా నిర్వహించే బ్రహ్మోత్సవాలతో పాటు సంస్కారభారతి నృత్య, చిత్రలేఖన పోటీల్లో పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు కైవసం చేసుకుంది. దీంతో పాటు ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము) పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచి, రజత పతకాన్ని సాధించింది. వివిధ సంస్థలు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ఎన్నో ప్రశంసాపత్రాలు అందుకుంది.

వైభవి గీసిన అర్ధ నారీశ్వర చిత్రం

నృత్యకారిణిగా కావ్యశ్రీ వైభవి

'మా-ఏపీ షార్ట్ ఫిల్మ్స్' ఉత్తమ నటీనటుల ఎంపిక

త్వరలో విజయవాడలో అవార్డుల ప్రదానం

ఉత్తమ నటుడు మోహన్

ఉత్తమ నటి సుజిత

నగరంపాలెం: ఏపీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ పోటీల్లో ఉత్తమ నటీనటులు, వివిధ కేటగిరీల్లో వారిని ఎంపిక చేశామని మా–ఏపీ వ్యవస్థాపకులు, చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. శనివారం గుంటూరు అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పోటీలను ఎటువంటి రుసుం లేకుండా నిర్వహించామని అన్నారు. ఏపీ మినహా ఇతరత్రా రాష్ట్రాల ఎంట్రీలను అనుమతించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 203 షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలు వచ్చాయని చెప్పారు. ఆయా ఫిల్మ్‌ల్లో రెండు వేల మంది పలు పాత్రల్లో నటించారని తెలిపారు. ఉత్తమ నటిగా సుజిత (మనం – జంగారెడ్డిగూడెం), ఉత్తమ నటుడిగా మోహన్ (ఎక్స్7944 ఆర్ఆర్ – శ్రీకాకుళం జిల్లా) ఎంపికయ్యారని అన్నారు. సహాయ నటీ నటులుగా పవన్‌శర్మ (మన్ను, మిన్ను – పల్నాడు జిల్లా), బిషాయ్ (మహా వృక్షం – విశాఖ), గంగాధర్ (డ్రగ్స్ వద్దు బ్రో – గుంటూరు), పి.సాయి (అబద్ధం వర్సెస్ నిజం – పాలకొల్లు), బాల నటులుగా శ్రీనివాస్ (గ్యాంగ్స్ ఆఫ్ రాబరీ – గుంటూరు), హర్షతున్నీసా (హోప్ – విజయవాడ), ఉత్తమ రచయితగా ఎం.శంకర్ (మదర్స్ హార్ట్ బీట్ – మాచర్ల), ఉత్తమ నిర్మాత దినేష్ కదిరి (సైకోసిస్ – చిత్తూరు), ఔత్సాహిక దర్శకుడు త్రివిక్రమ్ (మనం – తెనాలి), ఉత్తమ మహిళా దర్శకురాలుగా శ్రీనిజ శ్రీనివాస్ (బర్డ్స్ కాంట్ ఫ్లయి – వైఎస్సార్ కడప), నాగశ్రీ (నాలోని నేను – నర్సాపురం), ఉత్తమ కాన్సెప్ట్‌గా రాచూరి సునీత (చార్విక్ బత్తుల ఐఏఎస్– పలాస), ముగ్గురికి కన్సోలేషన్ బహుమతులకు ఎంపికయ్యారని దిలీప్ రాజా వివరించారు. వీరందరికీ త్వరలో విజయవాడలో అవార్డులను ప్రదానం చేస్తామని చెప్పారు. దర్శకుడు శ్రీనివాస యాదవ్, సహాయ దర్శకులు గాజులపల్లి రాముడు, నరేష్ దోనే పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల రక్షణ భద్రతే లక్ష్యంగా శక్తి బృందాలు

మూడు నెలల్లో 99 అవగాహన సదస్సులు.. రెండు వేల మందికి అవగాహన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : జిల్లాలోని మహిళలు, చిన్నారుల రక్షణ, భద్రతే లక్ష్యంగా శక్తి బృందాలు పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందాల ద్వారా క్షేత్రస్థాయిలో జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గత మూడు నెలల్లో పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యమైన కూడళ్లల్లో సుమారు 99 అవగాహన సదస్సులు నిర్వహించి, 2 వేల మందికి అవగాహన కల్పించామని అన్నారు. శక్తి యాప్‌లను 821 మంది మొబైల్‌ఫోన్లల్లో ఇన్‌స్టాల్ చేసుకున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది శక్తి బృందాలు ఉన్నాయని, ప్రతి పోలీస్ సబ్ డివిజన్‌కు ఒకటి చొప్పున నెలకొల్పామని అన్నారు. గుంటూరు నగరంలో రెండు బృందాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నగర నూతన కమిషనర్

గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను శనివారం గుంటూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.మయూర్ అశోక్ మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రజలకు ఉత్తమమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు పోలీస్ శాఖ నుంచి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తెలిపారు.

నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ

గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్), మీడియా సెల్ నూతన భవనాన్ని శనివారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఎంటీ ఆర్ఐ శ్రీహరిరెడ్డి జిల్లా ఎస్పీ వెంట ఉన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్

తాడేపల్లి రూరల్ : రాష్ట్రంలో అరాచక పాలన జరుగుతోంది. పల్నాడు జిల్లాలో పిన్నెల్లి గ్రామంలో రాజకీయ హత్యలు ప్రభుత్వం చేస్తోంది. ఎవరైతే హత్యచేశారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామానికి చెందిన సాల్మన్ రాజును ఇనుపరాడ్లతో, ఇతర మారణాయుధాలతో దారుణంగా కొట్టి చంపారని, సాల్మన్‌రాజు మృతికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ తరఫున ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికి నుంచి ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులపై మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

కేఎల్‌యూలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ సంతోష్‌కుమార్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో శనివారం అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభమైనట్లు వర్సిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ ఎస్.సంతోష్‌కుమార్ విచ్చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, జాతీయస్థాయి ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడానికి ఈ టోర్నమెంట్ ఒక గొప్ప అవకాశమన్నారు. వర్శిటీ వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు జోన్లలో విజేతలైన జట్లు ఒక్కో జోన్‌కు నాలుగు జట్ల చొప్పున మొత్తం 16 విశ్వవిద్యాలయాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. శనివారం నుంచి మూడు రోజులు పాటు జరిగే టోర్నమెంట్‌లో క్రీడాకారులకు అన్ని రకాల వసతి, భోజనం, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కేఎల్‌యూ క్రీడల డైరెక్టర్, సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రటరి డాక్టర్ కె.హరికిషోర్ మాట్లాడుతూ తొలిరోజు 16 జట్లు ఆడిన తరువాత కేఐఐటీ యూనివర్సిటీ ఒడిశాపైన బెంగళూరుకు చెందిన జైన్ యూనివర్శిటీ విజయం సాధించిందని, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ యూనివర్సిటీపై యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ విజయం సాధించిందని, వీటితో పాటు మరో ఆరు జట్లు విజేతలుగా నిలిచాయని ఆదివారం నాడు ఎనిమిది జట్లు తలపడనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలిండియా యూనివర్సిటీల పరిశీలకులు డాక్టర్ కిరణ్, వర్సిటీ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం

డాక్టర్ లావు రత్తయ్యకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారంతో సత్కారం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): స్థానిక బృందావన్‌గార్డెన్స్‌వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై మూడు రోజులపాటు జరగనున్న ఎన్టీఆర్ కళాపరిషత్ 21వ నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. కేఆర్‌కే ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు సంస్థ ఉపాధ్యక్షుడు వేములపల్లి విఠల్ అధ్యక్షత వహించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యను ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. అనంతరం కళాంజలి (హైదరాబాద్) ఆధ్వర్యంలో శ్రీశైలమూర్తి రచనకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన యాగం నాటకం ప్రదర్శించారు. దేశభక్తిని నాటకంలో చాటారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, సంస్థ అధ్యక్షుడు ఘంటా పున్నారావు, గౌరవాధ్యక్షుడు అంబటి మధుమోహన్‌కృష్ణ, డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి సభ్యుడు యర్రా ఈశ్వరరావు, ఎల్‌వీఆర్ సన్స్ క్లబ్ అధ్యక్షుడు నూకవరపు వెంకటేశ్వరరావు, పద్మశ్రీ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కేతేపల్లి సాంబశివరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సంస్థ నిర్వాహకులు రామకృష్ణప్రసాద్ కాట్రగడ్డ, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యాగం నాటకంలో ఓ సన్నివేశం

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలు నాటికలు

యద్దనపూడి: మన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు సమాజంలోని వాస్తవ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించే ప్రతిబింబాలే నాటికలని తెలుగు టీవీ, నిర్మాతల మండలి అధ్యక్షుడు ఆరెకట్ల ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నాలుగో ఉభయ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు మూడో రోజు పోటీలను ఎన్టీఆర్ పురస్కార గ్రహీత డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు దంపతులు ప్రారంభించారు. ఆరెకట్ల ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాన్ని మేల్కొల్పటంలో నాటికలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. నాటికల్లోని పాత్రల్లో ప్రేక్షకులు తమను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపటానికి నాటక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రఖ్యాత టీవీ దర్శకులు మలినేని రాధాకృష్ణ మాట్లాడుతూ నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముప్పవరపు సుచరిత, సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ నిర్వాహకులు గుదే పాండురంగారావు, గుదే తారక రామారావు, కొరిటాల వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు..

తొలి నాటికగా విజయవాడ సాంస్కృతిక సమితి వారి మమ్మల్ని బతకన్వండి, రెండో నాటికగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారిచే ఇది అతని సంతకం, ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారిచే మంచి మనస్సులు నాటికలు ఆహుతులను అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మృతి చెందిన జయంత్ బవన్

మంగళగిరి టౌన్ : మంగళగిరిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. సేకరించిన వివరాల మేరకు మంగళగిరి పట్టణం ఇందిరానగర్‌లో నివాసముంటున్న పెండెం రామకృష్ణ బంగారపు పనిచేసుకుంటూ భార్య, కుమారుడు, కుమార్తెతో జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు జయంత్ బవన్ (21) బీబీఏ పూర్తిచేసి ప్రస్తుతం ఇంటివద్దనే ఉంటున్నాడు. సంక్రాంతి పండుగకు స్నేహితులో కలసి బయటకు వెళుతున్నాని చెప్పి శుక్రవారం సాయంత్రం కారు తీసుకుని వెళ్లాడు. శుక్రవారం రాత్రి సమయంలో తమ కుమారుడు జయంత్‌తో పాటు అతని స్నేహితుడు నాగార్జున విజయవాడ వైపు నుంచి గుంటూరు వెళుతుండగా మంగళగిరి లక్ష్మీ నరసింహా స్వామి కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారు పల్టీలు కొడుతూ రోడ్డుకు అవతలవైపు పడింది. దీంతో కారు డ్రైవ్ చేస్తున్న జయంత్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు 108కు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జయంత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా, స్నేహితుడు నాగార్జునకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సమీపంలోని మణిపాల్ హాస్పిటల్‌కు తరలించారు. జరిగిన ఘటనపై మంగళగిరి పట్టణ ఎస్ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెన్నెడైన ప్లాట్స్ అ/కొ॥ సంప్ర: జన చైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 9492770739

FLAT FOR SALE

■ సంక్రాంతి స్పెషల్ డిస్కౌంట్‌తో నల్లపాడు రోడ్ సాయిభార్గవి కన్‌స్ట్రక్షన్ మధు ఎన్‌క్లేవ్ 2BHK ఫ్లాట్స్ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు అమ్మకానికి కలవు. 9849851331, 7989958789

HOUSE FOR SALE

■ తెనాలి అమరావతి ఫ్లాట్స్‌లో 168 చ.గ. నార్త్‌ఫేస్ G+2 ఇండిపెండెంట్ ఫ్లాట్ L.I.g A/40 అమ్మకం. 9885055646, 8309706440

OLD BUILDINGS

■ పాతబిల్డింగ్‌లు పెంకుటిల్లు రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 9703290782, 9700442419

■ కోటి పాత బిల్డింగ్స్, పెంకుటిల్లు, రేకుల షెడ్లు పగలకొట్టి నేలమట్టం చేయబడును. పాత దర్వాజాలు, కిటికీలు, కలప, ఐరన్ కొనబడును. సెల్లార్ తీయబడును. 9949760367, 9966433122

PLOT FOR SALE

■ తార్ రోడ్‌ని అనుకుని 30 అ. రోడ్డుతో వెంచర్, 100 చ.గ. రూ. 1 లక్ష మాత్రమే. ఇండస్ట్రియల్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న దొనకొండలో స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83175 28192

■ సంక్రాంతి బంపర్ ఆఫర్! ఇంటి స్థలాలు, 111చ.గ కేవలం 1లక్ష రూపాయలు మాత్రమే. ఇండ్లకు అతి దగ్గరలో తక్షణ గృహ నిర్మాణానికి అనువైన ప్రదేశం. ఈ ఆఫర్ కొద్ది రోజులు మాత్రమే. 8888899212, 9398875236

■ Hyd హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, పసుమాముల, కుంట్లూర్ మెట్టు బాటసింగారం శ్రీమిత్ర జనచైతన్య వెంచర్స్ ప్లాట్ కొన. 9553973999, 6303049720

SERVICES

GOLD FINANCE

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ సిరి స్వీట్స్ షాపు నందు ఆటో కం కారు నడుపుటకు డ్రైవర్ కావలెను. జీతం: 15 – 20వేలు భోజన వసతి కలదు. మా బ్రాంచ్ బృందావన్ గార్డెన్స్. సంప్ర॥ 8374815999

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/– నుండి 15000/– వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరముల పైన ఉండవలెను. వివరములకొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480429

■ Wanted experienced Telicallers / Computer Operators(F) Education Consultancy, Lakshmipuram, Sal: 15k to 20k, Qul: Degree, Contact: 9052975353

■ చిరంజీవ చిట్‌ఫండ్స్ గుంటూరులో పని చేయుటకు ABM(M/F) కావలెను. శాలరీ: 25K+ ఇన్సెంటివ్స్ కలదు. సంప్ర॥ 7997992202

■ బిజినెస్ మేనేజర్స్ / బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను, డిగ్రీ, ఫ్రెషర్స్ మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30సం॥లోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

■ గుంటూరు జిన్నాటవర్ సెంటర్ రామా ఎంటర్ ప్రైజెస్ నందు పనిచేయుటకు 2సం॥ సేల్స్ అనుభవం కలిగిన లేడీ కావలెను. అర్హత: ఇంటర్ టైం: 3 to 9.30, జీతం: 10వేలు. ఉదయం 8 – 9లోపు సంప్ర॥ 9441665758

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్, ఇండ్లలో వృద్ధులు /పేషంట్లు సేవ, ఇంటి/ వంటపని, బేబీ కేర్ కొరకు వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ✆ 90631 72246, 96525 31847

■ గాయత్రి ఓల్డేజ్ హోమ్, ఇండ్లలో వృద్ధులు /పేషంట్లుసేవ, ఇంటి/ వంటపని, బేబీ కేర్ కొరకు వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు ✆ 92907 95581, 72071 37329

■ విశ్వశాంతి ట్రస్ట్, VJA. సేవ/డ్యూటీ చేయుటకు టెలికాలర్స్, వాలంటీర్స్, అన్ని రకాల స్టాఫ్ కావలెను. భో+వ+ జీతము. 9491821122, 9949021122

■ మేడికొండూరులోని మా CRDA అప్రూవ్డ్ ప్లాట్లు మార్కెటింగ్ చేయుటకు రిటైర్డ్ ఉద్యోగస్తులు, గృహిణులు, LIC ఏజెంట్స్ & ఫ్రెషర్స్ కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. 8885556620

■ తెనాలిలోని ఇంటీరియర్స్ ఆఫీస్ నందు పనిచేయుటకు లేడీ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ కావలెను. 9121819627, 9700100385

■ కేర్ టేకర్స్, నర్సులు విజయవాడ లోని పేషంట్ ఇంటి వద్దనే ఉండి చూసు కొనుటకు కావలెను. ఆంధ్ర హోమ్ కేర్, మంచి జీతం.✆ 9701857559 / 7815835561.

■ గుంటూరులో ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో పని చేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. 10thపాస్, జీతం: 15వేలు వరకు + బోనస్. సంప్ర॥ 9440870099

■ ఫ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18-28 సం॥లోపు ✆ 9133444985 / 89

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమం HYDలో పని చేయుటకు,నర్సులు, కాంపౌండర్స్, లేడి ఆఫీస్ అసిస్టెంట్స్ ఆయాలు, వార్డ్ బాయ్స్ భార్యా భర్తలు కావలెను.8985114453, 9391036931

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం

- వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే కీలకం
- గడువుకు ముందే కమిటీల నియామకం దాదాపు పూర్తి
- 'సంస్థాగత కమిటీ' సమావేశంలో అంబటి రాంబాబు, ముఖ్య నేతలు

మాట్లాడుతున్న గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, పక్కన ఎమ్మెల్సీ మురుగుడు, పోతిన మహేష్ , యార్లగడ్డ మదన్‌మోహన్ గౌడ్, దొంతిరెడ్డి వేమారెడ్డి

సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

మంగళగిరి టౌన్ : అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి ఆత్మకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అధ్యక్షతన పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణంపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు ఉన్నారని, వీరిని పార్టీలో భాగస్వాములను చేయాలని కోరారు. 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత ఆలోచనల మేరకు కమిటీలను బలోపేతం చేయడమే అత్యంత కీలకమన్నారు. ప్రతి కార్యకర్త స్పష్టమైన బాధ్యతలను తీసుకుంటూ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందించేలా ఉండాలని సూచించారు. గుంటూరు జిల్లాలోని మంగళగిరి నియోజకవర్గాన్ని నెంబర్ వన్ స్థాయిలో వేమారెడ్డి నిలబెట్టారని, ఇప్పటికే 90 శాతానికిపైగా అన్ని కమిటీలను పూర్తిచేసిన ఘనత వేమారెడ్డిదే అని అభినందించారు.

చంద్రబాబు సర్కార్ విఫలం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ పార్టీలో కార్యకర్తలే కీలకమని అన్నారు. వారు కష్టపడి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలు అమలు అవుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని తెలిపారు. నేడు చంద్రబాబు సర్కార్ ప్రజలను పూర్తిగా మోసం చేస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

అసెంబ్లీ పరిశీలకులు యార్లగడ్డ మదన్‌మోహన్ గౌడ్ మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. రానున్న రోజుల్లో చంద్రబాబు సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యాన్ని పేదలకు అందించేందుకు వైఎస్ జగన్ నేతృత్వంలో పార్టీ కృషి చేసిందని వివరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పూనుకుందని, పార్టీ ఉద్యమ ఫలితంగా టెండర్ వేసేందుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదన్నారు.

వైఎస్ జగన్ హయాంలో అసలైన పండగ

పార్లమెంట్ పరిశీలకులు పోతిన మహేష్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల గురించి పవన్‌కల్యాణ్ మాట్లాడకూడదన్నారు. ఓ ఎమ్మెల్యే ముందు యువతులు డాన్స్ చేస్తుంటే ఎందుకు మాట్లాడలేదంటూ విమర్శించారు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో పండుగ అంటే కేవలం వైన్‌షాపుల దగ్గరే కనిపిస్తోందని, గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పథకాలతో రైతులకు డబ్బులు అందజేసి, వారు పండుగను ఆనందంగా జరుపుకొనేలా చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో పండుగ చేసుకున్నవారిలో పెట్టుబడిదారులు, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మాత్రమే ఉన్నారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు, చంద్రబాబు పరిపాలనకు వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ అనుబంధ విభాగాలు, గ్రామ కమిటీలు పార్టీని బలోపేతం చేసేవిధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ అరాచకాలపై ఉద్యమిస్తాం

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. పార్టీ పదవులను డిజిటలైజేషన్ చేయడానికి పార్టీ అధ్యక్షులు 45 రోజులు నిర్దేశించారని, ఫిబ్రవరి 18వ తేదీ నాటికి కమిటీల నియామకాల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డేటాను డిజిటలైజేషన్ చేసి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత కమిటీలోని ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్టానం నుంచి ఐడీ కార్డులు అందించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి కార్యకర్తను రాష్ట్ర, కేంద్ర కార్యాలయానికి అనుసంధానం చేసేవిధంగా ఈ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న తమ పార్టీ శ్రేణులపై చంద్రబాబు సర్కార్ అక్రమ కేసులు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. త్వరలో ఈ అరాచకాలకు బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో అసెంబ్లీ పరిశీలకులు ఈమని రాఘవరెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, మంగళగిరి పట్టణ, మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ, మండల అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, అమరా నాగయ్య, దుగ్గిరాల మండల అధ్యక్షులు తాడిబోయిన శివగోపయ్య, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తాడేపల్లి రూరల్: ప్రకాశం జిల్లా, పామూరు మండలం, బొట్ల గూడూరులో మహర్షి అనే రజక యువకుడిపై దాడి చేసిన వారికి వెంటనే అరెస్ట్ చేయాలని రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బొజ్జ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ అయిన అతడిపై అగ్రవర్ణాల వారు స్తంభానికి కట్టేసి దాడి చేయడాన్ని ఖండించారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని ఏటీపీఎం హైస్కూల్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ, మహానగర్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వి. ప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా క్లబ్ పూర్వ మాజీ గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమున్నత లక్ష్యాలతో, బలమైన కోరికతో కష్టపడి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఏ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని అందుకు అనుగుణంగా ముందుకు సాగాలని వివరించారు. ఇష్టపడి చదివితే పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

వై.రాయప్పరెడ్డి

తాడికొండ: తాడికొండ మండల పరిధిలో ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించనున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వై. రాయప్ప రెడ్డి తెలిపారు. 19న నిడుముక్కల, 20న ఫణిదరం, మోతడక, 21న గరికపాడు, రావెల, 22న పొన్నెకల్లు, లచ్చన్నగుడిపూడి, 23న దామరపల్లి, ముక్కామల, 27న పాములపాడు, బండారుపల్లి, 28న కంతేరు, బేజాత్పురం, 29న తాతిరెడ్డిపాలెం, 30న తాడికొండ గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఫిరంగిపురం: ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలయ్యాడు. మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోలు బంకు సమీపంలో ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సాతులూరు గ్రామానికి చెందిన ఉమామహేశ్వర రావు గుంటూరు నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెలుతున్నాడు. ఫిరంగిపురం శివారులోని పెట్రోలు బంకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు అతడిని 108లో నరసరావుపేట ప్రభుత్వవైద్యశాలకు చికిత్సకోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

మంగళగిరి టౌన్ : మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన లబ్దిదారులకు టీడీపీ నాయకులు శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. స్థానికులైన నరసింహారావు, సామ్రాజ్యం, రామమోహనరావు, శిరోమణి, శ్రీదేవి, గౌసియాలకు చెక్కులను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. మొత్తం రూ. 2,37,831 పంపిణీ చేసినట్లు నేతలు పేర్కొన్నారు.

మంగళగిరిలో దర్శకుడు అనిల్ రావిపూడి సందడి



మంగళగిరి టౌన్: ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి మంగళగిరిలో సందడి చేశారు. సంక్రాంతికి రిలీజ్ అయిన 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ డైరెక్టర్ అనిల్ రావిపూడి శనివారం సాయంత్రం మంగళగిరి విచ్చేశారు. సినిమా ప్రదర్శిస్తున్న ఊర్వశి థియేటర్‌కు ఫస్ట్ షో సమయంలో వచ్చి అభిమానులతో సరదాగా ముచ్చటించారు.

కార్మికుల కష్టార్జితం దోచుకోవడం అన్యాయం

తాడేపల్లి రూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాన్ని యాజమాన్యం దోచుకోవడం అన్యాయమని యూనియన్ నాయకులు కె. స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించిందని చెప్పారు. ఆనాటి కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. మంత్రి నారా లోకేష్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. దీక్షల్లో సువర్ణ, నవనీతం, లక్ష్మి, శారద, కాసమ్మ కూర్చున్నారు. నాయకులు సుభాని, అంకయ్య, డి. నాగేశ్వరరావు, వై. సాంబశివరావు, సూర్యప్రకాష్, కార్మికులు గురవయ్య, పిచ్చయ్య, ఆశీర్వాదం, ఏసోబు, రమాదేవి, ఇమాంబి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు, సంఘ నేతలు

బాధితులను వెంటనే వైద్యశాలకు తరలించాలి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'రహ వీర '(గతంలో గుడ్ సమారిటన్) వాల్ పోస్టర్లను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల, పట్టణంలోని ప్రవేటు వైద్యశాలలు, వడ్లమూడిలోని డీవీసీ వైద్యశాలలో తెనాలి రవాణా శాఖ అధికారులు శనివారం ఆవిష్కరించి అతికించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాఘవరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి త్వరితగతిన వైద్యసహాయం అందించి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గాయాలపాలైన వారికి సహాయం అందించే వారిని ఉద్దేశించి రహ వీర వాల్ పోస్టర్లను రవాణా శాఖ రూపొందించిందని తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని త్వరితగతిన వైద్యశాలకు తరలించిన వారికి రూ. 25 వేల వరకు నగదు ఇస్తారని చెప్పారు. క్షతగాత్రులను వైద్యశాలకు తీసుకువచ్చిన వారిని ఫారాలు నింపాలని, వైద్య ఖర్చులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదని, వారిని వైద్యశాల నుండి వెంటనే వెళ్లేందుకు అభ్యంతరం చెప్పకూడదని స్పష్టం చేశారు. బాధితులను ఆదుకున్న వారిని సాక్షులుగా ఉండాలని పోలీసులూ ఒత్తిడి చేసేందుకు వీలు లేదని, అవసరమైతే సాక్షిగా ఉండేందుకు అంగీకరిస్తారా అని వారిని అడిగి వారి సమ్మతంతోనే సాక్షిగా పోలీసులు చేరుస్తారని తెలిపారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లోపు వైద్యశాలలకు తరలిస్తే ప్రాణాన్ని కాపాడే వీలుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి 10 మంది రహ వీరలను ఎంపిక చేసి ట్రోఫీ, సర్టిఫికెట్‌తో పాటు నగదు ప్రోత్సాహకంగా అందిస్తుందని ఎంవీఐ రాఘవరావు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. సౌభాగ్యవాణి, ఇతర వైద్యులు సిబ్బంది ఉన్నారు..

వైద్యులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవాణా శాఖ అధికారులు

నిందితులను రోడ్డుపై నడిపించిన పోలీసులు

తెనాలిరూరల్: తెనాలి యడ్ల లింగయ్య కాలనీ శివారు టీచర్స్ కాలనీలో ఈ నెల తొమ్మిదో తేదీ అర్ధరాత్రి దాటాక జరిగిన ఏసీ మెకానిక్ షేక్ ఫయాజ్ అహ్మద్ హత్య కేసులో ఓ మహిళ సహా ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం సాయంత్రం త్రీ టౌన్ పోలీసులు సీన్ రీ–కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా నిందితులను చెంచుపేటలో రోడ్డుపై నడిపించారు. హత్యకు ముందు నిందితులు వెళ్లిన వైన్ షాపు, ఫార్మసీల్లోకి నిందితులను తీసుకువెళ్లి విచారణ జరిపారు. మొత్తం హత్య కేసులో ఆరుగురు నిందితులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని సాంబశివరావు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదని సిఐ సాంబశివరావు స్పష్టం చేశారు. కాగా మరో మైనర్‌ను అదుపులోకి తీసుకోవాల్సి ఉంది.

నిందితులను నడిపిస్తున్న పోలీసులు

ముగిసిన యోగ శిక్షణ తరగతులు

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామంలో శ్రీ దత్త పీఠంలో ఈ నెల 11వ తేదీ నుంచి జరుగుతున్న దత్తక్రియ యోగ ఉచిత శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఏడు రోజుల పాటు ఉదయం సాయంత్రం ఈ తరగతులను నిర్వహించగా, మైసూరు అంతర్జాతీయ దత్తక్రియ యోగా కేంద్రం నుంచి వచ్చిన డాక్టర్ శివప్రకాష్ ప్రత్యేక శిక్షణనిచ్చారు. అలానే ప్రతినెలా మొదటి ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత దత్తక్రియ యోగ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు తెలిపారు. డి. రామకృష్ణ, సాంబశివరావు, శంకర ప్రసాద్ శిక్షణ ఇవ్వడంతో పాటు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ ఖాజావలి పేర్కొన్నారు. శనివారం తాడేపల్లిలోని పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని, పలు కేసుల్లో ఉన్న వాహనాలను, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. సరైన పత్రాలు లేని సుమారు 50 ద్విచక్రవాహనాలపై కేసులు నమోదు చేసి, జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఎస్ఐలు అపర్ణ, సాయికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఖాజావలి

తెనాలి ఫ్లై ఓవర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్ఐ శ్రీహరిబాబు

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మంగళగిరి టౌన్: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంగళగిరి రూరల్ సీఐ ఎ.వి. బ్రహ్మం సూచించారు. మంగళగిరి మండలంలోని కాజా టోల్‌ప్లాజా, పెదవడ్లపూడి, యర్రబాలెం డాన్‌బాస్కో సెంటర్లలో శనివారం రాత్రి వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగిఉండాలని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాల తనిఖీలు నిరంతరం జరుగుతాయని, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 10 ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ ఎస్ఐలు చిరుమామిళ్ల వెంకట్, రవితేజ, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ అవసరం

ఫిరంగిపురం: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ శివరామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో సిబ్బందితో శనివారం సాయంత్రం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్, లైసెన్సులు లేని 30 మందిపై కేసులు నమోదు చేసి జరిమాన విధించినట్లు సీఐ తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ సురేష్, రైటర్ దాసు, సిబ్బంది ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ ఎ.వి. బ్రహ్మం

అవగాహన కల్పిస్తున్న సీఐ శివరామకృష్ణ

ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని మంగళగిరి పట్టణ ఎస్ఐ శ్రీహరిబాబు సూచించారు. మంగళగిరి పట్టణంలో తెనాలి ఫ్లై ఓవర్ వద్ద శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవించినపుడు ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందన్నారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ నాగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

జనాభా దామాషా మేరకు బీసీలకు రిజర్వేషన్లు

తెనాలి: ఎస్సీ–ఎస్టీలతో పాటు ఓసీలకూ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుచేస్తున్న కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు, బీసీలకు కూడా దామాషా మేరకు రిజర్వేషన్లు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో స్థానిక సంస్థలకు 42 శాతం గాని, ఏపీ కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానమైన చట్టసభలు–స్థానిక సంస్థల్లో బీసీలకు 33–34 శాతాల రిజర్వేషన్లు అమలు జరపాలన్నా, ముందుగా సుప్రీంకోర్టు 50 శాతం పరిమితిని రద్దు పరచాలన్నారు. ఆధిపత్య వర్గాల వారు ఏనాడూ రోడ్డెక్కి అడక్కుండానే– వారిలో రెండు మూడు శాతం కూడా లేని పేదల కంటూ 103వ రాజ్యాంగ సవరణ చేసి మరీ, ఈ. డబ్ల్యూ.ఎస్ పేరిట 10 శాతం రిజర్వేషన్లు కేటాయించారని గుర్తుచేశారు. అలాంటప్పుడు బీసీ రిజర్వేషన్ల కోసం కూడా రాజ్యాంగ సవరణ చేసి 50 శాతం మించి ఎంతైనా రాష్ట్రాలు పెంచుకునేలా కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని కోరారు. అలా పెంచిన రిజర్వేషన్లకు శాశ్వత రాజ్యాంగ రక్షణ కల్పించేలా,తమిళనాడు తరహాలో షెడ్యూల్–9లో చేర్చాలన్నారు. దీనికి ముందుగా ఈసారి జాతీయస్థాయిలో జనగణనతో పాటు జరిగే కుల గణనను సమగ్రంగా జరిపించాలన్నారు.

ఘనంగా సత్సంగ కేంద్ర వార్షికోత్సవం

తెనాలిరూరల్: పట్టణ బోస్ రోడ్డులోని సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్రం 34వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బాబా ఉత్సవ మూర్తిని సింహ వాహనంపై ఉంచి ప్రధాన వీధుల్లో రాత్రి నగరోత్సవం జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులను బుర్రిపాలెం రోడ్డులోని టీజీకే కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన గురుధామంకు తీసుకువెళ్లి హారతి ఇచ్చారు. సుగ్గున రమేష్ బాబు ఆధ్వర్యంలో కాకర్లమూడికి చెందిన కోదండరామ మహిళా కోలాట భజన సమాజం కోలాటం ప్రదర్శించారు. సత్సంగ కేంద్ర కన్వీనర్ వీఎస్ నాగభూషణ రెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

పునీత జోజప్ప 85వ వార్షిక పండుగ

తెనాలి: రూరల్ మండల గ్రామం కోపల్లెలోని ఆర్‌సీఎం చర్చిలో శనివారం రాత్రి పునీత జోజప్ప 85వ వార్షిక పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్, ఫాదర్ ఇమ్మానుయేలు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ కందుల రాంబాబు, మండల యూత్ ప్రధాన కార్యదర్శి కోట వినయ్, దండమూడి లాజర్, కట్టా అనిల్, కందుల అజయ్, కోట రతన్‌రాజు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు ధారాదత్తం చేయొద్దు

దుగ్గిరాల: ముస్లింల వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్లకు కట్టబెట్టడం తగదని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. శుక్రవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చినకాకాని వద్ద అంజుమన్ సంస్థకు చెందిన 71.57 ఎకరాలను ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ధారాదత్తం చేసే ప్రయత్నం విరమించుకోవాలని కోరుతూ మజ్లిస్ ఉలేమా, జామియాతుల్ ఉలేమాల ఆధ్వర్యంలో ముస్లిం సంఘాలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన భారీ నిరసన సభలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తీరు శోచనీయమని అన్నారు.

19న పారా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

ఫిరంగిపురం: ఈ నెల 19వ తేదీన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 2026 పోటీలకు ఎంపికలు జిల్లా కేంద్రంలోని బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జాయింట్ సెక్రటరీ పి. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆసక్తి గల అభ్యర్థులు స్టేడియానికి రావాలన్నారు. ఇతర వివరాలకు 99129 21602 ఫోను నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

‘చిన్నస్వామి’లో మ్యాచ్‌లకు సై

బెంగళూరు: ఐపీఎల్ టీమ్ ఆర్‌సీబీ అభిమానులకు శుభవార్త! సుదీర్ఘ కాలం పాటు అనిశ్చితి కొనసాగిన తర్వాత సరిగ్గా ఐపీఎల్‌కు ముందు చిన్నస్వామి స్టేడియం క్రికెట్ మ్యాచ్‌లకు సిద్ధమవుతోంది. ఈ మైదానంలో ఐపీఎల్, అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించుకునేందుకు కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గత ఏడాది జూన్ 4న ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల సందర్భంగా 11 మంది అభిమానులు చనిపోయిన నేపథ్యంలో ఈ స్టేడియంలో మ్యాచ్‌లపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయితే ఇటీవల మాజీ ఆటగాడు వెంకటేశ్ ప్రసాద్ అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన కర్నాటక క్రికెట్ అసోసియేషన్ తాము కొత్తగా భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, వీటిని పరిశీలించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దీనిపై హోంశాఖ నేతృత్వంలో ప్రత్యేకంగా ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ తాజా ఏర్పాట్లతో సంతృప్తి చెందింది. పలు షరతులను పెడుతూ మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి మంజూరు చేసింది. తాజా పరిణామంతో ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ తమ హోమ్ మ్యాచ్‌లను బెంగళూరునుంచి తరలించాల్సిన అవసరం లేకపోయింది.

సిరీస్ విజయంపై గురి

నేడు భారత్, న్యూజిలాండ్ చివరి వన్డే • విజయంపై టీమిండియా ధీమా • ఆత్మవిశ్వాసంతో కివీస్ • మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

దాదాపు ఏడాదిన్నర క్రితం భారత గడ్డపై న్యూజిలాండ్ తొలి సారి టెస్టు సిరీస్‌ను గెలుచుకుంది. అంతకు ముందు చరిత్రలో ఎప్పుడూ అలాంటి ఘనత సాధించని కివీస్ అనూహ్యంగా భారత్‌ను చిత్తు చేసింది. ఇప్పుడు వన్డేల్లో చరిత్ర చూస్తే భారత్‌లో న్యూజిలాండ్ ఎప్పుడూ వన్డే సిరీస్ నెగ్గలేదు. కానీ గత మ్యాచ్‌లో ఆ జట్టు ప్రదర్శన చూస్తే అలాంటి అవకాశం ఇక్కడా కనిపిస్తోంది. గతంలో మూడు సార్లు ఆ జట్టు సిరీస్ గెలిచేందుకు చేరువగా వచ్చినా అది సాధ్యం కాలేదు. ఇలాంటి సవాల్ మధ్య స్వదేశంలో తమ రికార్డును నిలబెట్టుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. 2019 మార్చి తర్వాత సొంతగడ్డపై ద్వైపాక్షిక వన్డే సిరీస్ కోల్పోని రికార్డును భారత్ కొనసాగిస్తుందా లేక సంచలనం నమోదవుతుందా చూడాలి.

గిల్

కోహ్లి, రోహిత్

ఇండోర్: భారత్, న్యూజిలాండ్ మధ్య సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి పోరుకు రంగం సిద్ధమైంది. హోల్కర్ స్టేడియంలో నేడు జరిగే మూడో వన్డేలో ఇరు జట్లు తలపడనున్నాయి. తొలి వన్డేలో భారత్ ఆధిపత్యం సాగగా, రెండో వన్డేలో న్యూజిలాండ్ అలవోక విజయాన్ని అందుకుంది. ప్రత్యర్థితో పోలిస్తే సొంతగడ్డపై భారత్ అన్ని రంగాల్లో పటిష్టంగా కనిపిస్తుండగా...పెద్దగా అనుభవం లేని ఆటగాళ్లతో ఇక్కడ అడుగు పెట్టిన కివీస్ కూడా తమ ఆటతో ఆకట్టుకుంది. ఈ నేపథ్యంలో ఆఖరి ఆట ఆసక్తికరంగా సాగవచ్చు.

అర్ష్‌దీప్‌కు చాన్స్!

భారత బ్యాటింగ్ టాప్–5 విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. రోహిత్, గిల్ జట్టుకు కావాల్సిన శుభారంభాన్ని అందిస్తున్నారు. అయితే రోహిత్ తన జోరును భారీ స్కోరుగా మార్చాల్సి ఉంది. గత మ్యాచ్‌లో తక్కువ పరుగులే చేసినా...కోహ్లి ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. శ్రేయస్ అయ్యర్ కూడా తన స్థాయిలో రాణిస్తుండగా... రాహుల్ రాజ్‌కోట్‌లో సెంచరీతో తానేమిటో చూపించాడు. ఈ ఐదుగురిలో ఏ ఇద్దరు చెలరేగినా భారత్ భారీ స్కోరు సాధించడం ఖాయం. ఆరో స్థానంలో నితీశ్ రెడ్డిని కొనసాగిస్తారా లేక స్పిన్నర్ ఆయుశ్ బదోనికి అరంగేట్రం చేసే అవకాశం వస్తుందా చూడాలి. నితీశ్‌ను పూర్తి స్థాయి ఆల్‌రౌండర్‌గా జట్టు ఉపయోగించుకోవడం లేదు. స్పిన్నర్‌గా కుల్దీప్ ప్రదర్శన కీలకం కానుంది. జడేజా బౌలింగ్ ప్రదర్శనను చూస్తూ అతని బ్యాటింగ్‌ను ఎవరూ పట్టించుకోలేదు. సుదీర్ఘ కాలంగా అతను వన్డేల్లో చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఓవరాల్‌గా భారత్‌లోనైతే 2013 తర్వాత అతను కనీసం హాఫ్ సెంచరీ సాధించలేదు. పేసర్లుగా సిరాజ్, హర్షిత్ ఖాయం. మూడో పేసర్‌గా వైవిధ్యం కోసం ప్రసిధ్ స్థానంలో అర్ష్‌దీప్‌ను ప్రయత్నించవచ్చు. తొలి రెండు వన్డేల్లో ప్రసిధ్ పెద్దగా ఆకట్టుకోలేదు.

కుర్రాళ్లు సమష్టిగా...

‘న్యూజిలాండ్ ఇంత సులువుగా విజయం సాధించడం నాకు చాలా ఆశ్చర్యం కలిగించింది’... అంటూ రెండో వన్డే తర్వాత దిగ్గజం సునీల్ గావస్కర్ చేసిన వ్యాఖ్య భారత్ వైఫల్యాన్ని స్పష్టంగా చూపించింది. మిచెల్, యంగ్‌లను నిలువరించడంలో మన బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. కాన్వే, నికోల్స్ కూడా ఓపెనర్లుగా రాణిస్తే కివీస్ కూడా మంచి స్కోరుపై దృష్టి పెట్టవచ్చు. ఫిలిప్స్‌లాంటి హిట్టర్‌తో పాటు మంచి బ్యాటింగ్ పదును ఉన్న కెప్టెన్ బ్రేస్‌వెల్ మిడిలార్డర్‌లో కీలకం కానున్నారు. పేసర్ జేమీసన్ మొదటినుంచీ భారత్‌ను ఇబ్బంది పెడుతున్నాడు. క్లార్క్, ఫోక్స్‌లతో జట్టు బౌలింగ్ ఆధారపడి ఉంది. ఆఫ్ స్పిన్నర్‌గా బ్రేస్‌వెల్ ఉన్నాడు కాబట్టి తొలి వన్డే తరహాలోనే లెనాక్స్ స్థానంలో లెగ్‌స్పిన్నర్ ఆదిత్య అశోక్‌కు చోటు దక్కవచ్చు. ఎనిమిది మంది తొలిసారి భారత గడ్డపై ఆడుతున్న ఆటగాళ్లతో పర్యటనకు వచ్చి వన్డే సిరీస్ గెలవగలిగితే న్యూజిలాండ్‌కు ఇది పెద్ద ఘనత అవుతుంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, కోహ్లి, అయ్యర్, రాహుల్, నితీశ్/బదోని, జడేజా, హర్షిత్, కుల్దీప్, అర్ష్‌దీప్, సిరాజ్.

న్యూజిలాండ్: బ్రేస్‌వెల్ (కెప్టెన్), కాన్వే, నికోల్స్, యంగ్, మిచెల్, హే, ఫిలిప్స్, క్లార్క్, జేమీసన్, ఫోక్స్, ఆదిత్య.

పిచ్, వాతావరణం

భారత్‌లో భారీ స్కోర్లకు పేరున్న మైదానం. చిన్న బౌండరీలతో బ్యాటర్ల పని సులువై అలవోకగా పరుగులు రావడం ఖాయం. గత రెండు వన్డేల్లో భారత్ ఇక్కడ 399, 385 స్కోర్లు చేసింది. రాత్రి పూట మంచు ప్రభావం ఉంది కాబట్టి టాస్ నెగ్గే జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు. మరో సారి భారీ స్కోరును ఆశించవచ్చు.

విహాన్ విజృంభణ

యువ భారత్‌కు వరుసగా రెండో విజయం

- 18 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి
- మెరిసిన వైభవ్, అభిజ్ఞాన్
- అండర్-19 ప్రపంచకప్

విహాన్‌కు సహచరుల అభినందన

బులవాయో (జింబాబ్వే): అండర్–19 ప్రపంచకప్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో అమెరికాపై అలవోక విజయం సాధించిన ఆయుశ్ మాత్రే సారథ్యంలోని యువ భారత జట్టు... రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. గ్రూప్ ‘బి’లో భాగంగా శనివారం జరిగిన పోరులో భారత్ 18 పరుగుల తేడాతో (డక్‌వర్త్–లూయిస్ పద్ధతిలో) బంగ్లాదేశ్‌పై గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఆయుశ్ మాత్రే (6), వేదాంత్ త్రివేది (0), విహాన్ మల్హోత్రా (7), హర్‌వంశ్ పంగలియా (2) విఫలమైనా... యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (67 బంతుల్లో 72; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), అభిజ్ఞాన్ కుందు (112 బంతుల్లో 80; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో కదం తొక్కారు. ఒకవైపు వరుస వికెట్లు పడుతున్నా... వైభవ్ సూర్యవంశీ, అభిజ్ఞాన్ చక్కటి పోరాటం కనబర్చారు. ఫలితంగా యంగ్ ఇండియా ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. గంటకు పైగా మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడంతో తొలుత భారత ఇన్నింగ్స్‌ను 49 ఓవర్లకు కుదించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో అల్ ఫహద్ 5 వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ సమయంలో మ్యాచ్‌కు మరోసారి వర్షం అడ్డుపడింది. దీంతో బంగ్లా లక్ష్యాన్ని 29 ఓవర్లలో 165గా నిర్ణయించారు. ఛేదనలో బంగ్లా 28.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ అజీజుల్ హకీమ్ (72 బంతుల్లో 51; 4 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో పోరాడగా... మిగిలినవాళ్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఒక దశలో 106/2తో పటిష్ట స్థితిలో ఉన్న బంగ్లాదేశ్... భారత బౌలర్ల జోరుతో మరో 40 పరుగుల వ్యవధిలో 8 వికెట్లు కోల్పోయింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ విహాన్ మల్హోత్రా 4 వికెట్లతో సత్తా చాటాడు. తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 26న న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది.

స్కోరు వివరాలు

భారత అండర్–19 ఇన్నింగ్స్: ఆయుశ్ (సి) కలామ్ (బి) ఫహద్ 6; వైభవ్ (సి) ఫహద్ (బి) ఇక్బాల్ 72; వేదాంత్ (సి) రిఫత్ (బి) ఫహద్ 0; విహాన్ (సి) అబ్రార్ (బి) అజీజుల్ 7; అభిజ్ఞాన్ (సి) ఫరీద్ (బి) ఫహద్ 80; హర్‌వంశ్ (సి) రిఫత్ (బి) ఇక్బాల్ 2; కనిష్క్ (సి) (సబ్) అబ్దుల్లా (బి) అజీజుల్ 28; అంబరీష్ (సి) ఫరీద్ (బి) పర్వేజ్ 5; ఖిలాన్ (సి) ఫరీద్ (బి) ఫహద్ 8; హెనిల్ (నాటౌట్) 7; దీపేశ్ (సి) రిజాన్ (బి) ఫహద్ 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (48.4 ఓవర్లలో ఆలౌట్) 238. వికెట్ల పతనం:** 1–12, 2–12, 3–53, 4–115, 5–119, 6–173, 7–194, 8–208, 9–224, 10–238. **బౌలింగ్:** అల్ ఫహద్ 9.2–1–38–5; ఇక్బాల్ 8–1–45–2; పర్వేజ్ 10–1–46–1; అజీజుల్ 10–1–42–2; రిజాన్ 8–0–43–0; సాద్ ఇస్లామ్ 2.2–0–18–0; బషీర్ 1–0–6–0.

బంగ్లాదేశ్ అండర్–19 ఇన్నింగ్స్: జవాద్ అబ్రార్ (సి) హెనిల్ (బి) దీపేశ్ 5; రిఫత్ (సి) అభిజ్ఞాన్ (బి) కనిష్క్ 37; అజీజుల్ (సి) కనిష్క్ (బి) ఖిలాన్ 51; కలామ్ (సి అండ్ బి) విహాన్ 15; పర్వేజ్ (సి) కనిష్క్ (బి) విహాన్ 7; రిజాన్ (సి) హెనిల్ (బి) విహాన్ 15; బషీర్ (సి) వైభవ్ (బి) విహాన్ 2; ఫరీద్ (సి) దీపేశ్ (బి) ఖిలాన్ 1; ఫహద్ (రనౌట్) 0; ఇక్బాల్ (సి) ఆయుశ్ (బి) హెనిల్ 2; ఇస్లామ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (28.3 ఓవర్లలో ఆలౌట్) 146. వికెట్ల పతనం:** 1–6, 2–62, 3–106, 4–124, 5–126, 6–129, 7–138, 8–143, 9–144, 10–146. **బౌలింగ్:** దీపేశ్ 4–0–27–1; హెనిల్ 4.3–1–17–1; అంబరీష్ 3–0–18–0; కనిష్క్ 6–0–22–1; ఖిలాన్ 6–0–35–2; ఆయుశ్ 1–0–7–0; విహాన్ 4–0–14–4.

టాటా చెస్ టోర్నీకి నిరసన సెగ!

విజ్‌క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): ప్రతిష్టాత్మక టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో తొలి రౌండ్ తొలి రౌండ్ మ్యాచ్‌ల నిర్వహణ ఆలస్యమైంది. స్థానిక పర్యావరణకారులు టాటా స్టీల్ కారణంగా తమ వద్ద కాలుష్యం పెరిగిపోతుండటంపై టోర్నీ వేదిక వద్ద తీవ్ర నిరసనను ప్రదర్శించడమే అందుకు కారణం. టాటా కంపెనీ విడుదల చేస్తున్న సీసం కారణంగా తమ చిన్నారుల మెదడుపై తీవ్ర నష్టం కలుగుతోందని, విషపూరిత వాయువుల మధ్య పిల్లలు పెరుగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. టోర్నీ ప్రధాన గేటు వద్ద దాదాపు 2 వేల కిలోల బొగ్గును పారబోసి వారు తమ నిరసనను చూపించారు.

ఐర్లాండ్ మ్యాచ్‌లను మార్చండి!

ఢాకా: టి20 వరల్డ్ కప్‌లో తమ లీగ్ మ్యాచ్‌లను భారత్‌లో ఆడేందుకు నిరాకరిస్తున్న బంగ్లాదేశ్ దానికి సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి మరో ప్రత్యామ్నాయాన్ని సూచించింది. ఐసీసీ బృందంతో శనివారం జరిగిన చర్చల సమయంలో బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) వారి ముందు ఈ ప్రతిపాదన ఉంచింది. టోర్నీలో భాగంగా ఐర్లాండ్ తమ నాలుగు లీగ్ మ్యాచ్‌లను కొలంబో, పల్లెకెలలో ఆడాల్సి ఉంది. వీటిని భారత్‌కు తరలించి తమ మ్యాచ్‌లు శ్రీలంకలో నిర్వహించాలని బీసీబీ చెబుతోంది.

విదర్భ x సౌరాష్ట్ర

నేడు విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ వన్డే టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన విదర్భ, సౌరాష్ట్ర మధ్య ఆదివారం తుదిపోరు జరగనుంది. గతేడాది ఫైనల్లో కర్ణాటక చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన విదర్భ... ఈ సారి ట్రోఫీ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. మరోవైపు 2022–23 సీజన్‌లో చాంపియన్‌గా నిలిచిన సౌరాష్ట్ర మూడేళ్ల తర్వాత తిరిగి ఫైనల్ చేరింది. లీగ్ దశలో ఏడు మ్యాచ్‌లాడిన ఇరు జట్లు ఐదేసి విజయాలు సాధించి నాకౌట్‌కు అర్హత సాధించాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఉత్తర ప్రదేశ్‌పై సౌరాష్ట్ర విజయం సాధించగా... ఢిల్లీపై విదర్భ గెలుపొందింది. ఇక సెమీఫైనల్లో కర్ణాటకపై విదర్భ... పంజాబ్‌పై సౌరాష్ట్ర నెగ్గి ఫైనల్‌కు చేరాయి. ఇప్పటికే రెండుసార్లు ట్రోఫీ నెగ్గిన సౌరాష్ట్ర మూడో సారి విజేతగా నిలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతుండగా... విదర్భ తొలి సారి చాంపియన్ హోదా దక్కించుకోవాలని తహతహలాడుతోంది. ఇరు జట్లలోనూ టీమిండియా స్టార్ ఆటగాళ్లు ఎవరూ లేకపోగా... సమష్టి ప్రదర్శనతోనే ఫైనల్ వరకు చేరాయి.

అరుంధతిపై వేటు

ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు భారత మహిళల జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యురాలైన హైదరాబాద్ పేసర్ అరుంధతి రెడ్డిపై వేటు పడింది. వచ్చే నెలలో ఆస్ట్రేలియాతో జరగనున్న పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం శనివారం వేర్వేరుగా జట్లను ప్రకటించారు. అరుంధతితో పాటు లెఫ్టార్మ్ స్పిన్నర్ రాధ యాదవ్, ఉమా ఛెత్రీని ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు. వీరి స్థానాల్లో వికెట్ కీపర్ కమలిని, వైష్ణవి శర్మ, కాశ్వీ గౌతమ్‌కు అవకాశం దక్కింది. టి20 జట్టులో శ్రేయాంక పాటిల్, భారతి ఫుల్‌మాలి చోటు దక్కించుకున్నారు. వన్డే జట్టులో చోటు నిలుపుకున్న హర్లీన్ డియోల్‌కు టి20ల్లో అవకాశం దక్కకపోగా... అరుంధతి టి20ల్లో చోటు నిలుపుకుంది. రెండు ఫార్మాట్‌లలోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఫిబ్రవరి 15 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు టి20లు, మూడు వన్డేలు జరగనున్నాయి.

లానింగ్ మెరుపులు

ముంబైపై యూపీ రెండో విజయం

లానింగ్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో యూపీ వారియర్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. శనివారం జరిగిన పోరులో మెగ్ లానింగ్ సారథ్యంలోని యూపీ వారియర్స్ 22 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై గెలుపొందింది. లీగ్‌లో ఐదు మ్యాచ్‌లాడిన యూపీ వారియర్స్‌కు ఇది రెండో విజయం కాగా... ఆ రెండు డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌పైనే కావడం విశేషం. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మెగ్ లానింగ్ (45 బంతుల్లో 70; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు), లిచ్‌ఫీల్డ్ (37 బంతుల్లో 61; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈ జంట రెండో వికెట్‌కు 76 బంతుల్లో 119 పరుగులు జోడించడంతో యూపీ మంచి స్కోరు చేయగలిగింది. హర్లీన్ డియోల్ (25), ట్రియాన్ (21) పర్వాలేదనిపించగా... కిరణ్ నవగిరే (0), శ్వేత సెహ్రావత్ (0), సోఫీ ఎకిల్‌స్టోన్ (1), దీప్తి శర్మ (0) విఫలమయ్యారు. అనంతరం లక్ష్యఛేదనలో ముంబై జట్టు తడబడింది. టాపార్డర్ విఫలమవడంతో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులకు పరిమితమైంది. కెర్ (28 బంతుల్లో 49 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), అమన్‌జ్యోత్ కౌర్ (24 బంతుల్లో 41; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (18), నాట్ సీవర్ బ్రంట్ (15), సీజవన్ సజన (10), హేలీ మాథ్యూస్ (13), నికోలా కేరీ (6) ఎక్కువసేపు నిలవలేకపోయారు. యూపీ బౌలర్ల ధాటికి ముంబై ఒక దశలో 69/5తో పరాజయం అంచున నిలిచింది. ఈ దశలో కెర్, అమన్‌జ్యోత్ ఆరో వికెట్‌కు 83 పరుగులు జోడించి ఆశలు రేపినా... ఆఖర్లో సాధించాల్సిన రన్‌రేట్ పెరిగిపోవడంతో ముంబైకి పరాజయం తప్పలేదు.

స్కోరు వివరాలు

యూపీ వారియర్స్ ఇన్నింగ్స్: లానింగ్ (సి) అమన్‌జ్యోత్ (బి) హేలీ 70; కిరణ్ నవగిరే (బి) కేరీ 0; లిచ్‌ఫీల్డ్ (సి) సంస్కృతి (బి) అమన్‌జ్యోత్ 61; హర్లీన్ (స్టంప్డ్) కమలిని (బి) కెర్ 25; ట్రియాన్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) సీవర్ బ్రంట్ 21; శ్వేత సెహ్రావత్ (సి) కమలిని (బి) సీవర్ బ్రంట్ 0; ఎకిల్‌స్టోన్ (స్టంప్డ్) కమలిని (బి) కెర్ 1; దీప్తి (సి) కమలిని (బి) కెర్ 0; ఆశ శోభన (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1–5, 2–124, 3–136, 4–177, 5–177, 6–185, 7–186, 8–187. **బౌలింగ్:** నికోలా కేరీ 4–0–38–1; సంస్కృతి 2–0–16–0; సీవర్ బ్రంట్ 4–0–22–2; హేలీ మాథ్యూస్ 3–0–40–1; అమన్‌జ్యోత్ 3–0–38–1; అమేలియా కెర్ 4–0–28–3.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ (సి అండ్ బి) ఎకిల్‌స్టోన్ 13; సంజన (ఎల్బీ) (బి) క్రాంతి 10; సీవర్ బ్రంట్ (సి) లానింగ్ (బి) శిఖ 15; హర్మన్‌ప్రీత్ (సి) ఎకిల్‌స్టోన్ (బి) ట్రియాన్ 18; నికోలా (సి) హర్లీన్ (బి) దీప్తి 6; కెర్ (నాటౌట్) 49; అమన్‌జ్యోత్ (సి అండ్ బి) శిఖ 41; కమలిని (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1–23, 2–23, 3–44, 4–57, 5–69, 6–152. **బౌలింగ్:** క్రాంతి 4–0–32–1; శిఖ 4–0–30–2; ఎకిల్‌స్టోన్ 4–1–33–1; దీప్తి 4–0– 35–1; ట్రియాన్ 2–0–18–1; శోభన 2–0–17–0.

స్మృతి చేజారిన సెంచరీ

బెంగళూరు జైత్రయాత్ర • 8 వికెట్లతో ఢిల్లీపై జయభేరి • రాణించిన బెల్, వోల్

స్మృతి

నవీ ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు అజేయంగా దూసుకెళుతోంది. జోరు మీదున్న జట్టు వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. శనివారం జరిగిన పోరులో బెంగళూరు 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ షఫాలీ వర్మ (41 బంతుల్లో 62; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగింది. 10 పరుగులకే జట్టు 4 వికెట్లు కోల్పోయిన దశలో లూసీ హామిల్టన్ (19 బంతుల్లో 36; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్నేహ్ రాణా (22; 3 ఫోర్లు)లతో కలిసి క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. బెల్, సయాలీ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన బెంగళూరు 18.2 ఓవర్లలో 2 వికెట్లకు 169 పరుగులు చేసి గెలిచింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ స్మృతి మంధాన (61 బంతుల్లో 96; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేసింది. త్రుటిలో సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్న ఆమె... జార్జియా వోల్ (42 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి రెండో వికెట్‌కు 142 పరుగుల్ని జోడించింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: షఫాలీ (సి) రావత్ (బి) బెల్ 62; లిజెల్లీ (బి) బెల్ 4; వోల్వార్ట్ (బి) బెల్ 0; జెమీమా (బి) సయాలీ 4; మరిజాన్ (బి) సయాలీ 0; నికీ (ఎల్బీ) (బి) రావత్ 12; మిన్ను మణి (సి) మంధాన (బి) డిక్లెర్క్ 5; స్నేహ్ రాణా (బి) రావత్ 22; హామిల్టన్ (సి) రాధ (బి) సయాలీ 36; శ్రీచరణి నాటౌట్ 11; నందిని రనౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 166. వికెట్ల పతనం:** 1–5, 2–5, 3–10, 4–10, 5–69, 6–74, 7–108, 8–130, 9–164, 10–166. **బౌలింగ్:** బెల్ 4–0–26–3, సయాలీ 3–0–27–3, శ్రేయాంక 3–0–44–0, డిక్లెర్క్ 4–0–31–1, ప్రేమ రావత్ 3–0–16–2, రాధా యాదవ్ 3–0–21–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) షఫాలీ (బి) మరిజాన్ 1; స్మృతి (సి) హామిల్టన్ (బి) నందిని 96; జార్జియా వోల్ నాటౌట్ 54; రిచా ఘోష్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.2 ఓవర్లలో 2 వికెట్లకు) 169. వికెట్ల పతనం:** 1–14, 2–156. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4–0–21–1, లూసీ హామిల్టన్ 3.2–0–37–0, నందిని శర్మ 4–0–34–1, శ్రీచరణి 3–0–26–0, స్నేహ్ రాణా 1–0–13–0, షఫాలీ 1–0–14–0, మిన్ను మణి 2–0–20–0.

‘గ్రాండ్’ సమరానికి సిద్ధం

నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ • తొలి ట్రోఫీ వేటలో అల్‌కరాజ్ • 25వ టైటిల్ కోసం జొకోవిచ్ ప్రయత్నం



అల్‌కరాజ్

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ‘ఆస్ట్రేలియన్ ఓపెన్’కు రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ టెన్నిస్ టోర్నీ కోసం సూపర్ స్టార్లు అల్‌కరాజ్, సినెర్‌లతో పాటు 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన టెన్నిస్ దిగ్గజం జొకోవిచ్ బరిలోకి దిగుతున్నాడు. మహిళల సింగిల్స్‌లో రెండుసార్లు తుది మెట్టుపై టైటిల్ చేజార్చుకున్న స్వియాటెక్ ఫేవరెట్‌గా సమరానికి సై అంటోంది.

జొకోవిచ్

మెల్‌బోర్న్: స్పానిష్ సంచలనం కార్లోస్ అల్‌కరాజ్ ఆస్ట్రేలియా గడ్డపై బోణీ కోసం సిద్ధమవుతుంటే సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తనకు అచ్చొచ్చిన ఓపెన్‌లోనే 25వ గ్రాండ్‌స్లామ్ సాకారం చేసుకోవాలని చూస్తున్నాడు. వీళ్లిద్దరిని దాటేసి వరుసగా మూడో ఏడాది కూడా టైటిల్ గెలిచి హ్యాట్రిక్ సాధించాలని ఇటలీ స్టార్, వరల్డ్ నంబర్‌వన్ యానిక్ సినెర్ పట్టుదలతో ఉన్నాడు. ఈ నేపథ్యంలో నేడు మొదలయ్యే ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో ఎలాంటి ఫలితాలు వస్తాయనేది ఆసక్తికరం. ‘హ్యాట్రిక్’ వేటలో సినెర్... తొలి రౌండ్లో గ్యాస్టన్ (ఫ్రాన్స్)ను ఎదుర్కొంటాడు. 22 ఏళ్ల స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ ఇక్కడ తప్ప మిగతా మూడు గ్రాండ్‌స్లామ్‌లు ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్‌లను రెండేసి సార్లు చేజిక్కించుకున్నాడు. ఆరు గ్రాండ్‌స్లామ్‌లను సాధించినప్పటికీ ఈ స్పెయిన్ టాప్‌సీడ్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ ఇంకా వెలితిగానే ఉంది. గత రెండేళ్లుగా (2024, 2025) క్వార్టర్ ఫైనల్ అంచెను దాటని అతను ఈసారైనా ట్రోఫీని అందుకోవాలని ఆశిస్తున్నాడు. కెరీర్ చరమాంకంలో ఉన్న జొకోవిచ్ చిరస్మరణీయమైన 25వ టైటిల్ కోసం రాకెట్‌కు పదును పెడుతున్నాడు. ఇక్కడ పది టైటిల్స్ సాధించిన జొకో 11వ టైటిల్ సాధిస్తే తన కెరీర్‌కు గ్రాండ్‌గా వీడ్కోలు పలికే అవకాశముంది. మూడేళ్ల క్రితం 2023లో చివరిసారిగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. అదే ఏడాది ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్‌లను గెలిచిన ఈ సెర్బియన్ ఆల్‌టైమ్ గ్రేట్... రెండేళ్లుగా ‘25వ గ్రాండ్‌స్లామ్’ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. ఈ హేమాహేమీలతో పాటు రెండు సార్లు (2020, 2024) రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న జర్మనీ ప్లేయర్, మూడో సీడ్ జ్వెరెవ్, ఐదో సీడ్ లోరెంజో మ్యూసెటి (ఇటలీ), రష్యన్ స్టార్లు రుబ్లెవ్, మెద్వెదెవ్, 2014 చాంపియన్, స్విట్జర్లాండ్ వెటరన్ స్టార్ వావ్రింకా సైతం ఆసీస్ బరిలోకి దిగుతున్నారు. వావ్రింకాకు వీనస్ విలియమ్స్‌కు ఇచ్చినట్లే నిర్వాహకులు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇచ్చారు.

స్వియాటెక్ ఈసారైనా!

పోలండ్ స్టార్ ఇగా స్వియాటెక్‌ను ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆఖరి దాకా ఊరించి చివరకు నిరాశపరుస్తోంది. 2022తో పాటు గతేడాది కూడా రన్నరప్‌తోనే సరిపెట్టుకున్న స్వియాటెక్ ఈ సారి ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో ఉంది. అమెరికన్ టెన్నిస్ స్టార్ మాడిసన్ కీస్ డిఫెండింగ్ చాంపియన్ హోదాతో టైటిల్ వేటకు సిద్ధమవగా, జెస్సికా పెగూలా (అమెరికా), ఎలీనా స్వితోలినా (ఉక్రెయిన్), 2021 రన్నరప్ కరొలినా మ్యుచొవా (చెక్ రిపబ్లిక్), 2024 రన్నరప్ కోకో గాఫ్ (అమెరికా), రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ (2023, 2024) సాధించిన బెలారస్ స్టార్, టాప్ సీడ్ సబలెంక టోర్నీ ఫేవరేట్లుగా ఉన్నారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో సరదాగా ‘డబుల్స్’ మ్యాచ్ ఆడుతున్న దిగ్గజాలు ఫెడరర్, అగస్సీ

Find two consecutive positive integers..

QUADRATIC EQUATIONS

- $ax^2 + bx + c = 0, a \neq 0$ is called the standard form of a quadratic equation.
- A real number α is called a root of the quadratic equation $ax^2 + bx + c = 0$ if $a\alpha^2 + b\alpha + c = 0$
- The zeroes of the quadratic polynomial $ax^2 + bx + c$ and the roots of the quadratic equation $ax^2 + bx + c = 0$ are the same.
- Any quadratic equation can have at most two roots.
- If we can factoring $ax^2 + bx + c, a \neq 0$ into a product of two linear factors, then the roots of the quadratic equation $ax^2 + bx + c = 0$ can be found by equations each factor to zero.
- A quadratic equation can also be solved by the method of completing the square.
- **Quadratic formula:** The roots of a quadratic equation $ax^2 + bx + c = 0$ ($a \neq 0$) are given by

$$x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a}$$

provided $b^2 - 4ac \geq 0$

- $b^2 - 4ac$ is called discriminant of quadratic equation $ax^2 + bx + c = 0$
- A quadratic equation $ax^2 + bx + c = 0$, $a \neq 0$ has
  i) two distinct real roots, if $b^2 - 4ac > 0$
  ii) two equal roots, if $b^2 - 4ac = 0$, and
  iii) no real roots, if $b^2 - 4ac < 0$

1 MARK QUESTIONS

1. **Create a quadratic equation with equal roots**

Sol: $(x - 2)(x - 2) = 0, x^2 - 4x + 4 = 0$

2. **The product of two consecutive positive integers 72. Create a quadratic equation.**

Sol: Let the two consecutive integers are
$x, x + 1$
$x(x + 1) = 72,\ x^2 + x = 72, x^2 + x - 72 = 0$

2 MARKS QUESTIONS

1. **Detect the nature of the roots of $3x^2 - 4\sqrt{3}x + 4 = 0$ using discriminant**

Sol: compare $3x^2 - 4\sqrt{3}x + 4 = 0$ with
$ax^2 + bx + c = 0$,
then $a = 3, b = -4\sqrt{3}, c = 4$
Discriminant $D = b^2 - 4ac$
$= (-4\sqrt{3})^2 - 4(3)(4)$
$= 48 - 48 = 0$
since $b^2 - 4ac = 0$, Given equation has equal real roots

2. **Check Whether the equation $(2x - 1)(x - 3) = (x + 5)(x - 1)$ is a quadratic equation ?**

Sol: $(2x - 1)(x - 3) = (x + 5)(x - 1)$
$2x^2 - 6x - x + 3 = x^2 + 5x - x - 5$
$2x^2 - 7x + 3 = x^2 + 4x - 5$
$x^2 - 11x + 8 = 0$
It is in the form of
$ax^2 + bx + c = 0$
$\therefore$ The given equation is a quadratic equation.

3. **Solve the quadratic equation $\sqrt{3}x^2 + 10x + 7\sqrt{3} = 0$**

Sol: $\sqrt{3}x^2 + 10x + 7\sqrt{3} = 0$
$\Rightarrow \sqrt{3}x^2 + 3x + 7x + 7\sqrt{3} = 0$
$\Rightarrow \sqrt{3}x(x + \sqrt{3}) + 7(x + \sqrt{3}) = 0$
$(x + \sqrt{3})(\sqrt{3}x + 7) = 0$
$x + \sqrt{3} = 0, \sqrt{3}x + 7 = 0$
$\Rightarrow x = -\sqrt{3}$,
$x = -\frac{7}{\sqrt{3}}$
$\therefore$ The roots of the given equation is $x = -\sqrt{3},\ x = -\frac{7}{\sqrt{3}}$

4. **Represent the following situation in the form of quadratic equation 'The product of Ramu's age (in years) five years ago with his age nine years later is 15'**

Sol. Let the age of Ramu $= x$ years
5 years ago Ramu age $= x - 5$
9 years later Ramu age $= x + 9$
Given $(x - 5)(x + 9) = 15$
$x^2 + 9x - 5x - 45 - 15 = 0$,
$x^2 + 4x - 50 = 0$

5. **Determine the nature of the roots of the quadratic equation $2x^2 + 5x + 5 = 0$**

Sol. Comparing given quadratic equation
$2x^2 + 5x + 5 = 0$ with $ax^2 + bx + c = 0$
$a = 2, b = 5, c = 5$
Discriminant
$D = b^2 - 4ac = 5^2 - 4(2)(5)$
$= 25 - 40 = -15 < 0$
Since $b^2 - 4ac < 0$, given quadratic equation has no roots.

6. **Find the roots of the equation** $x + \frac{1}{x} = 3, x \neq 0$

Sol: $x + \frac{1}{x} = 3$
Multiplying both sides by x, we get
$x^2 + 1 = 3x$
$x^2 - 3x + 1 = 0$
Comparing with
$ax^2 + bx + c = 0$, $a = 1, b = -3, c = 1$
$\therefore x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a} = \frac{-(-3) \pm \sqrt{(-3)^2 - 4(1)(1)}}{2(1)}$
$= \frac{3 \pm \sqrt{9 - 4}}{2} = \frac{3 \pm \sqrt{5}}{2}$
So, the roots are $\frac{3 + \sqrt{5}}{2}, \frac{3 - \sqrt{5}}{2}$

7. **Find the value of k for quadratic equation $2x^2 + kx + 3 = 0$. So that the equation has equal roots.**

Sol: Comparing given quadratic equation
$2x^2 + kx + 3 = 0$ with
$ax^2 + bx + c = 0$
$a = 2, b = k, c = 3$
If quadratic equation has equal roots then
$b^2 - 4ac = 0$
$k^2 - 4(2)(3) = 0$
$k^2 = 24$
$k = \pm\sqrt{24} = \pm\sqrt{4 \times 6} = \pm 6\sqrt{2}$

8. **Find the discriminant of the equation** $3x^2 - 2x + \frac{1}{3} = 0$ **and hence find the nature of its roots. Find them if they are real.**

Sol: Given quadratic equation $3x^2 - 2x + \frac{1}{3} = 0$
comparing with $ax^2 + bx + c = 0$
$a = 3, b = -2, c = \frac{1}{3}$
Discriminant $= b^2 - 4ac = (-2)^2 - 4(3)\left(\frac{1}{3}\right)$
$= 4 - 4 = 0$
Hence, the given quadratic equation has two equal real roots.
The real roots are
$x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a} = \frac{-(-2) \pm \sqrt{0}}{2(3)} = \frac{2}{6}, \frac{2}{6}$
$= \frac{1}{3}, \frac{1}{3}$

4 MARKS QUESTIONS

1. **Find the value of K for the quadratic equation $kx(x-2) + 6 = 0$, so that the quadratic equation has equal roots.**

Sol: Given quadratic equation
$kx(x - 2) + 6 = 0$
$kx^2 - 2kx + 6 = 0$
compare with $ax^2 + bx + c = 0$, we get
$a = k, b = -2k, c = 6$
If a quadratic equation has equal roots then
$b^2 - 4ac = 0$
$(-2k)^2 - 4(k)(b) = 0, 4k^2 - 24k = 0$
$4k(k - 6) = 0$
$k = 0, k - 6 = 0$ $\therefore k = 6$
($\therefore k \neq 0$, If $k = 0$, Given quadratic equation not exist)

2. **The base of a triangle is 4 cm longer than its altitude. If the area of the triangle is 48 sq cm then find its base, height.**

Sol: Let the altitude of the triangle
$h = x$ cm.
Then its base 'b' $= x + 4$
Area $= \frac{1}{2} \times \text{base} \times \text{height} = \frac{1}{2}(x + 4)(x) = 48$
$\Rightarrow x^2 + 4x - 96 = 0$
$\Rightarrow x^2 + 12x - 8x - 96 = 0$
$(x - 8)(x + 12) = 0$
$x = 8, x = -12$
But x can't be negative
$\therefore$ Altitude = 8cm,
base $= x + 4 = 8 + 4 = 12$cm

3. **Find the roots of the quadratic equation $2x^2 - 2\sqrt{2}x + 1 = 0$, using the quadric formula, if they exist.**

Sol: Comparing the given quadratic equation $2x^2 - 2\sqrt{2}x + 1 = 0$ with
$ax^2 + bx + c = 0$
$a = 2, b = -2\sqrt{2}, c = 1$
$b^2 - 4ac = (-2\sqrt{2})^2 - 4(2)(1)$
$= 8 - 8 = 0$, roots exist.
The roots of the given quadratic equation
$x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a} = \frac{-(-2\sqrt{2}) \pm \sqrt{0}}{2(2)} = \frac{2\sqrt{2} \pm 0}{4}$
$x = \frac{1}{\sqrt{2}}, \frac{1}{\sqrt{2}}$ so the roots are $\frac{1}{\sqrt{2}}, \frac{1}{\sqrt{2}}$

4. **Rohan's mother is 26 year older than him. The product of their ages after 3 year will be 360 years. Represent the situation in the form of**

Continued on next page..

quadratic equation.

Sol: Rohan's present age = x year

Rohan's mother present age = $x + 26$

Rohan's and his mother present ages after 3 years respectively = $x + 3, x + 26 + 3$

$= x + 3, x + 29$

Given that

$(x + 3)(x + 29) = 360$

$x^2 + 29x + 3x + 87 - 360 = 0$

$x^2 + 32x - 273 = 0$ (x = Rohan's Age)

5. Find two numbers whose sum is 27 and product is 182.

Sol: Let the first number will be x

second number $27 - x$ ($\because 27 - x + x = 27$)

Product $= x(27 - x) = 182$

$27x - x^2 - 182 = 0$

$x^2 - 27x + 182 = 0$

$x^2 - 13x - 14x + 182 = 0$

$x(x - 13) - 14(x - 13) = 0$

$(x - 13)(x - 14) = 0$

$x - 13 = 0, x - 14 = 0$

$x = 13, x = 14$

If $x = 13$, then $27 - x = 27 - 13 = 14$

If $x = 14$, then $27 - x = 27 - 14 = 13$

$\therefore$ Required two numbers = 13, 14 or 14, 13

6. Find two consecutive positive integers, sum of whole squares is 365.

Sol: Let the two consecutive positive integers will be x, $x + 1$

From the problem

$x^2 + (x + 1)^2 = 365$

$x^2 + x^2 + 2x + 1 - 365 = 0$

$2x^2 + 2x - 364 = 0$

$2(x^2 + x - 182) = 0$

$x^2 + x - 182 = 0$

This is a quadratic equation comparing with $ax^2 + bx + c = 0$, a = 1, b = 1, c = – 182

$$x = \frac{-b \pm \sqrt{b^2 - 4ac}}{2a} = \frac{-1 \pm \sqrt{1^2 - 4(1)(-182)}}{2(1)}$$

$$= \frac{-1 \pm \sqrt{1 + 728}}{2} = \frac{-1 \pm \sqrt{729}}{2} = \frac{-1 \pm 27}{2}$$

$$= \frac{-1 + 27}{2}, \frac{-1 - 27}{2} = \frac{26}{2}, \frac{-28}{2} = 13, -14$$

$x \neq -14$ ($\because x$ is positive)

If x = 13, two consecutive positive integers are 13, 14

7. The altitude of a right triangle is 7 cm less than its base. If the hypotenuse is 13 cm. Find the other two sides

Sol: Let the base will be x cm

altitude = $x - 7$

hypotenuse = 13 cm

In a right angle triangle, by Pythagoras Theorem

$(\text{hypotenuse})^2 = \text{base}^2 + \text{altitude}^2$



$13^2 = x^2 + (x - 7)^2$

$x^2 + x^2 - 14x + 49 = 169$

$2x^2 - 14x + 49 - 169 = 0$

$2x^2 - 14x - 120 = 0$

$2(x^2 - 7x - 60) = 0$

$x^2 - 7x - 60 = 0$

$x^2 - 12x + 5x - 60 = 0$

$x(x - 12) + 5(x - 12) = 0$

$(x - 12)(x + 5) = 0$

$x - 12 = 0, x + 5 = 0$

$x = 12, x = -5$

$x \neq -5$ ($\because$ base length is always positive)

$\therefore x = 12$

base = x = 12 cm

Altitude = $x - 7 = 12 - 7 = 5$cm

8. Is it possible to design a rectangular mango grove whose length is twice its breadth, and the area is 800 m²? If so, find its length and breadth.

Sol: Let the breadth (b) = x m

Length is twice its breadth

Length $l = 2x$ m

Area of rectangular mango grove

$= lb = x(2x) = 800$

$2x^2 = 800$

$x^2 = \frac{800}{2} = 400$ $x = \sqrt{400} = \pm 20$

$x \neq -20$ (... breadth length not negative)

$\therefore$ breadth x = 20 m

length $2x = 2 \times 20 = 40$ m

9. The sum of the ages of two friends is 20 years. Four years ago, the product of their ages in years was 48. Is the above situation possible? If so, determine their ages.

Sol: Let the present ages of two friends be x years and $20 - x$ years respectively

Four years ago their ages are

$x - 4, 20 - x - 4$



$x - 4, 16 - x$

From the problem

$(x - 4)(16 - x) = 48$

$16x - x^2 - 64 + 4x = 48$

$-x^2 + 20x - 64 - 48 = 0$

$x^2 - 20x + 110 = 0$

Comparing with $ax^2 + bx + c = 0$

a = 1, b = – 20, c = 110

Discriminent = $b^2 - 4ac = (-20)^2 - 4(1)(110)$

$= 400 - 440$

$= -40 < 0$

Since $b^2 - 4ac < 0$, the above equation has no roots

$\therefore$ Given situation is not possible

PAIR OF LINEAR EQUATIONS IN TWO VARIABLES

1. Check whether the system of equations $2x - 3y = 5$ and $4x - 6y = 15$ are consistent. Also verify by graphical representation.

Sol: $4x - 6y - 15 = 0$

$2x - 3y - 5 = 0$

$$\frac{a_1}{a_2} = \frac{4}{2} = 2, \frac{b_1}{b_2} = \frac{-6}{-3} = 2, \frac{c_1}{c_2} = \frac{-15}{-5} = 3$$

Since $\frac{a_1}{a_2} = \frac{b_1}{b_2} \neq \frac{c_1}{c_2}$, therefore they are parallel lines. So the equations are inconsistent and have no solution.

$4x - 6y - 15 = 0$

$4x - 15 = 6y$

$y = \frac{4x - 15}{6}$

If $x = 0$, $y = \frac{4(0) - 15}{6} = \frac{-15}{6} = \frac{-5}{2} = -2.5$,

$(x, y) = (0, -2.5)$

If $x = 3$, $y = \frac{4(3) - 15}{6} = \frac{12 - 15}{6} = \frac{-3}{6} = -0.5$,

$(x, y) = (3, -0.5)$

Plotting the points (0, – 2.5), (3, – 0.5) and join them. we get graph of $4x - 6y = 15$

$2x - 3y - 5 = 0$

$2x - 5 = 3y$

$y = \frac{2x - 5}{3}$

If $x = 1$, $y = \frac{2(1) - 5}{3} = \frac{-3}{3} = -1$,

$(x, y) = (1, -1)$

If $x = 4$, $y = \frac{2(4) - 5}{3} = \frac{3}{3} = 1$,

$(x, y) = (4, 1)$

Plotting the points (1, –1), (4, 1) and join them. we get graph of $2x - 3y - 5 = 0$



From the graph we know that the two lines are parallel

$\therefore$ equations $4x - 6y - 15 = 0$, $2x - 3y - 5 = 0$ have no solution

Y. Vanamraj
Subject Expert
Kurnool

Daily Quiz 17

1. Which of the following is the standard form of a quadratic equation?

A) ax + b = 0

B) ax² + bx + c = 0, (where a ≠ 0)

C) ax³ + bx² + cx + d = 0

D) ax² + bx + c = 0, (where a = 0)

2. If the discriminant (D = b² - 4ac) is greater than zero, the roots are:

A) Real and equal

B) Real and distinct

C) No real roots

D) Roots are always zero

3. What are the roots of the equation x² - 5x + 6 = 0?

A) 2 and 3 B) -2 and -3

C) 1 and 6 D) 5 and 1

4. If α and β are the roots of ax² + bx + c = 0, then the sum of roots (α + β) is:

A) c/a B) -b/a C) b/a D) -c/a

5. The discriminant (D) of the equation 3x² - 2x + (1/3) = 0 is:

A) 0 B) 1/3 C) 4 D) -4

• జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్

వర్రీతో గేమ్ గెలుస్తామా?

'హంగేరీలో ఒక టోర్నమెంట్‌కు హాజరు కావాల్సి ఉంటే వాతావరణంలో మార్పుల రీత్యా ఫ్లైయిట్స్ కేన్సిల్ అయ్యాయి. నేను బస్సులో చాలా గంటల పాటు ప్రయాణించాల్సి వచ్చింది. ప్రాక్టీసుకు టైమ్ లేదు. అలా అని బస్సు జర్నీ అంతా నేను వర్రీ అవుతుంటే గేమ్ గెలుస్తానా? అందుకని గేమ్ సంగతి మర్చిపోయి జర్నీ ఎంజాయ్ చేశాను. ఆందోళన వల్ల ఫలితాలు రావు. వర్రీ పడొద్దు. ఒకటి చెప్తాను. మీరు ఇవ్వదగ్గ బెస్ట్ కోసం ఎప్పుడూ ప్రయత్నించాలి. మీ స్థాయి 90 మార్కులు అయితే కనీసం 91 మార్కుల కోసం ప్రయత్నించాలి. అది చేయండి. చాలు' అన్నారాయన.

మూడు రకాల తప్పులు

'అందరం మూడు రకాల తప్పులు చేస్తాం. మొదటి రకం తప్పులు... ఇవి చేస్తే ఇక ఫినిష్ అయిపోతాం. రెండో రకం తప్పులు. వీటిని చేస్తే దిద్దుబాటు చేసుకోవచ్చు. మూడో రకం తప్పులు... ఇవి ఎవరైనా చేసేవి... పెద్ద లెక్కలోకి రావు. మనం మొదటి రకం తప్పులు... అంటే మన చదువును, జీవితాన్ని, కెరీర్‌ని ఫినిష్ చేసే తప్పులు ఎప్పుడూ చేయకూడదు' అన్నారాయన.

గ్రాండ్‌మాస్టర్ గైడెన్స్

'చదువు మాత్రమే చదివితే చదువు రాదు. మీకు మంచి హాబీలు ఉండాలి' అన్నారు గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్. 'మీ ఓటమిని అంగీకరించండి. దానిని నోట్‌బుక్‌లో రాసుకోండి. తర్వాత ఏం చేయాలో మీకే తెలుస్తుంది' అని పిల్లలకు చెప్పారు. జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌లో తన తాజా పుస్తకం 'లైటెనింగ్ కిడ్' గురించి మాట్లాడుతూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎన్నో విలువైన సూచనలు చేశారు.

'రష్యన్ గ్రాండ్‌మాస్టర్ కార్పొవ్ ఒకసారి నాతో పిచ్చాపాటి మాట్లాడుతున్నారు. మా ప్రస్తావన ఒక గ్రాండ్‌మాస్టర్ గురించి వచ్చింది. అతను తరచూ ఓటమి పాలు అవుతున్నాడు. అప్పుడు కార్పొవ్ నాతో ఇలా అన్నారు– అతను ఎందుకు ఓడిపోతున్నాడో తెలుసా? కేవలం చెస్ తప్ప మరో ధ్యాసే లేనట్టుగా ఉన్నాడు అందుకని – అన్నారు. మనందరం బాగా చదువుకోవాల్సిందే. అయితే కేవలం 24 గంటలు చదువు మీదే ధ్యాస పెడితే చదువు రాదు. మీకు మంచి హాబీలు ఉండాలి. హాబీకి నిర్వచనం ఏమిటి? ఏ ఆదాయమూ చేకూరక పోయినా మీరు చాలా ఇష్టంగా చేసే పనిని హాబీ అంటారు. మ్యూజిక్ వినడం హాబీ. దానికి ఎవరైనా డబ్బు ఇస్తారా? కాని మీరు ఇష్టంగా మ్యూజిక్ వింటే రిలాక్స్ అవుతారు. తర్వాత చేయాల్సిన పని మీద దృష్టి లగ్నం చేస్తారు. ప్రతి విద్యార్థికి చదువుతోపాటు ఇష్టమైన హాబీ ఉండాలి' అన్నారు ప్రపంచ చెస్ విజేత విశ్వనాథన్ ఆనంద్.

జైపూర్‌లో భారీగా మొదలైన జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ రెండో రోజున తన పుస్తకం 'లైటెనింగ్ కిడ్' వెలువడిన సందర్భంగా క్రిక్కిరిసిన విద్యార్థుల మధ్య ఆయన మాట్లాడారు.

ఓటమిని ఎలా ఎదుర్కొనాలి?

'ఓటమి ఎవరికీ నచ్చదు. గెలుపు మీద మన అంచనా కంటే వేరొకరు మన మీద అంచనా పెట్టుకుంటే, అప్పుడు ఓటమి వస్తే ఇంకా ఇబ్బందిగా ఉంటుంది. ఉదాహరణకు మనకు వెయ్యో ర్యాంకు వస్తుందని తెలుస్తుంటే ఎవరో వచ్చి 'నీకు ఫస్టు ర్యాంకు వస్తుందిలే. ఇరగదీస్తావు' అంటారు. మనకు రెండు వేల ర్యాంకు వస్తే మన అంచనా తప్పినందుకు బాధ కంటే వాళ్ల అంచనా తప్పినందుకు ఇంకా ఎక్కువ కోపం వస్తుంది. ఇలాంటివి మామూలు. మీరు ఓటమి నుంచి పారిపోవద్దు. దానిని గుర్తించండి. ఎక్కడెక్కడ తప్పులు చేశారో ప్రశాంతంగా ఒక నోట్‌బుక్ మీద రాసుకోండి. మనసు ఎలాంటిదంటే తర్వాత ఎప్పుడో ఓటమిని ఎనలైజ్ చేసుకోవాలనుకున్నప్పుడు మీకు నచ్చిన వెర్షన్‌ను అంటే మీదేం తప్పులేదన్నట్టు చెబుతుంది. నోట్‌బుక్ తెరిచి చూస్తే అసలు వెర్షన్ ఉంటుంది. నేను నా తప్పులను నోట్‌బుక్‌లో రాసుకుని వాటిని మళ్లీ చేయకుండా ఉంటూ విజయాలు సాధించడానికి ప్రయత్నించాను' అన్నారాయన.

మా అమ్మా నాన్నల వల్లే

'మా అమ్మ నాకు చెస్ నేర్పించింది. నీ శక్తిసామర్థ్యాలను... నీ బలహీనతలను నీ శత్రువుకు తెలియనివ్వకు. నీ కోసం కొన్ని దాచుకో అనే విలువైన పాఠాన్ని ఆమె చెప్పింది. దానిని నేటికీ పాటిస్తున్నాను. ఆటలు కూడు పెట్టవు అనే రోజుల్లో మా అమ్మా నాన్నలు నేను చెస్ ఆడటాన్ని అంగీకరించారు. రేపు పరీక్ష అనగా ఇవాళ చెస్ టోర్నమెంట్‌కు పంపారు. మనం ఎంచుకున్న దారిని తల్లిదండ్రులు అంగీకరిస్తే పిల్లలకు ఇక టెన్షన్ ఉండదు. తల్లిదండ్రులు టెన్షన్‌గా ఉంటే మనం సక్సెస్ కాలేము.

మా అమ్మా నాన్నలు ఈ విషయంలో నన్ను ఎంతో సౌకర్యంగా ఉంచారు. తల్లిదండ్రులు పిల్లలకు పూర్తిగా దూరంగా ఉండకూడదు. అలాగే వారి జీవితాలను పూర్తిగా ఆక్రమించకూడదు. ఒక మర్యాద ఇస్తూ పిల్లల అభిరుచులను పరిశీలించి ప్రోత్సహించాలి' అన్నారు విశ్వనాథన్ ఆనంద్.

– జైపూర్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

• బ్యూటిప్స్

ముఖ వర్చస్సు కోసం...

• రైస్ వాటర్ అంటే బియ్యం కడిగిన నీరు లేదా బియ్యం నానబెట్టిన నీటిని ముఖానికి టోనర్‌లా వాడటం వల్ల చర్మం కొరియన్ 'గ్లాస్ స్కిన్' లాగా మెరుస్తుంది. • పెరుగులో కొద్దిగా పసుపు కలిపి ఫేస్ ప్యాక్‌లా వేసుకుంటే చర్మానికి మంచి మృదుత్వం, కాంతి లభిస్తాయి. • **ఐస్ క్యూబ్ మసాజ్:** ఉదయాన్నే ఐస్ క్యూబ్స్‌తో ముఖంపై మసాజ్ చేయడం వల్ల చర్మం బిగుతుగా మారి, అలసట తగ్గి తాజాగా కనిపిస్తుంది.

సిల్కీ హెయిర్ కోసం...

• **చియా సీడ్స్ జెల్:** ఒకటి రెండు చియా సీడ్స్‌ను అరగ్లాసు నీటిలో మరిగించి తీసిన జెల్‌ను తలకు రాసుకోవడం వల్ల జుట్టు ఒత్తుగా, బలంగా పెరుగుతుంది. • **మెంతుల ప్యాక్:** రాత్రంతా నానబెట్టిన మెంతులను పేస్ట్‌లా చేసి, అందులో కొబ్బరి పాలు కలిపి జుట్టుకు పట్టిస్తే అది సహజ కండిషనర్‌లా పనిచేసి జుట్టును సిల్కీగా మారుస్తుంది. • **కరివేపాకు నూనె:** కొబ్బరి నూనెలో కరివేపాకు లేదా గోరింటాకు వేసి మరిగించి వాడితే జుట్టు రాలడం తగ్గి వేగంగా పెరుగుతుంది.

పింక్ పెదవుల కోసం...

• బీట్‌రూట్ ముక్కతో పెదవులపై రుద్దడం వల్ల నలుపు పోయి పెదవులు సహజమైన గులాబీ రంగులోకి వస్తాయి
• పెదవులపై పేరుకున్న మృత కణాలను తొలగించడానికి తేనె, చక్కెర కలిపి మెల్లగా స్క్రబ్ చేయాలి.

కళ్ల కింద నల్లటి వలయాల నివారణ

• పడుకునే ముందు కళ్ల కింద అలోవెరా జెల్ లేదా కొబ్బరి నూనెతో సున్నితంగా మసాజ్ చేయడం వల్ల డార్క్ సర్కిల్స్ తగ్గుతాయి. • బంగాళదుంప రసాన్ని కళ్ల కింద రాసి 15 నిమిషాల తర్వాత కడిగేయడం వల్ల నలుపు క్రమంగా తగ్గుతుంది.

మనవడి వైద్యం కోసం బామ్మ గేమ్స్

పండు వయసులో వున్న ఒక బామ్మ మినీ క్రాఫ్ట్ గేమ్స్‌ని ఆడుతూ సోషల్‌మీడియా వేదికగా వైరల్‌గా మారింది. ఎందుకంటారా..? తన మనవడిపై ఉన్న అమితమైన ప్రేమతో. క్యాన్సర్‌తో బాధపడుతున్న తన మనవడి వైద్యఖర్చుల కోసం డిజిటల్ గేమ్స్ ఆడుతూ .. మనుషుల మధ్య మరుగున పడిపోతున్న బంధాలని మరోసారి గుర్తుచేస్తోంది.

సూ జాక్వాట్ అనే బామ్మ తన 81 ఏళ్ల వయసులో మినీ క్రాఫ్ట్ గేమ్స్ ఆడుతూ అందరితో ఔరా అనిపిస్తోంది. ఈ వయసులో తను ఆన్ లైన్ వీడియో గేమ్స్ ఆడతానని ఆ బామ్మ ఎప్పుడూ ఊహించలేదు. తన మనవళ్లు తనను ఆడి చూడమని అడిగినపుడు ఒక చిన్న సరదా కోసం ఆమె మినీ క్రాఫ్ట్ ప్రపంచంలోకి అడుగు పెట్టారు. అలా వేసిన అడుగే ఇపుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక గొప్ప ప్రయాణంగా మారింది.

17 ఏళ్ల వయసున్న సూ జాక్వట్ మనవడు జాక్ 2024లో క్యాన్సర్ బారిన పడ్డాడు. అప్పటి నుండి వైద్యఖర్చులు కష్టమయ్యాయి. సరిగ్గా ఆ క్లిష్ట సమయంలోనే బామ్మ ఆలోచనల నుండి గ్రామా క్రాకర్స్ అనే యూ ట్యూబ్ ఛానల్ పుట్టుకొచ్చింది. ఈ ఛానల్ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు.. జాక్ చికిత్స కోసం నిధులు సేకరించడంతో పాటు అతనికి మానసిక ధైర్యాన్ని ఇవ్వడానికి కూడా. ఈ ఛానల్ ద్వారా సూ జాక్వట్ సుమారుగా 32 లక్షల రూపాయలు సంపాదించారు. అంతేకాదు నేడు ఆమె ఒక గేమింగ్ క్రియేటర్‌గా కూడా గుర్తింపు పొందారు. సూ జాక్వట్‌కు మినీక్రాఫ్ట్ గేమింగ్ గురించి ముందుగా ఎలాంటి అనుభవం, అవగాహన లేదు. కానీ తన మనవడిపై ఉన్న ప్రేమతో ఆ గేమ్స్‌ని నేర్చుకుని, వీడియోలను తన యూ ట్యూబ్ ఛానల్ లో పోస్ట్ చేస్తూ లక్షలాదిమంది హృదయాలను గెలుచుకుంటున్నారు. అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు.

హెల్త్

తింటే తంటా? అయితే... లో ఫోడ్ మ్యాప్ రైట్ డైట్!

ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ అనేది ఒక చిత్రమైన సమస్య. నిజానికి ఇది 'పెద్ద సమస్యగా అనిపించని చాలా పెద్ద సమస్య'. ఈ వాక్యం గందరగోళంగా అనిపించవచ్చు. కానీ అదే నిజం. 'ఐబీఎస్' అని పిలిచే ఈ 'ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్' అనే ఈ ఆరోగ్య సమస్యతో ఎలాంటి ప్రాణాపాయమూ ఉండదు, దేహంలోని మిగతా వ్యవస్థలకే కాదు... తాను బాధించే జీర్ణవ్యవస్థకూ దీనివల్ల ప్రమాదం ఉండదు... అని డాక్టర్లు చెప్పినప్పుడు 'ఇక సమస్యేముంది' అనిపిస్తుంది. కానీ నిజానికి ఇది ఎంత పెద్ద సమస్య అంటే దీని లక్షణాలు చాలా ఇబ్బంది పెడతాయి. ఇరిటబుల్ బవెల్ సింద్రోమ్ ఎలా బాధిస్తుందో, ఎంతగా వేధిస్తుందో తెలుపుతూ, దాన్నుంచి విముక్తికి ఏమేం చేయాలన్న విషయాలపై అవగాహన కోసం ఈ కథనం.

డాక్టర్ అరుణ్ అరోరా పగడపెల్లి
కన్సల్టెంట్
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్
హెపటాలజిస్ట్

ఐబీఎస్ అనేది జీర్ణవ్యవస్థలోని పెద్ద పేగును ప్రభావితం చేసే వ్యాధి. ఇది బాధితుడి జీవనశైలిని అతలాకుతలం చేస్తుంది. అదెలాగో ఒక కేస్‌స్టడీ ద్వారా తెలుసుకుందాం. ఐబీఎస్ అనేది చాలామందిలో చాలా సాధారణంగా కనిపిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా చాలామందిని బాధిస్తున్న ఆరోగ్య సమస్యల్లో ఇదీ ఒకటి.

లక్షణాలు : ఐబీఎస్ లక్షణాలు బాధితులందరిలోనూ ఒకేలా ఉండవు. వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంటాయి. దీని సాధారణ లక్షణాలిలా ఉంటాయి.

• ఒక్కోసారి కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, పొట్ట గ్యాస్‌తో నిండి ఉండటం. • కొన్నిసార్లు తిన్నవెంటనే విరేచనం కావడం, నియంత్రించడానికి వీల్లేకుండా తక్షణం మలవిసర్జనకు వెళ్లాల్సి రావడం. దీనికి భిన్నంగా మరికొందరిలో తీవ్రమైన మలబద్ధకం. • కొందరిలో విరేచనంలో నురగవంటిది (మ్యూకస్) కనిపించడం. • బాధితుడు ఒత్తిడికి గురవుతున్నప్పుడు ఈ లక్షణాలు మరింత తీవ్రతరం కావడం. • వేళతప్పి తినేవారిలోనూ, కొన్ని ఆహారాలు సరిపడనప్పుడు కూడా లక్షణాలు తీవ్రతరమవుతుండటం. నిశితంగా గమనిస్తే తమ సమస్యను ట్రిగర్ చేస్తున్న ఆహారాలను గుర్తించవచ్చు కూడా!

కారణాలు : నిజానికి ఐబీఎస్‌కు కారణమేమిటన్నది నిర్దిష్టంగా ఇప్పటికీ తెలియదు. కాకపోతే చాలా అంశాలు ఈ సమస్యను ప్రేరేపిస్తాయని నిరూపితమైంది. వాటిలో కొన్ని...

• కొన్నిసార్లు జీర్ణాశయ కండరాలూ, పేగుల కదలికలు చాలా వేగంగా జరగవచ్చు. మరికొందరిలో చాలా మందకొడిగా ఉండవచ్చు. జీర్ణాశయ కండరాలూ, పేగుల కదలికలు చాలా వేగంగా జరుగుతుంటే తిన్న వెంటనే తక్షణం మల విసర్జనకు వెళ్లాల్సి రావడం, పేగుల కదలికలు మందకొడిగా మారినప్పుడు మలబద్ధకం కనిపిస్తాయి.

• తీవ్రమైన ఒత్తిడి, ఉద్విగ్నత (యాంగ్జైటీ), భావోద్వేగాలకు లోనుకావడం వంటి అంశాలు ఐబీఎస్‌ను ప్రభావితం చేసి లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. • కొన్ని ఆహారాలు లేదా ఆహారాల్లోని కొన్ని అంశాలు... ఉదాహరణకు కెఫీన్, మసాలాలు, పాల ఉత్పాదనలు (డైరీ ప్రాడక్ట్స్), కృత్రిమంగా తయారుచేసిన తీపినిచ్చే పదార్థాలు (ఆర్టిఫిషియల్ స్వీటెనర్స్) ఐబీఎస్ లక్షణాలను తీవ్రతరం చేస్తాయి. • దీర్ఘకాలికంగా జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఇన్ఫెక్షన్లతో బాధపడే కొందరిలోనూ, అలాగే కొన్ని ఆహారాలు సరిపడనప్పుడు, జీర్ణవ్యవస్థలోని సూక్ష్మ జీవులు (గట్ బయోమ్) మారినప్పుడు... ఇవన్నీ ఐబీఎస్‌ను ప్రేరేపిస్తాయి.

ఐబీఎస్ ఎవరిలో ఎక్కువగా కనిపిస్తుందంటే...

• కౌమారంలో ఉన్న యువతను (యంగ్ అడల్ట్స్), మహిళలను, యాంగ్జైటీ లేదా డిప్రెషన్‌తో బాధపడుతున్నవారిని, జీర్ణవ్యవస్థకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నవారిలో, అనువంశీకంగానూ అలాగే కుటుంబాల్లో జీర్ణసమస్యలతో బాధపడేవారిలో ఐబీఎస్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది.

చికిత్స : • చికిత్స కంటే ఈ సమస్యను అదుపులో ఉంచడానికి (మేనేజ్‌మెంట్) తీసుకునే చర్యలు ఈ వ్యాధి విషయంలో చాలా ప్రధానం. సమస్యను అదుపుచేసుకోవడంలో భాగంగా మనం తినే ఆహారంలో పీచు (ఫైబర్) ఎక్కువగా ఉండేలా చూసుకోవడం, హై–ఫోడ్‌మ్యాప్ ఆహారాలను బాగా తగ్గించుకొని, లో–ఫోడ్‌మ్యాప్ ఆహారం తీసుకుంటూ... కడుపులో గ్యాస్‌పేరుకోకుండా / కడుపుబ్బరం లేకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. • జీర్ణవ్యవస్థకు మేలు చేసే సూక్ష్మజీవులు సమృద్ధిగా ఉండే ఆహారాలతో (ప్రోబయాటిక్స్‌తో) పరిస్థితి చాలావరకు మెరుగుపడుతుంది. (అంటే పెరుగు, మజ్జిగ, పులవడానికి అవకాశమున్న పిండితో చేసే దోశ, ఇడ్లీ వంటివి వాడటం వల్ల.)

ఇక మందుల విషయానికి వస్తే మలబద్ధకంతో బాధపడుతున్నవారికి తేలికపాటి విరేచనకారులు (లాక్సెటివ్స్) ఇవ్వడం, మరీ ఎక్కువ అవసరమున్నవారికి... జీర్ణవ్యవస్థా అలాగే మెదడుకూ మధ్య సమన్వయాన్ని మెరుగుపరచే కొన్ని రకాల మందులను డాక్టర్లు సూచిస్తారు. తద్వారా జీర్ణ వ్యవస్థలోని పేగుల కదలికలు సాఫీగా జరిగేలా చూస్తారు.

నివారణ : ఐబీఎస్ సమస్యకు నిర్దిష్టంగా నివారణ అంటూ లేకపోయినప్పటికీ... ఒత్తిడి (స్ట్రెస్), ఉద్విగ్నత (యాంగ్జైటీ), కుంగుబాటు (డిప్రెషన్) వంటివి దీన్ని ప్రేరేపిస్తాయి కాబట్టి వాటిని అదుపు చేసుకోడానికి ధ్యానం, రిలాక్సేషన్ టెక్నిక్స్ వంటివి బాగా ఉపయోగపడతాయి. ఈ సమస్యలు తీవ్రంగా ఉన్నవారికి కౌన్సెలింగ్, కాగ్నిటివ్ బిహేడియర్ థెరపీ (సీబీటీ) వంటివి మేలు చేస్తాయి.

నిర్వహణ
యాసీన్

లో ఫోడ్‌మ్యాప్ ఆహారంతో ప్రధానంగా ఇరిటెబుల్ బవెల్ సిండ్రోమ్‌తో పాటు ఇంకా మరెన్నో సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. ఉదాహరణకు కడుపు ఉబ్బరంగా ఉండటం, కడుపులో ఇబ్బంది, కడుపు నొప్పి, విసర్జక అలవాట్లలో మార్పురావడం మొదలుకొని కింది నుంచి గ్యాస్‌పోవడం వంటి పలు సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. ఈ నేపథ్యంలో అసలు 'లో–ఫోడ్‌మ్యాప్' ఆహారం అంటే ఏమిటో చూద్దాం...

ఫోడ్‌మ్యాప్ అనేది కొన్ని రకాల ఆహారాల తాలూకు ఇంగ్లిష్ పేర్ల ముందు అక్షరాలతో ఏర్పడ్డ పదం (ఏక్రోనిమ్). ఇందులో...

F అంటే... ఫెర్మెంటబుల్ (పులిసిపోవడం వల్ల గ్యాస్‌కు ఆస్కారమిచ్చే ఆహారాలు)

O అంటే... ఓలిగోశాకరైడ్స్ అంటే ఉల్లి, వెల్లుల్లి, బీన్స్‌లో ఉండే ఒకరకం పీచుపదార్థం)

D అంటే... డైశాకరైడ్స్ (అంటే పాలు, పాల ఉత్పాదనల్లో ఉండే ల్యాక్టోజ్ వంటివి వాటిల్లో ఉంటూ... అవి సరిగా అరగకపోవడంతో కడుపులో ఇబ్బంది కలిగించే ఆహారపదార్థాలు)

M అంటే... మోనో శాకరైడ్స్ (అంటే కొన్ని రకాల పండ్లతో పాటు బాగా ప్రాసెస్ అయిన ఆహారాల్లో ఉండే ఫ్రక్టోజ్ వంటి చక్కెరలు)

A అంటే... అండ్ (వాటితో పాటు లేదా మరియు అని అర్థం)

P అంటే... పాలియాల్స్ (అంటే చాక్లెట్లు (క్యాండీ), బబుల్‌గమ్ వంటి వాటికి కలిపే షుగర్, ఆల్కహాల్స్ వంటి పదార్థాలు... ఇవి కొన్ని రకాల పండ్లు, శాకాహారాల్లో స్వాభావికంగానే ఉంటాయి).

ఈ ముందు అక్షరాలన్నింటితో ఏర్పడ్డ పదమే 'ఫోడ్‌మ్యాప్'. ఈ ఆహారాలకు మూడు రకాల గుణాలుంటాయి. ఆ కారణంగా అవి జీర్ణవ్యవస్థపై ప్రతికూలమైన ప్రభావం చూపుతాయి. ఆ గుణాలేమిటంటే...

1. చిన్నపేగుల్లో అవి అంత బాగా జీర్ణం కావు. (చిన్న పేగుల్లోకి ఇంకిపోవు).

2. పేగుల్లో జీర్ణమయ్యే క్రమంలో చాలా ఎక్కువ నీళ్లను ఉపయోగించుకుంటాయి.

3. చాలా వేగంగా పులిసిపోయే వీటి గుణం కారణంగా అక్కడ ఎక్కువ బ్యాక్టీరియాపెరగడానికి కారణమవుతాయి.

ఆ పదార్థాలకు ఉన్న ఈ గుణాల కారణంగా తక్షణం మలవిసర్జనకు వెళ్లాల్సి రావడం, మలవిసర్జనకు వెళ్లాల్సిన అవసరమేర్పడ్డప్పుడు ఆపుకోలేకపోవడం, తరచూ కింది నుంచి గ్యాస్‌పోతూ ఉండటం, కడుపు ఉబ్బరం, కడుపులో ఇబ్బంది, కడుపు నొప్పి, విసర్జక అలవాట్లలో మార్పురావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా పేగుల్లో ఆహారం పులిసిపోవడం వల్ల కింది నుంచి గ్యాస్ ఎక్కువగా పోతుండటం, బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో పుడుతుండటం వల్ల కడుపుబ్బరం, కడుపునొప్పి వంటి సమస్యలకు కారణమవుతాయి.

ఒకవేళ అప్పటికే ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (ఐబీఎస్), కడుపు ఉబ్బిపోవడం / కడుపుబ్బరం (బ్లోటింగ్), కడుపునొప్పి, డయేరియా సమస్యలు ఉన్నవారు ఫోడ్‌మ్యాప్ ఆహారం తీసుకోవడం వల్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా పరిణమించే అవకాశాలెక్కువ. అందుకే పైన పేర్కొన్న సమస్యలతో పాటు ఇరిటబుల్ బవెల్ సిండ్రెమ్ ఉన్నవారు 'ఫోడ్ మ్యాప్' ఆహారాలకు వీలైనంత దూరంగా ఉండాలి. అంటే వాటికి బదులు... 'లో (తక్కువ) ఫోడ్‌మ్యాప్' ఆహారాలు తీసుకోవడం వల్ల ఆ ఆహారంతో కలిగే ఇబ్బందులను తగ్గించవచ్చు.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే... ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్‌తో పాటు కడుపుబ్బరం, నొప్పి లాంటి సమస్యలకు లో–ఫోడ్‌మ్యాప్ ఆహారాలు పూర్తి / శాశ్వత పరిష్కారం కానప్పటికీ... అలాంటి ఆహారం తీసుకోవడం వల్ల ఆ ఇబ్బందులు చాలావరకు తగ్గుతాయని చెప్పవచ్చు. ఇక మొదట్లో లోఫోడ్‌మ్యాప్ ఆహారాలను తీసుకుంటూ పరిస్థితిని చక్కబరుస్తూ, క్రమంగా హై–ఫోడ్‌మ్యాప్ లేదా నార్మల్ ఆహారాలను పెంచుకుంటూ పోవడం వల్ల ఐబీఎస్‌లక్షణాలనూ, ఇతరత్రా ఇబ్బందులను తగ్గించుకుంటూ వెళ్లడం ద్వారా... జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అవకాశాలెక్కువ.

బి. సంతోష
కన్సల్టెంట్
న్యూట్రిషనిస్ట్

లో-ఫోడ్‌మ్యాప్ ఆహారాల్లో తీసుకోవాల్సినవి...

కాయధాన్యాల్లో : వరి అన్నం అందునా దంపుడు బియ్యంతో వండిన అన్నం, జొన్నలు, ఓట్స్, క్వినోవా, చిరుధాన్యాలు

పప్పుధాన్యాల్లో: మినుములు, పెసరపప్పు, శనగపప్పు

పండ్లలో: అరటి, నేరేడు, బత్తాయి, నారింజ, నిమ్మ, ద్రాక్ష, స్ట్రాబెర్రీ, బొప్పాయి, కర్బూజ, పైనాపిల్, పియర్, కీవీ

నాన్ వెజిటేరియన్ ప్రోటీన్లలో: గుడ్లు, చేపలు, చికెన్.

నట్స్, నూనెగింజల్లో: వేరుశనగలు, బాదాం, పొద్దుతిరుగుడు గింజలు, వాల్‌నట్, గుమ్మడిగింజలు, అవిశెగింజలు

పానియాల (బీవరేజెస్)లో : పాలు లేకుండా టీ, కాఫీలు, గ్రీన్ టీ, పైన పేర్కొన్న పండ్లతో తయారు చేసిన పండ్లరసాలు.

సుగంధద్రవ్యాలూ, మసాలా దినుసుల్లో : అల్లం, ఆవాలు, మిరియాలు.

(ఇవన్నీ సాధారణంగా (జనరలైజ్‌డ్‌గా) చెప్పిన ఆహారాలు. అయితే వ్యక్తులు ఆరోగ్య స్వభావాలను బట్టి వీటిని వాడాల్సిన తీరు వ్యక్తి నుంచి వ్యక్తికి మారుతుంది. అంటే ఒకవేళ ఒక వ్యక్తికి వీటిల్లో ఏదైనా ఆహారం సరిపడకపోతే అతడు సదరు ఆహారం నుంచి దూరంగా ఉండటం మేలు).

తీసుకోకూడని ఆహారాలు...

తృణధాన్యాలూ, కాయధాన్యాల్లో : గోధుమల నుంచి తయరయ్యే ఉత్పాదనలు (ఉదాహరణకు మైదా, బొంబాయి రవ్వ, నూడుల్స్, వర్మిసెల్లీ), బార్లీ.

పప్పు ధాన్యాల్లో : పైన పేర్కొన్నవి గాక ఇతర పప్పులు, బీన్స్ (రాజ్మా, ఛోలే, లోబియా)

శాకాహారాల్లో (వెజిటబుల్స్) : మొక్కజొన్న, ఉల్లి, క్యాబేజీ, కాలీఫ్లవర్, వెల్లుల్లి, బీట్‌రూట్.

పండ్లలో : ఆపిల్, మామిడి, పుచ్చకాయ, చెర్రీస్, అంజీర్, దానిమ్మ

పాల ఉత్పాదనల్లో : పాలు, పెరుగు, యోగర్ట్, పనీర్, జున్ను, కస్టర్డ్, ఐస్‌క్రీమ్

పానీయాల్లో : ఆల్కహాల్, సాఫ్ట్ డ్రింక్స్, కొబ్బరి నీళ్లు

తీపి పదార్థాల్లో : తేనె, కార్న్ సిరప్

వీటితో పాటు అన్ని రకాల బేకరీ ఐటమ్స్, బిస్కెట్లు, చాక్లెట్లు, ప్యాక్ చేసిన ఆహారాలతో పాటు అన్ని రకాల నిల్వ పదార్థాలకు (ప్రిజర్వేటివ్స్ కలిపిన వాటికి) దూరంగా ఉండాలి. అలాగే... తమకు ఏ ఆహారం సరిపడుతోందో, ఏది సరిపడటం లేదో తెలుసుకుంటూ ఆ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ, తమకు సరిపడని ఆహారాల నుంచి దూరంగా ఉండటం అవసరం.

ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు - రవితేజ

''సంక్రాంతికి ఆడియన్స్‌కి ఫుల్ ఎంటర్‌టైన్మెంట్ దక్కింది. అన్ని సినిమాలతో పాటు మా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' కూడా చాలా బాగుంది. మా చిత్రాన్ని హిట్ చేసిన ప్రేక్షక మహాశయులకు కృతజ్ఞతలు. ఈ మూవీకి ఇంకా చాలా మంచి రన్ ఉంటుంది. మా సినిమా ఇంతపెద్ద విజయం సాధించిందంటే.. మెయిన్ క్రెడిట్ డైరెక్టర్ కిశోర్, సంగీత దర్శకుడు భీమ్స్‌కి దక్కుతుంది'' అని రవితేజ చెప్పారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో డింపుల్ హయతి, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన 'సంక్రాంతి బ్లాక్ బస్టర్ మీట్'లో రవితేజ మాట్లాడుతూ– ''సునీల్‌తో నాకు మంచి స్నేహం ఉంది. 'దుబాయ్ శీను' మూవీ తర్వాత మళ్లీ అంతలా ఎంజాయ్ చేశాం. తనతో మళ్లీ మళ్లీ ఇలాంటి సినిమాలు చేయాలని ఉంది. ఈ చిత్రంతో విజయం అందుకున్న నిర్మాత సుధాకర్‌ని అభినందిస్తున్నాను. సహజమైన వినోదం తెర కెక్కించడంలో కిశోర్‌కి మంచి టైమింగ్ ఉంది. బాబు మహేంద్రనగర్, జంధ్యాలగారు... వంటి ఫ్లేవర్ ఉన్న రైటింగ్ తనది. తనతో ఇలాంటి సినిమాలు మళ్లీ చేయాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. కిశోర్ తిరుమల మాట్లాడుతూ– ''మా సినిమాకి ఇంత పెద్ద విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. నాకు ఇంత మంచి చాన్స్ ఇచ్చిన రవితేజ, సుధాకర్‌గార్లకు థ్యాంక్స్'' అని తెలిపారు. ''ఇంత పోటీలోనూ మా మూవీకి పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంకా చూడని వారు ఉంటే తప్పకుండా థియేటర్స్‌కి వెళ్లి మా సినిమా చూడండి'' అన్నారు సుధాకర్ చెరుకూరి. ''ఈ చిత్రంలో నేను చేసిన బాలామణి పాత్రతో అందరూ రిలేట్ అవుతున్నారు'' అని చెప్పారు డింపుల్ హయతి. కెమెరామేన్ ప్రసాద్, నటులు సునీల్, మురళీధర్ గౌడ్, రోహన్, ఆర్ట్ డైరెక్టర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

● సుధాకర్ చెరుకూరి, కిశోర్ తిరుమల, రవితేజ, డింపుల్ హయతి, సునీల్

భూమిక కనువిప్పు కలిగించింది - గుణశేఖర్

● నీలిమ గుణ, పృథ్వీ, భూమిక, సారా అర్జున్, గుణశేఖర్, యుక్త గుణ, విష్ణీష్, రాగిణి గుణ

''చిత్ర పరిశ్రమలో 2026 నవ్వులతో ప్రారంభమైంది. అందుకే ఫిబ్రవరి 6న ఒక స్పెషల్ మూమెంట్ కోసం మా 'యుఫోరియా' సినిమాను తీసుకొస్తున్నాం. కుటుంబమంతా కలిసి చూడాల్సిన చిత్రం ఇది'' అని డైరెక్టర్ గుణశేఖర్ తెలిపారు. భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ్ మీనన్, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి తదితరులు కీలక పాత్రలు పోషించిన చిత్రం 'యుఫోరియా'. గుణశేఖర్ దర్శకత్వంలో రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 6న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో గుణశేఖర్ మాట్లాడుతూ– ''మా అమ్మాయి నీలిమ ఎప్పుడూ ఎమోషన్ అవదు. కానీ, ఈ ట్రైలర్ చూసి ఎమోషనల్ కావడానికి కారణం 'యుఫోరియా' కథ అంతగా ప్రభావితం చేయడమే. మా కుటుంబం మొత్తం ఈ స్టోరీకి కనెక్ట్ అయింది. కేవలం గ్లామర్ పాత్రలే చేస్తామని చెప్పే హీరోయిన్లకు తల్లి పాత్రలో నటించిన భూమిక కనువిప్పు కలిగించింది. గౌతమ్ మీనన్‌గారి పాత్ర సహజంగా ఉంటుంది. మా మూవీకి చక్కని సంగీతం అందించిన కాలభైరవ... తండ్రి (కీరవాణి)ని మించిన తనయుడు అనిపించుకున్నాడు'' అని చెప్పారు. నీలిమ గుణ మాట్లాడుతూ– ''మా మూవీ ట్రైలర్ చూశాక చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఇంత ఇంపాక్ట్ ఉన్న సినిమా తీసినందుకు ఆనందంగా ఉంది'' అని పేర్కొన్నారు. భూమిక మాట్లాడుతూ– ''యుఫోరియా' నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. పిల్లలను ఎలా పెంచాలి అనేది అందరూ తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన సినిమా ఇది'' అని చెప్పారు. ''గుణశేఖర్‌గారితో పని చేయడం గౌరవంగా ఉంది. 'యుఫోరియా' తప్పకుండా అందరూ మెచ్చే సినిమా అవుతుంది'' అని సారా అర్జున్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటులు అడ్డాల పృథ్వీరాజ్, విఘ్నేష్ గవిరెడ్డి మాట్లాడారు.

నెలాఖరులో నిశ్శబ్దంగా...

● అదితీ రావ్

మూకీ (సంభాషణలు లేని) చిత్రాలతో మొదలైన సినిమా ఆ తర్వాత టాకీ వరకూ వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడూ అడపా దడపా మూకీ చిత్రాలు వస్తుంటాయి. కానీ చాలా అరుదుగానే. తాజాగా 'గాంధీ టాక్స్' అనే సైలెంట్ ఫిల్మ్ రూపొందింది. ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఒక్క సంభాషణ కూడా లేకుండా రూపొందిన ఈ టీజర్‌లో నటీనటుల హావభావాలు అనేక ప్రశ్నలను లేవనెత్తేలా ఉన్నాయి. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి, అదితీ రావ్ హైదరీ, సిద్ధార్థ్ జాదవ్ ముఖ్య తారలుగా కిశోర్ పాండురంగ్ బేలేకర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. జీ స్టూడియోస్ సమర్పణలో క్యూరియస్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్, పింక్‌మూన్ మెటా స్టూడియోస్, మూవీ మిల్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై రూపొందిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఒక విభిన్నమైన థియేటర్ అనుభవాన్ని అందించేలా ఉంటుంది'' అని చిత్ర బృందం పేర్కొంది.

స్పెషల్ రికార్డ్

● 'ఆజ్ కీ రాత్'లో తమన్నా

స్పెషల్ సాంగ్స్ క్లిక్ అయితే చాలు... కోట్లలో వ్యూస్ దక్కించుకుంటాయి. అందుకు తాజా ఉదాహరణ 'ఆజ్ కీ రాత్' సాంగ్. హిందీ చిత్రం 'స్త్రీ 2' లోని ఈ స్పెషల్ సాంగ్‌లో తమన్నా నర్తించారు. తమన్నా అంటే... స్పెషల్ సాంగ్స్ క్వీన్ అన్నట్లుగా మారింది. రజనీకాంత్ 'జైలర్'లో తమన్నా చేసిన ప్రత్యేక పాట 'నువ్వు కావాలయ్యా' ఎంత పెద్ద హిట్టయిందో తెలిసిందే. 'ఆజ్ కీ రాత్' సాంగ్ అంత ఎక్కువగా ఎన్నో స్పెషల్ రికార్డ్ సాధించింది. సచిన్–జిగర్ స్వరపరచగా, విజయ్ గంగూలీ కొరియోగ్రఫీ చేసిన ఈ పాటకు యూట్యూబ్‌లో వంద కోట్ల వ్యూస్ దాటాయని చిత్రబృందం పేర్కొంది. ''ఈ పాట తొలి వ్యూ నుంచి వంద కోట్ల వ్యూస్ వరకూ ప్రేమ కురిపించిన అందరికీ థ్యాంక్స్'' అంటూ 'ఆజ్ కీ రాత్' చిత్రీకరణ సమయంలోని బిహైండ్ ది సీన్స్ క్లిప్పింగ్స్‌ని షేర్ చేశారు తమన్నా. ఇక రాజ్‌కుమార్ రావు, శ్రద్ధా కపూర్ జంటగా అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన 'స్త్రీ 2' భారీ వసూళ్లు సాధించింది. 2024 ఆగస్టులో ఈ చిత్రం విడుదలైంది.

1980 నేపథ్యంలో...

● సందీప్, మానసా రాధాకృష్ణన్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా, సిమ్రత్ కౌర్, సత్య టీటస్, ఖయాదేవి, మానసా రాధాకృష్ణన్ హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రామ్ భజరంగ్'. సీహెచ్ సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. స్వాతి సుధీర్, డా. రవి బాల నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను డిఫరెంట్ లుక్‌లో కనిపించబోతున్నాను. ప్రేక్షకులకు మా సినిమా నచ్చేలా ఉంటుంది'' అని తెలిపారు. సందీప్ మాధవ్ మాట్లాడుతూ– ''చక్కని ప్రొడక్షన్ వేల్యూస్‌తో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని సందీప్ మాధవ్ అన్నారు. ''1980 నేపథ్యంలో రాబోతున్న ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉన్నాయి'' అని సీహెచ్ సుధీర్ రాజు చెప్పారు. ''నటీనటులు, సాంకేతిక నిపుణులు మా సినిమా కోసం కష్టపడి పని చేశారు'' అన్నారు స్వాతి సుధీర్. ''మా సినిమాని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు రవి బాల.

త్రిముఖ డేట్ ఫిక్స్

● సుమన్, సన్నీ లియోన్

సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'త్రిముఖ'. సుమన్, ఆకృతి అగర్వాల్, యోగేష్ కల్లే, రవి ప్రకాశ్, 'షేర్' రమేశ్ ఇతర పాత్రలు పోషించారు. రాజేష్ నాయుడు దర్శకత్వంలో అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మించారు. ఈ సినిమాని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'త్రిముఖ'. శక్తిమంతమైన కథనం, ఆకట్టుకునే విజువల్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్నేలా ఈ చిత్రాన్ని రూపొందించారు రాజేష్ నాయుడు'' అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రవి అల్లి, సంగీతం: వినోద్ యాజమాన్య, కెమెరా: కొంగ శ్రీనివాస్.

ఓటీటీ ఇది చూడొచ్చు

సీక్రెట్స్ ఆఫ్ స్మగ్లింగ్

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తస్కరీ–ది స్మగ్లర్స్ వెబ్ అనే సిరీస్ ఒకటి. ఈ వెబ్ సిరీస్ గురించి తెలుసుకుందాం

మనకు తెలిసిన 64 కళలలో చోర కళ అనేది చతురత, నైపుణ్యంతో కూడుకున్నది. ఆ చోర కళలో ఓ విభాగమే ఈ స్మగ్లింగ్. ఇప్పటిదాకా అడపా దడపా వార్తలలో వినపడుతున్న లేక అప్పుడప్పుడు కొన్ని సినిమాలలో చూపించడం ద్వారానే స్మగ్లింగ్ అనేది సామాన్యులకు కాస్త పరిచయం. ఈ స్మగ్లింగ్ నేపథ్యం లో వాస్తవ ఘటనల ఆధారంగా 'తస్కరీ–ది స్మగ్లర్స్ వెబ్' సిరీస్ రూపొందింది. నీరజ్ పాండే ఈ సిరీస్‌కు కథ అందించి, స్వీయదర్శకత్వంలో రూపొందించారు. ఏడు భాగాలతో తెలుగు డబ్బింగ్ వెర్షన్‌తో పాటు నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ సిరీస్ స్మగ్లింగ్ జరిగే విధానాన్ని, కస్టమ్స్ అధికారుల ఆ స్మగ్లింగ్ అరికట్టే పద్ధతులను సామాన్య ప్రేక్షకులకు కూడా అర్థమయ్యే విధంగా దాదాపు కళ్లకు కట్టినట్టుగా చూపించారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో ఈ సిరీస్‌కు ప్రాణం పోశారు. ఈ సిరీస్ కథ మొత్తం ముంబై శివాజీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నేపథ్యంలో నడుస్తుంది. ఈ ఎయిర్‌పోర్ట్‌లో కథానాయకుడు అర్జున్ మీనా కస్టమ్స్ ఆఫీసరుగా పని చేస్తుంటాడు. తాను పని చేస్తున్న ఎయిర్‌పోర్టులో ఇతర దేశాల నుండి కొన్ని కోట్ల రూపాయల విలువ గల స్మగ్లింగ్ జరుగుతోందని, అది కూడా అరబ్ దేశాలలో ఉన్న బడా చౌదరి వల్ల జరుగుతోందని తెలుసుకుంటాడు అర్జున్. ఇదే సమయంలో కొత్తగా తమకు వచ్చిన బాస్ ప్రకాశ్‌తో కలిసి ఓ ప్లాన్ వేస్తాడు. కానీ బడా చౌదరి ఎత్తులు పై ఎత్తులు వేసి కస్టమ్స్ వాళ్లని ముప్పతిప్పలు పెడుతుంటాడు. మరి... బడా చౌదరి స్మగ్లింగ్ నుండి అర్జున్ ఎలా బయటపెడతాడు? లేదా అర్జున్ మాత్రం 'తస్కరీ–ది స్మగ్లర్స్ వెబ్' సిరీస్ చూసి తెలుసుకోవాల్సిందే. ఈ సిరీస్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. కాకపోతే క్లైమాక్స్ కాస్త పేలవంగా అనిపించినా సిరీస్ మొత్తం చూసినవారికి స్మగ్లింగ్ సీక్రెట్స్ బాగానే తెలుస్తాయి. ఈ వీకెండ్‌కి 'తస్కరీ–ది స్మగ్లర్స్ వెబ్' సిరీస్ మంచి కాలక్షేపం.

– హరికృష్ణ ఇంటూరు

భారీగా పెరిగిన

అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్!

వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో భారీగా వారసుల్లేని సొమ్ము

- 2005లో కోటి ఖాతాల్లో రూ.918 కోట్ల నగదు
- 2024 నాటికి 20 కోట్ల ఖాతాల్లో రూ.62,314 కోట్లు
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్ ఖాతాలు, నగదు వివరాలు..

సంవత్సరం	ఖాతాల సంఖ్య (రూ.కోట్లలో)	క్లెయిమ్ చేయని నగదు (రూ.కోట్లలో)
2005	1.0	918
2015	2.1	6835
2024	20.0	62,314

క్లెయిమ్ చేయని డిపాజిట్ ఖాతాల వాటా

సేవింగ్స్	75 శాతం
ఇతర డిపాజిట్లు	16 శాతం
కరెంట్ అకౌంట్స్	5 శాతం
ఫిక్స్‌డ్ డిపాజిట్స్	4 శాతం

బ్యాంకుల వారీగా క్లెయిమ్ చేయని నగదు వాటా

పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు	82 శాతం
ప్రైవేట్ సెక్టార్ బ్యాంకులు	9 శాతం
రీజినల్ గ్రామీణ బ్యాంకులు	6 శాతం
విదేశీ బ్యాంకులు	3 శాతం

సాక్షి, అమరావతి: దేశంలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. 2005లో కోటి ఖాతాల్లో కేవలం రూ.918 కోట్ల క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఉండగా... 2015 నుంచి ఆ విలువ భారీగా పెరిగినట్లుగా పేర్కొంది. 2024 నాటికి 20 కోట్ల ఖాతాల్లో రూ.62,314 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. క్లెయిమ్ చేయని మొత్తంలో 75 శాతం సేవింగ్స్ ఖాతాల్లోనివేనని, అందులో 82 శాతం వాటా పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోనే ఉన్నట్టు నివేదిక స్పష్టం చేసింది. క్లెయిమ్ చేయని డిపాజిట్ల ఖాతాలపై బ్యాంకులు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నప్పటికీ... ఇంకా నగదు ఎక్కువగానే ఉంటోంది. క్లెయిమ్ చేయని డిపాజిట్లను హక్కుదారులకు తిరిగి ఇవ్వడానికి కష్టమైన చెందిన చట్టపరమైన వారసుల స్థానాన్ని కనుగొనడం బ్యాంకులు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయి. క్లెయిమ్స్ ఫిర్యాదుల త్వరగా పరిష్కారం, రికార్డుల నిర్వహణ, క్లెయిమ్ చేయని డిపాజిట్ ఖాతాల కాలానుగుణ సమీక్ష కోసం ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాయి. న్యాయమైన హక్కుదారులకు సహాయం చేయడానికి, బ్యాంకులు లేఖలు, ఈ–మెయిల్స్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా ఖాతాదారులను సంప్రదించడంతో పాటు ఖాతా యాక్టివేషన్, క్లెయిమ్ ప్రక్రియపై సమాచారాన్ని అందించడం వంటి చర్యలు కూడా చేపడుతున్నాయి.

మొన్న నారాకోడూరు.. నేడు దోకిపర్రు..

ఓఆర్ఆర్ భూసేకరణ కోసం రైతులకు ప్రభుత్వం షాకులు

- ముందస్తు సమాచారం ఇవ్వకుండా సర్కారు దొంగాట
- సచివాలయాల్లో అతికించిన నోటీసులు చూసి రైతుల అవాక్కు
- రూ.రెండు కోట్లకు పైగా ఉన్న ఎకరా భూమికి చాలా తక్కువ పరిహారంపై ఫైర్
- గుంటూరు కలెక్టరేట్‌లో నిరసన.. కలెక్టరకు వినతిపత్రం
- తాడికొండ ఎమ్మెల్యే తీరుపైనా ఆగ్రహం

గుంటూరు కలెక్టరేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దోకిపర్రు రైతులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు వెస్ట్: అమరావతి చుట్టూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఓఆర్ఆర్ కోసం చంద్రబాబు సర్కారు రైతులకు వరుసగా షాకుల మీద షాకులు ఇస్తోంది. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం దోకిపర్రు గ్రామ రైతులకు ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తోంది. కనీసం గ్రామ సభ కూడా నిర్వహించకుండా కేవలం సచివాలయాల్లో ఇందుకు సంబంధించిన సమాచారాన్ని అతికించి వదిలేయడంతో రైతులు ఇది చూసి అవాక్కవుతున్నారు. పొన్నూర్ తీసుకుంటుండం నచివాలయానికి వెళ్లే ఈ విషయం వెలుగుచూసింది. పేరేచర్ల–మేడికొండూరు మధ్యలో ఉన్న తమ గ్రామంలో 365 ఎకరాల భూమిని ఔటర్ రింగ్‌రోడ్డు కోసం సేకరిస్తున్నట్లు తెలుసుకున్న రైతులు శనివారం ఆగమేఘాల మీద గుంటూరు కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఏదో ఒరగబెడతారని అందరూ చంద్రబాబును గద్దెనెక్కిస్తే చివరికి మా నోటి దగ్గర కూడును లాక్కోవడం దారుణమని వారు ముక్తకంఠంతో మండిపడ్డారు. ఇటీవల గుంటూరు జిల్లా పేరేచర్ల వద్ద, నారాకోడూరు భూముల విషయంలోనూ రైతుల నుంచి ఇలాగే తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

ఇంత తక్కువ నష్టపరిహారమా!?..

మావైపు.. భూమి కోల్పోతున్న రైతులకు కేవలం ఎకరా రూ.20–30 లక్షలతో నష్టపరిహారం సరిపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కానీ, ఇక్కడ మార్కెట్‌లో భూమి విలువ రూ.2 కోట్ల నుంచి రూ.2.5 కోట్ల వరకూ పలుకుతోంది. ప్రభుత్వం ఇలా అతితక్కువ పరిహారం ఇస్తే ఎట్టి పరిస్థితిలోనూ అంగీకరించేది లేదని రైతులు కుండబద్దలు కొడుతున్నారు. అవసరమైతే ఆందోళనలతో పాటు న్యాయపోరాటానికి కూడా ఆశ్రయిస్తామని వారు హెచ్చరిస్తున్నారు. సుమారు 350 మంది రైతుల జీవితాలు రోడ్డునపడుతుంటే తమకేమీ తెలియని తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అంటున్నారని రైతులు దుమ్మెత్తిపోశారు. మొదటి విడత గెజిట్‌లో 70 మీటర్ల రోడ్డుగా నమోదుచేశారని.. దానిని 140 మీటర్లకు పెంచి ఇప్పుడు 250 మీటర్లుగా చేస్తున్నారని పై వారు మండిపడుతున్నారు. ఇంత వెడల్పైన రోడ్డు రాష్ట్రంలో ఎక్కడాలేదని.. దీనిపై ఎమ్మెల్యే స్పందించకపోవడం ఏమిటని వారు రగిలిపోతున్నారు.

అమాత్యా.. ఛీఛీ ఇవేం పాడు పనులు?

- సంక్రాంతి వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ డ్యాన్సులు
- మంత్రి పదవికే మచ్చ తెచ్చారని మండిపడుతున్న నెటిజన్లు
- నేను ఇలాగే ఉంటానని సమర్థించుకున్న మంత్రి

సాక్షి టాస్క్‌ఫోర్స్: సంక్రాంతి సంబరాల పేరిట రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బహిరంగంగా చేసిన డ్యాన్సులు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలోని ఏఎస్ఎన్ కాలేజీలో సంక్రాంతి సంబరాల పేరిట మ్యూజికల్ నైట్లు, రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుల్లితెర, జబర్దస్త్‌లో మహిళా క్యారెక్టర్లు వేసే నటులతో కలిసి మంత్రి సుభాష్ వందల మంది రోజులూ బహిరంగంగా చిందులు వేశారు. ఆయనతో పాటు ఆయన తండ్రి వాసంశెట్టి సత్య కూడా డ్యాన్సులు చేయడం కొసమెరుపు. అయితే బాధ్యతాయుతమైన మంత్రిగా ఉన్న వ్యక్తి ఇలా బహిరంగంగా రికార్డింగ్ డ్యాన్సులు వేయడంపై సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇటువంటి మంత్రుల వల్ల రాష్ట్రం పరువు పోతోందని తప్పు పడుతున్నారు. ఇది సరిపోదన్నట్టు తప్పై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ట్రోలింగ్‌లపై మంత్రి స్పందించిన తీరు మరిన్ని విమర్శలకు దారి తీసింది. ''నేను మంత్రి అయినా, ఎమ్మెల్యే అయినా నేను నేనుగానే ఉంటాను. ఇలానే ఉంటాను'' అంటూ వింత ధోరణిలో సమర్థించుకోవడం గమనార్హం.

మంత్రి వాసంశెట్టి సుభాష్ బహిరంగంగా డ్యాన్స్ చేసిన వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రామచంద్రపురంలో డ్యాన్స్ చేస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

స్తంభానికి కట్టి.. దారుణంగా కొట్టి..

- పామూరు మండలం బొట్లగూడూరులో ఆటోడ్రైవర్‌పై అమానుష దాడి
- టీడీపీ మూకల పైశాచికం

పామూరు (మార్కాపురం): మానవత్వం మంటగలిసేలా ఓ ఆటోడ్రైవర్‌ను అమానుషంగా ఇనుప స్తంభానికి కట్టేసి కొట్టిన ఘటన శుక్రవారం మార్కాపురం జిల్లా పామూరు మండలంలోని బొట్లగూడూరులో చోటుచేసుకుంది. ఈ దాడికి పాల్పడిన తెలుగుదేశం పార్టీకి చెందిన అరుగురిని పోలీసులు అరెస్ట్‌చేసిన పామూరు సీఐ, డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, సీఐ మాకినేని శ్రీనివాసరావు, ఎస్సై కట్టా అనూక్ శనివారం విలేకరులకు వెల్లడించారు. పీసీ పల్లి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన భీమవరపు మహార్ షుక్ర వారం సాయంత్రం ఆటోలో నిమ్మకాయలు వేసుకుని పామూరు వస్తున్నాడు. బొట్లగూడూరు సెంటర్‌కు వచ్చేసరికి ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ పక్కన నిలబడి ఉండగా ఆటో తగిలింది. దీంతో బైక్ వద్ద ఉన్న మద్దినేని తిరుపతయ్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆటో నడుపుతున్న మహార్షిపై గొడవకుదిని దిందేశారు. ఆటో అద్దాలు పగులగొట్టి మహార్షిని తాడుతో ఇనుప స్తంభానికి కట్టేసి కర్రలతో దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహార్షిని విడిపించి పామూరు తీసుకొచ్చి చికిత్స కోసం ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. అనంతరం క్షతగాత్రుడు మహార్షి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన కమ్మ ప్రసాద్, రేగలగడ్డ నాగేశ్వరరావు, దొడ్డోజి హరిక్రిష్ణ, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసులు, కోటపాటి వెంకటేశ్వర్లును అరెస్ట్ చేశారు. దాడికి పాల్పడిన మిగిలిన వారిని కూడా గుర్తించి త్వరలో అరెస్ట్ చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అరుగురిని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేస్తామని తెలిపారు. గ్రామంలో ముందస్తుగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. సీఐ, ఎస్సైతో పాటు 10 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, నలుగురు కానిస్టేబుళ్లతో పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎవరైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఆటోడ్రైవర్ మహార్షిని స్తంభానికి కట్టేసి కొడుతున్న టీడీపీ మూక

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎటి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

SC హిందూ మాల/కట్న ప్రసక్తి లేదు/ M.Tech/ C.Govt. మెకానికల్ ఇంజనీర్ / BHEL/ 1 Lakh PM/ 6' ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16284]

గౌడ/ B.Tech, MBA/C.Govt అకౌంటెంట్ ఆఫీసర్/ ఆడిట్ (COG) Dept/75,000/- PM/ 5'11" ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9550166072 [HA-16284]

క్రిస్టియన్ మాదిగ/ M.Tech/SWE/ 40 Lakhs PA/ 6' ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6305007091 [HA-16284]

వడ్డెర/కట్న ప్రసక్తి లేదు/B.Tech/ C. Govt. Sr. అకౌంటెంట్/ FCI/ 60,000/-PM/ 5'11"ఎత్తు/28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16284]

పద్మశాలి/కట్న ప్రసక్తి లేదు/B.Tech, NIT/ MBA/ C.Govt. సూపరింటెండెంట్/ ONGC/ 1,60,000/- PM/ 5'11" ఎత్తు 30 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-16284]

ఆర్యవైశ్య/28,5'8" B.Tech/Software Job (100 Cr బిజినెస్ Own Company Proposal) గల అందమైన వరునికి, సాంప్రదాయ కులప్రసక్తి లేని డిగ్రీ చదివిన అందమైన వధువు కావలెను. 8341742398 (డైరెక్ట్) [H-821112]

రెడ్డి 34/6'/CA in Australia in Auditor Practice, వెల్ సెటిల్డ్ వరునికి, వధువు (Prefer Doctors) ఆస్ట్రేలియాలోనే ఉండేటట్టుగా కావలెను. డైరెక్ట్ ఫోన్ 9652778110 [HA-563]

కులపట్టింపు లేదు/హిందూ/34Y/6'ft/ M.Tech/ LLB/ Advocate/ Any Degree జాబ్ & బిజినెస్ 2.5 L(pm), 25Cr ప్రాపర్టీ గల వరునికి BC or OC వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు (డైరెక్ట్) 6304162893 [H-983684]

ఓపెన్ మైండ్/2వ పెళ్లి, విడో అయినా Ok మంచి మనస్సు వధువు కావలెను. *2వ పెళ్లి/ 54/ 5'7"/ C.Govt. ఎంప్లాయ్/ 80,000/- PM/ 1 Cr/ పిల్లలు లేరు **60/5'10"/30,000/- PM/ అర్జెంట్ వాట్సప్. 8187053655, 6303293337 [HA-16288]

యాదవ/ కట్న ప్రసక్తి లేదు/B.Tech/ Govt. Jr. రెవెన్యూ ఆఫీసర్/60,000/- PM/ 5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7075953400 [HA-16288]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel - kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Govt-Officers/B.Tech/ 1998/5'11"/100Cr * 1993/5'8"/Rich Family * Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/BIG Business * B.Tech/ MBA/ 1994/6'/800Cr * 98/6'/400 Cr *82/5'8"/ 400 Cr *Cont: K.C. Reddy - Mar- Bureau-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Business/B.Tech/1996/6'/500 Cr *95/5'7"/2000 Cr *95/6'/150 Cr *95/ 5'9"/ 250 Cr * Cont: K.C. Reddy- Mar-Bureau-Hyd. Ph:9347807015 /9849321309

Reddy/Business/B.Tech/MS/1994/5'11"/250Cr. *90/5'11"/300 Cr * 90/ 6'/1000 Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/IIT (B.Tech)/ BITS *1998/5'11"/50L Yr/8Cr *94/1 Cr/Yr/ 30 Cr/5'9" *96/ 5'7"/ 50L/Yr/20 Cr *Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *95/ 5'10"/ 170K / 20Cr/ *99/5'10"/ 170K/ 50Cr *97/ 5'6"/ 500K /20 Cr *Cont: K.C. Reddy- Mar-Bureau- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/1998/5'11"/ 190K/ 30 Cr * 95/5'8"/ 125K/ 20 Cr * 93/ 5'11"/ 240K/ 50Cr *Cont: K.C. Reddy-Mar-Bureau- Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/MBBS/MS/USA-Doc/1989/ 5'9" / 500K / 30Cr. *92/6'/MD/ *89/ 5'9"/ *95/5'8"/ * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015 /9849321309

Reddy/Divorcee/MBBS/MD/1988/5'9"/80Cr *94/5'9"/100 Cr * 86/ 5'9"/ 10 Cr Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/ *USA -CITIZEN/MS/1976/ 5'10'/ 500K/ 100Cr * B.Tech/ MS/ 1981/5'8"/ 1200 Cr *MBA/ 1986/ 5'5"/1000 Cr * Cont: K.C. Reddy - Hyd- Ph: 9849321309

వరుడు కావలెను

Reddy/ U.G/2003/5'/100 Cr * MS/USA/ 2000/ 5'3"/V.Rich *MS/1995/ 5'5"/ Business/ 100Cr * MS/93/5'3"/ 1000 Cr *Cont: K.C. Reddy- Hyd. Ph:9347807015

Reddy/ B.Tech/1995/5'5"/100 Cr * 97/ 5'4"/ 150 Cr *94/5'5"/300 Cr * 88/ 5'3" / 300Cr- * Cont: K.C.Reddy-Mar - Bureau-Hyd. Ph: 9849321309 / 9347807015

Reddy/MSc/2000/5'5"/100 Cr * B.Tech/ 95/5'5" 100 Cr * 99/5'7"/100 Cr * MBA/ 98/ 5'5"/ 50 Cr * Cont: K.C. Reddy-Mar - Bureau- Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1995/5'3"/75 Cr *90/ 5'4"/ 50 Cr *92/5'4"/20 Cr *88/ 5'3"/ 20 Cr *90/5'5"/50 Cr * Cont: K.C. Reddy-Ph: 9347807015/ 9849321309

Reddy/MBBS/PG *2000/5'6"/100 Cr *98/ 5'5"/50 Cr *97/5'6"/500 Cr *96/ 5'8"/40 Cr *90/5'6"/ 200 Cr *94/5'10"/25 Cr *Cont: K.C. Reddy - Hyd. Ph: 9849321309

Reddy/MBBS/USA- Doctors/1996 /5'3" *97/5'4" *96/5'2" *95/5'5" *95/ 5'7" *96/ 5'2"/ 20 Cr *Cont: K.C. Reddy - Mar-Bureau Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/ IIT/BITS/2000/5'7"/ 45L/ Yr/ 10Cr *97/5'4"/35L/Yr/6 Cr *96/ 5'7" *95/5'6"/ 200K * Cont: K.C. Reddy-Mar - Bureau - Hyd. Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/ *1998/ 5'3"/ 25 Cr/Yr/ 80 Cr *94/5'8"/8 Cr *97/5'4"/ 100 Cr *96/5'3"/115K/ 30 Cr * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/ Divorcee *B.Tech/MS/ Job/ Hyd/ 88/ 5'5"/70 L/Yr/20 Cr *92/5'5"/ 50 Cr *93/ 5'6"/50 Cr *MD/93/5'8"/ 40 Cr *Cont: K.C. Reddy -Hyd- Ph: 9849321309

Reddy/Divorcee/B.Tech/MS/USA/ 1991/5'3"/ 25 Cr *91/5'8"/ 6 Cr *91/5'4"/ 10 Cr *85/5'5"/400 Cr * Cont: K.C. Reddy -Mar-Bureau-Hyd- Ph: 9347807015

[D-584]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి BE, MS, 29, 5' 8", Microsoft, Very Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 28, 6', Engineer, 400 K, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 29, 5' 11", Engineer, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి MBBS, Residency Doctor, 25, 5' 3", 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, Degree, 27, 5' 8", Manager, 30 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE MSc (BITS), 28, 5' 4", SWE, 20 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (IIT), MSc, 29, 5' 10", 50 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 5' 10", SWE, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 10", Doctor, 70 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, MBA, 35, 5' 8", Hyderabad, Very Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", Amazon, 250 K, H1, 10 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 5", AI Engineer, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 8", Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5'5", SWE, 12 L P/A, Hyderabad, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

SC మాల & క్రిస్టియన్/ కట్న ప్రసక్తి లేదు/ M.Tech/C. Govt. మేనేజర్/ SBI/ 1 Lakh PM/ 5'8" ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9676995093 [HA-16288]

హిందూ Age 34, 5'7", హైదరాబాద్ లో బిజినెస్ చేసే, కట్నం ఆశించని, అందమైన వరునికి, 1వ, పిల్లలు లేని 2వ మంచి సంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను ✆ 93928 18189 [B-755620]

Kamma/Converted Christian/49y/5'7"/USA Citizen/Widower/Very Rich & Well Settled Working as Software Architect in USA. Seeking Bride Caste No Bar. WhatsAPP: +91-7032123063 [H-801311]

★★

6వేల నియోగి బ్రాహ్మణ 36 సం॥ 5"7", MBA, ప్రైవేట్ జాబ్, 50వేలు PM, అనూరాధ 2వ పాదం, కౌశికస గోత్రం వరుడుకు వధువు కావలెను. శాఖ, కట్న ప్రసక్తి లేదు. 98856 91115, 81253 88109 [B-1190087]

డైరెక్ట్: 45/ప్రభుత్వ ఉద్యోగం/ ఒంటరి వరుడికి కుల, మత, వయస్సు ప్రసక్తి లేని వధువు పెళ్ళి / తోడు / ఇల్లరికం అయినా ఓకే. సెల్: 83417 12438. [SCA26011361]

వరుడు కావలెను

క్రిస్టియన్ మాల/M.Sc/Govt ప్లానింగ్ ఆఫీసర్/ MPSO/50,000/- PM/5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16284]

రజక/ఏకైక కుమార్తె/B.Tech, IIT/ C.Govt. Jr. Asst/ పోస్టల్ Dept/ 45000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధవుకు వరుడు కావలెను. Ph: 9550166072 [HA-16284]

ముదిరాజ్/B.Tech,NIT/C.Govt డిప్యూటీ మేనేజర్/SBI/ 8.5 Lakh PA/ 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16284]

యాదవ/ MA/C.Govt ఇన్‌స్పెక్టర్/ కస్టమ్స్ & GST Dept/ 90,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 8297439565 [HA-16284]

హిందూ మాదిగ/MBA/C.Govt. Jr. స్టెనోగ్రాఫర్/ అగ్రికల్చర్ Dept/52,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16284]

రెడ్డి/విడో/కుల, ఆస్తి పట్టింపు లేదు/45yrs, డిగ్రీ/ Govt. Job & స్థిర ఆస్తి గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) 1st & 2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు మా వద్ద కలవు. Ph: 9063623252 [H-801311]

రెడ్డి/2nd (కుల-ఆస్తి) పట్టింపు లేదు, Age: 30, Q: డిగ్రీ/ సొంత వ్యాపారం మంచి స్థిరాస్తి గల వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1వ, 2వ సంబంధాలు కలవు. Ph: 8125222667 [H-801311]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/ Age: 35/Q: Degree. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 8074131208 [H-801311]

రెండో పెళ్లి/విడో/55y/Guntur/Govt. Rtd Emp/Pensioner/Own House/వెల్ సెటిల్డ్ ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8519803423 [H-801311]

రజక/M.Sc/Govt బ్యాంక్ క్లర్క్ & క్యాషియర్/ కెనరా బ్యాంక్/ 50,000/- PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16288]

2వ పెళ్లి/కులపట్టింపు లేదు, 40 Yrs/5'4"/ PG, గుడ్ లుకింగ్, కోట్ల ఆస్తి & మంచి ఫ్యామిలి గల వధువుకి వరుడు కావలెను. Ph: 9959501399 [HA-16288]

వేదికలు



కమ్మ, కాపు, రెడ్డి పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16287]

USA, UK, CANADA, AUS పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16287]

Christian పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16287]

Divorcee & Widowed పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Srinivas. Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16287]

మాదిగ–మాల పెళ్లి సంబంధాలకై సంప్ర: Verified Profiles & నమ్మకమైన సంస్థ. *Shyam. Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16287]

15రో॥ అన్ని కులముల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. ✆ 94418 29644, 98490 58673, 94407 85888, 94936 61288 W. జిల్లాల వారీగా ఏజెంట్స్ కావలెను. [B-1096]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 26-01-26వ తేదీ ఉ॥ 10 గం॥లకు 68వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 23వ పునర్వివాహ పరిచయ వేదిక, విజయవాడ, KBN కాలేజీలో జరుగును. ✆ 99895 00130, 81064 54284 [B-1133]

★★

అన్ని కులాల వధువు, వరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. లక్ష్మీ శ్రీనివాస మ్యారేజెస్, ✆ 8985394744. [SCA26011351]

హైదరాబాద్‌లో ఏఎంఏ అధ్యక్షుడు బాబీ ముక్కామల బృందం పర్యటన

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వైద్య విధానాలు, వైద్య విద్యా వ్యవస్థ, ఆరోగ్య రంగంలో జరుగుతున్న సంస్కరణలను అధ్యయనం చేయడమే తన పర్యటన ఉద్దేశమని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఏఎంఏ) అధ్యక్షుడు డాక్టర్ బాబీ ముక్కామల తెలి పారు. బాబీ ముక్కామల నేతృత్వంలోని ప్రతినిధి బృందం పదిరోజుల భారత పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కామన్ వెల్త్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ఐఎంఏ చైర్మన్ ప్రభు కుమార్ చల్లగాలిని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. దేశ పర్యటనలో భాగంగా ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, ఆధునిక వైద్య విధానాలతో పాటు గ్రామీణ, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న వైద్య సేవలపై బాబీ ముక్కామల బృందం అధ్యయనం చేసింది. కార్యక్రమంలో ఏఎంఏ ప్రెసిడెంట్ విలీ అండర్‌వుడ్, ట్రస్టీలు స్కాట్ ఫెర్గుసన్, మెలిస్సా గారెట్సన్, జస్టిస్ మెక్‌గ్రాత్, మాజీ అధ్యక్షుడు బ్రూస్ స్కాట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

మినీ థియేటర్లు పెరగాలి: దగ్గుబాటి సురేష్

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో మినీ థియేటర్లు పెరగాలని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు అన్నారు. శనివారం ఆయన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని థియేటర్ల సముదాయాన్ని పరిశీలించారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల మాదిరిగా ఇక్కడ మల్టీప్లెక్స్ నిర్మించడం అభినందనీయమన్నారు. సినిమా హాళ్ల వద్ద వాణిజ్య సముదాయాలు ఉంటే ప్రేక్షకులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. శ్రీశ్రీ థియేటర్ల యజమానులు డాక్టర్ శ్రీనివాసరావు, ఎన్వీ రమణరావు పాల్గొన్నారు.

సోనోవిజన్ లక్కీ డ్రాలో హోండా అమేజ్ కారు

లక్కీ డ్రా తీస్తున్న పల్లా శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్

అల్లిపురం (విశాఖ): సంక్రాంతి సేల్ సందర్భంగా డైమండ్ పార్కు సమీపంలోని సోనోవిజన్ బ్రాంచ్‌లో నిర్వహించిన లక్కీ డ్రాలో హోండా అమేజ్ కారు కంచరపాలెం వాసిని వరించింది. సంక్రాంతి సందర్భంగా సోనోవిజన్ ఆఫర్లతో పాటు లక్కీ డ్రా ఆఫర్లు పెట్టింది. శనివారం సాయంత్రం ద్వారకానగర్‌లో గల సోనోవిజన్ షోరూమ్‌లో జరిగిన లక్కీ డ్రాలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్ డ్రా తీసారు. మొదటి బహుమతి కంచరపాలానికి చెందిన కె.వీర్రాజు, రెండో బహుమతి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పి.నాగమణికి ఎల్ఈడీ టీవీ, ఆరిలోవ గాంధీనగర్‌కు చెందిన బి.సంతోష్‌కు రిఫ్రిజిరేటర్, గాజువాక, పెదగంట్యాడకు చెందిన బి.కనకరత్నానికి వాషింగ్ మెషిన్ బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ పి.భాస్కరమూర్తి మాట్లాడుతూ వందలాది కొనుగోలుదారుల సమక్షంలో పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్టు తెలిపారు.

25 రోజుల తరువాత కేసులు

- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరిగి 25 రోజుల తరువాత కేసులు, అరెస్టులు
- తిరుపతి జిల్లా కేవీబీపురంలో టీడీపీ నేతలకు పోలీసుల జీహుజూర్

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఇది జరిగి 25 రోజులు అయింది. ఆరోజు జంతు బలి ఇచ్చారంటూ తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం కేవీబీపురం మండల పోలీసులు శనివారం అక్రమ కేసులు పెట్టడం చర్చనీయాంశమైంది. కేవీబీపురం సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కరపారెడ్డి గిరిబాబు, మురళి, బాషా, శ్రీధర్‌పై పోలీసులు అక్రమ కేసులు పెట్టారు. అంతేకాక జీవహింసకు పాల్పడ్డారని అడ్డగోలుగా కేసులు నమోదు చేసి ముగ్గురు నేతలను శనివారం ఉదయం వారి ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకుని నారాయణవనం పోలీస్‌స్టేషన్‌కు తరలించి రోజంతా వేధింపులకు గురి చేసినట్లు సమాచారం.

25 రోజుల తర్వాత అరెస్టులా..!

గతేడాది డిసెంబర్ 21న వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను కేవీబీపురం స్థానిక సర్పంచ్ కరపారెడ్డి గిరిబాబు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు టీడీపీ నేతలకు కంటగింపయ్యాయి. కేవీబీపురం మాజీ ఎంపీపీ తనయుడు, టీడీపీ నేత, ప్రస్తుత సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యురాలి భర్త చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు అక్రమ కేసులు పెట్టి, అరెస్టు చేయడం కక్ష పూరితమేనని స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

టీడీపీ నేతల డైరెక్షన్‌లో కుట్ర..

బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కరపారెడ్డి గిరిబాబు మండలంలో కీలకంగా ఉన్నారు. ఆయనను రాజకీయంగా దెబ్బతీసేందుకు నియోజకవర్గ టీడీపీ నేతలు తెర వెనుక కుట్ర పన్నారు. కరపారెడ్డి గిరిబాబు సామాజిక వర్గానికే చెందిన చంద్రశేఖర్‌ను పావుగా వాడుకుని ఆయన ద్వారా వైఎస్సార్‌సీపీ నేతలపై ఫిర్యాదు చేయించారు.

సర్పంచ్ గిరిబాబు, మురళి, శ్రీధర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ముమ్మాటికీ ఇది రాజకీయ కుట్రే..

కేవీబీపురం మండలంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉండడాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నేతలు కుట్రపూరితంగా కేవీబీపురం సర్పంచ్ కరపారెడ్డి గిరిబాబు, మురళి, శ్రీధర్‌ను అరెస్టు చేయించారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ భర్త నందగోపాల్, జిల్లా కార్యదర్శి లాల్ బాబు యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఏ గిఫ్ట్ కోసం రాయలసీమ లిఫ్ట్‌ను తాకట్టు పెట్టారు

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

సాక్షి, అమరావతి: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఏ గిఫ్ట్ తీసుకుని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను సీఎం చంద్రబాబు పక్కనపెట్టారో ప్రజలకు స్పష్టం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నా, చంద్రబాబు విజయవాడకు పారిపోయి వచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ కేసు నుంచి బయటపడటం కోసం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపేశారని విమర్శించారు. ఏపీ ప్రయోజనాలను కూడా తాకట్టు పెట్టేలా రేవంత్‌రెడ్డితో చేసుకున్న ఆ రహస్య ఒప్పందం ఏమిటో చంద్రబాబు బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు మంచిపేరు రావడం ఇష్టంలేకే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్‌ను పణంగా పెట్టడానికి కూడా వెనుకాడటం లేదన్నారు.

అన్యాయాలను ప్రశ్నించినందుకే అక్రమ కేసు

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అన్యాయాల గురించి ప్రశ్నించినందుకే తనపై అక్రమంగా కేసు నమోదు చేసి, వారెంట్ జారీ చేశారని గోరంట్ల మాధవ్ చెప్పారు. చిన్నారిని చంపేసి ఏడాదిన్నర గడిచినా ఇంతవరకు మృతదేహాన్ని గుర్తించి నిందితులను శిక్షించలేని కూటమి ప్రభుత్వం.. అన్యాయాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై మాత్రం అక్రమ కేసులు పెట్టి ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయాలపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.

చంద్రగిరిలో పోలీసుల ఓవర్‌యాక్షన్

- జల్లికట్టు సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫ్లెక్సీలను తొలగించాలంటూ పోలీసుల అల్టిమేటం
- టీడీపీ, జనసేన ఫ్లెక్సీలను తొలగిస్తే తామూ తొలగిస్తామన్న బీసీ నేత బొమ్మగుంట రవి
- మూడేళ్ల కిందట పొట్టేళ్లను బలిచ్చిన వీడియో వైరల్ చూపుతూ రవి అక్రమ అరెస్టు
- నిరసనగా పార్టీ శ్రేణులతో కలిసి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి రోడ్డుపై బైఠాయింపు

చంద్రగిరి: చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని విస్మరించి, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధి లోని మల్లయ్యపల్లి, దోర్నకంబాల, మండపం పల్లి గ్రా మాల్లో శనివారం పరుష పందేల(జల్లికట్టు) సందర్భంగా స్థానిక ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. అలాగే మల్లయ్యపల్లికి చెందిన వైఎస్సార్ అభిమాని, బీసీ నాయకుడు బొమ్మగుంట రవి వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. చంద్రగిరి పోలీసులు శనివారం ఉదయం మల్లయ్యపల్లికి చేరుకుని ఫ్లెక్సీలను తొలగించాలని అల్టిమేటం జారీచేశారు. అయితే టీడీపీ, జనసేన ఫ్లెక్సీలను తొలగిస్తే తామూ తొలగిస్తామని రవి చెప్పారు. గత ప్రభుత్వంలో ఇతర పార్టీ ఫ్లెక్సీలను తొలగించాలని తాము కోరలేదని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను మాత్రమే తొలగించమనడం ఏమిటని ప్రశ్నించాడు. దీంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బొమ్మగుంట రవి జల్లికట్టు సంబరాల్లో పొట్టేళ్లను బలి ఇచ్చిన వీడియోను బూచిగా చూపి పోలీసులు ఆయన్ను అక్రమంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల తీరుపై చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆగ్రహం

బీసీ సామాజిక వర్గానికి చెందిన బొమ్మగుంట రవిని అక్రమంగా అరెస్టు చేసినట్లు తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ సురేష్ కుమార్‌తో మాట్లాడి తమ నేతను విడిచి పెట్టాలని కోరారు. స్పందించకపోవడంతో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పోలీసు స్టేషన్ ముందు నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్ ఘటన స్థలానికి చేరుకుని హర్షిత్ రెడ్డితో చర్చించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని, రెడ్‌బుక్ రాజ్యాంగంలో కీలుబొమ్మలుగా మారుతున్నారంటూ హర్షిత్‌రెడ్డి మండిపడ్డారు. రానున్న రోజుల్లో సాక్ష్యాలతో సహా ప్రజల ముందు దోషులుగా నిలబెడతామని స్పష్టం చేశారు. ఆపై అడిషనల్ ఎస్పీ హామీతో నిరసన విరమించారు.

చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని బలవంతంగా లాగేస్తున్న పోలీసులు

వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు నమోదు

ఈ ఘటనలో వైఎస్సార్‌సీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, చంద్రగిరి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మైనార్టీ నేత మస్తాన్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు బీసీ నేత బొమ్మగుంట రవిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హత్య

చిత్తూరు జిల్లాలో వెలుగుచూసిన ఘటన

శాంతిపురం (చిత్తూరు): మద్యం తాగేందుకు కలిసి వెళ్లిన మిత్రుల మధ్య జరిగిన గొడవ ఓ యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొంది. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తుమ్మిశి పంచాయతీలోని బురడసిద్దనపల్లి – కాకర్లవంక మార్గంలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ దారుణం శనివారం వెలుగు చూసింది. కడపల్లి పంచాయతీలోని తిమ్మరాజుపల్లి, బీరనకుప్పం గ్రామాలకు చెందిన మిత్రులు శుక్రవారం రాత్రి మద్యం తాగేందుకు బురడసిద్దనపల్లి సమీపంలోని కొలిమిమిట్ట ప్రాంతానికి వెళ్లారు. అక్కడ రోడ్డుకు దూరంగా మద్యం తాగారు. ఈ సందర్భంగా జరిగిన గొడవలో తిమ్మరాజుపల్లికి చెందిన చంద్ర (26)ను తలపై మద్యం బాటిల్, బండ రాయితో కొట్టి హతమార్చారు. శనివారం సాయంత్రం విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానిక వీఆర్వో గాలించడంతో మృతదేహం వెలుగుచూసింది. దీంతో కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై విచారణ ప్రారంభించారు. మరోవైపు బీరనకుప్పం గ్రామానికి చెందిన ఓ యువకుడు తానే చంద్రను హత్య చేశానని పోలీసుల ఎదుట లొంగిపోవడంతోనే మృతదేహాన్ని గుర్తించారని సమాచారం. హత్య విషయం తెలిసిన మృతుడి బంధువులు బీరనకుప్పంలోని నిందితుడు ఉదయ్ ఇంటిపై దాడి చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారించడంతో బాధితులు, తిమ్మరాజుపల్లి గ్రామస్తులు కుప్పం – పలమనేరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడితోపాటు మరికొందరికి హత్యతో సంబంధం ఉందని, వారందరినీ అరెస్ట్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

● పొడవైన నోరు.. రంపం లాంటి దంతాలు

ములకలపల్లి (అన్నపురెడ్డిపల్లి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలోని సీతారామ ప్రాజెక్ట్ కాల్వలో శనివారం ఓ జాలరికి వెరైటీ చేప లభ్యమైంది. పొడవైన నోరు, పదునైన దంతాలు, లేత బంగారు రంగుతో ఉన్న చిట్టి చేప వలకు చిక్కింది. దీన్ని మంచినీటి గార్ ఫిష్ లేదా నీడిల్ ఫిష్‌గా పిలుస్తారు. ఈ చేప సగటున సుమారు 30 సెంటీమీటర్ల దాకా పొడవు పెరుగుతుంది. ఇది ఎక్కువగా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతాల్లో లభిస్తుందని స్థానికులు తెలిపారు.

జల్లికట్టు వీరులకు ప్రాధాన్యత ఇస్తాం

తమిళనాడు సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులో వీరత్వాన్ని చాటే విధంగా సంక్రాంతి సాహస క్రీడ జల్లికట్టు శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ ఏడాది తొలి పోటీ గురువారం జల్లికట్టుకే ప్రసిద్ధిగాంచిన మదురై జిల్లా అవనియాపురంలో జరిగింది. ఈ పోటీలో ఓ యువకుడు మరణించాడు. కనుమరోజైన శుక్రవారం ఇదే జిల్లా పాలమేడులో పోటీ జరిగింది. కాగా ఈ రెండుపోటీల్లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన విజేతలకు కార్లు, ఎద్దు యజమానికి ట్రాక్టర్ బహుమతిగా అందజేశారు. కానుం పొంగల్ సందర్భంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన అలంగానల్లూరులో జరిగిన జల్లికట్టు పోటీలను సీఎం స్టాలిన్, మంత్రులు వీక్షించారు. దేశ విదేశాల నుంచి సైతం సందర్శకులు జల్లికట్టు చూసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ అలంగానల్లూరులో జల్లికట్టు శిక్షణ కేంద్రం, ఎద్దులకు మెరుగైన సేవలు అందించడానికి వైద్యచికిత్స కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే జల్లికట్టులో వీరత్వాన్ని చాటే క్రీడాకారులకు పశు సంవర్ధక శాఖ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ పోటీల్లో ఆల్‌రౌండ్ విజేతలకు కూడా కారు, ట్రాక్టర్ అందజేశారు.

ముగ్గురు మృతి..

జల్లికట్టు పోటీలను కట్టుదిట్టమైన ఆంక్షలు, నిబంధనల నడుమ అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్వహించాల్సి ఉంది. అయితే సేలం జిల్లాలో నిషేధం ఉన్నప్పటికీ, కొన్ని గ్రామాల్లో సంప్రదాయాన్ని వీడే ప్రసక్తే లేదంటూ అనుమతి లేకుండానే శనివారం జల్లికట్టు నిర్వహించారు. కిరిపట్టి గ్రామంలో జరిగిన పోటీల్లో ఎద్దు దాడిలో కాశి(50) అనే వ్యక్తి మరణించాడు. సెంతార పట్టిలో జరిగిన జల్లికట్టులో శక్తివేల్ (32)అనే క్రీడాకారుడు, కొండయంపల్లిలో వినిత(30) అనే ప్రేక్షకురాలు ఎద్దు దాడిలో మరణించారు. పలువురు గాయపడ్డారు. అనుమతి లేకుండా జల్లికట్టు నిర్వహించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును వెంటనే క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ (ఏపీ గెసా) ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 33 ఏళ్లుగా ఆ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయసు కూడా దగ్గరగా ఉందని.. వారి సర్వీసును దృష్టిలో ఉంచుకుని వచ్చే మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి వారి సర్వీసును క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. క్రమబద్ధీకరణ ప్రక్రియ ఆలస్యమయ్యేలా ఉంటే వారి రిటైర్మెంట్ అర్హత వయసు 62 ఏళ్లకు పెంచి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వారి సర్వీసు, అర్హతలను బట్టి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంఈవో–1కు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం ఇవ్వాలి

ఎంఈవో–1 అసోసియేషన్

సాక్షి, అమరావతి: మండల విద్యాశాఖ అధికారి–1కు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారాలు కల్పించాలని ఎంఈవో–1 అసోసియేషన్ అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి భూక్యా రవినాయక్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఒక మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు డీడీవోగా ఉన్న ఎంఈవో–1కు సెల్ఫ్ డ్రాయింగ్ అధికారం లేకపోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. పరిమిత స్థాయిలో ఉపాధ్యాయులున్న హైస్కూల్ హెచ్‌ఎంలకు సైతం ఈ అధికారం కల్పించిన ప్రభుత్వం.. మండల విద్యాశాఖకు హెడ్‌గా ఉన్న గెజిటెడ్ ఎంఈవో–1కు కల్పించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని పలుమార్లు విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేకపోవడం దారుణమన్నారు.

'ఆశ్రమ' ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

ఏపీఎస్టీఏ డిమాండ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల(ట్రైబల్ వెల్ఫేర్) ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశ్రమ ఉపాధ్యాయులు రెసిడెన్షియలా, లేక నాన్ రెసిడెన్షియలా అర్థం కావడం లేదన్నారు. రెసిడెన్షియల్ అయితే గురుకుల సిబ్బందికి ఇచ్చే వేతనాలు చెల్లించాలని, లేకుంటే ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల్లా విద్యా బోధనకే పరిమితం చేయాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శాశ్వత ప్రాతిపదికన వార్డెన్లను నియమించాలని, వార్డెన్ బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగిస్తే బోధన కుంటుపడుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ ఏఎన్ఎంలను నియమించాలని కోరారు.

మాంసాహార ఉత్పత్తి పెరిగితే పర్యావరణానికి చేటు	మాంసాహార ప్రొటీన్ల ఉత్పత్తితో 20 రెట్లు ఎక్కువగా కర్బన ఉద్గారాలు	శాకాహార ప్రొటీన్ల ఆహారంతో పర్యావరణానికి మేలు	పశువుల పాలతో పోలిస్తే బఠాణీ, సోయా పాలతో తక్కువ ఉద్గారాలు

ప్లాంట్ ప్రొటీన్.. ప్లానెట్‌కూ మేలు!

సాక్షి స్పెషల్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అతిపెద్ద ఫుడ్ ట్రెండ్స్‌లో ప్రొటీన్ ఒకటి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల దగ్గరి నుంచి ఆహార కంపెనీలు, ప్రభుత్వాల వరకు అందరూ ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నాయి. తాజాగా అమెరికా ప్రభుత్వం 'మాంసకృత్తులు, పాల ఉత్పత్తులు, ఆరోగ్యకరమైన కొవ్వుల'ను అధికంగా తినాలంటూ సరికొత్త ఆహార మార్గదర్శకాలు–2025–2030 జారీ చేసింది. శరీర బరువులో కిలోకు 0.8–1 గ్రాము చొప్పున ప్రొటీన్లు తినాలని నేషనల్ అకాడమీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ అమెరికన్లకు గతంలో సిఫార్సు చేసింది. అయితే తాజాగా కిలో శరీర బరువుకు 1.2 నుంచి 1.6 గ్రాముల ప్రొటీన్‌తో కూడిన ఆహారం తినాలని కొత్త మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. కానీ అందరూ రెట్టింపు ప్రొటీన్ తింటే పర్యావరణంపై ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణంపై ప్రొటీన్ ప్రభావం ఎంత?

వాతావరణ కాలుష్యానికి ఆహారోత్పత్తి ప్రక్రియ కూడా ప్రధాన కారణంగా ఉంది. ప్రొటీన్ అనగానే అందుకు మాంసాహారం ఒక్కటే మార్గమని అనుకోనవసరం లేదు. ప్రొటీన్ ఆహారాలన్నీ ప్రజల మీద, భూగోళం మీద ఒకే విధమైన ప్రభావాన్ని చూపవు. వాటి పర్యావరణ ముద్ర వేర్వేరు స్థాయిలో ఉంటుంది. ముఖ్యంగా మేక/గొర్రె మాంసం, గొడ్డు మాంసం ఇతర ఆహారాలకన్నా పర్యావరణ కాలుష్యాన్ని అధికంగా పెంచుతున్నాయి. జంతువులను పెంచడానికి అధికంగా ప్రకృతి వనరులు అవసరం కావడమే అందుకు కారణం. మరింత మాంసాహారం ఉత్పత్తి చేయాలంటే భూమి, నీరు, మేత మరింత వాడాల్సిన అవసరం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో అడవుల వంటి సహజ పర్యావరణ వ్యవస్థలను పచ్చిక బయళ్లుగా మార్చాల్సిన అవసరం ఉంటుంది. ఆవులు, గొర్రెల వంటి క్షీరదాలు కూడా త్రేనుపు ద్వారా భూగోళాన్ని వేడెక్కించే మీథేన్ వాయువును విడుదల చేస్తాయి.

మాంసం ప్రభావం 20 రెట్లు!

➤ పప్పుధాన్యాల ప్రొటీన్లతో పోల్చినప్పుడు మేక/గొర్రె మాంసం ద్వారా ఒక కిలో ప్రోటీన్‌ను ఉత్పత్తి చేయడానికి 20 రెట్లు ఎక్కువ భూమి అవసరం. అలాగే 20 రెట్లు ఎక్కువగా కర్బన ఉద్గారాలు విడుదలవుతాయని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక తెలిపింది. ఉదాహరణకు కిలో ప్రొటీన్ కోసం గొడ్డు మాంసం ఉత్పత్తి చేయడంతో పోలిస్తే కోడి మాంసం, పంది మాంసం ఉత్పత్తికి 85% తక్కువ గ్రీన్‌హౌస్ వాయువులు విడుదలవుతాయి. బీఫ్ తినేవారు దానికి బదులు పౌల్ట్రీ లేదా పోర్క్ తినడం వైపు మారితే ఆ మేరకు భూతాపం తగ్గుతుంది. అలాగే అన్ని రకాల పాల ఉత్పత్తుల ప్రభావం పర్యావరణంపై ఒకేలా ఉండదు. పాలు అనగానే జంతువుల పాలే కానక్కర లేదు. కొన్ని రకాల ధాన్యం గింజల తోనూ పాలను తయారు చేసి వాడుకోవచ్చు. బఠాణీ గింజలు లేదా సోయా గింజలతో తయారయ్యే పాలతో పోలిస్తే ఆవు పాల ఉత్పత్తికి దాదాపు 3 రెట్లు ఎక్కువ ఉద్గారాలు విడుదలవుతాయి.



శాకాహార మాంసకృత్తులే మేలు..

అధిక మాంసకృత్తులతో కూడిన ఆహారం తీసుకోవాలనుకొనే వారు కూడా భూతాపం ఎక్కువగా పెరగని రీతిలో మొక్కల ఆధారిత ప్రొటీన్ డైట్‌ను ఎంచుకోవచ్చు. మేక/గొర్రె మాంసం, బీఫ్ వల్ల ఎక్కువ ఉద్గారాలు విడుదలవుతాయి. కోళ్లు, పందులు, పాడి పశువుల పెంపకం కోసం ఉద్గారాలు మధ్యస్థంగా విడుదలవుతాయి. ధాన్యాలు, పప్పుధాన్యాల సాగు కోసం విడుదలయ్యే ఉద్గారాలు చాలా తక్కువ. సోయా, బఠాణీల వంటి పప్పుధాన్యాలు, పిక్కలు, గింజలు వంటి మొక్కలు, చెట్ల ద్వారా లభించే ప్రొటీన్లను ఆహారంగా తీసుకోవచ్చు. ఈ ఆహారంలో పీచు, ఇనుము వంటి ఇతర ముఖ్యమైన పోషకాలూ పుష్కలంగా ఉంటాయి. ఈ పదార్థాలు సాధారణంగా మాంసం కంటే తక్కువ ధరకే అందుబాటులో ఉంటాయి. ప్రజలు శాకాహార ప్రొటీన్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రకృతి, వాతావరణ పరిరక్షణ కోసం కూడా కృషి చేసినవారవుతారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

సాక్షి, అమరావతి: హెల్త్ సైన్సెస్ కోర్సుల నిర్వహణపై ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల భవిష్యత్ నాశనం అవుతోందని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా బీపీటీ, అలైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియలో అసాధారణ జాప్యం చేస్తోందని పేర్కొంది. శనివారం ప్రభుత్వానికి రాసిన లేఖలో ప్రభుత్వం చొరవ తీసుకోకపోవడం, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యంతో వేలాది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు శిఖరం నరహరి, ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య ఇతర కార్యవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో విమానాల జాతర

ఈ నెల 28 నుంచి బేగంపేటలో వింగ్స్ ఇండియా ఏవియేషన్ షో

సాక్షి, న్యూఢిల్లీ: ఆసియాలోనే అతిపెద్ద సివిల్ ఏవియేషన్ షో కోసం హైదరాబాద్ మరోసారి సిద్ధమవుతోంది. బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు వింగ్స్ ఇండియా–2026 నిర్వహించనున్నట్లు పౌర విమానయాన శాఖ ప్రకటించింది. గ్లోబల్ ఏరోహబ్‌గా భారత్ ఎదుగుతున్న వైనాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించింది. భారత వైమానిక దళానికి చెందిన సూర్యకిరణ్ ఏరోబాటిక్ టీమ్ చేయనున్న గగనతల విన్యాసాలు ఈ షోకే హైలైట్‌గా నిలవనున్నాయి. వివిధ రకాల విమానాలను సందర్శకులు దగ్గరి నుంచి చూసేలా స్టాటిక్ డిస్‌ప్లేలు ఏర్పాటు చేయనున్నారు. కేవలం వినోదం, వ్యాపారమే కాదు.. యువతకు ఉపాధి కల్పించేలా ఈవెంట్ ప్లాన్ చేశారు. ఏవియేషన్ రంగంలో కెరీర్‌ను కోరుకునే యువత కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. పరిశ్రమ దిగ్గజాలను, నైపుణ్యం కలిగిన యువతను ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేలా సివిల్ ఏవియేషన్ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను కూడా నిర్వహించనున్నారు. 20కిపైగా దేశాల నుంచి ప్రతినిధులు, బృందాలు ఈ వేడుకలో పాల్గొననున్నాయి. విమానయాన సంస్థలు, తయారీదారులు, ఎయిర్‌పోర్ట్ డెవలపర్లు, పెట్టుబడిదారులు అంతా ఒకేచోట చేరనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్లోబల్ సీఈవోల ఫోరం, బిజినెస్ మీటింగ్స్ జరగనున్నాయి. డ్రోన్ టెక్నాలజీ, మహిళలకు విమానయాన రంగంలో అవకాశాలు, ఎయిర్ కార్గో వంటి 13 కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

మెడికల్ కాలేజీలకు నిధులుండవు.. ఎన్టీఆర్ విగ్రహానికి రూ.1,700 కోట్లా?

కాపు కార్పొరేషన్ రుణాల పరిస్థితి ఏమిటి?

- కూటమి ప్రభుత్వంలో జనసైనికులకు ఒరిగిందేమీ లేదు
- అమరావతి మునిగిపోయే ప్లేస్.. అక్కడికి ఒక్క పరిశ్రమా రాదు
- వైజాగ్ గ్రోత్ ఇంజిన్ అంటున్నారు.. ఆంధ్రాలో రోడ్లన్నీ గోతులమయం
- సోషల్ మీడియా వచ్చింది.. ఎల్లో మీడియాను జనం నమ్మరు
- పోలవరం జనసేన నాయకుడు బల్లె మురళి సెల్ఫీ వీడియోలు వైరల్

బల్లె మురళి

జంగారెడ్డిగూడెం: సీఎం చంద్రబాబు పాలనను ఎండగడుతూ ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ జనసేన నాయకుడు బల్లె మురళికి సంబంధి రెండు సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు, కాపు కార్పొరేషన్‌కు నిధులుండవు కానీ, ఎన్టీఆర్ విగ్రహానికి ఉంటాయా? చంద్రబాబు వైఖరి మార్చుకుంటే చాలా మంచిది. సోషల్ మీడియా వచ్చింది. ఎల్లో మీడియాను నమ్మరు. మీరు చెప్పే అబద్ధాలు, నిర్లక్ష్యాన్ని సహించే పరిస్థితి లేదు. మాలాంటి వారితో జనసేనలో మార్పు మొదలైంది' అంటూ చంద్రబాబు ప్రభుత్వ తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'రూ.1,700 కోట్లతో ఎన్టీఆర్ విగ్రహం పెడతారంట. ప్రభుత్వ నిర్ణయం ఘోరాతి ఘోరం. దీన్ని జనసైనికులంతా వ్యతిరేకించాలి. పవన్ కళ్యాణ్‌కు మద్దతుగా ఎన్నికల్లో కాపు యువత సొంత డబ్బు రూ.లక్ష–రూ.2 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడు కాపు కార్పొరేషన్ ద్వారా లోన్ ఇస్తారేమో అని చూస్తున్నారు. కార్యకర్తలు రాకుండా పార్టీ ఆఫీస్‌కు తాళం వేశారు. ఈ ప్రభుత్వంలో జన సైనికులకు ఒరిగింది ఏమీ లేదు. అమరావతి సెల్ఫ్ ఫండ్ ప్రాజెక్టు, టీడీపీ సెల్ఫ్ ఫండ్ పార్టీ అన్నారు కదా. ఎన్టీఆర్ విగ్రహం కూడా అలాగే కట్టండి. అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ (యూకే) అన్నీ మా చేతుల్లో ఉన్నాయని చెప్పుకొనే టీడీపీ వారు ఎన్టీఆర్ విగ్రహాన్ని ప్రజల సొమ్ముతో కట్టడం ఏంటి? చంద్రబాబు హైదరాబాద్ కట్టేశాడంట.. అమరావతి కట్టలేకపోతున్నాడు. అది మునిగిపోయే ప్లేస్. అట్టర్ ఫ్లాప్. ఒక్క పరిశ్రమ రాదు. వైజాగ్ గ్రోత్ ఇంజిన్ అంటున్నారు. ఆంధ్రాలో రోడ్లన్నీ గోతులమయం. పవన్.. మీరు చంద్రబాబుకు చేసే భజన చూసి సిగ్గుపడుతున్నాం. ఇంత దిగజారతామా?' అని మురళి ధ్వజమెత్తారు. మొదటి వీడియో సంచలనంగా మారడంతో రెండో వీడియో విడుదల చేశారు. 'ఎన్టీఆర్ విగ్రహం ప్రజల సొమ్ముతో కట్టడానికి జనసేన వ్యతిరేకం. దీనిపై సోషల్ మీడియాలో నన్ను తిడుతున్నారు. నా నంబర్ ఉంది. దమ్ముంటే కాల్ చేయండి. నోటికొచ్చినట్టు మాట్లాడితే ఒక్కొక్కడి చర్మం తీస్తా. వైఎస్ జగన్‌కు భయపడి స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకుండా టీడీపీ వారు పారిపోయారు. అప్పుడు పోటీ చేసింది జనసేన. మేం లేకపోతే మిమ్మల్ని జగన్ ఆడుకుంటారు. కానీ, మీరు పదవిలోకి వచ్చాక జనసేనను జీరో చేయాలని చూస్తున్నారు. కాపు కార్పొరేషన్ నిధులు ఆపేశారు. ఇది టీడీపీ చేస్తున్న తప్పు' అని పేర్కొన్నారు.

కొత్త ప్రైవేటు వర్సిటీల నిబంధనల్లో సవరణలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కొత్త ప్రైవేటు విశ్వవిద్యాలయాల (గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్) స్థాపనలో భాగంగా అనుమతుల ప్రక్రియ వేగవంతం చేసేందుకు ఏపీ ప్రైవేటు వర్సిటీ స్థాపన చట్టం–2016లోని నిబంధనల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ మేరకు ఐదు రకాల ప్రత్యేక దరఖాస్తు ఫారాలను అందుబాటులోకి తెచ్చింది. వర్సిటీ వివరాలు, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)తో పాటు అనుబంధ దస్త్రాలు, చెక్‌లిస్టు, దరఖాస్తు చేసినప్పటి నుంచి వివిధ దశల్లో అనుమతుల ప్రక్రియ ఫారాలను ఉన్నత విద్యా కార్యదర్శికి సమర్పించాలని పేర్కొంది. కొత్తగా ఏర్పడే వర్సిటీలు ప్రపంచంలోని టాప్–100 వర్సిటీలతో ఉమ్మడి డిగ్రీ విధానం కోసం ప్రయత్నించాలని గతంలో ఉన్న నిబంధనను తొలగించింది. ఇకపై కొత్తగా ఏర్పడే వర్సిటీల్లో అన్ని కోర్సుల్లో 35శాతం ప్రభుత్వ కోటా సీట్లను రాష్ట్ర అభ్యర్థులతో భర్తీ చేయాలి. ఇందులో స్థానికతను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్వహించే సెట్స్ ఆధారంగా ప్రవేశాలు చేపట్టాలి. ఈ మేరకు శనివారం ఉన్నత విద్యా కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్ సెట్ ఇంటర్వ్యూలు వెంటనే నిర్వహించండి: ఎస్ఎఫ్ఐ

సాక్షి, అమరావతి: ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇంటర్వ్యూల ప్రక్రియను వేగంగా చేపట్టాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్ సెట్ ఫలితాలు డిసెంబర్‌లో విడుదల చేశారని, కానీ, ఇప్పటివరకు ప్రవేశాలు చేపట్టలేదని మండిపడ్డారు. కనీసం ఆర్ సెట్ కన్వీనర్ నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్టు తెలిపారు.

చిన్నారులకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

9 నెలల పసికందు సహా ముగ్గురు మృతి

భర్త కొట్టడంతో దారుణానికి ఒడిగట్టిన గృహిణి

నంద్యాలలో విషాదం

మల్లిక మృతదేహం

మృతి చెందిన ఇద్దరు చిన్నారులు

నంద్యాల: ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి.. తల్లి ఉరి పోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నంద్యాలలో కలకలం రేపింది. నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్‌బాషా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని లలితానగర్‌కు చెందిన ఉదయ్‌కిరణ్, ఎస్‌బీఐ కాలనీకి చెందిన మల్లికకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఉదయ్‌కిరణ్ పట్టణంలోని ఫెర్టిలైజర్ షాపు నిర్వహిస్తుండగా మల్లిక (27) గృహిణి. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం మల్లికను భర్త తీవ్రంగా కొట్టడంతో ఆమె కుడిచేతిపై గాయాలయ్యాయి. తీవ్ర మనస్తాపానికి గురైన మల్లిక జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడేందుకు నిర్ణయించుకుంది. ఇంట్లో ఉన్న పురుగు మందును ఇద్దరు పిల్లలకు తాగించి.. తాను ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలిసిన మృతురాలి బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకుని తలుపులు పగులగొట్టి మల్లికను, పిల్లలు ఇషాంత్ (3), పరిణితి(9 నెలలు)ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే తల్లి, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహంపై గాయాలను గుర్తించడంతో పాటు ఇంట్లో ఉన్న రెండు పురుగు మందు డబ్బాలను సీజ్ చేశారు. భర్త ఉదయ్‌కిరణ్ పరారీలో ఉన్నాడు. మృతురాలి తమ్ముడు కార్తీక్ ఫిర్యాదు మేరకు భర్త ఉదయ్, ఆడపడుచు, తోటికోడళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మైదానంలో ముగిసిన జీవితం

క్రికెట్ ఆడుతూ కుప్పకూలిన యువకుడు

తేజేశ్వరరెడ్డి (ఫైల్)

చౌడేపల్లి: క్రికెట్ మైదానంలో జీవితమనే ఆట ముగిసిపోయింది. సంక్రాంతికి సొంతూరు వచ్చిన ఓ యువకుడు క్రికెట్ ఆడుతూ కుప్పకూలిపోయాడు. పండుగ వేళ కన్నవారికి తీరని వేదన మిగిల్చిన ఈ ఘటన అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో హైదరాబాద్‌లో ఉంటున్న తేజేశ్వరరెడ్డి (22) సంక్రాంతి కోసం చౌడేపల్లి మండలంలో పెద్దూరులోని సొంతింటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి వెంగళపల్లె పంచాయతీ పాలెంపల్లి సమీపంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం పాల్గొన్నాడు. మైదానంలో ఫీల్డింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే సహచరులు పుంగనూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి సహదేవరెడ్డి సంబేపల్లి నుంచి 20 ఏళ్ల క్రితం చౌడేపల్లె వచ్చేశాడు. బోయకొండ గంగమ్మ ఆలయంలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తూ పెద్దూరులో నివసిస్తున్నాడు. ఇటీవలే కుమార్తెకు వివాహం జరిపించాడు. చేతికి అందొచ్చిన కుమారుడు ఆకస్మికంగా అనంత లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

తీరని యూరియా కష్టాలు

పుణ్యసముద్రం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

ఉదయగిరి/తవణంపల్లె: చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు తొలగేటట్లు లేవు. అదునుకు ఎరువులు అందక రాష్ట్రంలోని రైతన్నలు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం తిరుమాపురం పంచాయతీ గుడినరవ తదితర గ్రామాల రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నామంటూ శనివారం వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వారం రోజులుగా యూరియా కోసం తిప్పలు పడుతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయగిరిలోని కొట్టాయపల్లి సొసైటీ కార్యాలయం ఎదుట బైఠాయించి, ఆందోళన చేశారు. అలాగే, చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలో శనివారం యూరియా కోసం రైతులు వేకువజాము నుంచే నిరీక్షించారు. మండలంలోని పుణ్యసముద్రంలో శనివారం యూరియా కోసం క్యూలో పడిగాపులు కాశారు. చివరికి అధికారులు రైతుల పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డులను తీసుకొని రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సోమవారం పంపిణీ చేస్తామని చెప్పడంతో.. మళ్లీ సోమవారం క్యూ కట్టాల్సిందేనా అంటూ రైతులు నిరాశతో వెనుదిరిగారు.

చెప్పుతో కొడతా ల.. కొడకా..!

- నువ్వు ఎమ్మెల్యేని చూశావా? ఎమ్మెల్యే బామ్మర్ది గురించి మాట్లాడతావా ?
- మహిళా డాక్టర్ భర్తపై అనంతపురం టీడీపీ అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి బండబూతులు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో
- అనంతనగరంలోని అస్రా కంటి ఆస్పత్రి డాక్టర్ భర్తకు, ఎమ్మెల్యే మధ్య సంభాషణ
- నిత్యం వివాదాలకు కేరాఫ్‌గా టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్


టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం టౌన్: 'చెప్పుతో కొడతా నా కొడకా.. నీయమ్మా.. ల–– కొడకా. ఎమ్మెల్యే గురించి మాట్లాడతావా? నీవు ఎమ్మెల్యేని చూశావా? నీ పెళ్లాం ఎమ్మెల్యేని చూసిందా? ఎమ్మెల్యే బామ్మర్ది గురించి మాట్లాడతావా? నా కొడకా..' అంటూ అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ రెచ్చిపోయిన ఆడియో బయటకొచ్చింది. బండ బూతులతో, పత్రికల్లో రాయలేని అసభ్య పదజాలంతో దూషించారు. నగరంలోని సాయినగర్‌లో ఉన్న అస్రా కంటి ఆసుపత్రి భవనం డబుల్ రిజిస్ట్రేషన్‌పై ఆ ఆస్పత్రి డాక్టర్ భర్త షరీఫ్‌తో దగ్గుపాటి గతంలో మాట్లాడిన సంభాషణల ఆడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇప్పటికే పలు భూ వివాదాలు, డబ్బులు డిమాండ్ చేయడంపై విమర్శలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి తాజా ఆడియో ఉదంతంతో మరో వివాదంలో చిక్కుకుపోయారు. 'సబ్ రిజిస్ట్రార్ రమణరావు మాటలు విని నీ పెళ్లాం ప్రెస్‌మీట్ పెడుతుందా? ల..కొడకా' అంటూ షరీఫ్‌పై రెచ్చిపోయిన ఎమ్మెల్యే దగ్గుపాటి ఆడియోను విన్న ప్రతి ఒక్కరూ ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి ఇంత చిల్లరగా మాట్లాడతారా? అంటూ మండిపడుతున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

ఐసర్‌లో ఆకట్టుకున్న 'విరాసత్' సంగీత కచేరీలు

జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శంతాను భట్టాచార్య

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐసర్‌లో స్పిక్ మాకే సహకారంతో 'విరాసత్ – 2026' పేరుతో జరుగుతున్న సంగీత కచేరీ, వర్క్‌షాప్‌లు ఆకట్టుకున్నాయి. ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శంతాను భట్టాచార్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోని విభిన్న, సంస్కృతులు, కళలను మేళవించి, దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ కార్యక్రమాలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. రెండవరోజు శనివారం ఐసర్ ప్రాంగణంలోని కొలీజియం హాల్‌లో విద్వాన్ అమృత మురళి కర్ణాటక సంగీత కచేరీ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కచేరీలో వయొలిన్‌పై విద్వాన్ ఆర్ కె శ్రీరామ్‌కుమార్, మృదంగంపై విద్వాన్ మనోజ్ శివ, కంజీరపై విద్వాన్ కె వి గోపాలకృష్ణన్ సహకారం అందించారు. ఈ శాస్త్రీయ నృత్య ప్రదర్శన సభికులను కట్టిపడేసింది. ధనలకోట వైకుంఠం నకాష్ చేత చెరియల్ పెయింటింగ్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొని పెయింటింగ్ నేర్చుకున్నారు. ఆయన నుంచి మెళుకువలను నేర్చుకుని కళాత్మకతను ప్రతిబింబించేలా పెయింటింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా ఆదివారంతో ఈ విరాసత్ కార్యక్రమం ముగియనుంది. ఐసర్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ, సిబ్బంది పాల్గొన్నారు.

కారాగారమే.. కర్మాగారం!

అది విశాఖపట్నం కేంద్ర కారాగారం. నేరస్తులకు శిక్ష అమలు చేసే ఈ ప్రాంగణం.. ఇప్పుడు పారిశ్రామిక ప్రగతికి వేదికగా మారుతోంది. నాలుగు గోడల మధ్య మగ్గిపోకుండా.. ఖైదీలు తమలోని నైపుణ్యానికి పదును పెడుతున్నారు. ఒక చేత్తో వ్యవసాయం, మరో చేత్తో ఉక్కు పరికరాలు తయారు చేస్తూ.. 'మేము ఖైదీలం మాత్రమే కాదు, కష్టజీవులం' అని నిరూపిస్తున్నారు. విశాఖ సెంట్రల్ జైలులో నిర్వహిస్తున్న వివిధ పరిశ్రమల ద్వారా ఏటా కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తులు తయారవుతుండగా, ఖైదీలకు ఉపాధితో పాటు భవిష్యత్తుపై భరోసా లభిస్తోంది. - ఆరిలోవ

జైలులోని వ్యవసాయ క్షేత్రంలో పనులు చేస్తున్న ఖైదీలు

విశాఖ జైలులో పారిశ్రామిక ప్రగతి / ఖైదీలకు బతుకుపై భరోసా

విశాఖ కేంద్ర కారాగారంలోని కర్మాగారాలు ఇప్పుడు ఉత్పత్తిలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పరిశ్రమల్లో ఖైదీలే కార్మికులుగా మారి, నాణ్యమైన వస్తువులను తయారు చేస్తున్నారు. జైళ్ల శాఖ ఇక్కడ పరిశ్రమల ద్వారా ఖైదీలకు చేతినిండా పని కల్పించి, ఆదాయ మార్గాన్ని చూపిస్తోంది. ఇక్కడ కొబ్బరి చీపుర్ల నుంచి ఇంట్లో వినియోగించే కుర్చీలు, టేబుళ్లు, కార్యాలయాల్లో వాడే ఇనుప బీరువాల వరకు అన్నీ తయారవుతున్నాయి. వ్యవసాయం, పాడి పరిశ్రమ, స్టీలు పరికరాల తయారీ, బుక్ బైండింగ్, చేనేత వస్త్రాలు, బేకరీ తదితర పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ఉన్న జీవిత, జీవితేతర ఖైదీలే తయారుచేస్తున్నారు. వారు జైల్లో శిక్ష అనుభవిస్తున్నప్పటికీ, ఆదాయార్జనలో నిమగ్నమయ్యే అవకాశాన్ని జైలు అధికారులు కల్పిస్తున్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండించడంలో, నాణ్యమైన వస్తువులు తయారు చేయడంలో తాము బయట పనిచేసే కార్మికులకు ఏమాత్రం తీసిపోమని వారు నిరూపిస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 9 నెలల కాలంలోనే రూ.1.33 కోట్ల విలువైన ఉత్పత్తులను తయారు చేసి ఔరా అనిపించారు. ఇక్కడ తయారైన వస్తువులను జైలు అవసరాలకు వినియోగించడంతో పాటు, మిగిలిన వాటిని బయట మార్కెట్‌లోనూ, రాష్ట్రంలోని ఇతర జైళ్లకు విక్రయిస్తున్నారు.

సింహభాగం స్టీల్‌దే..

జైలులో నడుస్తున్న పరిశ్రమల్లో స్టీల్ ప్లాంట్‌ది అగ్రస్థానం. ఇక్కడ ఇనుప బీరువాలు, ఆఫీసు సామగ్రి, కుర్చీలు, టేబుళ్లు వంటివి తయారవుతున్నాయి. 2024–25లో రూ.1.71 కోట్ల విలువైన స్టీల్ ఉత్పత్తులు జరగగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన 9 నెలల్లో రూ.85 లక్షల మేర ఉత్పత్తి జరిగింది.

వీటితో పాటు కొబ్బరి చీపుర్లు, బుక్ బైండింగ్, రకరకాల పంటల సాగుతో జైలు కళకళలాడుతోంది. సుమారు 200 మంది జీవిత, జీవితేతర ఖైదీలు ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. శిక్ష కాలంలో ఖైదీలు చేసే పనికి జైలు అధికారులు వేతనాలు చెల్లిస్తారు. ఈ మొత్తాన్ని వారు విడుదలయ్యే సమయంలో అందజేస్తారు. ఈ డబ్బు వారి కొత్త జీవితానికి, ఉపాధికి పెట్టుబడిలా మారుతుంది. అంతేకాకుండా, జైలులో ఉంటూనే తమ కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా నిలిచే వెసులుబాటు కూడా కలుగుతోంది.

జౌళి విభాగంలో వస్త్రాలను తయారు చేస్తున్న ఖైదీలు

స్టీల్ పరిశ్రమలో తయారైన బీరువాలకు రంగులు వేస్తున్న ఖైదీలు

వివిధ విభాగాల వారీగా 9 నెలల ఆదాయం/ఉత్పత్తి	
స్టీల్ యూనిట్	రూ. 85 లక్షలు
పాడి పరిశ్రమ	రూ. 15.20 లక్షలు
బేకరీ యూనిట్	రూ. 13 లక్షలు
వీవింగ్ (చేనేత)	
యూనిట్	రూ. 13 లక్షలు
వ్యవసాయం	రూ. 3.90 లక్షలు
జైలు షాపు	రూ. 2.50 లక్షలు

మార్పు కోసమే ఈ ప్రయత్నం

ఖైదీలలో పరివర్తన తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యం. ఇక్కడి పరిశ్రమల ద్వారా వారికి ఆదాయంతో పాటు పని నేర్పించి, విడుదలయ్యాక సమాజంలో గౌరవంగా బతికేలా తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం స్టీల్, పాడి, బేకరీ విభాగాల నుంచి మంచి ఆదాయం వస్తోంది. ఉత్పత్తులను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – ఎం. మహేష్‌బాబు, పర్యవేక్షణాధికారి, విశాఖ కేంద్రకారాగారం

ఏపీకే.. అంతా ఫేకే

రూ. 5 వేలు వస్తాయి.. ప్రయత్నించండంటూ కేటుగాళ్ల వల

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం జిల్లాలో పలు సామాజిక మాధ్యమాల్లో భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో ఏపీకే ఫైల్స్ (ఫేక్) మెసేజ్‌లు హల్‌చల్ చేశాయి. పలు వాట్సాప్ గ్రూపుల్లో ఇలా ఫేక్ మెసేజ్లు దర్శనమిచ్చాయి..

'మొదట ఇది నకిలీ అనుకున్నాను, కానీ నిజంగా నాకు రూ.5,000 వచ్చింది ! మీరు కూడా ప్రయత్నించి చూడండి ! అంటూ కిందన ''హెచ్‌టీటీపీఎస్://ఎఫ్ డీజీసీ.విఆర్‌ఐహెచ్‌ఆర్.ఎక్స్‌వైజెడ్/ఎక్స్6ఆర్‌సిఐడిఒఎమ్‌డబ్ల్యూ/21569ఎఫ్ఇ2ఎఫ్ఎఫ్969ఎఫ్5621సిసి60802సిడి?–టి17684822పి=డబ్ల్యూ'' ఓ లింక్ దాని కిందన బోర్డర్ లైన్ ఇస్తూ మెసేజ్‌లు పంపారు. తెలిసి నవారి నంబర్ల నుంచే గ్రూపుల్లో ఇలా రావడంతో కొంతమంది క్లిక్ చేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు కాల్స్ చేయడంతో ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. ఆ తర్వాత సైబర్ కేటుగాళ్లు గ్రూపుల్లో తెలిసిన వారి నంబర్లను హ్యాక్ చేశారని తెలిసింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

ఇలాంటి ఫేక్ లింక్‌లు వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయని, పూర్తిగా అనుమానాస్పదమైన స్కామ్ లింక్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- లింక్‌లో ఎక్స్‌వైజెడ్ డొమైన్ ఉంటే ఆ లింక్ ప్రమాదకరమైనదిగా గుర్తించాలి.
- నమ్మదగిన బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు ఇలాంటి లింక్‌లు పంపవు.
- లింక్ ఓపెన్ చేయగానే మొబైల్ నంబర్, ఓటీపీ, యూపీఐ, బ్యాంక్ డీటెయిల్స్ తీసుకుని ఖాతా ఖాళీ చేసే ప్రమాదముంది. మన అకౌంట్‌లో డబ్బులు పోవడమే కాక మొబైల్ హ్యాకింగ్‌కు గురవుతుంది.

వాట్సాప్ గ్రూపులో వచ్చిన మెసేజీలు

రైల్ వన్‌యాప్

- రైలు టికెట్‌పై రిబేటు
- 3 శాతం ప్రకటించిన రైల్వే శాఖ
- మార్చి తర్వాత యూటీఎస్ రద్దు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైల్వే శాఖ పలు రకాల రైలు సేవలను ఒకే ప్లాట్‌ఫాంపైకి తెచ్చింది. ఇందులో భాగంగా రైలు ప్రయాణికుల మరింత చేరువగా రైల్ వన్‌యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆన్‌లైన్ టికెట్లపై 3 శాతం రిబేటు ప్రకటించింది. ఈ యాప్ ద్వారా బుధవారం నుంచి టికెట్ల రిబేటు విధానాన్ని ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. గతంలో అన్ రిజర్వ్‌డ్ టికెట్ల జారీ కోసం రైల్వేశాఖ పదేళ్ల కిందట అన్ రిజర్వ్‌డ్ టికెట్ సర్వీస్ (యూటీస్) పేరిట ఒక యాప్‌ను లాంచ్ చేసింది. ఆ అప్లికేషన్స్ రైల్వే శాఖ ప్రచారం చేసినా పూర్తిస్థాయిలో ప్రజాదరణ పొందలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రైల్వే ఆన్‌లైన్ సేవలను ఒక గొడుగు కిందకు తెచ్చే క్రమంలో గత ఏడాది జూలైలో రైల్ వన్ యాప్‌ను ప్రారంభించింది. ఆ యాప్ ద్వారా రైలు టికెట్లపై ఎటువంటి డిస్కౌంట్ ప్రకటించలేదు. సాధారణ టికెట్ల జారీ ఆప్షన్ రైల్ వన్‌యాప్‌లో ఉండడంతో యూటీఎస్ అవసరం లేకుండాపోయింది. దీంతో మార్చి నుంచి ఆ యాప్ రద్దు చేసే యోచనలో రైల్వే శాఖ ఉంది. ఈ మేరకు యూటీఎస్ యాప్‌లో ఆన్‌లైన్ జనరల్ టికెట్‌పై ఇచ్చే 3 శాతం డిస్కౌంట్‌ను రైల్ వన్‌యాప్‌లో సంక్రాంతి కానుకగా రైల్వే శాఖ ప్రయాణికులను అందుబాటులోకి తీసుకొచ్చింది.

అన్ని రకాల టికెట్లపై డిస్కౌంట్...

యూటీఎస్ యాప్‌లో కేవలం అన్ రిజర్వ్ టికెట్లు జారీ చేసేవారు. అలాగే వ్యాలెట్ డబ్బుతో బుక్‌చేసే అన్ రిజర్వ్ టికెట్లపై మాత్రమే 3 శాతం రిబేటు లభించేది. ప్రస్తుతం రైల్ వన్ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్‌తో పాటు రిజర్వ్ టికెట్లపై కూడా 3 శాతం రిబేటు ఇవ్వడానికి రైల్వే శాఖ అంగీకారం తెలిపింది. రైల్వే శాఖ టికెట్లు జారీ చేసే కమర్షియల్ శాఖ సిబ్బందిని, కాంట్రాక్టు, టికెట్ బుకింగ్ కౌంటర్లకు తగ్గించే లక్ష్యంతో దశాబ్దం కిందట యూటీఎస్ యాప్‌ను రైల్వేశాఖ ప్రవేశపెట్టింది. కేవలం ఈ యాప్ అన్‌రిజర్వుడు టికెట్లకే పరిమితం కావడంతో ప్రయాణికులు రిజర్వుడు టికెట్ల కోసం ఆయా రైల్వేస్టేషన్‌లోని పీఆర్ఎస్ కౌంటర్లకు రావడమో, ఐఆర్‌సీటీసీ, ఇతర ప్రైవేటు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా టికెట్‌ను బుక్ చేసుకోవడం వంటివి చేసేవారు. దీనిని అధిగమిస్తూ రైల్వే శాఖ సరికొత్తగా రైల్ వన్‌యాప్‌ను డిజైన్ చేసింది. ఇతర సేవలను కూడా దీని ద్వారా ప్రయాణికులకు అందించి ఆదరణ పొందే యత్నంలో భాగంగానే రైల్ వన్‌యాప్ ద్వారా అన్ని రకాల టికెట్ల బుకింగ్‌పై 3 శాతం డిస్కౌంటును ప్రకటించింది.

బహుళ ప్రయోజనాలు

రెల్ వన్ యాప్ ద్వారా రిజర్వ్, అన్ రిజర్వుడ్‌తోపాటు ప్లాట్‌ఫామ్, సీజన్ టికెట్లను కూడా ప్రయాణికులు పొందే సదుపాయాన్ని కల్పించారని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ వెల్లడించారు. టికెట్లపై రిబేటు మాత్రమే కాకుండా పలు రకాల సేవలను ప్రయాణికులకు చేరువ చేసిందన్నారు. కాగా యూటీఎస్ యాప్‌లో అన్ రిజర్వుడ్ టికెట్లను బుక్ చేయాలంటే రైల్వేస్టేషన్ వెలుపలే యాప్ ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. రైల్ వన్‌యాప్ ద్వారా రైల్వే స్టేషన్‌లోనూ టికెట్లను బుక్ చేసే వెసులుబాటు కల్పించారన్నారు.

నల్లమలలో రైలు ఢీకొని ఎలుగుబంటి మృతి

మహానంది: నల్లమల అడవిలోని నంద్యాల–గిద్దలూరు రైలు మార్గంలో రైలు ఢీకొని ఎలుగుబంటి మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. జీవాలమోరీ వద్ద ట్రాక్ దాటుతున్న ఎలుగుబంటిని రైలు ఢీకొట్టగా ఎలుగుబంటి అక్కడికక్కడే మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులు మగ ఎలుగుబంటిగా గుర్తించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

పోలీసుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

గోరంట్ల (సోమందేపల్లి): పోలీసుల వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లలో జరిగింది. బాధితుడు తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ గోరంట్ల పోలీసుస్టేషన్ ఎదుటే పురుగుల మందు తాగుతూ తీసుకున్న సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది. గోరంట్ల మండలం వానవోలుకు చెందిన మహేష్ (37) గతంలో ఓ ప్రయివేటు డెయిరీలో పనిచేసేవాడు. కంపెనీ నుంచి బయటికి వచ్చాక మహేష్‌కు రావాల్సిన పీఎఫ్ మొత్తాన్ని కంపెనీ నిర్వాహకులు అందించలేదు. ఇటీవల డెయిరీ వద్దకు వెళ్లిన మహేష్ అక్కడి పాల క్యాన్లు తీసుకురాగా, డెయిరీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తనను పోలీసులు తరచూ స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురి చేస్తున్నారంటూ శుక్రవారం మహేష్ గోరంట్ల పోలీస్ స్టేషన్ వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే హిందూపురం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు సమాచారం.

సినీనటి శారదకు సీపీఎం అభినందనలు

సాక్షి, అమరావతి: సినీనటి శారద సినీ రంగానికి చేసిన కృషికి గుర్తింపుగా కేరళ ప్రభుత్వ అత్యున్నత పురస్కారం 'జేసీ డేనియల్' అవార్డు పొందిన సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆమెను అభినందించారు. గతంలో ఆమె ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు పొందారనీ, తెలుగు, మలయాళ రంగాల్లో ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఆమె కళా జీవితం ప్రజానాట్యమండలితో ప్రారంభమైందని, డాక్టర్ రాజారావు ఆమెను ప్రోత్సహించి తీర్చిదిద్దారని తెలిపారు.

ఆ అంశంపై విచారణ చేపట్టాలి
ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్

మహారాణిపేట (విశాఖ): అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలానికి చెందిన గిరిజన మహిళ మృతి, ఆమె మృతదేహం తరలింపు వ్యవహారంలో జరిగిన జాప్యంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు డిమాండ్ చేశారు. మహిళ మరణించిన తర్వాత మృతదేహాన్ని అప్పగించడానికి 36 గంటల సుదీర్ఘ సమయం ఎందుకు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శనివారం కేజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, సి.ఎస్.ఆర్.ఎం.వో డాక్టర్ శ్రీధర్, ఆర్.ఎం.వో డాక్టర్ బంగారయ్య, ఇతర వైద్యులతో రవిబాబు ఈ విషయంపై చర్చించారు.

లయ తప్పుతున్న లబ్ డబ్

పుట్టపర్తికి చెందిన 45 ఏళ్ల వ్యక్తి రెండు నెలల క్రితం గుండెపోటుకు గురయ్యాడు. ఉన్నట్టుండి ఇంట్లో పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేసి బతికించారు. రెండు వారాల క్రితం రామగిరి మండలానికి చెందిన 37 ఏళ్ల వివాహిత ఉదయం 9 గంటల సమయంలో గుండెపోటుకు గురైంది. ఆమెను అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే ప్రాణాలు విడిచింది... ఇలా జిల్లా వ్యాప్తంగా ఏదో మూలన నిత్యం గుండెపోటు కేసులు వెలుగు చూస్తున్నాయి. అందరినీ భయాందోళనకు గురి చేస్తున్నాయి.

సాక్షి, పుట్టపర్తి: మనిషి శరీరంలోని అవయవాల్లో గుండె ప్రధానమైనది. అంతటి ప్రాధాన్యం ఉన్న హృదయం ఆకస్మాత్తుగా లయ తప్పి మనిషిని విగతజీవిగా మారుస్తోంది. ఇటీవల చిన్నా, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా గుండెపోటుతో కన్ను మూస్తున్నారు. జిల్లాలో నిత్యం ఏదో మూలన గుండెపోటు బారిన పడుతున్నారు. సకాలంలో ఆస్పత్రికి చేరిన వారు మాత్రమే ప్రాణాలతో మిగులుతున్నారు. ఆహారపు అలవాట్లు, మారిన జీవన శైలి, శారీరక శ్రమ చేయకపోవడం గుండెపోటుకు కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ఆధునిక యుగంలో ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడి శారీరక శ్రమకు దూరమయ్యారని చెప్పవచ్చు. నిత్యం శారీరక శ్రమ చేస్తే ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతుండడం గమనార్హం.

వయసుతో సంబంధం లేకుండా..

వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది. పుట్టపర్తి మున్సిపాలిటీ కమ్మవారిపల్లికి చెందిన ఓ 31 ఏళ్ల యువకుడు రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురై మరణించాడు. నెల రోజుల క్రితం అనంతపురంలోని డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ ఆస్పత్రికి గుండెపోటుకు గురైన 62 ఏళ్ల వృద్ధుడిన కుటుంబ సభ్యులు తీసుకురాగా, వైద్యులు సకాలంలో వైద్యం చేయడంతో గండం నుంచి బయటపడడం గమనార్హం.

జీవనశైలిలో మార్పులతోనే..

కోవిడ్ అనంతరం గుండెపోటు ఘటనలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, మద్యం తాగడం, మానసిక వేదన, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో గుండెపోటు వస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా ఫ్యాన్లు, ఏసీ గదుల్లో కూర్చుని కంప్యూటర్లపై ఉద్యోగం చేస్తుండడంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. ఈ క్రమంలోనే మానసిక ఒత్తిళ్లు అధికమై గుండెపోటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది.



మసాలా ఫుడ్‌తో చేటు..

మసాలాలతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం కూడా గుండెకు చేటు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే, మైదాతో చేసిన పిండి వంటకాలు, రోడ్ల పక్కన, హోటళ్లలో ఎక్కువ రోజులు మరిగిన నూనెలో చేసిన ఆహార పదార్థాలు తినడం ద్వారా కూడా గుండెపోటు వస్తుందని వివరిస్తున్నారు.

అలవాట్లు మార్చుకోవాలి

గుండెపోటు రావడానికి అనేక కారణాలున్నాయి. అప్పుడప్పుడు ఆస్పత్రులకు వెళ్లి వైద్యులను సంప్రదించాలి. హృదయ స్పందనలో మార్పు వచ్చినట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. వ్యాయామం తప్పనిసరి. మానసిక ఒత్తిళ్లను అధిగమించాలి.
– డాక్టర్ ఫైరోజాబేగం, శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

తెలుగు సినిమా మాట నేర్చిననాటి నుంచి వెండితెరపై పురాణకథలు ప్రేక్షకులకు కొత్త కావు. అయితే, మాటల్లో కొంటెతనం – చేతల్లో చాతుర్యం – మనసంతా పాండవ పక్షపాతం – నడకలో, చూపులో లలిత లావణ్యం నిండిన శ్రీకృష్ణ పాత్ర ఒకటి. అహంకార జనిత దర్పం, అధికార జనిత మదోన్మత్తత, అభిజాత్యం నిండిన నడక – నడత, పరాభవ దగ్ధ మానసుడైన మత్సరగ్రస్త మానిషి సుయోధన పాత్ర వేరొకటి. పరస్పరం పూర్తి విరుద్ధమైన ఈ నాయక – ప్రతినాయక పాత్రలను రెంటినీ ఒకే నటుడు ఒకే చిత్రంలో ధరించేందుకు సాహసిస్తే? అత్యంత శ్రద్ధ, అపారమైన అధ్యయనంతో అనితర సాధ్యంగా ఆ పాత్రలకు ప్రాణం పోస్తే? ఖర్చుకు వెనుకాడకుండా ఆ కళాతపస్సుకు నిర్మాత – దర్శకుడిగా తన ఆలోచనల అంతర్నేత్రంతో అద్భుతంగా నిర్దేశకత్వం వహిస్తే? ఎన్టీఆర్ తన శక్తియుక్తులను ధారపోసి చేసిన ఆ అపురూప సినీసృష్టి విన్యాసం... 'శ్రీకృష్ణ పాండవీయం'. **సరిగ్గా 60 ఏళ్ళ క్రితం 1966 జనవరి 13న విడుదలైన ఆ చిత్రం ఎన్టీఆర్ నటన – నిర్దేశకత్వాలకు మకుటాయమానం.** ఆయన బహుముఖ ప్రజ్ఞకు వెండితెర దర్పణం. అందుకే, తెలుగు పౌరాణిక సినిమాల్లో అది ఈనాటికీ అత్యంత ప్రత్యేకం. ఎన్టీఆర్ స్వర్గస్థులై ఈ జనవరి 18తో 30 ఏళ్ళు నిండిన వేళ... ఇది ఆ మరపురాని సినీ విశేషాల సమాహార కథనం.

నట సాహస మణిమకుటం శ్రీ క్రిష్ణపాండవీయం

పదిమందికీ తెలిసిన పురాణకథనైనా పకడ్బందీ స్క్రీన్‌ప్లే రాసి, నట – సాంకేతిక నైపుణ్యంతో తెరపై రసస్ఫోరకంగా కళ్ళకు కడితే దానికి వచ్చే స్పందనే వేరు. 'శ్రీకృష్ణ పాండవీయం'లో జరిగింది అక్షరాలా అదే! నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా ఎన్టీఆర్ సమర్థ్యం చేసిన సమయం అది. నట, సాంకేతికుల ప్రతిభ సమిష్టిలో సంగమించిన సందర్భం అది. అందుకే, ఆ చిత్రం... వెండితెర పురాణపుటం అయింది. పౌరాణిక చిత్ర రూపకర్తలకు పాఠ్యగ్రంథమైంది.

కత్తృత్వంతో... సుయోధన పాత్రకు శ్రీకారం!

'పాండవీయం' రావడానికి ముందే ఆ సమీప కాలంలో తెలుగు తెరపై 'నర్తనశాల', 'పాండవ వనవాసం', 'బభ్రువాహన', 'ప్రమీలార్జునీయం', 'వీరాభిమన్యు' లాంటి మహాభారత గాథలు తెరకెక్కాయి. ప్రజాదరణ పొందాయి. 'పాండవ వనవాసం' (1965)లో భీముడిగా ఎన్టీఆర్, దుర్యోధనుడిగా ఎస్వీఆర్ ఢీ అంటే ఢీ నటన ప్రదర్శించారు. ఆ తర్వాత తనదైన శైలిలో దుర్యోధన పాత్రను అపూర్వ రీతిలో పోషించి, నటుడిగా తన కర్తృత్వ తీర్చుకోవాలని ఎన్టీఆర్ భావించారు. అదిగో... అలా 'పాండవీయం'కి బీజం పడింది. భారీ వ్యయంతో వచ్చిన నవరస భరిత చిత్రాల 'నర్తనశాల' (1963), 'పాండవ వనవాసం', 'వీరాభిమన్యు' (1965)లకు సెట్టింగుల మొదలు చిత్రీకరణ దాకా ఎక్కడా తీసిపోకుండా నయన మనోహరంగా 'పాండవీయం' రూపొందించారు ఎన్టీఆర్. చిత్రమేమంటే, 'పాండవీయం' ఘన విజయం తర్వాత ఎస్వీఆర్ సైతం దుర్యోధన పాత్ర ధరిస్తూ, స్వీయ నిర్మాణ – దర్శకత్వంలో 'రారాజు' పేరిట సినిమాగా తీస్తున్నట్టు ప్రకటించడం గమనార్హం. కానీ, ఆ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చలేదు.

డైరెక్టర్‌గా... తెరపై తొలిసారి పేరు!

నిజానికి, ఎన్టీఆర్ దర్శకత్వంలో రూపొందిన మూడో చిత్రం 'శ్రీక్రిష్ణ పాండవీయం'. అయితే, తెరపై టైటిల్స్‌లో దర్శకుడిగా ఆయన పేరు తొలిసారి కనిపించింది ఈ చిత్రం తోనే! అంతకుముందే 'సీతారామ కల్యాణం'(1961), 'గులేబకావళి కథ' ('62)కు దర్శకత్వం వహించినా... ఈ సినిమాకే ఆయన తొలిసారి డైరెక్టర్‌గా తన పేరు వేసుకున్నారు. ఇంకా చెప్పాలంటే, పెద్దల బలవంతాన వేసుకోవాల్సి వచ్చింది. ఎన్టీఆర్ రాముడిగా, ఎస్వీఆర్ రావణుడిగా 'సీతారామ కల్యాణం' చిత్రానికి ఆయన గురువు కె.వి. రెడ్డి దర్శకత్వం వహించాలి. కానీ, ఆ సొంత సినిమాలో రావణుడి పాత్ర ధరించాలని ఎన్టీఆర్ ముచ్చటపడ్డారు. కె.వి. రెడ్డి ససేమిరా అన్నారు. ఆయన దర్శకత్వం వహించననడంతో, తప్పనిసరై ఆ బాధ్యతలు తానే తీసుకొని, కళా తృష్ణ తీర్చుకోవడమే కాక, దర్శకుడిగానూ నిరూపించుకున్నారు.

ఆ తర్వాత 'గులేబకావళి కథ'కూ డైరెక్టర్‌గా టైటిల్ కార్డ్ మాత్రం వేసుకోలేదు. ముచ్చటగా మూడోసారి చేస్తున్న 'పాండవీయం'కి కూడా డైరెక్టర్ పేరు లేకుండానే ఎన్టీఆర్ ముందుకెళ్ళారు. అప్పట్లో 'సౌతిండియన్ ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్'కు ప్రెసిడెంట్ దర్శకుడు పి. పుల్లయ్య. ఇలా డైరెక్టర్ పేరు లేకుండా సినిమాలు రావడం ఒక రకంగా దర్శకత్వ శాఖకే అగౌరవమని పుల్లయ్య అనడంతో, పెద్దల మాట గౌరవిస్తూ ఎన్టీఆర్ అప్పటి నుంచి పేరు వేసుకోసాగారు.

ఎన్టీఆర్ అప్పటి దాకా 'ఎన్.ఏ.టి.' పతాకంపై సినిమాలు తీస్తూ వచ్చారు. ఈ సినిమాకు కొంతకాలం ముందే కుమారుడు రామకృష్ణ దురదృష్టవశాత్తు మరణించారు. కొడుకు చనిపోయాక ఎన్టీఆర్ నిర్మించిన తొలి సినిమా 'పాండవీయం'మే! అందుకే, నిర్మాణసంస్థ పేరులో తొలిసారి 'రామకృష్ణ' అని చేర్చారు.

భారత, భాగవతాల మేళవింపు

లక్క ఇంటి దహనం నుంచి శిశుపాల వధ దాకా తెరపై చూపిన 'శ్రీకృష్ణ పాండవీయం' కథ కూడా చిత్రమైన వెండితెర వంటకం. భారతం, భాగవతం... రెంటినీ కలిపి, భారతంలోని ప్రధాన ఘట్టాలను కలిపి చేసిన స్క్రీన్‌ప్లే సినిమా స్క్రిప్ట్. బకాసుర వధ, హిడింబాసుర వధ, ద్రౌపదీ స్వయంవరం, జరాసంధ వధ, శిశుపాల వధ లాంటి భారత ఘట్టాలు ఉన్నాయి. అదే సమయంలో భాగవతంలోని అద్భుతమైన రుక్మిణీ కల్యాణమూ సినిమాలో గుదిగుచ్చారు. తెలుగునాట ఇంటింటికీ సుపరిచితమైన పోతన భాగవతం లోని రుక్మిణీ కల్యాణ ఘట్టం ఒక పాపులర్ టిక్ క్లాసిక్. దాన్ని అంతే అద్భుతంగా, యథాతథంగా పోతన పద్యాల తోనే 'పాండవీయం'లో తెరపైకి తెచ్చారు ఎన్టీఆర్. అలా తాను అద్భుతమైన నటుడినే కాక అభిరుచి గల రసజ్ఞుడైన దర్శకుడినీ నిరూపించుకొన్నారు. రాజసూయ యాగం – మయసభ ఘట్టం లాంటివి అపూర్వంగా తెరపై చూపిన సినిమా కూడా ఇదే! ఇన్ని గాథలను ఒకే సినిమాలో బిగి చెడకుండా తెరకెక్కించిన తొలి బృహత్తర యత్నమూ ఇదే!

కెరీర్ బెస్ట్ పాత్రల్లో ఒకటిగా...

మూడు దశాబ్దాల పైచిలుకు ఎన్టీఆర్ సినీ కెరీర్‌ను విశ్లేషిస్తే... సుయోధన పాత్రపోషణ నటుడిగా ఆయన కృషిలో కలికితురాయి. ముఖ్యంగా, 'పాండవీయం'లోని ఆ పాత్ర కోసం ఆయన పురాణాలను సైతం శోధించారు. అంతకు మునుపటి చిత్రాల్లోని దుర్యోధన పాత్రకు భిన్నంగా ప్రత్యేకమైన వేష భూషణాలు, పాము పడగలతో తీర్చిదిద్దిన ఆ ప్రత్యేక కిరీటం – గద, నెన్నొసట దిద్దిన నాగతిలకం, నటనలో తనదైన శైలి, దైహిక భాష, సంభాషణోచ్చారణతో ఆ పాత్రను చిరంజీవిని చేశారు. ఒక రకంగా నాయక పాత్ర తరహా ఇమేజ్‌ను దానికి సంతరించిపెట్టారు.



ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణం...

'పాండవీయం' చిత్ర నిర్మాణాన్ని ఎన్టీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులతో కలసి అత్యుత్తమ స్థాయి చిత్ర రూపకల్పన కోసం శ్రమించారు. సముద్రాల సీనియర్ ఈ చిత్ర రచన చేశారు. 'నర్తనశాల'తో అంతర్జాతీయ అవార్డు అందుకున్న సీనియర్ కళాదర్శకుడు టి.వి.ఎస్. శర్మ 'పాండవీయం'కు పనిచేశారు. కళ్ళు చెదిరే సెట్లు, కళాత్మకత ఉట్టిపడే మౌల్డింగులు, కిరీటాలు, వేష భూషణాలు సిద్ధం చేశారు. కురు సభ, మయసభ, రాజసూయ సభలను నేత్రపర్వంగా రూపొందించారు. రవికాంత్ నగాయిచ్ ప్రతి సన్నివేశాన్నీ కనువిందుగా చిత్రీకరించారు. రెండు విభిన్న పాత్రలు ధరిస్తూ, దర్శకత్వం వహించడాన్ని ఎన్టీఆర్ సైతం గర్వకారణంగా భావించారు. ఎప్పటిలా కాక పబ్లిసిటీ సైతం భారీగా చేశారు.

నేటికీ వినిపించే పాటలు...

ఎన్టీఆర్‌కు చిరకాల సన్నిహితుడైన టి.వి. రాజు సంగీతం అందిస్తే, కొసరాజు – సి. నారాయణరెడ్డి సాహిత్యం సమకూర్చారు. హిడింబి పాడే 'ఛాంగురే...', అలాగే 'స్వాగతం సుస్వాగతం...' (ఈ రెంటి రచన సినారె), శ్రీకృష్ణుడు – రుక్మిణి పాత్రలపై వచ్చే 'ప్రియురాల సిగ్గేలనే...' (సముద్రాల సీనియర్) చాలా పాపులర్. ఇక, ఆదమరిచిన భీమసేనుణ్ణి అప్రమత్తం చేస్తూ శ్రీకృష్ణుడు పాడే 'మత్తు వదలరా...' పాట ఇవాళ్టికీ అందరూ తరచూ పేర్కొనే అద్భుత వ్యక్తిత్వపాఠ గీతం. పాటలకు వెంపటి సత్యం కూర్చిన నృత్యాలు మరో హైలైట్. ఈ చిత్రంలో తెర నిండుగా భారీ తారాగణమే. అలాగే, తరువాతి కాలంలో హీరోయిన్‌గా వెలుగు వెలిగిన భారతి (కన్నడ హీరో విష్ణువర్ధన్ భార్య) సుయోధనుడి స్వాగత గీతంలో నర్తిస్తూ తెరపై తొలిసారి అలరించారు.

విమర్శలున్నా... విజయమే!

పతాక సన్నివేశంలో శిశుపాలుడి వధ అనంతరం శ్రీకృష్ణుడి విశ్వరూప సందర్శనంతో 20 రీళ్ళ 'పాండవీయం' సినిమా ముగుస్తుంది. భారతంలో శ్రీకృష్ణ రాయబారం, కురుక్షేత్రంలో అర్జునుడికి గీతోపదేశ సందర్భాల్లోనే విశ్వరూప సందర్శన ఘట్టం ఉంటుంది. అయితే, మన వాళ్ళు మాత్రం సినిమాటిక్‌గా ఎప్పుడు కావాలంటే అప్పుడు విశ్వరూప సందర్శన చూపుతున్నారంటూ పండితులు వ్యాఖ్యానించారు. భాషాపరంగా 'శ్రీకృష్ణ పాండవీయం' అని ఉండాల్సిన టైటిల్‌ను ఉచ్చారణ సౌలభ్యం కోసం 'శ్రీక్రిష్ణ...' అని రాయడం పైనా విమర్శలొచ్చాయి. అయితే, సామాన్యులకు అవేమీ పట్టలేదు. మూడున్నర గంటల నిడివినీ ఆసక్తిగా చూశారు. సూపర్‌హిట్ చేశారు.

ఆకస్మికంగా ప్రధాని మృతి... ఆగని రిలీజ్...

అది 1966 జనవరి. భారత్ – పాక్‌ల మధ్య శాంతి, సామరస్యాల సాధన కోసం భారత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి తాష్కెంట్‌కు చర్చలకు వెళ్ళారు. 'తాష్కెంట్ ఒప్పందం' కుదిరిన కొద్ది గంటలకే జనవరి 11 తెల్లవారకుండానే ఆయన ఆకస్మికంగా మరణించారు. యావత్ దేశం దిగ్భ్రాంతికి లోనైంది. సరిగ్గా అంతకు నెల రోజుల ముందే డిసెంబర్ 11 రాత్రి హైదరాబాద్ నిజామ్ కాలేజీలో జరిగిన సభలో సినీ బృందంతో ప్రధానిని కలిశారు. అప్పటికి 21 రోజులు రాష్ట్రమంతా తమ సినీ కళాకారుల బృందం పర్యటించి, ప్రజల నుంచి సేకరించిన రూ. 8 లక్షలను 'జాతీయ రక్షణ నిధి'కి చెక్కుగా ప్రధానికి అందజేశారు. ఎన్టీఆర్ ఉద్వేగపూరితంగా ప్రసంగించి, ప్రధానిచే 'నటరత్న'గా ప్రశంసలందుకున్నారు. అలాంటి శాస్త్రీజీ మరణ వార్తతో ఎన్టీఆర్ నివ్వెరపోయారు.

నిజానికి, డిసెంబర్‌లో మద్రాసు వాహినీ స్టూడియోలో లెక్కకు మించి ఆర్కెస్ట్రాను పెట్టి, సంగీత దర్శకుడు టి.వి. రాజు సారథ్యంలో 'పాండవీయం' రీ–రికార్డింగ్ పూర్తి చేయించి, సెన్సార్ కూడా పూర్తి చేయించి, సంక్రాంతి విడుదలకు సర్వం సిద్ధం చేశారు. మరో రెండే రోజుల్లో రిలీజ్. ఇంతలో అనుకోని ఈ దుస్సంఘటన. ఇప్పుడేం చేయాలి? ఆపేస్తే... సినీ వ్యాపారవర్గాలందరికీ ఎంతో నష్టం. అంతా ఆలోచించి, రిలీజ్‌కే ఓటేశారు. అలా శాస్త్రీజీ మరణించిన రెండు రోజులకు తెలుగు 'పాండవీయం' 1966 జనవరి 13న విడుదలైంది. సరిగ్గా ఆ మరునాడే 'మోడరన్ థియేటర్స్' వారి 102వ చిత్రంగా ఎస్.డి. లాల్ దర్శకత్వంలో ఎస్వీఆర్ నటించిన అపరాధ పరిశోధక చిత్రం 'మొనగాళ్ళకు మొనగాడు' రిలీజైంది. వీటి కన్నా ముందే ఆ ఏడాది జనవరి 7న అక్కినేని 'జమిందార్' రిలీజైంది.

అన్నింటి మధ్య ఆ సంక్రాంతి చిత్రాల బరిలో 'పాండవీయం' ఘన విజయం సాధించింది. తెలుగు వెర్షన్ తర్వాత 1966 ఏప్రిల్ 30న తమిళ 'రాజసూయం' వచ్చింది. అయితే ఆ తర్వాత 'కర్ణన్ కరుజై' అని కొత్త టైటిల్‌తో 1971 జూన్ 18న మళ్ళీ భారీగా రిలీజ్ చేశారు.

ఏకకాలంలో... రెండు భాషల్లో...

ఎన్టీఆర్ ఏకకాలంలో తెలుగు, తమిళాల్లో ద్విభాషా చిత్రంగా దీన్ని తెరకెక్కించారు. తమిళ వెర్షన్‌కు 'రాజసూయం' అని టైటిల్ పెట్టారు. తమిళంలోనూ శ్రీకృష్ణ పాత్రను ఎన్టీఆర్ స్వయంగా ధరించారు. సుయోధన పాత్రకు మాత్రం తమిళంలో ఆ భాషకే చెందిన రంగస్థల విఖ్యాత పౌరాణిక పాత్రధారి, సుప్రసిద్ధుడైన రంగస్థల – సినీ నటుడు ఆర్.ఎస్. మనోహర్‌ను ఎంచుకున్నారు. అలాగే, నారదుడిగా టి.ఆర్. మహాలింగం, మరికొన్ని పాత్రలకు రామదాస్, ఓ.ఎ.కె. దేవర్ లాంటి పేర్లున్న అక్కడి నటులను తీసుకున్నారు. ఎస్. వరలక్ష్మి (కుంతి పాత్ర), తెలుగు తెరపై తొలి సారిగా చిరకాలం గుర్తుండిపోయే పాత్రలు చేసిన కె.ఆర్. విజయ (రుక్మిణి పాత్ర), కన్నడ నటుడు ఉదయ్‌కుమార్ (భీమసేనుడి పాత్ర) లాంటి వారు తమిళంలోనూ అవే పాత్రలతో అలరించారు.

తమిళ 'రాజసూయం' త్వరలో విడుదల ప్రకటన

ఆ రోజుల్లోనే... ప్రీక్వెల్స్!

గమనిస్తే... పద్దెనిమిది పర్వాల మహాభారతంలోని ప్రధాన గాథలన్నో వెండితెరపై సినిమాలుగా వచ్చాయి. దేనికదే ప్రత్యేకం. అయితే, కేవలం 27 నెలల కాలవ్యవధిలో ఒక సినిమాకు 'ప్రీక్వెల్' కథతో మరో సినిమా చొప్పున ఏకంగా 3 సినిమాలు రావడం 1960లలో జరిగింది. ఆ 3 సినిమాల్లోనూ ఎన్టీఆర్ హీరో కావడం, మూడూ సూపర్‌హిట్లు కావడం విశేషం. అవి – 'నర్తనశాల' (రిలీజ్ 1963 అక్టోబర్ 11), 'పాండవ వనవాసం' (1965 జనవరి 14), 'శ్రీక్రిష్ణ పాండవీయం' (1966 జనవరి 13). మూడూ మహాభారత ఆధారిత కథలే! భారతంలోని విరాట పర్వ గాథతో 'నర్తనశాల' తయారైతే, దానికి ముందుదైన అరణ్యపర్వ కథతో 'పాండవ వనవాసం' వచ్చింది. అటు తర్వాత అరణ్యపర్వానికి ముందువైన ఆది, సభా పర్వాల ఘట్టాలతో 'పాండవీయం' రూపొందింది. కథాపరంగా చూస్తే, వరుసగా మూడూ ఒకదానికొకటి ప్రీక్వెల్సే!

అన్నీ చేసిన... అరుదైన యాక్టర్!

ఇక, కృష్ణరాయబార ఘట్టం ఉండే ఉద్యోగపర్వం, భీష్మ – ద్రోణాది పర్వాల్లోని కురుక్షేత్ర యుద్ధం వగైరా అంతా ఎన్టీఆరే నటించిన 'శ్రీకృష్ణావతారం' ('67), 'దానవీరశూర కర్ణ' ('77)ల్లో చూపారు. అలా దాదాపు భారతంలోని అన్ని పర్వాలూ, వ్యాస–కవిత్రయ భారతాల నుంచి పోతన భాగవతం దాకా అన్నింటిలోని ప్రధాన అంశాలూ సినిమాతెరకెక్కాయి. అన్నింటిలో ఎన్టీఆరే పాత్రధారి. 'భీష్మ'('62), 'శ్రీమద్విరాటపర్వం'('79) కూడా కలుపుకొంటే... భీష్ముడు నుంచి బృహన్నల దాకా ప్రధాన భారత పాత్రలన్నీ ఎన్టీఆర్ పోషించి, నభూతో నభవిష్యతి అనిపించారు.

మళ్ళీ మళ్ళీ... అర్ధశత, శతదినోత్సవాలు

అరవై ఏళ్ళ క్రితం భారీ మొత్తం (దాదాపు రూ. 10 లక్షలు) వెచ్చించి, 'పాండవీయం' రూపొందించారు. 30 ప్రింట్లతో తొలి రిలీజైన ఈ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. రిలీజైన అన్ని కేంద్రాల్లో అర్ధ శతదినోత్సవాలు, ఆపైన 9 కేంద్రాల్లో శతదినోత్సవాలు జరుపుకొంది. తర్వాత అనేకసార్లు రీరిలీజై, తరతరాల పర్యంతం ఆకట్టుకొంటూనే ఉంది. వసూళ్ళ వాన కురిపిస్తూ వచ్చింది.

తొలి రిలీజ్ 1966 తర్వాత ప్రధానంగా 1968, 1986, 1997ల్లో కూడా 'పాండవీయం' పెద్దయెత్తున ఏకకాలంలో వివిధ కేంద్రాల్లో మళ్ళీ వచ్చింది. ఫస్ట్ రిలీజ్ లానే 1968 నవంబర్ 1న సెకండ్ రిలీజ్ సైతం విజయవాడలోని దుర్గాకళామందిరంలోనే వచ్చింది. మళ్ళీ 50 రోజులు ఆడింది.

ఇక, 1986 సంక్రాంతికి ఆంధ్రా – సీడెడ్‌లలో దాదాపు 20 ప్రింట్లతో 'పాండవీయం' రీరిలీజైంది. అప్పట్లో ఎన్టీఆర్ సొంత చిత్రాలు మూడింటికి ('పాండవీయం', 'ఉమ్మడి కుటుంబం', 'తల్లా పెళ్ళామా') కలిపి, అయిదేళ్ళ పంపిణీ హక్కులు రూ. 50 లక్షలకు అమ్ముడయ్యాయి. అందులో ఒక్క 'పాండవీయం' విలువే రూ. 40 లక్షలని ట్రేడ్ పండితుల మాట. అలా 1986 ఆరంభంలో రీ–రిలీజైనప్పుడు అప్పటికి ఇరవయ్యేళ్ళు నిండిన ఈ పాత బ్లాక్ అండ్ వైట్ చిత్రం కొత్త కలర్ చిత్రాలతో సైతం ఢీ అంటే ఢీ అంది.

అప్పట్లో విజయవాడలో 'అలంకార్ ఎ.సి', 'శేష్‌మహల్ ఎ.సి' థియేటర్లు రెంటిలో రిలీజైంది. తెగిన టికెట్ల సంఖ్యతో సంబంధం లేకుండా హాలులో ఉన్న సీట్లు అన్నింటిపైనా ప్రతి షోకూ ప్రభుత్వానికి వినోదపు పన్ను కట్టాల్సిన 'శ్లాబ్ సిస్టమ్' నడుస్తున్న రోజులవి. అయినా సరే, ఒక్క 'అలంకార్'లోనే 43 రోజులు నడిచింది. ఒక రీ–రిలీజ్ సినిమా అలా బెజవాడలో ఒక ఎ.సి. థియేటర్‌లో అన్ని రోజులు ప్రదర్శితం కావడం అప్పటికీ, ఇప్పటికీ హయ్యస్ట్ రికార్డ్. ఆ తర్వాత షిఫ్టులతో బెజవాడలో మొత్తం 11 వారాలు ఆడింది. ఇక, ఆ శ్లాబ్ సిస్టమ్‌లోనే గుంటూరులో ఈ రీ–రిలీజ్ సినిమా ఏకంగా 33 రోజులు హౌస్‌ఫుల్! అంతేకాదు... అప్పటి సంక్రాంతి కొత్త చిత్రాలన్నింటినీ మించి ఆ ఊళ్ళో 69 రోజులు ఆడి, కాసులు కురిపించింది.

''1997లో మళ్ళీ కొత్త పబ్లిసిటీ, పోస్టర్ డిజైన్లతో సినిమాను భారీగా రిలీజ్ చేస్తే, అన్నిచోట్లా బాగా ఆడి, ఏరియాలవారీగా కొనుక్కున్న అందరికీ లాభాలు పండించింది'' అని అప్పట్లో ఈ చిత్రం హక్కులు కొని, పంపిణీ చేసిన సినీ ప్రముఖుడు కొమ్మినేని వెంకటేశ్వరరావు చెప్పారు. ఆ 1997 లోనే 'పాండవీయం' హైదరాబాద్‌లో షిఫ్టింగులతో 100 రోజులు ఆడింది. అలా... వచ్చిన ప్రతిసారీ కొత్త సినిమాలకు దీటుగా దీర్ఘకాలం నడిచింది. ఇలా నాలుగుసార్లు 50 నుంచి 100 రోజులు ఆడిన సినిమా మరొకటి లేదు.

పదే పదే పెట్టుబడిని మించి లాభం

ఈ బ్లాక్ అండ్ వైట్ కళాఖండం అప్పటి నుంచి ఇప్పటి దాకా దాదాపుగా రీ–రిలీజైన ప్రతిసారీ కాసుల వర్షం కురిపిస్తూనే వచ్చింది. సినిమా రూపకల్పనకైన తొలి నిర్మాణవ్యయానికే కాదు... రీ–రిలీజుకు డిస్ట్రిబ్యూటర్లు పెట్టిన పెట్టుబడి కూడా అనేక రెట్లు వసూలు చేసి, ఆశ్చర్యపరిచింది. చివరకు శాటిలైట్ టీవీ ఛానళ్ళు, ఇటీవల ఓటీటీలు వచ్చాక కూడా 'పాండవీయం' సినిమాకు క్రేజు తగ్గలేదు. మొదట్లో రెండు తడవలు 'ఈ' టీవీ వారికి, ఆ తరువాత మరో మూడుసార్లుగా 'జెమినీ' వారికీ ప్రసార హక్కులను పరిమిత కాలవ్యవధికి అమ్మారు. ఒక్క 2011లోనే శాటిలైట్ హక్కులు రూ. 25 లక్షలకు అమ్ముడవడం గమనార్హం. అనేక చిత్రాల హక్కులు శాశ్వత ప్రాతిపదికన అమ్ముడైపోతుంటే... అరవై ఏళ్ళ నాటి ఈ క్లాసిక్ చిత్ర శాటిలైట్ రైట్స్ ఇలా ఇప్పటికి అయిదుసార్లు పదే పదే పెద్ద మొత్తానికి అమ్ముడవడం అపూర్వం. అంటే, ఈ చిత్రరాజం తన తొలినాళ్ళ బడ్జెట్‌తో పోలిస్తే, ఇప్పటికి ఎన్ని వందలరెట్లు వ్యాపారం చేసినట్టు!

చెప్పింది బంగారు నంది! ఇచ్చింది వెండి నంది!!

ప్రభుత్వమిచ్చే ప్రతిష్ఠాత్మక నంది అవార్డులు అరవై ఏళ్ళ క్రితం కూడా వివాదాస్పదమయ్యాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. నంది అవార్డులు ఆరంభించిన రెండో ఏడాదే 'శ్రీక్రిష్ణ పాండవీయం' విషయంలో అదే జరిగింది. ఆ చిత్రం సెన్సార్ 1965 డిసెంబర్ లోనే అయిపోయింది. అందుకే, 1965కిచ్చే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డుల బరిలోనే అది పోటీకి నిలిచింది. ఆ ఏడాది అవార్డుల్లో మొదట ఉత్తమ చిత్రంగా ఎన్టీఆర్ 'పాండవీయం'కి బంగారు నందిని ఇస్తున్నట్టు ప్రకటించారు. తీరా ప్రకటన తరువాత కూడా ప్రైజు మార్చి, వెండి నందితో సరిపెట్టారు. అదేమంటే... 'పాండవీయం' పౌరాణికం కదా, కాబట్టి అది సొంతంగా రాసిన కథ కాదు కదా అని అభ్యంతరం చెప్పారు. అలా ఏయన్నార్ 'అంతస్థులు'కి ఆ ఏడాది బంగారు నంది దక్కింది. తీరా బహుమతి ప్రదానం కూడా అయిపోయాక 'అంతస్థులు' పైనా వివాదం వచ్చింది. 'నిను వీడని నీడను నేనే...' పాట ఉన్న ఆ చిత్ర కథను ప్రధానంగా నడిపేది భౌతికం కాని దయ్యం పాత్ర అనీ, దానికి ఎలా బంగారు నంది ఇచ్చారనీ రచ్చ రేగింది.

ప్రజల మనసుల్లో సుయోధనుడు

నెగిటివ్ ఛాయలున్న పురాణపాత్రను తీసుకొని, అలాంటి పాత్రకు సైతం ఒక హీరో వర్షిప్ వచ్చేలా, అందరికీ నచ్చేలా, అందరూ మెచ్చేలా తీర్చిదిద్దడం అసాధారణ విన్యాసం. ఎవరెన్ని విమర్శలు చేసినా లెక్కచేయకుండా అతి కష్టమైన ఆ ఫీట్‌ను వెండితెరపై ఒకటికి రెండుసార్లు అనాయాసంగా చేశారు ఎన్టీఆర్. 'సీతారామ కల్యాణం'లో రావణ పాత్ర, 'పాండవీయం' – 'కర్ణ'ల్లో సుయోధన పాత్రలు అందుకు మచ్చుతునక. భారతంలోని దుర్యోధన పాత్రను... ఆభిజాత్యం, ఔద్ధత్యం, మైత్రీభావం నిండిన సుయోధనుడిగా చూపి, ఆ పాత్రతో ప్రేమలో పడేలా చేయడం ఎన్టీఆర్‌కే చెల్లింది. అది ఏ స్థాయికి వెళ్ళిందంటే – ఆ పాత్ర డైలాగులు నేటి సోషల్ మీడియా యుగంలోనూ సూపర్ హిట్టే! 'జెన్ జీ తరం ఫోన్లలోనూ పాపులర్ రింగ్‌టోన్లే!! అలాగే, తెలుగునాట అనేక చోట్ల ఎన్టీఆర్ వేసిన శ్రీకృష్ణాది దైవపాత్రలే కాదు... చివరకు సుయోధన పాత్ర వీధుల్లో విగ్రహాల రూపంలో నిలిచింది. ఒక ప్రతినాయక పాత్రను అంతలా ప్రేమాస్పదం చేయడం ఆ పాత్రకు ప్రాణం పోసిన నట, దర్శకుడిగా ఎన్టీఆర్ గొప్పదనం.

నవల మిగిలింది! నెగిటివ్ పోయింది!

ఫస్ట్ రిలీజ్ నాటికే 'పాండవీయం' వెండితెర నవలగా కూడా వచ్చింది. సముద్రాల జూనియర్ దానికి కథనం కూర్చడం విశేషం. అయితే, తెలుగువారి దురదృష్టం ఏమిటంటే, ఈ అపురూప సినీ కళాఖండం ఒరిజినల్ నెగిటివ్ 1990ల రీ–రిలీజ్ నాటికే కొంత దెబ్బతింది. పదే పదే రీ–రిలీజుల కోసం నెగిటివ్ నుంచి ప్రింట్లు వేస్తున్నందున, అసలు 'ఒరిజినల్ నెగిటివ్' బాగున్న సందర్భంలోనే ఎన్టీఆర్ ముందు జాగ్రత్తతో 'డూప్ నెగిటివ్' కూడా చేయించి పెట్టారు. కానీ కళాతపస్విగా ఎన్టీఆర్ ప్రాణం పెట్టి తీసిన ఈ చిత్రం తాలూకు ఆ నెగిటివ్‌లు రెండూ ఇప్పుడు ఎక్కడున్నాయో ఆచూకీ లేదు. ఈ వెండితెర క్లాసిక్ డిజిటైజేషన్ ప్రభుత్వ పరంగా కానీ, ప్రైవేటుపరంగా కానీ ఎక్కడా జరిగినట్టు లేదు. టీవీల్లో ప్రసారానికై సిద్ధం చేసిన అరకొర డిజిటల్ మాస్టర్లు, కోతలు పోనూ యూ ట్యూబ్‌లో మిగిలిన సినిమానే ఇప్పుడు మిగిలిన మహాప్రసాదం. ఘనమైన మన చరిత్రపై మనకున్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. క్షమార్హం కాని కళా, సాంస్కృతిక నేరం.

- రెంటాల జయదేవ

మరపురాని శకుని పాత్రపోషణ



'పాండవీయం'లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది శకుని పాత్ర. ఆ పాత్రకు దర్శకుడిగా ఎన్టీఆర్ ఇచ్చిన ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. గాంధార రాజ్య వారసుడిగా కౌరవులపై శకునికి పైకి కనిపించని పగ, మాయోపాయానికి ఉన్న గాథను తెర పైకి తొలిసారిగా తీసుకువచ్చారు. అలా శకుని పాత్ర, ఆ పాత్ర ప్రవర్తనలకు కథాపరంగా చేసిన వ్యాఖ్యానం, తెరపై కథనంలో చూపిన తీరు అపూర్వం. దానికి తగ్గట్టు రంగస్థల దిగ్గజమైన ధూళిపాళ ఆ పాత్రపోషణలో ప్రదర్శించిన ప్రతిభ మరో ఎత్తు. అందుకే, ఇవాళ్టికీ ధూళిపాళ, 'పాండవీయం'లో ఆయన పోషించిన ఆ శకుని పాత్ర ప్రేక్షకుల మనసులో చెరగకుండా నిలిచిపోయాయి. అలాగే, మయసభా ఘట్టంలో సుయోధనుడిగా ఎన్టీఆర్ అనుపమానమైన నటన, సంస్కృత సమాసభూయిష్ఠమైన ఆ సుదీర్ఘ సంభాషణల్ని పలుకుతూ ఆయన అభినయించిన తీరు, సముచితమైన షాట్ డివిజన్, కెమెరా వర్క్, ఎడిటింగ్‌లతో వాటిని తెరపై పండించిన దర్శకత్వ సామర్థ్యం... ఇలా అన్నీ మరపురానివే!

ఆయనే హీరో... ఆయనే విలన్...

ఇటు హీరో, అటు విలన్... రెండు పాత్రలూ ఒకే సినిమాలో ఒకే నటుడు పోషించి, మెప్పించడం సాంఘిక సినిమాల్లో సైతం పెను సవాలు. అలాంటిది ఇక, పౌరాణికాల్లో అయితే వేరే చెప్పేదేముంది? అలాంటి క్లిష్టమైన సవాలును స్వయంగా భుజానికెత్తుకొని ఒక రకంగా ఒంటి చేతితో ఎన్టీఆర్ చేసిన మ్యాజిక్ 'పాండవీయం'. కథానుసారం పాండవుల్ని నామరూపాలు లేకుండా చేయాలనుకొనే ప్రతినాయక పాత్ర సుయోధనుడు. వారిని ఎలాగైనా కాపాడే పనిలో ఉండే నాయక పాత్ర శ్రీకృష్ణుడు. అలా ఈ కథంతా హీరో వర్సెస్ విలన్ వ్యవహారం. పౌరాణికాల్లో ఈ రెండు పాత్రలూ పోషించిన నటుడు ఎవరూ లేరు. అలాంటిది... ఈ రెండు పాత్రలూ ఒకే సినిమాలో వేసి, ఒప్పించి, జనాన్ని మెప్పించడం, అదే సమయంలో నిరుపమాన నిర్దేశకత్వ ప్రతిభ చూపడం ఒక్క ఎన్టీఆర్‌కే చెల్లింది. అది ఒక్క 'పాండవీయం'కే జరిగింది.

రిపబ్లిక్ డే పరేడ్ కోసం రిహార్సల్స్ సందర్భంగా శనివారం ఢిల్లీలోని విజయ్ చౌక్‌లో బ్యాక్ట్రియన్ ఒంటెతో భారత ఆర్మీ రీమౌంట్ వెటెరినరీ కార్ప్స్ జవాను

పెంపుడు జంతువులకు రక్షక దూతగా భావించే 'సెయింట్ ఆంథోనీ ది అబాట్' గౌరవార్థం శుక్రవారం స్పెయిన్‌లోని శాన్ బార్టోలోమ్ డి పినారెస్ గ్రామంలో మంటల గుండా గుర్రాల విన్యాసం

బోర్డ్ ఆఫ్ పీస్‌లో అజయ్ బంగా, రూబియో

గాజా పునరభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు అమెరికా ప్రకటన

న్యూయార్క్/వాషింగ్టన్: గాజా సంక్షోభ నివారణలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో రెండో దశ మొదలైంది. గాజా పునరభివృద్ధి కోసం ట్రంప్ సారథ్యంలో బోర్డ్ ఆఫ్ పీస్ ఏర్పాటైంది. ఇందులో భారత సంతతికి చెందిన ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితర ప్రముఖులుగా సభ్యులుగా ఉన్నారు. అధ్యక్ష భవనం వైట్‌హౌస్ శుక్రవారం 'బోర్డ్ ఆఫ్ పీస్' ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుల పేర్లను విడుదల చేసింది. 'దౌత్యం, అభివృద్ధి, మౌలిక రంగం, ఆర్థిక వ్యూహం..'ఇలా అన్ని రంగాల్లో అనుభవం గడించిన వారికి ఇందులో చోటు కల్పించినట్లు ప్రకటించింది. వీరిలో మహిళలు, పాలస్తీనియన్లకు చోటుదక్కకపోవడం గమనార్హం. బోర్డ్ ఆఫ్ పీస్‌లో బంగా, రూబియోలతోపాటు అమెరికా పశ్చిమాసియా ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్, యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్, ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అపోలో గ్లోబల్ మేనేజ్‌మెంట్ సీఈవో మార్క్ రొవాన్, యూఎస్ డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ గాబ్రియెల్ ఉన్నారు. సుస్థిర గాజా, దీర్ఘకాల పురోగతికి సంబంధించి వీరిలో ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బాధ్యతలున్నాయని వైట్ హౌస్ తెలిపింది. అంతేకాదు, అదనపు ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా తుర్కియే విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్, ఖతార్ దౌత్యవేత్త అలీ అల్-థవాడి, ఈజిప్టుకు చెందిన హస్సన్ రషద్, యూఏఈ మంత్రి రీమ్ అల్ హషిమీ, ఇజ్రాయెల్ వ్యాపారవేత్త యకిర్ గబాయ్, నెదర్లాండ్స్ మాజీ ఉప ప్రధాని సిగ్రిడ్ కాగ్ ఉంటారని వైట్ హౌస్ వివరించింది. గాజా ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సభ్యుడిగా బల్గేరియాకు చెందిన ఐరాస పశ్చిమాసియా దూత నికొలాయ్ మ్లాదెనొవ్‌ను నియమించినట్లు వెల్లడించింది. పునరభివృద్ధి ప్రణాళికను వేగంగా అమలు చేసేందుకు 15 మందితో ఏర్పాటైన నేషనల్ కమిటీ ఫర్ ది అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ గాజా(ఎన్‌కాగ్)ను పర్యవేక్షిస్తారు.

అజయ్ బంగా

మార్కో రూబియో

టోనీ బ్లెయిర్

నికొలాయ్ మ్లాదెనొవ్

సిగ్రిడ్ కాగ్

రీమ్ అల్ హషిమీ

ఐఎస్ఎఫ్ కూడా..

ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్(ఐఎస్ఎఫ్) కమాండర్‌గా మేజర్ జనరల్ జాస్పెర్ జెఫ్ఫర్స్‌ను నియమించినట్లు వైట్ హౌస్ తెలిపింది. ఈయన గాజాలో భద్రత, ఉగ్రవాద రహిత వాతావరణాన్ని నెలకొల్పడంలో కృషి చేస్తారని తెలిపింది. భద్రతా చర్యలకు సారథ్యం వహిస్తూ సమగ్ర డీమిలిటరైజేషన్‌కు, మానవతా సాయం పంపిణీ, పునర్నిర్మాణ సామగ్రి అందజేత చర్యలను పర్యవేక్షిస్తారంది. గాజా సమగ్ర ప్రణాళిక లక్ష్యాల సాధన కోసం అంతర్జాతీయ సమాజంతోపాటు కీలకమైన అరబ్ దేశాలతో సన్నిహిత భాగస్వామ్యం కొనసాగించేందుకు అమెరికా కట్టుబడి ఉందని వైట్ హౌస్ ప్రకటించింది. ఎన్‌కాగ్, బోర్డ్ ఆఫ్ పీస్, ఐఎస్ఎఫ్‌లకు పూర్తి స్థాయిలో సహకరించాలని సంబంధిత వర్గాలకు అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చారు.

కైరోలో ఎన్‌కాగ్ మొదటి భేటీ

గాజా రోజువారీ పాలనా బాధ్యతలను చేపట్టే పాలస్తీనా కమిటీ ఎన్‌కాగ్, ఈజిప్టు రాజధాని కైరోలో శుక్రవారం మొదటిసారిగా సమావేశమైంది. అనంతరం, గాజాలో పాలస్తీనా అథారిటీ మాజీ అధికారి, ఇంజనీరింగ్ నిపుణుడు అయిన కమిటీ సారథి అలీ షాథ్ మీడియాతో మాట్లాడారు. గాజాలో పరిస్థితులను మెరుగుపర్చేందుకు తక్షణమే రంగంలోకి దిగుతామన్నారు. గాజా తిరిగి కోలుకునేందుకు, పునర్నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు కనీసం మూడేళ్లయినా పడుతుందని చెప్పారు. అత్యవసరాలను సమకూర్చడంతో గూడు కోల్పోయిన పాలస్తీనా వాసులకు ఆశ్రయం కల్పించడానికి మొదటగా తాము ప్రాధాన్యమిస్తామన్నారు. గతేడాది అక్టోబర్ 10వ తేదీన ట్రంప్ ప్రణాళిక అమల్లోకి వచ్చిన తర్వాత గాజాలోని కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఇజ్రాయెల్ ఉపసంహరించుకోగా, వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వేలాది మంది తిరిగి తమ స్వస్థలాలకు చేరుకున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం సరిగ్గా అమలయ్యేలా చూడటం, హమాస్ వంటి సాయుధ గ్రూపులను నిరాయుధుల్ని చేయడం అతి పెద్ద సవాలుగా మారాయి. గాజాలో రోజువారీ కార్యకలాపాలను బోర్డ్ ఆఫ్ పీస్ పర్యవేక్షణలో అలీ షాథ్ సారథ్యంలోని కమిటీ చూసుకుంటుంది.

రాజ్యసభలో 19 బిల్లులు పెండింగ్

న్యూఢిల్లీ: రాజ్యసభలో దీర్ఘకాలంగా 19 వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 1992 నాటి బిల్లు కూడా ఉండటంగమనార్హం. రాజ్యసభ శాశ్వత సభ. ఇందులోని మూడోవంతు సభ్యులు రెండేళ్లకోసారి రిటైరవుతుంటారు. ఇది రద్దు కాదు. అదే లోక్‌సభ రద్దయితే బిల్లులు కూడా మురిగిపోతాయి. రాజ్యసభలో బిల్లులు పెండింగ్‌లో ఉంటాయే తప్ప రద్దు కావు. అందుకే, రాజ్యసభలో జనాభా నియంత్రణకు సంబంధించిన రాజ్యాంగ (79వ సవరణ)బిల్లు-1992 కూడా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన ఎంపీ, ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలనే ప్రతిపాదన కూడా ఈ బిల్లులో ఉండటం గమనార్హం. 1997 నాటి ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు, విత్తనాల బిల్లు-2004, ఇంటర్‌స్టేట్ మైగ్రాంట్ వర్క్‌మెన్ బిల్లు-2011, 2020 నాటి పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు తదితరాలు పెండింగ్‌లో ఉన్నాయి.

పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదం..
6గురు చిన్నారులు సహా 14 మంది మృతి

లాహోర్: పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శనివారం ఉదయం దట్టమైన మంచు కారణంగా ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వంతెన పైనుంచి ఓ ట్రక్కు కాల్వలో పడిపోవడంతో అందులోని ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళలు సహా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇస్లామాబాద్‌కు చెందిన ఓ కుటుంబం బంధువు అంత్యక్రియల కోసం ఫైసలాబాద్ వైపు వెళ్తుండగా సర్గోధా జిల్లాలోని కొట్‌మొమిన్ వద్ద ప్రమాదం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మంచు కురుస్తుండటంతో వాస్తవానికి ప్రధాన రహదారిని మూసివేశామని, ఆ ట్రక్కు డ్రైవర్ అడ్డ దారిలో వెళ్తూ ప్రమాదానికి కారణమయ్యాడన్నారు. మరో ఘటన..బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని గ్వాదర్ సమీపంలో హైవేపై మలుపులో ఓ వాహనం బోల్తా పడగా అందులోని 9 మంది చనిపోయారు. మరో 15 మంది గాయపడ్డారు. అతి వేగమే ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు.

రష్యాకు అక్రమంగా విమాన విడి భాగాల సరఫరా
అమెరికాలో భారతీయుడికి జైలు

వాషింగ్టన్: నిషేధం ఉన్నప్పటికీ రష్యాకు అక్రమంగా విమాన విడిభాగాలను ఎగుమతి చేసిన ఆరోపణలపై అమెరికా కోర్టు భారతీయుడొకరికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధించింది. ఒరెగాన్ నుంచి రష్యాలోని సంస్థలకు సంజయ్ కౌశిక్(58) స్వలాభం కోసం విమాన విడి భాగాలతోపాటు సాంకేతికతకు చట్ట విరుద్ధంగా అమ్మినట్లు ఒరెగాన్ డిస్ట్రిక్ట్ అటార్నీ స్కాట్ బ్రాడ్‌ఫర్డ్ తెలిపారు. తనకు, భారత్‌లోని తన సంస్థకు ఇవి పౌర అవసరాల కోసమంటూ అబద్ధమాడారన్నారు. ఇతడు రష్యాకు విక్రయించిన వాటిలో అటిట్యూడ్ అండ్ హెడింగ్ రిఫరెన్స్ సిస్టమ్(ఏహెచ్ఆర్ఎస్) వంటివి ఉన్నాయన్నారు. దీనికి గాను, కౌశిక్‌కు 30 నెలల ఫెడరల్ జైలు శిక్షతోపాటు మరో 36 నెలలపాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలంటూ తీర్పు వెలువరించారు.

ట్రంప్ నోట మళ్లీ మళ్లీ అదే మాట

ఫ్లోరిడా: భారత్, పాకిస్తాన్‌ల మధ్య భీకర యుద్ధాన్ని తానే ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి చెప్పుకున్నారు. ఆ పోరును నిలువరించడం ద్వారా కోట్లాది మంది ప్రజల ప్రాణాలను కాపాడటం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఏడాది కాలంలోనే ఎన్నో శాంతి ఒప్పందాలకు మధ్యవర్తిత్వం వహించినట్లు ఫ్లోరిడాలో జరిగిన కార్యక్రమంలో ట్రంప్ అన్నారు. 'భారత్-పాక్‌ల మధ్య యుద్ధాన్ని నివారించడం ద్వారా కోటి మంది ప్రాణాలను కాపాడాననని పాక్ ప్రధాని షెహబాజ్ నన్ను మెచ్చుకున్నారు. పశ్చిమాసియాలో శాంతి సాధ్యమని ఎవరూ ఊహించి ఉండరు. నా కారణంగానే అక్కడ కూడా శాంతి నెలకొంది'అని తెలిపారు. భారత్ ఖండిస్తున్నప్పటికీ..భారత్-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం తన జోక్యంతోనే సమసిపోయినట్లు గతేడాది మే 10వ తేదీ నుంచి ట్రంప్ కనీసం 80సార్లు చెప్పుకోవడం గమనార్హం.

అల్ ఫలాహ్ వర్సిటీపై ఈడీ చార్జిషీటు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గతేడాది నవంబర్‌లో జరిగిన పేలుడు సూసైడ్ బాంబర్, అరెస్టయిన మరో ఇద్దరు వైద్యులను ఎలాంటి పరిశీలన జరపకుండానే అల్ ఫలాహ్ వర్సిటీ విధుల్లో నియమించుకుందని ఈడీ ఆరోపించింది. వీరిపై ఉన్న పోలీసు కేసులను కూడా తెల్సుకోలేదని తెలిపింది. ఈ మేరకు ఢిల్లీ కోర్టులో శుక్రవారం 260 పేజీల చార్జిషీటు దాఖలు చేసింది. సూసైడ్ బాంబర్‌గా మారిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉమర్ నబీ 2024 మే నుంచి పనిచేస్తుండగా, ఈ కేసులో కీలకమైన డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ షహీన్‌లు 2021 నుంచి విధుల్లో ఉన్నట్లు తెలిపింది. వర్సిటీ హెచ్ఆర్ హెడ్ సిఫారసు మేరకు వీరి నియామకాలను చేపట్టారే తప్ప, ఎటువంటి రికార్డులను పరిశీలించలేదని ఈడీ పేర్కొంది. వర్సిటీపై ఇప్పటికే మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ, ఫరీదాబాద్‌లోని ధౌజ్‌లో ఉన్న వర్సిటీ రూ.140 కోట్ల విలువైన భూమి, భవనాలను ఈడీ అటాచ్ చేయడం తెల్సిందే.

సిక్కు గురువును అగౌరవపర్చిన ఆరోపణలపై
ఆతిశీపై సీబీఐ విచారణకు ఆదేశిస్తాం

ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తా వెల్లడి

న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత ఆతిశీ సిక్కు గురువులను అవమానిస్తూ మాట్లాడినట్లుగా ఉన్న వీడియో అసలైందేనని ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తా చెప్పారు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ పరీక్షలో ఈ విషయం ధ్రువీకరించారని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపిస్తామని శనివారం ఆయన ప్రకటించారు. ఆతిశీ వ్యాఖ్యలున్న వీడియో అసలైంది కాదు, అది వక్రీకరణకు గురైందని పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం తెలిపింది. వీడియోపై ఫోరెన్సిక్ ల్యాబ్‌లో టెస్ట్ చేయించామంది. మార్ఫింగ్ చేసిన వీడియోను ఆన్‌లైన్‌లో ఉంచిన మంత్రి కపిల్ మిశ్రాపై చర్యలు తీసుకోవాలని ఆప్ నేత సంజీవ్ ఝా స్పీకర్ విజేందర్ గుప్తాను కోరారు. పంజాబ్ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ సమాంతర దర్యాప్తు చేపట్టిన నేపథ్యంలో మొత్తం వ్యవహారంపై సీబీఐ విచారణ కోరుతామని విజేందర్ చెప్పారు. జనవరి 6వ తేదీన అసెంబ్లీలో ఆతిశీ చేసిన ప్రసంగం వివాదాస్పదం కావడంతో 8వ తేదీనే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామన్నారు. చేసిన తప్పిదాన్ని ఆప్ అంగీకరించడానికి బదులుగా దాన్ని కప్పుపుచ్చుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం, పోలీసులు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ను దుర్వినియోగం చేశారంటూ సీఎం రేఖా గుప్తా సైతం మండిపడ్డారు. సిక్కుల గురువును వివాదంలోకి లాగడం ద్వారా బీజేపీ నీచ రాజకీయాలకు దిగుతోందని ఆప్ ధ్వజమెత్తింది.

ట్రంప్ ఓ నేరగాడు

- మరణాలు, విధ్వంసాలకు అతడే కారణం
- ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ తీవ్ర వ్యాఖ్యలు

టెహ్రాన్: ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీ శనివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో సంభవించిన ప్రజల మరణాలు, విధ్వంసాలకు ఆయనే కారణమన్నారు. నిరసనలకు ఆజ్యం పోసింది ట్రంపేనంటూ నిందించారు. ఇటీవల తలెత్తిన అశాంతి వెనుక అమెరికా హస్తం ఉందన్నారు. ఇరాన్‌ను అస్థిరపర్చడం ద్వారా పైచేయి సాధించాలన్నదే ఆ దేశం లక్ష్యమన్నారు. అయితే, తమ దేశాన్ని బలవంతంగా యుద్ధంలోకి నెట్టలేరని కుండబద్దలు కొట్టారు. విధ్వంసానికి కారణమైన దేశీయ, విదేశీ నేరగాళ్లను శిక్షించి తీరుతామని స్పష్టం చేశారు. ఇరాన్ ఎంతో సంయమనం పాటిస్తోందని, అదే సమయంలో హింసకు కారణమైన వారిపై సహనంచూపే ప్రసక్తే లేదన్నారు. 'దేశంలో జరుగుతున్న ఆందోళనల విషయంలో ట్రంప్ స్వయంగా జోక్యం చేసుకున్నారు. విధ్వంసాలకు పాల్పడే వారిని ఇరానియన్లుగా పేర్కొన్నారు. నిరసనలపై తప్పుడు కథనాలను వ్యాప్తి చేశారు. సైన్యాన్ని మద్దతుగా పంపుతామంటూ ఉసిగొల్పారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం ద్వారా అశాంతికి ఆజ్యం పోశారు'అని ఖమేనీ విమర్శించారు. అంతర్గత, బాహ్య శత్రువులపై తీవ్ర స్థాయిలో చర్యలుంటాయని హెచ్చరించారు. అల్లర్లను కఠినంగా అణచివేయడంతోపాటు రెచ్చగొట్టే వారి వెన్ను విరుస్తామన్నారు. అశాంతికి కారణమైన లోపలి, బయటి నేరగాళ్లను వదలబోమని తెలిపారు.

రెండు రోజుల్లోనే 12 వేల మంది

దేశంలో తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఆందోళనలను కఠినంగా అణగదొక్కేందుకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌లోని కుద్స్ బలగాలు, అనుబంధ సాయుధ గ్రూపులు రంగంలోకి దిగినట్లు చెబుతున్నారు. ఈ నెల 8, 9వ తేదీ రాత్రుల్లోనే కనీసం 12 వేల మందిని ఇవి పొట్టన బెట్టుకున్నాయని సమాచారం. అధికారిక సమాచారం, ఆస్పత్రుల్లో డేటా ఆధారంగా ఈ అంచనాకు వచ్చినట్లు ఇరాన్ ఇంటర్నేషనల్ అనే మీడియా సంస్థ పేర్కొంది. అయితే, నిరసనల్లో ఇప్పటి వరకు 3,090మంది చనిపోయినట్లు అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. మృతుల్లో 2,885మంది నిరసనకారులున్నారంది. ఇలా ఉండగా, శనివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు 8 గంటల సమయంలో జాతిని ఉత్తేజపరిచేలా నినాదాలు చేయాలని ప్రజలకు అమెరికాలో ఉన్న రాజ కుటుంబ వారసుడు రెజా పహ్లవీ పిలుపునిచ్చారు.

రాజ్యాంగాన్ని, న్యాయవ్యవస్థను కాపాడండి

సీజేఐకి సీఎం మమత వినతి

జల్పాయ్‌గురి: దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థను కాపాడాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం కలకత్తా హైకోర్టు జల్పాయ్‌గురి సర్క్యూట్ బెంచ్ భవనాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో సీఎం మమత మాట్లాడారు. కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి అక్రమంగా వేధింపులకు గురవుతున్న దేశ ప్రజలను రక్షించాలని కోరారు. 'దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ, చరిత్ర, భౌగోళిక స్వరూపాన్ని విపత్తు నుంచి రక్షించండి'అని ఆమె వ్యాఖ్యానించారు. 'మీరు రాజ్యాంగ సంరక్షకులు, మేమంతా మీ చట్టపరమైన సంరక్షణలో ఉన్నాం. దయచేసి ప్రజలను రక్షించండి'అని బెనర్జీ పేర్కొన్నారు. 'కేసులు తేలకముందే మీడియా సమాంతర విచారణ చేపట్టే ధోరణులు బాగా పెరిగిపోయాయి. ఇటువంటి వాటికి కూడా అడ్డుకట్టపడాలి'అని సీఎం మమత అన్నారు.

బంగ్లాలో మరో హిందువు హత్య

న్యూఢిల్లీ/ఢాకా: కల్లోల బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్యకు గురయ్యాడు. రాజ్‌బరి జిల్లాలోని గోలాండ మోర్‌లో రిపోన్ సాహా అనే 30 ఏళ్ల యువకుడు కారు ఢీకొన్న ఘటనలో మృతి చెందాడు. అతను స్థానిక పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం కార్లో వచ్చిన ఇద్దరు వ్యక్తులు పెట్రోల్ పోయించుకున్నాక డబ్బులివ్వకుండానే వెళ్లిపోబోయారు. అడ్డుగా నుంచున్న సాహాను కారుతో గుద్దేసి పారిపోయారు. దాంతో అతను తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మరణించాడు. అనంతరం పోలీసులు కారును సీజ్ చేయడంతో పాటు దాని యజమాని అబుల్ హషేం అలియాస్ సుజన్, డ్రైవర్ కమాల్ హొసేన్‌ను అరెస్టు చేశారు. హషేం బంగ్లా నేషనలిస్ట్ పార్టీ నేత అని వారు చెప్పారు. సాహా బంగ్లాదేశ్‌లో గత నెల రోజుల్లో హత్యకు గురైన తొమ్మిదో హిందువు.

11 మందితో ఇండోనేసియా విమానం గల్లంతు

జకార్తా: ఇండోనేసియాలో గల్లంతైన విమానం కోసం గాలింపు ముమ్మరంగా సాగుతోంది. ఇండోనేసియా మత్స్యశాఖకు చెందిన ఏటీఆర్ 42-500 రకం విమానం దక్షిణ సులవేసి ప్రావిన్స్‌లోని మరోస్ ప్రాంతంలో ఉండగా మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)తో సంబంధాలు తెగిపోయాయి. ఆ విమానంలో 8 మంది సిబ్బంది, ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులున్నారు. యోగ్యకర్త ప్రావిన్స్ నుంచి దక్షిణ సులవేసి రాజధాని మకస్సర్‌కు విమానం వెళుతుండగా ఘటన చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. విమానం ఆచూకీ కోసం 400 మంది సైనిక, పోలీసు సిబ్బంది గాలింపు చేపట్టారు. ప్రతికూల వాతావరణం అన్వేషణకు ఆటంకం కలిగిస్తోందన్నారు. విమానం గల్లంతవ్వడానికి కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

స్వచ్ఛమైన తాగునీరు ప్రజల హక్కు

- ఇండోర్‌లో కలుషిత నీటికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం
- నగరంలో బాధితులకు పరామర్శ

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో కలుషిత నీటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న అర్బన్ మోడల్ ఇదేనా? అని నిలదీశారు. కలుషిత నీటి వల్ల ఎంతోమంది ప్రజలు బలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన శనివారం ఇండోర్‌లోని భగీరథ్‌పురాలో పర్యటించారు. కలుషిత నీటిని సేవించి అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వాంతులు, డయేరియాతో బాధపడుతున్నామని వారు చెప్పారు. బాధితులు త్వరగా కోలుకోవాలని రాహుల్ గాంధీ ఆకాంక్షించారు. అనంతరం కలుషిత నీటి వల్ల మరణించిన కుటుంబాలను కలుసుకున్నారు. వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రజల హక్కు అని స్పష్టంచేశారు. నూతన మోడల్ స్మార్ట్ సిటీ అయిన ఇండోర్‌లో స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో లేకపోవడం దారుణమని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వారు భయపడుతూ బతకాల్సి వస్తోందని అన్నారు. కాలుష్యాన్ని తగ్గించడం, సరైన తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని తేల్చిచెప్పారు. ఈ విషయంలో మధ్యప్రదేశ్ సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆక్షేపించారు. కలుషిత నీటి సమస్య ఇండోర్‌కే పరిమితం కాలేదని, దేశమంతటా ఉందని తెలిపారు. ప్రజలకు మంచినీరు అందించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా దృష్టి పెట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఇండోర్‌లో బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రజల మరణాలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని తేల్చిచెప్పారు. తమ పార్టీ తరపున బాధితులను ఆదుకుంటామని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.

ఇండోర్‌లోని బాంబే హాస్పిటల్‌లో బాధితులతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

నేటి నుంచి 'పీఎం విశ్వకర్మ హాట్'

సాక్షి, న్యూఢిల్లీ: దేశీయ హస్తకళల వైభవాన్ని, సంప్రదాయ వృత్తుల నైపుణ్యాన్ని చాటిచెప్పే 'పీఎం విశ్వకర్మ హాట్ -2026'నేటి నుంచి మొదలుకానుంది. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో ఐఎన్ఏ ఢిల్లీ హాట్ వేదికగా ఈ ప్రదర్శన జరగనుంది. ఈనెల 31వ తేదీ వరకు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి జితన్ రామ్ మాంఝీ ప్రారంభించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 117 మంది కళాకారులు పాల్గొంటున్నారు. కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, ఈ కళాకారులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం కల్పించారు. విదేశీ మిషన్ల ప్రతినిధులను కూడా ఈ ప్రదర్శనకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

పశువుల స్మగ్లర్లపై దాడులు

10 మంది అరెస్ట్.. రూ.50 కోట్ల సొత్తు సీజ్

భువనేశ్వర్: ఒడిశా పోలీసులు శనివారం పశువుల స్మగ్లర్ల ఇళ్లలో సోదాలు జరిపారు. భద్రక్, జజ్‌పూర్, కియోంఝర్, మయూర్‌భంజ్, ఖుర్దా జిల్లాల్లోని 46 ప్రాంతాల్లో దాడులు చేపట్టి, 10 మందిని అరెస్ట్ చేశారు. రూ.50 కోట్ల విలువైన సొత్తును సీజ్ చేశారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో ఇద్దరు ఏఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 36 మంది ఎస్సైలు, ఏఎస్సైలతోపాటు 18 ప్లటూన్ల బలగాలు పాల్గొన్నాయి. సోదాల్లో రూ.1.52 కోట్ల నగదు, 1.131 కిలోల బంగారం, 3.80 కిలోల వెండి, 23 కార్లు, 23 బైక్‌లు, 13 సెల్‌ఫోన్లు, 21 వాచీలు స్వాధీనం చేసుకున్నారు. పశువులను అక్రమంగా తరలించడం, విక్రయించడం ద్వారానే స్మగ్లర్లు ఈ సొత్తును కూడబెట్టారని పోలీసులు తెలిపారు. భద్రక్‌లోని ఓ స్మగ్లర్ ఇంట్లో ఏకంగా రూ.70 లక్షల నగదు, భారీగా బంగారం, రెండు ఎస్‌యూవీలు, ఇతర ఖరీదైన వస్తువులను సీజ్ చేశామన్నారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు.

దేవుడు దయతలిస్తే ముంబై పీఠం మాదే

ఉద్ధవ్ ఠాక్రే నర్మగర్భ వ్యాఖ్యలు

ముంబై: ప్రతిష్టాత్మక బృహన్ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికల్లో పరాజయం మూటగట్టుకున్నా, నగరపాలక సంస్థ మేయర్‌గిరీపై మాత్రం ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన (యూబీటీ) ఇంకా ఆశలు కోల్పోలేదు! దేవుడు దయతలిస్తే బీఎంసీ మేయర్ పదవిని తామే దక్కించుకుంటామంటూ ఉద్ధవ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. ఆయన శనివారం పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. ''ముంబై మేయర్‌గా శివసేన (యూబీటీ) నేతనే చూడాలన్నది నా కల. దేవుడు సహకరిస్తే అది నిజమవుతుంది'' అని చెప్పుకొచ్చారు. ''శివసేనను మట్టికరిపించామని బీజేపీ మిడిసిపడుతోంది. కానీ అది నిజం కాదు. ఈ ఎన్నికల్లో ఎంతటి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డా ఆ పార్టీ ముంబైవాసుల విశ్వాసాన్ని మాత్రం చూరగొనలేకపోయింది. వారి మనసులను గెలవడం బీజేపీకి ఎన్నటికీ సాధ్యం కాదు'' అని ఉద్ధవ్ మండిపడ్డారు. ''యుద్ధం ముగియలేదు. అసలు పోరు ఇప్పుడే మొదలైంది'' అంటూ పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచే ప్రయత్నం చేశారు. దాదాపు మూడు దశాబ్దాల అనంతరం ఈ ఎన్నికల్లో ఉద్ధవ్ పార్టీ పేలవ ప్రదర్శన కనబరచడం తెలిసిందే.

ఉగాండా అధ్యక్షుడిగా ముసెవెని ఏడోసారి..

కంపాలా: ఉగాండా అధ్యక్షుడిగా యొవెరి ముసెవెని వరుసగా ఏడోసారి ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనకు 71.65 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు శనివారం ప్రకటించారు. ప్రధాన ప్రత్యర్థి, యువ నేత బోబి వైన్‌కు 24.72 శాతం ఓట్లు పడ్డాయన్నారు. ప్రముఖ గాయకుడైన వైన్ అసలు పేరు క్యాగులన్యి సెసెంటము. నాలుగు దశాబ్దాల ముసెవెని పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా ఎన్నికల సమయంలో ఇంటర్‌నెట్‌ను నిషేధించడం, మిలటరీని రప్పించడం, పోలింగ్ ఏజెంట్లను నిర్బంధించడం వంటి చర్యలపై వైన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుచిత పద్ధతుల్లో జరిగిన ఈ ఎన్నికను తాము గుర్తించడం లేదన్నారు. పైపెచ్చు, ఎన్నికల రోజున రాజధాని కంపాలాతోపాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో ఈవీఎంలు పనిచేయలేదు. దీంతో, ఓటర్ల జాబితా ఆధారంగా ఓట్లు వేయించారు. దీంతో, భారీగా రిగ్గింగ్ జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఫలితంపై న్యాయస్థానాల్లో సవాల్ చేయాలని నిర్ణయించాయి.

పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాజ్యాంగ అవలోకనం, ముఖ్య లక్షణాలు, ప్రవేశిక

మాదిరి ప్రశ్నలు

1. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉండేది?
   ఎ) బ్రిటిష్ రాణి / రాజు
   బి) ఇంగ్లండ్ పార్లమెంట్
   సి) సమాఖ్య శాసనసభ
   డి) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
2. బ్రిటిషర్లు బెంగాల్‌లో సుప్రీంకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1776 బి) 1775 సి) 1777 డి) 1774
3. 1773 నుంచి 1857 వరకు చేసిన చట్టాలను ఎలా వ్యవహరిస్తారు?
   ఎ) చార్టర్ చట్టాలు బి) కౌన్సిల్ చట్టాలు
   సి) క్రౌన్ చట్టాలు డి) ఏవీకాదు
4. భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం ఎన్ని జాబితాలు ఉండేవి?
   ఎ) 2 బి) 3 సి) 5 డి) 6
5. భారత్‌లో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేయడానికి కారకుడు?
   ఎ) వాట్సన్ బి) రాబర్ట్ క్లైవ్
   సి) డూప్లెక్స్ డి) వారెన్ హేస్టింగ్స్
6. భారత ప్రభుత్వ చట్టం 1919లోని ప్రధాన అంశం / అంశాలు?
   ఎ) రాష్ట్రాల కార్య నిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం
   బి) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను నిర్వచించడం
   సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసన నిర్మాణ అధికారాన్ని సంక్రమింపజేయడం
   డి) పైవన్నీ
7. మొదటిసారిగా ఏ బ్రిటిష్ చట్టం భారతీయులకు పాలనలో భాగస్వామ్యం కల్పించడానికి ఉద్దేశించింది?
   ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
   బి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1862
   సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1909
   డి) గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం, 1919
8. 'గట్టి బ్రేకులు ఉండి ఇంజన్ లేని యంత్రం' అని నెహ్రూ దేన్ని పేర్కొన్నారు?
   ఎ) కేబినెట్ ప్లాన్
   బి) మౌంట్‌బాటన్ ప్లాన్ సి) వేవెల్ ప్లాన్
   డి) 1935 భారత ప్రభుత్వ చట్టం
9. మత ప్రాతిపదిక నియోజకవర్గాల పితామహుడిగా ఎవరిని పేర్కొంటారు?
   ఎ) లార్డ్ మింటో బి) లార్డ్ బెంటింక్
   సి) వారెన్ హేస్టింగ్స్ డి) రాబర్ట్ క్లైవ్
10. భారతదేశంలో ఏ చట్టం ద్వారా తొలి అధికారిక శాసనసభను ఏర్పాటు చేశారు?
   ఎ) చార్టర్ చట్టం, 1833
   బి) చార్టర్ చట్టం, 1853
   సి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861
   డి) ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1892
11. మౌంట్ బాటన్ ప్రణాళిక లక్ష్యం?
   ఎ) సమాఖ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం
   బి) రాజ్యాంగ సభ ద్వారా భారత రాజ్యాంగ రూపకల్పనకు మార్గదర్శకాలు ఇవ్వడం
   సి) బ్రిటిషర్ల నుంచి భారతీయులకు అధికారాన్ని బదిలీ చేసే పద్ధతి
   డి) ఆ కాలంలో చెలరేగిన మతకల్లోలాలను నివారించడానికి ప్రణాళిక
12. ద్వంద్వ పరిపాలనను ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం – 1892
   బి) భారత ప్రభుత్వ చట్టం – 1909
   సి) భారత ప్రభుత్వ చట్టం – 1919
   డి) గాంధీ–ఇర్విన్ ఒప్పందం
13. రాజ్యాంగ వాదాన్ని మొదటిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త?
   ఎ) అరిస్టాటిల్ బి) రూసో
   సి) చార్లెస్ డార్విన్ డి) ప్లేటో
14. కింది వాటిలో ఏ చట్టాన్ని మొదటి లిఖిత రాజ్యాంగంగా అభివర్ణిస్తారు?
   ఎ) పిట్ ఇండియా చట్టం – 1784
   బి) రెగ్యులేటింగ్ చట్టం – 1773
   సి) చార్టర్ చట్టం – 1313
   డి) చార్టర్ చట్టం – 1853
15. మొదటిసారిగా మత ప్రాతిపదికన ప్రత్యేక నియోజక గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
   ఎ) 1909 బి) 1919
   సి) 1935 డి) ఏవీకాదు
16. రాష్ట్రాల్లో ద్విసభా పద్ధతికి అవకాశం కల్పించిన చట్టం?
   ఎ) 1935 బి) 1919
   సి) 1909 డి) ఏదీకాదు
17. కింది వాటిలో భారత ప్రభుత్వ చట్టం – 1935లో సరికాని అంశం?
   ఎ) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
   బి) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
   సి) ఆర్.బి.ఐ. ఏర్పాటు
   డి) సార్వజనీన ఓటుహక్కు
18. కింది వాటిలో ఏ చట్టం ద్వారా 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్' పదవిని 'గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా'గా మార్చారు?
   ఎ) 1833 బి) 1813 సి) 1861 డి) 1858
19. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
   ఎ) 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
   బి) రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించడం
   సి) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
   డి) పైవన్నీ
20. కింది వాటిలో ఏ ప్రతిపాదనను భారత ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల మాగ్నా కార్టాగా పేర్కొంటారు?
   ఎ) వేవెల్ ప్రతిపాదన
   బి) క్రిప్స్ ప్రతిపాదన
   సి) కేబినెట్ రాయబార ప్రతిపాదన
   డి) విక్టోరియా రాణి ప్రకటన
21. మహాత్మా గాంధీ హాజరైన రౌండ్ టేబుల్ సమావేశం?
   ఎ) మొదటి రౌండ్ టేబుల్ సమావేశం
   బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం
   సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం
   డి) ఏదీకాదు
22. భారత ప్రభుత్వ చట్టం – 1935ను బానిసత్వానికి నూతన పత్రంగా పేర్కొన్నవారు?
   ఎ) కె.టి. షా బి) జవహర్ లాల్ నెహ్రూ
   సి) మహాత్మాగాంధీ డి) సర్దార్ పటేల్
23. కింది వాటిలో ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటయ్యింది?
   ఎ) కేబినెట్ ప్రతిపాదనలు
   బి) మౌంట్ బాటన్ ప్రతిపాదనలు
   సి) క్రిప్స్ ప్రతిపాదనలు డి) ఏవీకాదు
24. భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రోజు?
   ఎ) 1946 సెప్టెంబర్ 2
   బి) 1946 అక్టోబర్ 2
   సి) 1946 నవంబర్ 1
   డి) 1947 నవంబర్ 1
25. భారత రాజ్యాంగ రచనలో అత్యంత ప్రభావం చూపిన అంశం?
   ఎ) అమెరికా రాజ్యాంగం
   బి) బ్రిటిష్ రాజ్యాంగం
   సి) ఐరిష్ రాజ్యాంగం
   డి) భారత ప్రభుత్వ చట్టం
26. జతపరచండి.
   1. పోర్ట్ పోలియో పద్ధతి — ఎ. లార్డ్ మెకాలే
   2. సివిల్ సర్వీస్ సులభతరం — బి. లార్డ్ కార్న్‌వాలిస్
   3. మత నియోజక వర్గాలు — సి. లార్డ్ కానింగ్
   4. భారత న్యాయ సంస్కరణలు — డి. లార్డ్ మింటో
   ఎ) 1–సి, 2–బి, 3–డి, 4–ఎ
   బి) 1–బి, 2–సి, 3–ఎ, 4–డి
   సి) 1–డి, 2–ఎ, 3–బి, 4–సి
   డి) 1–ఎ, 2–బి, 3–డి, 4–సి
27. కింది వాటిని ప్రవేశపెట్టిన కాలానుగుణంగా క్రమంలో రాయండి.
   1. ప్రత్యేక నియోజకవర్గాలు
   2. శాసన అధికారాల బదలాయింపు
   3. ద్విసభా విధానం
   4. డొమినియన్ ప్రతిపత్తి
   ఎ) 1, 2, 3, 4 బి) 2, 1, 3, 4
   సి) 3, 2, 1, 4 డి) 3, 4, 1, 2
28. రాజ్యాంగ వికాసానికి సంబంధించి సరైన క్రమాన్ని గుర్తించండి.
   ఎ) మాగ్నాకార్టా, యు.ఎస్. రాజ్యాంగం, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం
   బి) మాగ్నాకార్టా, బిల్ ఆఫ్ రైట్స్, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
   సి) బిల్ ఆఫ్ రైట్స్, మాగ్నాకార్టా, సెటిల్‌మెంట్ చట్టం, యు.ఎస్. రాజ్యాంగం
   డి) పైవేవీ కాదు
29. ప్రభుత్వానికి ఉండే అధికారం కింది వాటిలో దేనికి ఉదాహరణ?
   ఎ) సంప్రదాయ అధికారం
   బి) సమ్మోహన అధికారం
   సి) చట్టబద్ధ – హేతుబద్ధ అధికారం
   డి) పైవన్నీ
30. కింది వాటిలో భారత రాజ్యాంగానికి ఏ లక్షణాన్ని ఆపాదించలేం?
   ఎ) శాసన శాఖ ఆధిక్యత
   బి) న్యాయ శాఖ ఆధిక్యత
   సి) కార్య నిర్వాహక శాఖ ఆధిక్యత
   డి) పైవన్నీ
31. భారత సమాఖ్య స్వభావం?
   ఎ) సిద్ధాంత సమాఖ్య బి) అర్ధ సమాఖ్య
   సి) విశిష్ట సమాఖ్య
   డి) బేరసారాల సమాఖ్య
32. పార్లమెంటరీ వ్యవస్థకు మరో పేరు?
   ఎ) కేబినెట్ ప్రభుత్వం
   బి) ప్రధానమంత్రి ప్రభుత్వం
   సి) పై రెండూ డి) ఏవీ కాదు
33. 'భారత రాజ్యాంగం సుదీర్ఘమైంది' కారణం?
   ఎ) ఇతర రాజ్యాంగాల ప్రభావం
   బి) భారతదేశ వైవిధ్యం
   సి) రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకపోవడం
   డి) పైవన్నీ
34. కింది వారిలో ఎవరి జీతభత్యాలను రెండో షెడ్యూల్‌లో పేర్కొనలేదు?
   ఎ) పార్లమెంట్ సభ్యులు
   బి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్
   సి) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
   డి) గవర్నర్
35. భారత రాజ్యాంగానికి, అమెరికా రాజ్యాంగానికి పోలిక?
   ఎ) సమాఖ్య వ్యవస్థ బి) న్యాయ సమీక్ష
   సి) ప్రాథమిక హక్కులు డి) పైవన్నీ
36. భారతదేశంలో రాజ్యాధికారానికి మూలం?
   ఎ) రాజ్యాంగం బి) పార్లమెంట్
   సి) ప్రజలు డి) రాష్ట్రపతి
37. భారత రాజ్యాంగ పీఠికలో ఉండే పదాల క్రమం?
   ఎ) సార్వభౌమాధికార, ప్రజాస్వామిక, సామ్యవాద, గణతంత్రరాజ్యం
   బి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యం
   సి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక
   డి) సార్వభౌమాధికార, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యం
38. భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం అంటే?
   ఎ) రాజ్యాంగ లక్షణాలు చాలా ముఖ్యమైనవి. వాటిని సవరించడానికి వీలులేదు
   బి) ప్రాథమిక హక్కులను కుదించడం గానీ, తొలగించడం గానీ కుదరదు
   సి) 368 ప్రకరణ ప్రకారం తప్ప రాజ్యాంగాన్ని సవరించడానికి వీలులేదు
   డి) కొన్ని అంశాలను సవరించడానికి పార్లమెంట్‌కు అధికారం ఉండదు
39. ప్రవేశికను భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం, ఒక ఆభరణంగా వర్ణించినవారు?
   ఎ) మహాత్మాగాంధీ బి) అంబేద్కర్
   సి) వల్లభ్‌భాయ్ పటేల్
   డి) ఠాకూర్‌దాస్ భార్గవ
40. రాజ్యాంగ ప్రవేశిక?
   ఎ) సూచనాత్మకమైంది
   బి) విషయసూచిక లాంటిది
   సి) పై రెండూ డి) పైవేవీ కాదు
41. ప్రవేశిక నుంచి ఏయే అంశాలు తెలుసుకోవచ్చు?
   ఎ) రాజ్యాంగ ఆమోద తేది
   బి) రాజ్యాంగ ఆధారాలు
   సి) రాజ్యాంగ ఆశయాలు
   డి) పైవన్నీ
42. 'సమగ్రత' (ఇంటిగ్రిటీ) అనే పదాన్ని 1976లో 42 రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికకు చేర్చారు. దీని ఉద్దేశం?
   ఎ) వేర్పాటువాద శక్తులను అరికట్టడం
   బి) భౌగోళిక సామీప్యతను సాధించడం
   సి) మతకలహాలను నియంత్రించడం
   డి) పైవన్నీ
43. భారత 'సామ్యవాదం' (సోషలిస్ట్) అనే భావజాలం ఎవరి భావాలను ప్రతిబింబిస్తుంది?
   ఎ) మార్క్స్, మహాత్మాగాంధీ
   బి) గాంధీ, నెహ్రూ సి) మార్క్స్, మావో
   డి) మార్క్స్, వినోభా బావే
44. కింది వాటిలో ప్రవేశికకు సంబంధించి సరైంది?
   ఎ) రాజ్యాంగంలోని ప్రకరణలతో సంబంధం ఉంటుంది
   బి) ప్రత్యేకంగా ప్రవేశికకు ఉనికి ఉండదు
   సి) సవరణకు అతీతం కాదు
   డి) పైవన్నీ సరైనవే
45. కింది వాటిలో ఏయే అంశాలను వ్యాఖ్యానించడానికి ప్రవేశికను ఆధారంగా తీసుకోవచ్చు?
   ఎ) ప్రాథమిక హక్కులు
   బి) ఆదేశిక సూత్రాలు
   సి) ప్రభుత్వ అధికారాలు డి) పైవన్నీ
46. ప్రవేశికలో పేర్కొన్న 'సమానత్వం' కింది వాటిలో దేనికి హామీ ఇస్తుంది?
   ఎ) హోదా బి) అవకాశాలు
   సి) ఉపాధి డి) ఎ, బి
47. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రవేశిక అధికారానికి ఆధారం, పరిమితి కాదు
   బి) ప్రవేశిక సవరణకు అతీతం కాదు
   సి) ప్రవేశికను రాజ్యాంగ రచన తర్వాత చేర్చారు. ఆఖరున ఆమోదించారు
   డి) పైవన్నీ సరైనవే
48. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) అత్యంత దృఢ రాజ్యాంగం – అమెరికా
   బి) పరిమాణాత్మక రాజ్యాంగం – ఇంగ్లండ్
   సి) చట్టీకృత రాజ్యాంగం – ఇండియా
   డి) పైవన్నీ సరైనవే
49. రాజ్యాంగ వాదన అంటే?
   ఎ) పరిమిత అధికారాలతో కూడిన పరిపాలన
   బి) పరిమిత ప్రభుత్వ వ్యవస్థ
   సి) రాజ్యాంగ వికాస దశ
   డి) పైవేవీ కాదు
50. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చేర్చిన అంశాలు?
   ఎ) ప్రాథమిక విధులు బి) ట్రిబ్యునల్
   సి) సహకార సంస్థలు డి) పైవన్నీ

సమాధానాలు

1) డి; 2) డి; 3) ఎ; 4) బి; 5) బి;
6) డి; 7) ఎ; 8) డి; 9) ఎ; 10) బి;
11) సి; 12) సి; 13) ఎ; 14) బి; 15) ఎ;
16) ఎ; 17) డి; 18) ఎ; 19) ఎ; 20) డి;
21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) డి;
26) ఎ; 27) ఎ; 28) బి; 29) సి; 30) డి;
31) సి; 32) సి; 33) డి; 34) ఎ; 35) డి;
36) సి; 37) డి; 38) డి; 39) డి; 40) ఎ;
41) డి; 42) ఎ; 43) ఎ; 44) డి; 45) డి;
46) డి; 47) డి; 48) డి; 49) ఎ; 50) డి.

ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధానమైన ఆక్సైడ్‌లు?

చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి ప్రధాన కారణం. తాజ్‌మహల్‌ను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం 1995లో ఆగ్రా, ఫిరోజాబాద్, మధురా, భరత్‌పూర్ (వీటిని 'తాజ్ ట్రెపీజియం'గా వ్యవహరిస్తారు) పట్టణాల్లోని 200కు పైగా పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించింది. వారసత్వ కట్టడమైన తాజ్‌మహల్ పరిరక్షణలో ఇది ముఖ్యమైన ముందడుగు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం

వాయు కాలుష్యం

క్లోరిన్ (Cl_2)

వాతావరణాన్ని కలుషితం చేస్తున్న వాయువుల్లో క్లోరిన్ ఒకటి. ఇది అతి తక్కువ పరిమాణంలో ప్లాస్టిక్ పరిశ్రమలు, నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల నుంచి వాతావరణంలోకి విడుదలవుతోంది. కాగితం తయారీ పరిశ్రమల్లో కలప గుజ్జును విరంజనం చేయడంలో క్లోరిన్‌ను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా కూడా క్లోరిన్ వాయువు వాతావరణంలోకి చేరుతోంది. క్లోరిన్ విషపూరిత, హానికర వాయువు. ఇది వాతావరణంలోని నీటి బిందువులతో కలిసి హైడ్రోక్లోరికామ్లం, హైపోక్లోరస్ ఆమ్లంగా మారుతుంది.

ఫ్రియాన్‌లు

వివిధ క్లోరో ఫ్లోరో కార్బన్లను సాధారణంగా ఫ్రియాన్లు అంటారు. వీటి ఆవిష్కరణతో శీతలీకరణ (రిఫ్రిజిరేషన్) పరిశ్రమ కొత్త పుంతలు తొక్కింది. రంగులేని, విషపూరితం కాని, మండే స్వభావం లేని ఈ ఫ్రియాన్‌లను ఎయిర్ కండిషనింగ్‌లో శీతలీకరణులుగానే కాకుండా ఏరోసోల్ చోదకాలు (ప్రొఫెల్లెంట్స్), డ్రైక్లీనింగ్‌లో ద్రావణిలు (సాల్వెంట్స్), నురుగు ఏర్పరిచే కారకాలు (ఫోమింగ్ ఏజెంట్స్), మంటలనార్పే పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్ ప్యాకింగ్ పదార్థాలుగా వినియోగించారు. సర్జికల్ పరికరాలను క్రిమి రహితం (స్టెరిలైజేషన్) చేయడానికి ఉపయోగించడం వల్ల వీటిని పరిశ్రమలకు వరాలుగా భావించారు. కానీ ఇవి హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమవడం వల్ల వీటిని పర్యావరణానికి 'శాపం'గా పరిగణిస్తూ నిషేధించారు. ఇవి ఇతర కాలుష్యాల మాదిరిగా కాకుండా చాలా స్థిరమైనవి. ఇవి ట్రోపోవరణంలో దాదాపు ఒక శతాబ్దానికిపైగా స్థిరంగా ఉంటాయి.

కణ స్వభావ పదార్థాలు (Particulate matter)

సాధారణంగా 0.001 నుంచి 10 మి.మీ. పరిమాణం ఉన్న దుమ్ము, ధూళి కణాలు మాత్రమే గాలిలో తేలియాడుతూ కంటికి కనిపిస్తాయి. ఇంతకంటే తక్కువ పరిమాణం ఉన్నవి కంటికి కనిపించవు. ఇవి గాలిలో తెరలు తెరలుగా ఉంటాయి. వీటిలో ప్రధానమైనవి మసి (కార్బన్ కణాలు), లోహాలు, లోహ లవణాలు, సిమెంట్, ఫ్లై యాష్, ఖనిజాలు, హైడ్రోకార్బన్‌లు మొదలైనవి. లోహాల్లో ముఖ్యమైనవి లెడ్, మెర్క్యూరీ, క్రోమియం, ఆర్సెనిక్, జింక్, కాడ్మియం, నికెల్, ఐరన్. కణ స్వభావ పదార్థాలు శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతానికి కారణమవుతున్నాయి.

వాహనాల ఇంధనం పెట్రోల్‌కు శబ్దం చేయకుండా సున్నితంగా మండటానికి 'టెట్రా ఇథైల్ లెడ్'(టీఈఎల్) అనే సీసం (లెడ్) సమ్మేళనాన్ని కలిపేవారు. ప్రస్తుతం దీన్ని నిషేధించారు. దీనివల్ల వాతావరణంలోకి లెడ్ విడుదలై అనేక మానసిక రుగ్మతలను కలిగిస్తుందని గుర్తించారు. పట్టణాల్లో కాలుష్యం ఎక్కువగా ఉండటం వల్ల ఇది ఎక్కువగా ఉండేది.

ఫ్లై యాష్

నేల బొగ్గును మండించినప్పుడు చివరగా మిగిలే బూడిదనే 'ఫ్లై యాష్' అంటారు. ఇది ప్రధానంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి విడుదలవుతోంది. కొంతవరకు దీన్ని ఇటుకల తయారీ, సిమెంట్ పరిశ్రమల్లో వాడుతున్నప్పటికీ.. మిగిలింది పర్యావరణానికి గుదిబండగా మారుతోంది. ఫ్లై యాష్‌లో ప్రధానంగా సిలికాన్ డై ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్, కాల్షియం ఆక్సైడ్‌లు ఉంటాయి. వీటితో పాటు కొద్ది పరిమాణంలో ఆర్సెనిక్, బెరీలియం, బోరాన్, క్రోమియం, కాడ్మియం, మెర్క్యూరీ, లెడ్, సెలీనియం లాంటి కొన్ని లోహాలుంటాయి. వీటిలో కొన్ని హానికరమైనవి.

పాలీ ఎరోమాటిక్ హైడ్రోకార్బన్‌లు

కోల్, పెట్రోలియం పదార్థాలను మండించడం (ఆక్సీకరించడం) వల్ల కర్బన రసాయన కణ స్వభావ పదార్థాలు వాతావరణంలోకి చేరుతున్నాయి. బెంజీన్, టోలీన్‌తోపాటు అధిక వలయ ఎరోమాటిక్ సమ్మేళనాలైన నాఫ్తలీన్, ఆంత్రసీన్ లాంటివి గాలిలో చేరి 'కేన్సర్' లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయి.

స్మాగ్ (Smog)

Smoke + Fog → Smog

ప్రాథమికంగా పొగ, దుమ్ము–ధూళితో కూడిన మంచునే 'స్మాగ్'గా వ్యవహరిస్తారు. స్మాగ్ రెండు రకాలు. అవి..

1. సాంప్రదాయిక స్మాగ్: దుమ్ము, సల్ఫర్ డై ఆక్సైడ్‌తో కూడిన మంచు.. పొగతో కలిసినప్పుడు సాంప్రదాయిక స్మాగ్ ఏర్పడుతుంది. నైట్రోజన్, సల్ఫర్ ఆక్సైడ్‌లు అధికంగా ఉన్న చల్లని తేమతో కూడిన పారిశ్రామిక ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. దీన్నే 'రసాయన స్మాగ్', 'క్షయకరణ స్మాగ్'గా వ్యవహరిస్తారు.1962లో మెట్టమొదట లండన్‌లో కనిపించిన ఈ స్మాగ్ దాదాపు ఐదు రోజులపాటు ఉండి అనేక మంది మరణానికి కారణమైంది.

2. కాంతి రసాయన స్మాగ్: ఈ రకమైన స్మాగ్ ప్రధానంగా వెచ్చని, పొడి వాతావరణంతోపాటు ధారాళంగా సూర్యరశ్మి ఉన్నప్పుడు ఏర్పడుతుంది. పొగ, దుమ్ము, ధూళితోపాటు, కాంతి రసాయన ఆక్సీకరణులు అధికంగా ఉన్న వాతావరణంలో ఇది ఏర్పడుతుంది.

ఈ కాంతి రసాయన స్మాగ్ ప్రధానంగా ఓజోన్, నైట్రిక్ ఆక్సైడ్ (NO), హైడ్రోకార్బన్లు, ఫార్మాల్డిహైడ్, ఎక్రైలిక్ ఆల్డిహైడ్ (ఎక్రోలిన్), పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ (పీఏఎన్) లాంటి సూర్యరశ్మి లేదా అతినీలలోహిత (UV) కాంతి సమక్షంలో స్వేచ్ఛా ప్రాతిపదికలు (ఫ్రీ ర్యాడికల్స్) ఉత్పత్తి చేసే సమ్మేళనాల చుట్టూ కేంద్రీకృతమై ఉంటుంది.

కాంతి రసాయన స్మాగ్ దుష్ప్రభావాలు

- ఇందులో ఉండే 'ఓజోన్' శ్వాస సంబంధ వ్యాధులను కలిగిస్తుంది, రబ్బర్‌ను పెలుసుగా, త్వరగా పాడయ్యేట్లు చేస్తుంది. పంటలకు నష్టం కలుగజేస్తుంది. భూగోళ తాపానికి కారణమవుతుంది.
- ఆల్డిహైడ్లు, హైడ్రోకార్బన్లు కళ్లలో మంటను కలిగిస్తాయి.
- పీఏఎన్ ఊపిరితిత్తులతోపాటు గుండె, కళ్లకు హాని కలిగిస్తుంది. మొక్కల ఆకులు పాలిపోయేలా చేస్తుంది.
- స్మాగ్‌తో దారులు మసకగా ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయి.

ఆమ్ల వర్షం (యాసిడ్ రెయిన్)

నేలబొగ్గు, పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాల్లో కార్బన్‌తోపాటు సల్ఫర్, నైట్రోజన్ సమ్మేళనాలుంటాయి. వీటిని మండించినప్పుడు ప్రధానంగా కార్బన్ డై ఆక్సైడ్ (CO_2) విడుదలవుతుంది. ఇది నీటిలో కరిగి బలహీన ఆమ్లమైన కార్బోనికామ్లాన్ని ఇస్తుంది. అందుకే స్వచ్ఛమైన నీటి pH (ఆమ్లత్వాన్ని కొలిచే పద్ధతి) విలువ ఏడు అయినప్పటికీ వర్షపునీటి pH 5 నుంచి 6 మధ్య ఉంటుంది (బలహీన ఆమ్ల అవధి). వర్షం pH విలువ ఇంతకంటే తగ్గితే దాన్ని 'ఆమ్ల వర్షం'అంటారు. సాధారణంగా శిలాజ ఇంధనాలను మండించినప్పుడు వెలువడే సల్ఫర్ ఆక్సైడ్‌లు, నైట్రోజన్ ఆక్సైడ్‌లు సూర్యరశ్మి సమక్షంలో వివిధ చర్యలకు లోనై వర్షపు నీటితో కలిసి సల్ఫ్యూరికామ్లం(H_2SO_4),నైట్రిక్ ఆమ్లం (HNO_3) గా ఆమ్లవర్ష రూపంలో భూమిని చేరతాయి.

ఆమ్ల వర్షం దుష్ప్రభావాలు

- చలువరాయి (మార్బుల్), సున్నపురాయి, స్లేట్ లాంటి పదార్థాలతో నిర్మించిన కట్టడాలు దెబ్బతింటాయి. తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి చమురుశుద్ధి కర్మాగారాలు విడుదల చేసే సల్ఫర్, నైట్రోజన్‌ల డై ఆక్సైడ్‌లే ప్రధాన కారణం.
- ఆమ్ల వర్షం సరస్సుల నీటిలోని జీవ జాలానికి నష్టం కలిగిస్తుంది.
- లోహ నిర్మాణాలు త్వరగా క్షయం కావడానికి కారణమవుతుంది.
- ఆమ్ల వర్షం నేలలు, శిలల్లోని సీసం(లెడ్), పాదరసం(మెర్క్యూరీ), రాగి (కాపర్), అల్యూమినియం లాంటి లోహ అయాన్‌లను జలాశయాల్లోకి చేర్చి వాటిని విషపూరితం చేస్తుంది.
- ఆమ్ల వర్షం వల్ల నేలల సారం తగ్గుతుంది.

మాదిరి ప్రశ్నలు

1. ఫ్లై యాష్‌కు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   ఎ. ఇటుకల తయారీలో వాడతారు
   బి. పోర్ట్‌లాండ్ సిమెంట్‌కు ప్రత్యామ్నాయంగా కొంతవరకు వాడవచ్చు
   సి. ఫ్లై యాష్‌లో కాల్షియం ఆక్సైడ్, సిలికాన్ డై ఆక్సైడ్‌లు మాత్రమే ఉంటాయి. విషపూరిత మూలకాలుండవు
   1) ఎ, బి మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, సి మాత్రమే 4) సి మాత్రమే
2. వాతావరణంలో మానవ కార్యకలాపాల వల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ కార్యకలాపాల్లో ముఖ్యమైన వాటిని గుర్తించండి.
   ఎ. శిలాజ ఇంధనాల దహనం
   బి. వ్యవసాయం సి. చెట్ల నరికివేత
   డి. హరితహారం
   1) ఎ, బి, డి మాత్రమే
   2) ఎ, డి మాత్రమే
   3) ఎ, బి, సి మాత్రమే
   4) ఎ, సి మాత్రమే
3. వాహనాల నుంచి వెలువడే 2.5 మైక్రాన్ల పరిమాణంలో ఉండే కణ స్వభావ పదార్థాలు (Particulate matter) ఊపిరితిత్తుల్లోకి అత్యంత సునాయాసంగా ప్రవేశిస్తాయి. వీటి వల్ల కలిగే జబ్బులేవి?
   1) శ్వాస సంబంధిత వ్యాధులు
   2) గుండె జబ్బులు
   3) పక్షవాతం 4) పైవన్నీ
4. కిందివాటిలో కేన్సర్ కారక పదార్థాలు ఏవి?
   1) కార్బన్ డై ఆక్సైడ్‌లు
   2) ఎరోమాటిక్ సమ్మేళనాలు
   3) ఎలిఫాటిక్ హైడ్రోకార్బన్‌లు
   4) జడవాయువులు
5. ఆమ్ల వర్షానికి కారణమయ్యే ప్రధానమైన ఆక్సైడ్‌లు ఏవి?
   ఎ. కార్బన్ ఆక్సైడ్‌లు బి. సల్ఫర్ ఆక్సైడ్‌లు
   సి. నైట్రోజన్ ఆక్సైడ్‌లు
   1) బి, సి మాత్రమే 2) ఎ, బి మాత్రమే
   3) ఎ, సి మాత్రమే 4) పైవన్నీ
6. వరి పొలాలు ఏ విధంగా భూగోళ తాపానికి కారణమవుతున్నాయి?
   1) నైట్రోజన్ డై ఆక్సైడ్ విడుదల చేయడం ద్వారా
   2) మీథేన్ వాయువు విడుదల చేయడం ద్వారా
   3) సల్ఫర్ డై ఆక్సైడ్ విడుదల ద్వారా
   4) పైవన్నీ
7. కాంతి కాలుష్యం అంటే?
   1) రాత్రివేళలో పెద్ద పెద్ద నగరాలను ఆవహించి ఉండే కాంతి పుంజం
   2) ఫ్రియాన్ల వల్ల కలుషితమైన కాంతి
   3) అడవులు మండటం వల్ల వెలువడే కాంతి
   4) వాహనాల లైట్ల వల్ల వెలువడే కాంతి
8. కాంతి రసాయన స్మాగ్‌కు కారణమైనవి?
   1) హైడ్రోకార్బన్‌లు 2) ఆల్డిహైడ్‌లు
   3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
   4) పైవన్నీ
9. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ పెరగడం వల్ల కలిగే దుష్ప్రభావం?
   1) ఆమ్ల వర్షాలు కురుస్తాయి
   2) హరిత గృహ ప్రభావం ఏర్పడుతుంది
   3) జలచరాలు చనిపోతాయి
   4) కిరణజన్య సంయోగ క్రియను నిరోధిస్తుంది

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2;
5) 1; 6) 2; 7) 1; 8) 4;
9) 2.

మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్

1. బెంజిమన్ హిగ్గిన్స్ అల్పాభివృద్ధి దేశాలకు సంబంధించిన ఏ అంశం గురించి పేర్కొన్నారు?
ఎ) సామాజిక ద్వంద్వత్వం
బి) సాంకేతిక ద్వంద్వత్వం
సి) అల్పస్థాయి సమతౌల్య స్తంభన
డి) వస్తుమార్పిడి విధానం
2. ఆధునిక అభివృద్ధిలో సాంకేతిక ప్రగతి ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నవారు?
ఎ) కుజ్‌నట్స్ బి) హరాడ్ – డోమార్
సి) మాధుర్ డి) షుంపీటర్
3. రోస్టో వృద్ధి సిద్ధాంతం ప్రకారం స్వయం సమృద్ధి సాధించిన దశగా దేన్ని భావించవచ్చు?
ఎ) అధిక వినియోగ దశ బి) ప్లవన దశ
సి) ప్లవన దశకు ముందున్న పరిస్థితి
డి) పరిపక్వ దశకు గమనం
4. కార్ల్‌మార్క్స్ కింది వాటిలో దేనికి ప్రాముఖ్యం ఇచ్చారు?
ఎ) మూలధన ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
5. రోస్టో రచించిన **"The stages of Economic Growth"** గ్రంథాన్ని ఏ విధంగా వ్యవహరిస్తారు?
ఎ) కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
బి) నాన్ కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో
సి) మూలధన సంచయనం
డి) పైవన్నీ
6. ప్రపంచంలో అధిక జనాభా వల్ల కలిగే దుష్పరిణామాలను మొదటగా వివరించింది?
ఎ) డాల్టన్ బి) థామస్ మాల్థస్
సి) రాబిన్‌సన్ డి) డ్యూసెన్‌బరి
7. 2013–14లో దేశంలో స్థూల దేశీయ పొదుపు రేటు ఎంత?
ఎ) జీడీపీలో 30.6 శాతం
బి) జీడీపీలో 32 శాతం
సి) జీడీపీలో 33 శాతం
డి) జీడీపీలో 34 శాతం
8. **"The problems of Industrialization in Eastern & South Eastern European Nations"** గ్రంథకర్త?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) రొసెన్‌స్టిన్ రోడాన్ డి) థామస్ మన్రో
9. రాగ్నర్‌నర్క్స్ సిద్ధాంతం ప్రకారం డిమాండ్ కోణంలో విష వలయాన్ని ఛేదించడానికి పేద దేశాల్లో వేటికి డిమాండ్ పెరగాలి?
ఎ) పెట్టుబడి బి) పొదుపు
సి) ఆదాయం డి) వస్తువులు, సేవలు
10. 2016–17లో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిని ప్రపంచ బ్యాంకు ఎంత శాతంగా అంచనా వేసింది?
ఎ) 7.7 బి) 7.8 సి) 7.9 డి) 8.0
11. మూడో ప్రపంచ దేశాలు అనే పదాన్ని మొదటి సారిగా ఉపయోగించినవారు?
ఎ) ఆల్‌ఫ్రెడ్ సవి బి) మార్షల్
సి) ఫిషర్ డి) జాన్ రాబిన్‌సన్
12. స్థిర మూల ధనానికి, చర మూలధనానికి మధ్య నిష్పత్తిని తెలిపేది?
ఎ) మూలధన – ఉత్పత్తి నిష్పత్తి
బి) పొదుపు – మూలధన ఉత్పత్తి నిష్పత్తి
సి) ఆర్గానిక్ కాంపోజిషన్ ఆఫ్ కాపిటల్
డి) ఏదీకాదు
13. అభిలషణీయ జనాభా సిద్ధాంతాన్ని మొదటగా చెప్పిన శాస్త్రవేత్త?
ఎ) మాల్థస్ బి) ఎడ్వర్డ్ వెస్ట్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) షుంపీటర్
14. 'జనాభా పెరుగుదల సమాజంలో ఆదర్శవంతమైన మార్పునకు సహకరిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) డ్యూసెన్‌బరి
సి) గౌతమ్ మాథుర్ డి) మాల్థస్
15. బలహీన **Spread effects** గురించి వివరించినవారెవరు?
ఎ) హరాడ్ బి) ఫీల్డ్‌మన్
సి) గున్నార్ మిర్థాల్ డి) ఎడ్వర్డ్ వెస్ట్
16. వనరులతో పోలిస్తే తక్కువ పెట్టుబడులు ఉన్న దేశాలను అల్పాభివృద్ధి దేశాలుగా అభిప్రాయపడినవారు?
ఎ) ఫీల్డ్‌మన్ బి) హెబర్లర్
సి) మార్షల్ డి) రాగ్నర్‌నర్క్స్
17. కమ్యూనిజం, సోషలిజం ఆధారిత దేశాలను ఏ దేశాలుగా వర్ణించవచ్చు?
ఎ) మొదటి ప్రపంచ దేశాలు
బి) రెండో ప్రపంచ దేశాలు
సి) మూడో ప్రపంచ దేశాలు
డి) నాలుగో ప్రపంచ దేశాలు
18. అంతర్జాతీయ వాణిజ్యం అల్పాభివృద్ధి దేశాల పారిశ్రామికీకరణకు అవరోధమని భావించింది?
ఎ) గున్నార్ మిర్థాల్ బి) హర్షమన్
సి) డాల్టన్ డి) హెబర్లర్
19. విద్యా ప్రమాణాలు, శ్రామిక నైపుణ్యం పెరిగితే మూలధన – ఉత్పత్తి నిష్పత్తి?
ఎ) పెరుగుతుంది
బి) స్థిరంగా ఉంటుంది
సి) తగ్గుతుంది
డి) పెరుగుదలలో పెరుగుదల రేటు ఎక్కువ
20. మార్కెట్ విస్తృతికి అవసరమైన ముఖ్య కారకం ఏది?
ఎ) శ్రమ
బి) మూలధనం
సి) వ్యవస్థాపన
డి) తక్కువ సాంకేతిక ప్రగతి
21. ద్వి అంతర నమూనాను ప్రతిపాదించింది?
ఎ) చినరీ బి) కార్ల్ మార్క్స్
సి) మహలనోబిస్ డి) ఫీల్డ్‌మన్
22. 'శ్రమ విభజన ప్రత్యేకీకరణను పెంపొందిస్తుంది' అని పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్ బి) ఆడమ్ స్మిత్
సి) మహలనోబిస్ డి) గౌతమ్ మాథుర్
23. 2013–14లో స్థూల దేశీయ పొదుపులో ప్రభుత్వ రంగం వాటా ఎంత?
ఎ) జీడీపీలో 1% బి) జీడీపీలో 1.3%
సి) జీడీపీలో 1.5% డి) జీడీపీలో 1.6%
24. అంతర్జాతీయ వాణిజ్యం వెనుకబడిన దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నది?
ఎ) మార్షల్ బి) హెబర్లర్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) గౌతమ్ మాథుర్
25. **Incremental Capital - Output Ratio (ICOR)**ను ఎలా రాబట్టవచ్చు?
ఎ) (పొదుపులో మార్పు) ÷ (పెట్టుబడిలో మార్పు)
బి) (మూలధనంలో మార్పు) ÷ (ఉత్పత్తిలో మార్పు)
సి) (పెట్టుబడిలో మార్పు) ÷ (శ్రమలో మార్పు)
డి) ఏదీకాదు
26. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి ప్రధాన పాత్ర పోషించిన కారకం ఏది?
ఎ) మూలధన సంచయనం
బి) జనాభా పెరుగుదల
సి) సహజ వనరుల లభ్యత
డి) పైవన్నీ
27. మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా వృద్ధిరేటును తగ్గించేది?
ఎ) ప్రకృతి బి) తక్కువ ఉపాధి
సి) తక్కువ ఆదాయం డి) పైవన్నీ
28. **"Towards A dynamic Economics"** గ్రంథకర్త?
ఎ) డోమార్ బి) హరాడ్
సి) రాబిన్‌సన్ డి) ఫీల్డ్‌మన్
29. ట్రికిల్ డౌన్ వ్యూహాన్ని ప్రతిపాదించింది?
ఎ) ఫీల్డ్‌మన్ బి) రాబిన్‌సన్
సి) షుంపీటర్ డి) మహలనోబిస్
30. అల్పాభివృద్ధి దేశాలను ప్రపంచ మురికివాడలుగా పేర్కొన్నవారు?
ఎ) మార్షల్ బి) ఆడమ్‌స్మిత్
సి) రాబిన్‌సన్ డి) కైరన్‌క్రాస్
31. 'అదృశ్య హస్తం' అనే పదాన్ని తొలిసారిగా ఉపయోగించినవారు?
ఎ) మార్షల్ బి) రాగ్నర్‌నర్క్స్
సి) ఆడమ్ స్మిత్ డి) మీడ్
32. అల్ప స్థాయి సమతౌల్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు చాలా కాలం చిక్కుకొని ఉన్నాయని పేర్కొన్నవారు?
ఎ) నెల్సన్ బి) లూయిస్
సి) డాల్టన్ డి) జె.బి. సీ
33. అల్పాదాయం అనేది అల్పాభివృద్ధి దేశాల్లో విష వలయాలకు కారణమవుతోందని పేర్కొన్నవారు?
ఎ) డాల్టన్ బి) రాబిన్‌సన్
సి) రాగ్నర్‌నర్క్స్ డి) హెబర్లర్
34. వెనుకబడ్డ దేశాల్లో అమల్లో ఉన్న సాంఘిక, సాంస్కృతిక పరిస్థితులు ఆయా దేశాల ఆర్థికాభివృద్ధికి నిరోధకాలుగా ఉంటాయి. వీటిని ఏమంటారు?
ఎ) సాంకేతిక పూర్వక నిరోధకాలు
బి) వ్యవస్థాపూర్వక నిరోధకాలు
సి) మార్కెట్ సంపూర్ణతలు
డి) పైవన్నీ
35. ఆసియా దేశాల్లో ఉద్యమత్వం లోపించడానికి మూలధన కొరత లేదా ముడి సరకుల కొరత కారణం కాదని పేర్కొన్నది ఎవరు?
ఎ) గున్నార్ మిర్థాల్ బి) ఆడమ్ స్మిత్
సి) జె.బి. సీ డి) హెబర్లర్
36. అధిక స్థాయి తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన జనాభా స్థాయిని అభిలషణీయ జనాభాగా పేర్కొన్నవారు?
ఎ) కార్ల్‌మార్క్స్, జె.బి. సీ
బి) మార్షల్, ఆడమ్ స్మిత్
సి) డాల్టన్, ఎడ్విన్ కానన్
డి) ఏదీకాదు
37. 'పొదుపును ప్రోత్సహించడం ద్వారా లభించే మూలధనాన్ని గుర్తించిన రంగాల్లో పెట్టుబడులుగా మార్చాలి' అనేది ఏ రకమైన వృద్ధి వ్యూహం?
ఎ) ప్లవన దశ
బి) సంతులిత
సి) అసంతులిత
డి) పరిపక్వ దశకు గమనం
38. **"Rate of Growth and Employment"** గ్రంథకర్త?
ఎ) హరాడ్ బి) డోమార్
సి) రాబిన్‌సన్ డి) రాగ్నర్‌నర్క్స్
39. మహలనోబిస్ నాలుగు రంగాల నమూనా ఏ సిద్ధాంతంపై ఆధారపడి ఉంది?
ఎ) ట్రికిల్ డౌన్ వ్యూహం
బి) సోలో సిద్ధాంతం
సి) డోమార్ సిద్ధాంతం
డి) అధిక పెట్టుబడుల సిద్ధాంతం
40. ఆదాయం, డిమాండ్ పెరగడం వల్ల లాభోద్దేశంతో సమకూరే పెట్టుబడి?
ఎ) స్వయం ప్రేరిత పెట్టుబడి
బి) ప్రేరిత పెట్టుబడి
సి) స్థూల పెట్టుబడి
డి) నికర పెట్టుబడి
41. ఆర్థిక వ్యవస్థలో సంపూర్ణ పోటీ, స్వేచ్ఛా వ్యాపారం, వేతన సరళత ఉండాలని పేర్కొన్నవారు?
ఎ) కీన్స్
బి) పాల్‌క్రూగ్‌మన్
సి) ఫ్రీడ్‌మన్
డి) సాంప్రదాయ ఆర్థికవేత్తలు
42. 'అభివృద్ధి లక్ష్యం అభిలషణీయ స్వర్ణయుగాన్ని సాధించడం' అని పేర్కొన్నవారు?
ఎ) గౌతం మాథుర్ బి) ఆడమ్ స్మిత్
సి) రాబిన్‌సన్ డి) జె.బి. సీ
43. 'ఆర్థికాభివృద్ధి నిత్యం కొనసాగే అంతులేని ప్రక్రియ' అని పేర్కొన్నవారెవరు?
ఎ) మార్షల్ బి) పాల్‌క్రూగ్‌మన్
సి) హెగల్ డి) డాల్టన్
44. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ ఒక స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా అభివర్ణించినవారు?
ఎ) షుంపీటర్ బి) గున్నార్ మిర్థాల్
సి) కీన్స్ డి) డ్యూసెన్‌బరి
45. 'ఆర్థికాభివృద్ధి ప్రారంభంలో శ్రమ సాంద్రత పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న తర్వాత మూలధన సాంద్రత పద్ధతులు ఉపయోగించాలి' అని పేర్కొన్నవారు?
ఎ) ఐక్యరాజ్య సమితి నిపుణులు
బి) ప్రపంచ బ్యాంకు
సి) IMF
డి) WTO
46. చిరకాలంలో వాస్తవిక తలసరి ఆదాయం పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా పేర్కొన్నది?
ఎ) డాల్టన్ బి) కానన్
సి) హెగల్ డి) ఆచార్య ఎల్లిస్
47. భారీ పరిశ్రమలు స్థాపించడం వల్ల దశల వారీగా వాటి ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందుబాటులోకి వచ్చి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని చెప్పినవారు?
ఎ) ఆడమ్‌స్మిత్ బి) ఫీల్డ్‌మన్
సి) డాల్టన్ డి) హెగల్
48. **"Business cycles, Capitalism, Socialism and Democracy"** గ్రంథకర్త?
ఎ) షుంపీటర్ బి) కానన్
సి) హెగల్ డి) ఎల్లిస్
49. పొదుపు, పెట్టుబడుల మధ్య అంతరాన్ని పూరించడానికి అల్పాభివృద్ధి దేశాలు సాధారణంగా ఏ సాధనాన్ని ఉపయోగిస్తాయి?
ఎ) పన్నుల రేటు పెంచడం
బి) లోటు బడ్జెట్ సి) విదేశీ సహాయం
డి) అంతర్గత రుణాలు
50. **"An Operational Research Approach to Indian Planning of 4 sector model"** పుస్తక రచయిత?
ఎ) ఆడమ్ స్మిత్ బి) కార్ల్‌మార్క్స్
సి) మహలనోబిస్ డి) మార్షల్

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) డి; 4) సి; 5) బి; 6) బి; 7) ఎ; 8) సి; 9) డి; 10) బి; 11) ఎ; 12) సి; 13) బి; 14) ఎ; 15) సి; 16) డి; 17) బి; 18) ఎ; 19) సి; 20) బి; 21) ఎ; 22) బి; 23) డి; 24) బి; 25) బి; 26) ఎ; 27) ఎ; 28) బి; 29) ఎ; 30) డి; 31) సి; 32) ఎ; 33) సి; 34) బి; 35) ఎ; 36) సి; 37) సి; 38) బి; 39) ఎ; 40) బి; 41) డి; 42) ఎ; 43) సి; 44) బి; 45) ఎ; 46) డి; 47) బి; 48) ఎ; 49) బి; 50) సి.

How is 'TRAIL' written in that code?

BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Read the following information carefully to answer the given questions.

In a global environment summit, eight representatives, viz P, Q, R, S, T, V, W and Z are representing different countries, viz Australia, Canada, France, Iran, China, Korea, Nepal and Britain, but not necessarily in the same order. All of them are sitting around a circular table facing the centre. V sits third to the left of T. R and Z and also their immediate neighbours do not represent France. Only one person sits between W and the representative of France. The representatives of Iran and Canada are immediate neighbours of each other. R represents neither China nor Iran. Only one person sits between P and the one who represents Korea. P does not represent either France or Canada. R sits third to the right of Z. Z represents Britain. T is not an immediate neighbour of either R or Z. The one who represents Australia is an immediate neighbour of T. Three people sit between Z and the representative of Nepal. Q is not representing either France or Australia. W is not representing Korea.

1. Who among the following represents Canada?
1) Q 2) R
3) T 4) V
5) Cannot be determined
2. Who among the following represent immediate neighbours of V?
1) P, Q 2) P, S
3) T, W 4) P, R
5) P and the representative of China
3. Which of the following is true regarding W?
1) W sits second to the right of P.
2) W represents Iran.
3) W sits between Q and the representative of Britain.
4) Only one person sits between W and the representative of Canada.
5) None is true
4. How many persons sit between S and the representative of Iran, when counted anticlockwise from S?
1) None 2) One 3) Two
4) Three 5) Four
5. Which of the following is true?
1) S represents France.
2) Only one person is sitting between the representatives of Korea and China.
3) The representative of Canada is an immediate neighbour of W.
4) One person sits between Z and the representative of France.
5) None is true

Directions (Q. No. 6 -10): Study the following information carefully and answer the questions given below:

Following are the conditions for selecting a Finance Manager in an organisation: The candidate must

(i) be a graduate in any discipline with at least 50% marks.
(ii) have completed Postgraduate Degree/Diploma in Management with specialisation in Finance with at least 65% marks.
(iii) have post- qualification work experience of at least 4 years in the finance department of an organisation.
(iv) be at least 26 years and not more than 36 years as on 1.12.2011.

In the case of a candidate who fulfils all the conditions **except**

(a) at (ii) above, but has secured at least 60% marks in postgraduate degree/diploma in management with specialisation in Finance and at least 70% marks in graduation, his/her case is to be referred to the DGM-Finance.
(b) (iii), but has post qualification work experience of at least two years as Assistant Finance Manager, his/her case is to be referred to the GM-Finance.

In each question below, details of one candidate are provided. You have to take one of the following courses of action based on the conditions and sub-conditions given above and the information provided in each question and mark the number of that course of action as your answer. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 1.12.2011. ***Mark answer:***

1) If the candidate is to be selected.
2) If the data provided are inadequate to take a decision.
3) If the candidate is not to be selected.
4) If the case is to be referred to DGM - Finance.
5) If the case is to be referred to GM-Finance.

Now, read the information provided in each question and mark your answer accordingly.

6. Hemant Shah was born on 19 March 1981. He has been working in the finance department of an organisation for the past six years. He has scored 65% marks in B.Com and 75% marks in his postgraduate degree in management with finance as specialisation.
7. Subodh Sahay was born on 7 November 1982. He has been working for the past four years as Assistant Finance Manager in an organisation after completing his post-graduate degree in Finance management with 66% marks. He has scored 52% marks in BSc.
8. Neera Bhagat has been working in the finance department of an organisation for the past seven years after completing her post-graduate degree in management with specialisation in Finance with 62% marks. She has scored 75% marks in BSc. She was born on 12 January 1983.
9. Sudha Malhotra was born on 26 July 1984. She has been working as Assistant Finance Manager for the past three years in an organisation after completing her Postgraduate diploma in management with finance as specialisation with 68% marks. She has scored 55% marks in BA.
10. Atul Khemka has been working in Finance department of an organisation for the past five years after completing his post-graduate degree in management with finance as specialisation with 60% marks. He has scored 60% marks in BCom. He was born on 4 November 1985.
11. In a certain code, 'BEAMING' is written as 'BFCMHOJ' and 'CLEAR' is written as 'MDESB'. How is 'TRAIL' written in that code?
1) USAMJ
2) USAJM
3) SUAMJ
4) SUAJM
5) None of these
12. If it is possible to make only one meaningful English word with the third, fourth, sixth and seventh letters of the word COURTESY, using each letter only once in the word, which of the following will be the third letter of that word? If no such word can be formed, give "N" as your answer, If two words can be formed give "P" as your answer and if more than two such words can be formed, give "M" as your answer.
1) R 2) P 3) S 4) N 5) M
13. How many digits in the number 5279143 will be as far away from the beginning of the number as when the digits are rearranged in ascending order from left to right within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
14. How many such pairs of digits are there in the number '5391246' in both forward and backward directions, each of which has as many digits between them in the number as when the digits are arranged in ascending order within the number?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
15. In a certain code, 'TASK' is written as 'BUJR' and 'BIND' is written as 'JCCM'. How is 'SUIT' written in that code?
1) VTSH 2) VSTH 3) TRUJ
4) TRJU 5) None of these

Directions (Q. No. 16-20): Study the following information carefully and answer the questions given below:

M, N, A, D, J, V and R are sitting around a circular table facing the centre but not necessarily in the same order. V is third to the right of J. N is fourth to the left of R. R is on the immediate right of J. A is fourth to the right of D. D is not an immediate neighbour of V.

16. Who is second to the left of N?
1) V 2) J 3) A
4) M 5) Data inadequate
17. What is M's position with respect to R?
1) Fourth to the right
2) Third to the left
3) Fifth to the right
4) Third to the right
5) None of these
18. Who is fourth to the right of R?
1) V 2) N 3) M
4) A 5) None of these
19. Who is second to the right of J?
1) N 2) A 3) V
4) D 5) None of these
20. Who is on the immediate right of D?
1) M 2) J 3) N
4) Data inadequate
5) None of these

Answers with Explanation

(1-5):



1. 4 **2.** 4 **3.** 5 **4.** 3;
Only two persons, i.e W and Z
5. 2
(6-10):
6. 1 **7.** 1 **8.** 4 **9.**5
10. 3
11. 3; As,



And



12. 5; Third, fourth, sixth and seventh letters are U, R, E and S respectively. Words that can be formed with these letters are SURE, USER and RUSE.
13. 2;
Given number: 5 2 7 9 1 4 3
Ascending order: 1 2 3 4 5 7 9
There is only one such digit, i.e 2.
14. 5;
Given number: 5 3 9 1 2 4 6
Ascending order: 1 2 3 4 5 6 9
Such pairs: 1–2, 1–3, 4-9 & 5-9.
15. 1; As,



ie VTSH
(16-20):



16. 3 **17.** 3
18. 5;
D is fourth to the right of R.
19. 2 **20.** 1